www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
పేజీలు: 14
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 112
మంగళవారం | 6-8-2024
6 ఆగస్టు 2024; శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: విదియ రా. 7.53 తదుపరి తదియ; నక్షత్రం మఖ సా. 5.44 తదుపరి పుబ్బ; వర్జ్యం: శేషం ఉ. 6.18, రా. 2.32-4.26; దుర్ముహూర్తం: ఉ. 8.32-9.22, రా. 10.23-11.07; అమృతఘడియలు: మ. 3.05-4.51; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 5.59; సూర్యాస్తమయం: 6.42
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


సోమవారం కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు లోకేశ్, అనగాని, సీఎస్ నీరబ్ కుమార్, డీజీపీ ద్వారకా తిరుమలరావు

పేదల సేవలో..

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం

అధికార దర్పానికి దూరంగా.. ప్రజలకు దగ్గరగా!

కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి మార్గ నిర్దేశం

- పేదల పరిస్థితిని అర్థం చేసుకోండి
- మానవీయ దృక్పథంతో పనిచేయండి
- వినూత్న ఆలోచనలతో ముందుకు రండి
- ప్రజలు గుర్తుంచుకునేలా పని చేయండి
- ప్రతి నెలా పదో తేదీన 'పేదల సేవలో'
- ప్రజల జీవితాన్ని మార్చేది 'పబ్లిక్ పాలసీ'యే
- అక్టోబరు 2న రాష్ట్రస్థాయి విజన్ డాక్యుమెంట్
- జిల్లా స్థాయిలో మీరూ రూపొందించండి


సదస్సులో పాల్గొన్న కలెక్టర్లు, ఎస్పీలు

పేదరికం లేని సమాజమే మా ప్రభుత్వ నిర్దిష్టమైన ఆలోచన. పేదల పరిస్థితిని అర్థం చేసుకుంటేనే సరిగ్గా పని చేయగలుగుతాం. ఏం చేస్తే పేదరికం పోతుందో కలెక్టర్లు ఆలోచించాలి. సమాజంలో టాప్ 10 శాతం డబ్బులు సంపాదించిన వారు... చిట్టచివరి 20 శాతం వారిని దత్తత తీసుకుని, వారిని తీర్చిదిద్దే బాధ్యత ఇవ్వబోతున్నాం.

- చంద్రబాబు

పేదల సంక్షేమం.. రాష్ట్ర పునర్నిర్మాణం..
సుపరిపాలన.. భవిష్యత్ ప్రణాళిక.. ఇవే లక్ష్యాలు

కూటమి సర్కారు కొలువు తీరిన తర్వాత జరిగిన తొలి కలెక్టర్ల సదస్సు 'సూటిగా... సుత్తిలేకుండా' సాగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులకు స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు. అధికార దర్పానికి దూరంగా ఉండాలని... పేదలకు దగ్గర కావాలని సూచించారు. ఎమ్మెల్యేలూ, మంత్రులకూ ఇదే చెప్పారు. 'మా ప్రభుత్వ విధానం, మా లక్ష్యాలు ఇవి! మీరు వినూత్నంగా ఆలోచించండి. మనసుపెట్టి పని చేయండి. ఫలితాలు సాధించండి' అని కలెక్టర్లకు చంద్రబాబు సూచించారు. ఎప్పటికప్పుడు అందరి పనితీరు సమీక్షిస్తుంటానని కూడా చెప్పారు.

అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): "గత ఐదేళ్లల్లో విధ్వంసం సృష్టించారు. చిన్న తప్పు జరిగితే సరి చేసుకోవచ్చు. కానీ పూర్తిగా విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మించడానికి చాలా కష్టపడాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం సచివాలయం వేదికగా జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలోని పరిస్థితులను గుర్తుచేస్తూ... భవిష్యత్తుకు పునాదులు వేయడంపై కలెక్టర్లకు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. కీలకమైన అంశాలు ఆయన మాటల్లోనే.. పబ్లిక్ పాలసీ ద్వారా ప్రజల జీవితాలు మారిపోతాయి. గ్రామాల్లో రోడ్లు, కరెంటు లేని రోజుల నుంచి డ్రైవర్ లేకుండా నడిచే కార్లు, సొంతంగా

మిగతా 11వ పేజీలో...

- గేట్ల లోపాలకు ఏఈ, డీఈలదే బాధ్యత
- ఆటోమేటిగ్గా డిప్యూటీ ఇంజనీర్ సస్పెన్షన్
- వర్చువల్ వర్కింగ్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్
- 48 గంటల్లో రైతులకు సొమ్ము చెల్లించాలి
- గోతాలు ఇవ్వలేని పరిస్థితి మళ్లీ రాకూడదు
- సచివాలయాల్లో ఇసుక బుకింగ్ సదుపాయం

ప్రజలకు న్యాయం చేయాలి



- కూటమికి 93 శాతం స్ట్రైక్‌రేట్ ఇచ్చారు
- గత ప్రభుత్వం వ్యవస్థల్ని ఛిద్రం చేసింది
- వాటిని కాపాడటానికి దెబ్బలు తిన్నాం
- చక్కదిద్దాలనే ప్రజలు కూటమిని ఆశీర్వదించారు
- సుపరిపాలనకు సిద్ధం.. సహకరించండి
- ఐఏఎస్, ఐపీఎస్‌లకు స్వేచ్ఛ ఉంటుంది 11
- సీఎం చంద్రబాబు అనుభవంతో పూర్వవైభవం
- కలెక్టర్ల సదస్సులో ఉపముఖ్యమంత్రి పవన్


హసీనా తండ్రి, బంగ్లా పితామహుడు ముజిబుర్ రెహ్మాన్ విగ్రహాన్ని ధ్వంసం చేస్తున్న యువకుడు

భారత్ అప్రమత్తం

- సరిహద్దు వెంట నిఘా పటిష్ఠం
- ప్రధాని మోదీ నేతృత్వంలో కేబినెట్ కమిటీ భేటీ
- కోల్‌కతా చేరుకున్న బీఎస్ఎఫ్ డీజీ దల్జీత్‌సింగ్

బంగ్లా ప్రధాని నివాసం, సుప్రీం కోర్టు, పార్లమెంటుల్లో విధ్వంసం

కల్లోల బంగ్లా

ప్రధాని షేక్ హసీనా రాజీనామా.. పార్లమెంటు రద్దు.. ఖలీదా జియా విడుదల


హసీనా అధికారిక నివాసాన్ని ముట్టడించిన వందల మంది ఆందోళనకారులు; (ఇన్‌సెట్) ప్రధాని పడకపై ఓ విద్యార్థి

- హసీనాను జాతినుద్దేశించి ప్రసంగించనివ్వని ఆర్మీ
- ఆగమేఘాల మీద భారత్‌కు.. కట్టుదిట్టమైన భద్రత
- తమవద్దకు రావొద్దన్న బ్రిటన్!.. కొన్నాళ్లు భారత్‌లోనే!
- బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ జమా నేతృత్వంలో కొత్త సర్కారు
- ఆందోళనలు విరమించాలని ఉద్యమకారులకు పిలుపు
- బంగ్లాదేశ్‌కు విమానాలు, రైళ్ల రాకపోకలు బంద్
- అమ్మ మళ్లీ రాజకీయాల్లోకి రారు: హసీనా కుమారుడు
- ప్రధాని మోదీకి పరిణామాలను వివరించిన జైశంకర్

ఢాకా/న్యూఢిల్లీ, ఆగస్టు 5: సర్కారీ కొలువుల్లో 30% కోటా నిరసనలతో దేశవ్యాప్తంగా ఆందోళనలు అట్టుడికిపోతుండడంతో.. నాటకీయ పరిణామాల మధ్య బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేశారు. హింస అదుపులోకి రాకపోవడం.. ఆందోళనకారులు వేల సంఖ్యలో ప్రధాని అధికారిక నివాసం 'గణభవన్' వైపు చొచ్చుకువస్తుండడంతో.. పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదముందంటూ ఆర్మీ అధికారులు చేసిన హెచ్చరికలతో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా ఆందోళనలు

మిగతా 2వ పేజీలో...

ఇద్దరు క్రికెటర్ల ఇళ్లకు నిప్పు

బంగ్లాదేశ్ క్రికెటర్లకూ నిరసనల సెగ తాకింది. ఢాకాలోని మాజీ క్రికెటర్, ఎంపీ మష్రఫే మొర్తుజా, నజ్ముల్ హసన్ ఇళ్లకు ఆందోళనకారులు నిప్పంటించారు.

హీరో, అతని తండ్రి హత్య



చాందపూర్ జిల్లా బగారాబజార్‌లో ఉంటున్న బంగ్లా నటుడు శాంటోఖాన్, అతని తండ్రి, సహ-నిర్మాత సెలీంఖాన్‌ను విద్యార్థులు కొట్టి చంపారు. విద్యార్థుల గుంపు ఇంటిని తగులబెట్టేందుకు రాగా.. వీరు తుపాకీతో కాల్పులు జరిపి, అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆందోళనకారులు వీరిని చుట్టుముట్టి, కర్రలతో కొట్టి, హతమార్చారు

అవామీ నేత హోటల్‌లో 13 మంది సజీవ దహనం

జెస్సోర్ జిల్లాలోని అవామి లీగ్ ప్రధాన కార్యదర్శి షహీన్ చక్లాదర్‌కు చెందిన 14 అంతస్తుల 'హోటల్ జబీర్ ఇంటర్నేషనల్'కు ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ఈ ఘటనలో 13 మంది సజీవ దహనమయ్యారు. తప్పించుకునే ప్రయత్నంలో పైనుంచి కిందకు దూకిన 20 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. హోటల్‌లో ఇంకా ఎంత మంది చిక్కుకున్నారో తెలియదని స్థానికులు తెలిపారు.

సూటిగా.. స్పష్టంగా!

- వినూత్నంగా కలెక్టర్ల కాన్ఫరెన్స్.. ప్రాధాన్యాలపై స్పష్టత ఇచ్చిన సీఎం
- సుదీర్ఘ ప్రసంగాలు, ప్రజెంటేషన్లకు స్వస్తి.. అసమగ్ర వివరణలపై అసంతృప్తి
- ముఖ్యమంత్రి అన్నీ గమనిస్తున్నారనే సంకేతాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

సుదీర్ఘమైన ప్రసంగాలు లేవు! పేజీలకొద్దీ ప్రజెంటేషన్లు లేవు! అంతా... క్లుప్తంగా, స్పష్టంగా, సూటిగా, సుత్తిలేకుండా! కలెక్టర్ల కాన్ఫరెన్స్ జరిగిన తీరిది! ముఖ్యమంత్రి చంద్రబాబు గతంతో పోలిస్తే ఈసారి వినూత్నంగా దీనిని నిర్వహించారు. సంబంధిత అంశాలపై తమ ప్రాధాన్యాలు ఏమిటో... తమకేం కావాలో ఆయన స్పష్టంగా చెప్పారు. సీనియర్ అధికారులు కూడా సుదీర్ఘ వివరణలతో సమయం తినేయకుండా విషయం సూటిగా చెప్పేలా సీఎం జాగ్రత్త తీసుకొన్నారు. వారి ప్రజెంటేషన్లలో ఎక్కడైనా ఏదైనా లోపం కనిపిస్తే అక్కడికక్కడే ఆ విషయాన్ని మొహమాటం లేకుండా చెప్పారు. దీంతో ఆయన అన్నీ సునిశితంగా గమనిస్తున్నారనే సంకేతాలు వెళ్లాయి. గతంలో చంద్రబాబు హయాంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండు రోజులు జరిగేది. చిన్న చిన్న విషయాలపైనా కొందరు అధికారులు సుదీర్ఘ చర్చలు పెట్టేవారు. ఈసారి దానికి అవకాశం లేకుండా సమావేశాన్ని ఒక రోజుకు పరిమితం చేశారు. మధ్యాహ్నం

మిగతా 12వ పేజీలో...

ఐదేళ్ల నేరాలు వెలికితీయండి!

- తప్పు చేసిన వారెవరినీ వదిలిపెట్టొద్దు.. జిల్లా ఎస్పీలకు సీఎం స్పష్టీకరణ
- నేరగాళ్లను జైలుకు పంపితేనే అదుపులో శాంతి భద్రతలు 11
- రాష్ట్రాన్ని కాపాడుకుందాం.. వ్యవస్థలపై నమ్మకం కలిగిద్దాం
- నాడు తప్పుడు కేసులు పెట్టడంపైనే శ్రద్ధ.. నేరస్థుల్ని పట్టుకోవడంలో లేదు: సీఎం
- జగన్ పాలనలో గంజాయివనం.. ఆయా శాఖల మధ్య సమన్వయం ఉండాలి
- తొలుత డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలి.. తర్వాత ఉక్కుపాదం మోపాలి: బాబు

ఆర్-5 జోన్ వివాదానికి తెర 12

- లబ్ధిదారులకు సొంత ప్రాంతాల్లో ఇళ్లు
- పేదలకు స్థలాలిచ్చి ఇళ్ల నిర్మాణం
- లేదా టిడ్కో గృహాల కేటాయింపు
- కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు నిర్దేశం
- గత ప్రభుత్వంలో రాజధానిలో చిచ్చు
- ఎన్నికల ముందు అమరావతిలో ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల వారికి స్థలాలు

గత ఐదేళ్లలో ఏదో జరిగింది!

- భూవివాదాలు 10 శాతం నుంచి 50 శాతానికి పెరిగాయి
- కబ్జాలు, దౌర్జన్యాల ఫిర్యాదులే ఎక్కువ
- వీటి పరిష్కారమే కలెక్టర్ల ప్రథమ కర్తవ్యం
- 9 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ రికార్డుల పునఃపరిశీలన: సిసోడియా

సాగర్ దాటిన కృష్ణమ్మ


సోమవారం నాగార్జున సాగర్ డ్యాం 16 గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్న దృశ్యం 12

- 16 గేట్లు ఎత్తి 1.53 లక్షల క్యూసెక్కులు విడుదల.. పులిచింతల గేట్లూ ఎత్తివేత
- సాగర్‌లో పర్యాటకుల సందడి.. కృష్ణమ్మ పరవళ్లతో రాష్ట్రంలోని ప్రాజెక్టులకు జలకళ

బ్లాక్ మండే

- ప్రపంచ మార్కెట్లతోపాటు కుప్పకూలిన దేశీయ స్టాక్ సూచీలు
- సెన్సెక్స్ 2,222 పాయింట్లు పతనం
- 662 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
- చిన్న, మధ్య స్థాయి షేర్లు విలవిల
- రూ. 15.32 లక్షల కోట్ల సంపద ఉఫ్
- అమెరికా ఆర్థిక మాంద్యం భయాలు, జపాన్ వడ్డీ పోటే ప్రధాన కారణాలు



ప్రపంచ మార్కెట్లతో పాటు దేశీయ ఈక్విటీ ప్రామాణిక సూచీలు సోమవారం భారీ పతనాన్ని చవిచూశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా *79,000* దిగువకు జారుకోగా.. ఎన్ఎస్ఈ నిఫ్టీ *24,000* వద్దకు పడిపోయింది. నిఫ్టీ సైతం ఒక సమయంలో *824* పాయింట్లు *(3.33%)* పతనమై *23,893.70* వద్దకు జారుకుంది. చివర్లో తేరుకుని *662.10* పాయింట్ల *(2.68%)* నష్టంతో *24,055.60* వద్ద క్లోజైంది. 10

మృత్యు కుహరాలుగా కోచింగ్ సెంటర్లు



- విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయి
- అవసరమైతే వాటిని మూసివేయిస్తాం 8
- ఢిల్లీ ఘటన నేపథ్యంలో సుప్రీం వ్యాఖ్యలు

టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూక దాడి..

నిందితులపై 307 సబబే

ముందుగా మేజిస్ట్రేట్‌కు చెప్పక్కర్లేదు: హైకోర్టు



3

- అప్పట్లో ఆ సెక్షన్ చేర్చకపోవడం దర్యాప్తు అధికారి అసమర్థతే: న్యాయమూర్తి
- నలుగురు నిందితులకు షరతులతో బెయిల్.. 15 వేలతో రెండు పూచీకత్తులు
- ప్రతి నెలా 1, 15 తేదీల్లో దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని ఆదేశం
- అప్పిరెడ్డి, రఘురాం సహా వైసీపీ నేతల పిటిషన్లపై విచారణ ఎల్లుండికి వాయిదా



సీఎంగా ఉన్నప్పటి భద్రత ఇవ్వండి

- హైకోర్టులో వైఎస్ జగన్ పిటిషన్.. వ్యక్తిగత రక్షణ అధికారులను ఇవ్వాలి
- కౌంటర్ అసాల్ట్ టీములు, జామర్ కూడా ఉండాలి.. తగు ఆదేశాలివ్వండి
- నాకిచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో ఏసీ పనిచేయడం లేదు
- ముందస్తు నోటీసివ్వకుండా జడ్ ప్లస్ రక్షణ తగ్గించారు 8
- ప్రతివాదులుగా డీజీపీ, నిఘా ఐజీ, కేంద్ర, రాష్ట్ర హోం శాఖలు

బాత్‌రూమ్‌ల ఫొటోలకు స్వస్తి

- టీచర్లకు ఆ భారం తప్పించిన ప్రభుత్వం
- యాప్‌ను తొలగించిన పాఠశాల విద్యా శాఖ 3


ఢాకాలో నిరసనకారుల సంబరాలు


బంగ్లా జాతిపిత ముజిబుర్ విగ్రహాన్ని ధ్వంసం చేస్తున్న ఆందోళనకారుడు

కల్లోల బంగ్లా

(మొదటి పేజీ తరువాయి)

ఉధృతమైన వేళ.. ఆమె తన పదవికి రాజీనామా చేసి.. ప్రత్యేక విమానంలో భారత్‌కు బయలుదేరారు. జాతినుద్దేశించి ప్రసంగించడానికి కూడా సైన్యాధికారులు ఆమెకు అవకాశం ఇవ్వలేదు.! హసీనా తన సోదరి రెహనాతో కలిసి ఆర్మీ హెలికాప్టర్‌లో ఎయిర్‌బేస్‌కు.. అక్కడి నుంచి మిలటరీ రవాణా విమానం(సీ-130జే)లో భారత్‌కు బయలుదేరారు. 3.30 గంటల సమయంలో.. హసీనా భారత సరిహద్దుల్లోకి ప్రవేశించారని నిర్ధారించుకున్నాక.. ఆమె రాజీనామా చేసినట్లు ఆర్మీ చీఫ్ ప్రకటించారు. ఆ తర్వాత జాతినుద్దేశించి ప్రసంగించారు. నిరసనకారులు ఆందోళనలను విరమించాలని, కర్ఫ్యూను ఎత్తివేస్తున్నామని ప్రకటించారు. ఆదివారం నుంచి సస్పెండ్ చేసిన ఇంటర్నెట్ కనెక్షన్‌ను తిరిగి పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. అధికారికంగా మిలటరీ ప్రభుత్వం ఏర్పడుతుందని వెల్లడించారు. అప్పటి దాకా నిరసనలు వ్యక్తం చేస్తున్న ఆందోళనకారులు.. ఒక్కసారిగా సంబురాలు జరుపుకొన్నారు. అదే సమయంలో ప్రధాని అధికారిక నివాసం సహా.. అధికార అవామీ పార్టీ నేతల ఇళ్లు, ఆస్తులను ధ్వంసం చేశారు. మీడియా కార్యాలయాలపైనా దాడులు జరిగాయి. అధికారపక్షానికి మద్దతిచ్చే వ్యాపారుల దుకాణాలు, పరిశ్రమలు లూటీ అయ్యాయి. దాంతో ఢాకా సహా.. దేశంలోని ప్రధాన నగరాలు నిప్పుల కుంపటిగా మారిపోయాయి. మరోవైపు భారత్ చేరిన హసీనా.. ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్‌ఫోర్స్ బేస్ వద్ద దిగారు. ఆ వెంటనే.. జాతీయ భద్రత సలహాదారు అజిత్ ఢోబాల్, వైమానిక దళం అధికారులు అక్కడికి చేరుకున్నారు. హసీనా ఢిల్లీ మీదుగా లండన్ వెళ్లాలని నిర్ణయించుకున్నా.. బ్రిటన్ ప్రభుత్వం అందుకు అంగీకరించలేదని.. దాంతో హసీనా కొంతకాలం భారత్‌లోనే ఉండనున్నారు.

ఉదయం నుంచే

దేశంలో రిజర్వేషన్లపై జరుగుతున్న ఆందోళనల కట్టడిలో భాగంగా హసీనా.. నిరసనల్లో మృతిచెందిన 34 మంది కుటుంబ సభ్యులతో ఉదయం 10.30కు తన అధికారిక నివాసంలో భేటీ అయ్యారు. అప్పటి నుంచి పరిణామాలు వేగంగా మారిపోయాయి. మధ్యాహ్నానికి దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతమయ్యాయి. దాంతో ఆర్మీ చీఫ్ వకార్-ఉజ్-జమా(హసీనాకు బంధువు) ప్రధాని నివాసానికి చేరుకుని, పరిస్థితిని వివరించారు. ఆయన


ప్రధాని ప్యాలెస్‌లో నిరసనకారులు

సూచన(45 నిమిషాల అల్టిమేటం జారీ చేశారని బంగ్లాదేశ్ పత్రికలు పేర్కొంటున్నాయి) మేరకే మధ్యాహ్నం 3 గంటల సమయంలో హసీనా రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం 3.35 సమయంలో ఆర్మీ చీఫ్ వకార్ జాతినుద్దేశించి ప్రసంగించారు. ఆ తర్వాత ఆయన ప్రభుత్వ ఏర్పాటు విషయమై చర్చించేందుకు అధ్యక్షుడు షాబుద్దీన్ నివాసానికి వెళ్లారు. తర్వాత అధ్యక్షుడు.. పార్లమెంటును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఉధృతమైన ఆందోళనలు

ఆర్మీ చీఫ్ ప్రసంగం తర్వాత కొంత సేపు వీధుల్లో సంబరాలు జరుపుకొన్న ప్రజలు.. ఆ వెంటనే మళ్లీ విధ్వంసకాండకు దిగారు. ప్రధాని అధికారిక నివాసంలోకి వందల మంది చొరబడ్డారు. అక్కడ దొరికిన వస్తువును దొరికినట్లు తస్కరించారు. ప్రధాని అధికార నివాసంలోని ల్యాన్‌లో విద్యార్థులు విలాసంగా కూర్చున్న ఫొటోలు, స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అదే సమయంలో హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమాల్ ఇంటికి నిప్పుపెట్టారు. హసీనా తండ్రి, బంగ్లాదేశ్ లిబరేషన్ నాయకుడు, బంగబంధు ముజీబ్-ఉర్-రెహ్మాన్ భారీ విగ్రహం పైకెక్కిన ఆందోళనకారులు.. తల భాగాన్ని సుత్తెతో మోది, పాక్షికంగా ధ్వంసం చేశారు. రాత్రి 7.30 సమయంలో బుల్డోజర్‌తో తిరిగి వచ్చిన ఆందోళనకారులు.. ఆ విగ్రహాన్ని నేలమట్టం చేశారు. ఢాకాలోని అవామీ లీగ్ కార్యాలయం సుధాసదన్‌కు, బంగబంధు మ్యూజియానికి, ఇందిరాగాంధీ కల్చరల్ సెంటర్‌కు నిప్పుపెట్టారు. బంగ్లాదేశ్ ప్రధాన న్యాయమూర్తి ఇంట్లోనూ విధ్వంసం సృష్టించారు. ఆ తర్వాత పార్లమెంట్ భవనంలోకి చొచ్చుకువెళ్లారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఢాకా విమానాశ్రయాన్ని ఆరు గంటల పాటు మూసివేశారు.

ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష

బంగ్లాదేశ్ పరిణామాలపై మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ కమిటీ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించింది. ఈ సమీక్షలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్‌షా, విదేశాంగ మంత్రి జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పాల్గొన్నారు. బంగ్లాదేశ్‌లో చదువుకుంటున్న భారత విద్యార్థులు పూర్తిస్థాయిలో వెనక్కి తిరిగి రాలేదు. అక్కడ కోటా ఆందోళనలు మొదలైనప్పటి నుంచి గత నెల 22 వరకు 2,894 మంది విద్యార్థులు వెనక్కి వచ్చారు. ఇంకా 3 వేల మంది వరకు అక్కడే ఉన్నారని.. వారిని వెనక్కి తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని విదేశాంగ శాఖ తెలిపింది. కాగా.. ఇండో-బంగ్లా మధ్య గూడ్స్ లారీలను నడిపే భారత డ్రైవర్లు సరిహద్దుల్లో చిక్కుకుపోగా.. ఆది, సోమవారాల్లో వారిని వెనక్కి రప్పించినట్లు బీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు.

అప్రమత్తమైన భారత్

బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఇంకా తగ్గకపోవడంతో.. భారత్ అప్రమత్తమైంది. హింస నేపథ్యంలో ఇండో-బంగ్లా సరిహద్దు వెంబడి చొరబాట్లకు అవకాశాలుండడంతో.. సరిహద్దు భద్రత దళం(బీఎస్ఎఫ్) నిఘాను పెంచింది. బీఎస్ఎఫ్ డీజీ దల్జీత్‌సింగ్ చౌదరి ఆగమేఘాల మీద కోల్‌కతా చేరుకున్నారు. బంగ్లాదేశ్‌తో 4,096 కిలోమీటర్ల మేర భారత్ సరిహద్దును పంచుకుంటుందని.. సరిహద్దు వెంబడి హైఅలెర్ట్ ప్రకటించామని ఆయన వివరించారు. మరోవైపు.. ప్రభుత్వం భారత్-బంగ్లాదేశ్ మధ్య రైలు సేవలను నిలిపివేసింది. ఎయిరిండియా కూడా బంగ్లాదేశ్‌కు విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేసింది. హసీనాకు కట్టుదిట్టమైన భద్రత ఉండే ప్రాంతంలో బస ఏర్పాటు చేసినట్లు తెలిసింది. కాగా.. హసీనా భారత్‌ను ఆశ్రయం కోరలేదని తెలుస్తోంది. ఆమె ఢిల్లీలోని తన కూతురు, ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) తూర్పు ఆసియా డైరెక్టర్ సైమా వాజిద్‌ను కలిసి.. ఆ తర్వాత లండన్‌కు వెళ్లే ప్రయత్నంలో ఉన్నారని సమాచారం. అయితే.. బ్రిటన్ ప్రభుత్వం ఆమెకు ఆశ్రయం కల్పించలేమని సమాచారం అందించినట్లు తెలిసింది. దీంతో హసీనా కొంతకాలం భారత్‌లోనే ఉండే అవకాశాలున్నాయి.



15 ఏళ్లు ప్రధానిగా..

షేక్ హసీనా అనూహ్య పరిణామాల మధ్య రాజకీయాల్లోకి వచ్చారు. ఆమె తండ్రి ముజీబ్-ఉర్-రెహ్మాన్. 1975లో మిలటరీ తిరుగుబాటులో.. ముజీబ్-ఉర్-రెహ్మాన్, ఆయన భార్య, ముగ్గురు కుమారులు దారుణ హత్యకు గురయ్యారు. ఆ సమయంలో హసీనా, ఆమె సోదరి రెహానా జర్మనీలో ఉన్నారు. ఆరేళ్ల పాటు ప్రవాస జీవితాన్ని గడిపిన హసీనా.. ఆ తర్వాత బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చారు. ప్రజల పక్షాన నిలబడి రాజకీయాల్లోకి వచ్చారు. 15 ఏళ్లపాటు ఐదుసార్లు ప్రధానిగా సేవలందించారు.

ఎస్సైని కొట్టి చంపిన దుండగులు

చాంద్‌పూర్ జిల్లాలోని కచువా, మత్లాబ్(సౌత్), మత్లాబ్(నార్త్), హెమ్చార్, ఫరీద్‌గంజ్ ఠాణాలపై ఆందోళనకారులు దాడి చేశారు. కచువా ఎస్సై మామునూర్ రషీద్‌ను కొట్టి చంపారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో షహదత్(20) అనే విద్యార్థి మృతిచెందగా.. ఇమ్రాన్‌హుస్సేన్ అనే విద్యార్థికి తూటా గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమంగా ఉంది.


ప్రధాని ప్యాలెస్ వైపు ఆందోళనకారుల ర్యాలీ

బంగ్లాదేశ్‌ను కుదిపేస్తున్న ప్రస్తుత పరిణామాలకు 'ముక్తి యోధుల కోటా'పై ఆగ్రహమేనా? అంటే.. రిజర్వేషన్ల అంశం పైకి కనిపించే స్థూల కారణం మాత్రమేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు! బంగ్లాదేశ్ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నా ఆ ఫలాలు ఉద్యోగాల రూపంలో ప్రజలకు అందకపోవడం, 2009 నుంచి అధికారంలో ఉన్న అవామీ లీగ్ అక్రమాలు, అవినీతి, విపక్ష నేతల అరెస్టులు, ప్రతిపక్షాలు ఎన్నికలనే బహిష్కరించే పరిస్థితి రావడం.. ఇలా చాలా కారణాలు ఒకదానికొకటి తోడై ప్రస్తుత సంక్షోభానికి దారితీశాయని వారు విశ్లేషిస్తున్నారు.

రిజర్వేషన్లపై యుద్ధంగా మొదలై

1972లో అమల్లోకి స్వాతంత్ర్య సమరయోధుల కోటా

1971 యుద్ధంలో స్వాతంత్ర్యం సంపాదించుకున్న అనంతరం.. బంగ్లాదేశ్ తొలి ప్రధాని షేక్ ముజిబుర్ రహమాన్ 1972లో స్వాతంత్ర్య సమరయోధులకు (30%), యుద్ధం వల్ల నష్టపోయిన మహిళలకు (20%), పేదలు, వెనుకబడిన జిల్లాలకు చెందినవారికి, గిరిజనులు, మైనారిటీలకు (30%) ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కేటాయించారు. ఆయన మరణానంతరం.. ఆ దేశ ప్రభుత్వం 1976లో రిజర్వేషన్లను 60 శాతానికి తగ్గించింది. మిగతా 40 శాతం ఉద్యోగాలను ప్రతిభ ఆధారంగా భర్తీ చేయడం మొదలుపెట్టింది. 1996 నాటికి రిజర్వేషన్లు 55 శాతానికి తగ్గాయి. అయితే, 1997 తర్వాత స్వాతంత్ర్య సమరయోధుల కోటాలో ఉద్యోగాల భర్తీ క్రమంగా తగ్గడం మొదలైంది. ఆ తరం వారంతా వృద్ధులై చనిపోవడమే ఇందుకు కారణం. దీంతో అప్పటి షేక్ హసీనా ప్రభుత్వం ఆ కోటాను స్వాతంత్ర్య సమర యోధుల పిల్లలకు వర్తింపజేయడం మొదలుపెట్టింది. 2010లో స్వాతంత్ర్య సమరయోధుల మనవలకు సైతం ఆ కోటా వర్తించేలా చేశారు. 2012లో దివ్యాంగులకు 1 శాతం కోటాను వర్తింపజేశారు. దీంతో మళ్లీ రిజర్వేషన్లు 56 శాతానికి పెరిగాయి. 2018లో ఈ కోటా వ్యవస్థను నిరసిస్తూ బంగ్లాదేశ్‌వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో.. హసీనా సర్కారు ప్రథమ, ద్వితీయ శ్రేణి ఉద్యోగాల్లో అన్ని రకాల రిజర్వేషన్లనూ ఎత్తేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంపై స్వాతంత్ర్య సమరయోధుల వారసులు కొందరు 2021లో హైకోర్టును ఆశ్రయించారు. రిజర్వేషన్లు ఎత్తేస్తూ హసీనా సర్కారు ఇచ్చిన సర్క్యులర్ చెల్లదంటూ ఈ ఏడాది జూలై 1న హైకోర్టు తీర్పునివ్వడంతో విద్యార్థులు మళ్లీ రోడ్డెక్కారు. ప్రభుత్వం దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జూలై 14న.. నిరసనకారులను ఉగ్రవాదులతో పోలుస్తూ హసీనా చేసిన వ్యాఖ్యలు, 'రిజర్వేషన్లు స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు కాక రజాకార్ల వారసులకు ఇవ్వాలా?' అని వ్యంగంగా ప్రశ్నించడం పరిస్థితిని తీవ్రతరం చేసింది. 'అవును మేం రజాకార్లమే.. అన్యాయాన్ని ప్రశ్నించినవారు రజాకార్లయితే.. మేం రజాకార్లమే' అంటూ నినాదాలు చేస్తూ నిరసనల జోరు పెంచారు. ఆ సమయంలో సున్నితంగా వ్యవహరించి విద్యార్థులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సిన హసీనా సర్కారు.. ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని నిర్ణయించింది. కర్ఫ్యూ విధించి.. సాయుధ బలగాలను రంగంలోకి దించింది. జూలై 18న.. సాయుధబలగాలకు, నిరసనకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో 200 మందికి పైగా మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. జూలై 21న.. ముక్తియోధుల వారసులకు ఇస్తున్న 30 శాతం కోటాను 5 శాతానికి, దివ్యాంగుల కోటాను ఒక శాతానికి, మైనారిటీలకు, ట్రాన్స్ జెండర్లకు కలిపి ఇస్తున్న రిజర్వేషన్‌ను ఒక శాతానికి తగ్గిస్తూ సుప్రీంకోర్టు అప్పిలేట్ డివిజన్ తీర్పునిచ్చింది. మిగతా 93 శాతం ఉద్యోగాలనూ ప్రతిభ ఆధారంగా భర్తీ చేయడానికి మార్గం సుగమం చేసింది. కానీ, ఈ కోటాలను భవిష్యత్తులో మార్చే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంటుందని తన తీర్పులో పేర్కొంది. ఆ తీర్పు ప్రకారం నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఆ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. కానీ, అప్పటికే పరిస్థితి చెయ్యిదాటిపోయింది.

(సెంట్రల్ డెస్క్)

తదుపరితరాలకూ వర్తింపజేయడంపై విద్యార్థుల ఆక్రోశం

పాక్ హస్తం?

బంగ్లాదేశ్ కల్లోలం వెనుక పాకిస్థాన్ హస్తం ఉందని విశ్వసనీయవర్గాలు పేర్కొంటున్నాయి. విద్యార్థి ఆందోళనలకు మద్దతిచ్చిన నిషేధిత జమాతే ఇస్లామీకి చెందిన విద్యార్థి సంఘం 'ఛాత్ర శిబిర్'కు పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ అండ ఉందని.. విద్యార్థి ఉద్యమాన్ని రాజకీయ ఉద్యమంగా మార్చడం వెనుక అది కీలక పాత్ర పోషించిందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. భారతదేశానికి అనుకూలంగా ఉండే హసీనా ప్రభుత్వాన్ని కూల్చి వారి లక్ష్యమని వివరించాయి.

హసీనా హయాంలో అభివృద్ధి

విద్యార్థుల ఉద్యమానికి సామాజిక, ఆర్థిక కోణాలూ ఉన్నాయి. గడిచిన దశాబ్దన్నర కాలంలో.. అంటే, షేక్ హసీనా 2009లో మళ్లీ పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ బంగ్లాదేశ్ ఆర్థికంగా బాగా అభివృద్ధి చెందింది. ప్రపంచంలోనే అతిపెద్ద రెడీమేడ్ దుస్తుల తయారీ హబ్‌గా మారి అంతర్జాతీయ స్థాయి బ్రాండ్లకు వస్త్రాలను ఎగుమతి చేసింది. ఆ రంగంలో 4 కోట్ల ఉద్యోగాలున్నా.. అవి ప్రైవేటు ఉద్యోగాలు. వేతనం తక్కువ. చాకిరీ ఎక్కువ. సముచిత వేతనాలు వచ్చే ప్రభుత్వ ఉద్యోగాలనేమో.. స్వాతంత్ర్య సమరయోధుల కోటా కింద అధికార అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలకు, శ్రేణులకు కేటాయించడం, విపరీతమైన అవినీతి కారణంగా దేశంలో ద్రవ్యోల్బణం పెరిగిపోవడం ప్రజల్లో కోపానికి కారణమైంది. ఆ కోపాన్ని వెలిబుచ్చుదామంటే విపరీతమైన నిర్బంధాలు. నిరసన కూడా తెలపలేని భయానకమైన వాతావరణం నెలకొని ఉండేది. ఈ పదిహేనేళ్లలో ప్రభుత్వాన్ని విమర్శించిన 80 మంది ఆచూకీ గల్లంతైంది. వారి గురించి వారి కుటుంబసభ్యులకు ఎలాంటి సమాచారమూ లేదు. ప్రభుత్వమే వారిని చంపించిందన్న ఆరోపణలున్నాయి. మరోవైపు.. హసీనా అధికారంలో ఉండగా ఎన్నికలు నిష్పాక్షికంగా జరుగుతాయన్న నమ్మకం లేక.. విపక్ష బీఎన్‌పీ, మరికొన్ని పార్టీలు 2014, 2024 ఎన్నికలను బాయ్‌కాట్ చేశాయి. ఆమె రాజీనామా చేసి.. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిపిస్తేనే తాము పోటీ చేస్తామని ప్రకటించాయి. ఇవన్నీ ప్రజల్లో కోపం తారస్థాయికి చేరడానికి కారణమయ్యాయి.

భారత్-బంగ్లా మధ్య నిలిచిన వాణిజ్యం

కోల్‌కతా, ఆగస్టు 5: బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిణామాల ప్రభావం భారత్-బంగ్లాదేశ్ వాణిజ్యంపై పడుతోంది. సోమవారం మధ్యాహ్నం నుంచి ఇరు దేశాల మధ్య వాణిజ్య కార్యకలాపాలు నిలిచిపోయినట్టు వ్యాపారులు చెబుతున్నారు. ఆదివారం నాడే బంగ్లాదేశ్ ప్రభుత్వం మూడు రోజుల ట్రేడ్ హాలిడేను ప్రకటిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే అత్యవసర సర్వీసులను మాత్రం దీని నుంచి మినహాయించింది. బంగ్లాదేశ్‌లోని లాండ్ పోర్ట్‌ల వద్ద ఆ దేశ కస్టమ్స్ నుంచి క్లియరెన్స్ లేకపోవడం వల్ల అన్ని లాండ్ పోర్టుల్లో ఎగుమతి, దిగుమతుల కార్యకలాపాలు నిలిచిపోయాయని పశ్చిమ బెంగాల్ ఎగుమతిదారుల కోఆర్డినేషన్ కమిటీ సెక్రటరీ ఉజ్వల్ సాహ తెలిపారు. ఇదిలా ఉండగా.. బంగ్లాదేశ్‌లో నెలకొన్న సంక్షోభం పట్ల భారత ఎగుమతిదారులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఆ దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ద్వైపాక్షిక వాణిజ్యంపై ప్రభావం చూపుతాయంటున్నారు. అయితే త్వరలోనే పరిస్థితులు సద్దుమణుగుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాసియాలో బంగ్లాదేశ్.. భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉండగా.. ఆసియాలో బంగ్లాదేశ్‌కు భారత్ రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి.


భారత్ విరాళంగా ఇచ్చిన అంబులెన్స్‌పై ఆందోళనకారుల దాడి



పాక్‌లో ఇమ్రాన్‌పై కుట్ర

సైనిక పెత్తనానికి కేంద్రమైన పాకిస్థాన్‌లో ఇమ్రాన్ ఖాన్‌ను పూర్తి కాలం పదవిలో కొనసాగనివ్వలేదు. ఉక్రెయిన్ యుద్ధం సమయంలో రష్యాలో పర్యటించిన ఆయనను పట్టుబట్టి మరీ తప్పించారు. దీనివెనుక అమెరికా హస్తం ఉందనే ఆరోపణలున్నాయి. చివరకు ఇమ్రాన్ అనేక కేసులను ఎదుర్కొంటున్నారు. ఏడాదిన్నరగా జైల్లోనే ఉన్నారు. ఆయన బయటకు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

అనూహ్యంగా మారిన నేపాలన

నేపాల్‌లో మొన్నటి వరకు ప్రచండ ప్రధానిగా ఉన్నారు. కానీ, గత నెల 12న జరిగిన విశ్వాస పరీక్షలో ఓడిపోయారు. దీంతో ప్రచండ స్థానంలో కేపీ శర్మ ఓలీ ప్రధాని అయ్యారు. భారత్ వ్యతిరేకత కనబరిచే ఈయన 2021కి ముందు వరకు రెండుసార్లు ప్రధానిగా పనిచేశారు. మరోవైపు, మయన్మార్‌లో సైనిక పెత్తనం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ప్రజాస్వామ్యం కోసం పోరాడిన సూచీని జైలుకు పంపిన మయన్మార్ సైనిక పాలకులు దేశంపై తమ పట్టును బిగించారు.







లంకలో కల్లోలం

ధరల పెరుగుదల, అంతులేని అవినీతి, కుటుంబ పెత్తనంతో సరిగ్గా రెండేళ్ల కిందట శ్రీలంకలో ప్రజలు అధ్యక్షుడు గొటబాయ రాజపక్స మీద తిరుగుబాటు చేశారు. రోజుల తరబడి ఆందోళనలు సాగించారు. చివరకు గొటబాయ అధికారిక నివాసంలోకి చొరబడి నానా బీభత్సం సృష్టించారు. ఈ ఆగ్రహాన్ని చూసిన రాజపక్స దేశం విడిచిపారిపోయారు.



బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ చిచ్చు

బంగ్లాదేశ్‌లో స్వాతంత్ర్య సమరయోధుల పిల్లలకు రిజర్వేషన్లపై మొదలైన నిరసనలు చివరికి ఆ దేశ ప్రధాని షేక్ హసీనా రాజీనామాకు దారి తీశాయి. బంగ్లాదేశ్ హసీనా హయాంలో ఆర్థికంగా బాగా అభివృద్ధి చెందింది. అయితే, విపరీతమైన అవినీతి, ద్రవ్యోల్బణం, రాజకీయ ఏకస్వామ్యం, నిర్బంధ విధానాలతో ప్రజల్లో అసంతృప్తి పెరిగింది.

రికార్డు విజయం నుంచి

పలాయనం దాకా

విద్యార్థిగానే రాజకీయాల్లోకి హసీనా.. 5 సార్లు ప్రధానిగా ఎన్నిక

ఢాకా, ఆగస్టు 5: స్వాతంత్ర్యం కోసం పోరాడి.. విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి వచ్చి.. సొంత దేశంలోనే సైన్యం చేతిలో తల్లిదండ్రులు, సోదరులను కోల్పోయి.. భారత్‌లో ప్రవాసంలో గడిపి.. మాతృభూమికి తిరిగెళ్లి.. ప్రధానిగా రికార్డు కాలం పనిచేసిన షేక్ హసీనా జీవితంలో మరోసారి సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. బంగ్లా జాతిపిత షేక్ ముజిబుర్ రెహ్మాన్ కుమార్తె అయిన ఈమె.. భారత్-పాక్ విభజన జరిగాక 1947 సెప్టెంబరులో జన్మించారు. 1960ల చివరలో పాకిస్థాన్ నుంచి స్వాతంత్ర్యం కావాలంటూ బంగ్లా ప్రజలు సాగించిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తండ్రిని పాక్ పాలకులు జైలులో పెట్టగా.. ఆయన స్థాపించిన అవామీ లీగ్ పార్టీ బాధ్యతలను చూశారు. 1971లో దేశానికి స్వాతంత్ర్యం అనంతరం ముజిబుర్ తొలుత అధ్యక్షుడు, తర్వాత ప్రధాని అయ్యారు. మరో నాలుగేళ్లకే ఆయనతో పాటు భార్య, ముగ్గురు కొడుకులను సైన్యం అధికారిక నివాసంలోనే చంపేసింది. చెల్లెలు రెహానాతో కలిసి విదేశాల్లో ఉండడంతో హసీనా ప్రాణాలు దక్కించుకున్నారు. స్వదేశానికి వెళ్లలేని పరిస్థితుల్లో ఆరేళ్లు భారత్‌లో ఉన్నారు. అవామీ లీగ్ పార్టీ అధినేత్రిగా ఎన్నికయ్యాక 1981లో బంగ్లాకు వెళ్లారు. సైన్యం పాలన పోయి ప్రజాస్వామ్యం రావాలని గళమెత్తారు. గృహ నిర్బంధాలను ఎదుర్కొన్నారు. 1991లో జరిగిన ఎన్నికల్లో అవామీ లీగ్.. బేగం ఖలీదా జియాకు చెందిన బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్పీ) చేతిలో పరాజయం పాలైంది. 1996లో తొలిసారి గెలిచి ప్రధాని అయ్యారు. 2001లో ఓడిపోయినా 2008 ఎన్నికల్లో గెలిచారు.


బంగ్లాదేశ్‌ను వీడే ముందు మిలిటరీ హెలికాప్టర్ వద్ద షేక్ హసీనా

ఐరన్ లేడీ నుంచి..

హసీనా గత రెండు ఎన్నికల్లో దొడ్డిదారిన ఎన్నికయ్యారన్న విమర్శలొచ్చాయి. భారత్, చైనాలతో బలమైన మైత్రీబంధం ఆమె అధికార పీఠాన్ని పటిష్ఠం చేసినా క్రమేణా బంగ్లావాద భావోద్వేగం పేరిట ప్రత్యర్థులను అణచివేస్తూ ఆస్మదీయులకు పెద్ద పీట వేయడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. ఓ ర్యాలీలో హసీనాపై 2004లో హత్యాయత్నం జరిగింది. అనంతరం ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకున్నారు. 1971 యుద్ధ నేరాలపై ట్రైబ్యునల్ ఏర్పాటు చేశారు. ఇది ప్రత్యర్థి పార్టీ అగ్రనేతలు కొందరిని దోషులుగా తేల్చింది. 2013లో బీఎన్పీ మిత్రపక్షం జమాత్ ఎ ఇస్లామీపై ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించారు. అవినీతి ఆరోపణలపై ఖలీదా జియాకు 17 ఏళ్ల జైలు శిక్ష పడేలా చేశారు. దీంతో హసీనాను నియంతగా ప్రత్యర్థులు విమర్శించారు. కాగా ఈ ఏడాది జనవరిలో జరిగిన ఎన్నికల్లో అవామీ లీగ్ గెలిచింది. ఆరు నెలలు తిరగకుండానే రిజర్వేషన్ల కోటాపై హసీనా ప్రభుత్వంపై తిరుగుబాటు నేపథ్యంలో అభిమానులు ఐరన్ లేడీగా పిలుచుకున్న నాయకురాలు దేశం విడిచి వెళ్లాల్సివచ్చింది.

గల్ఫ్‌లో బంగ్లా ప్రవాసీల సంఘీభావం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

బంగ్లాదేశీయులు లక్షల సంఖ్యలో గల్ఫ్ దేశాల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు. స్వదేశంలో పరిణామాలను సోమవారం వీరంతా అత్యంత ఆసక్తిగా పరిశీలించారు. హసీనా రాజీనామా చేయనున్నట్లుగా కథనాలు రావడంతో పనులను పక్కనపెట్టి ఇళ్లకు ఫోన్లు చేసి ఆరాలు తీశారు. కాగా, స్వదేశంలో జరుగుతున్న నిరసనలకు సంఘీభావం తెలిపినందుకు పెద్ద సంఖ్యలో గల్ఫ్ దేశాల్లోని బంగ్లాదేశీయులను పోలీసులు అరెస్టు చేసి జైలు శిక్షలు విధించారు. వీధులలో శాంతియుతంగా గూమిగూడినా ఊరుకోలేదు. ఫేస్‌బుక్‌లో సంఘీభావ సందేశాలను పెట్టినందుకు దుబాయ్‌లోని బంగ్లాదేశీ ప్రవాసీయులను అరెస్ట్ చేశారు. హసీనా వాస్తవానికి గల్ఫ్ దేశాలలో బంగ్లాదేశ్ వీసాలపై ఉన్న ఆంక్షలను తొలగించి, ఉపాధికి దోహదం చేశారు. కానీ, బంగ్లాదేశ్‌లో పెరిగిపోతున్న మత ఛాందసవాదులకు ఆమె ధోరణి నచ్చలేదు. మోదీ పాలనలోని భారత్‌తో ఆమె సత్సంబంధాలు నెరపడం వారి ఆగ్రహాన్ని రెట్టింపు చేసింది.

ఆర్మీ చీఫ్ అయిన నెలన్నరకే..



షేక్ హసీనా రాజీనామాతో పాటు.. త్వరలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ జనరల్ వకార్ ఉజ్ జమాపైనే ప్రస్తుతం ప్రపంచం దృష్టంతా ఉంది. ఆయన ఆ పదవి చేపట్టింది ఈ ఏడాది జూన్ 23నే! అంటే ఇంచుమించుగా నెలన్నర క్రితం. ఆయన వయసు 58 సంవత్సరాలు. 1966లో ఢాకాలో జన్మించిన జమాన్.. బంగ్లాదేశ్ జాతీయ విశ్వవిద్యాలయం నుంచి డిఫెన్స్ స్టడీస్‌లో మాస్టర్ డిగ్రీ పూర్తిచేశారు. అనంతరం కింగ్స్ కాలేజ్ (లండన్)లో డిఫెన్స్ స్టడీస్‌లో మరో ఎమ్మే చేశారు. 1985 డిసెంబరులో ఆర్మీలో చేరి సేవలందిస్తున్నారు. ఆర్మీ చీఫ్ కాకమునుపు.. చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్‌గా ఆర్నెల్లపాటు వ్యవహరించారు. ఐక్యరాజ్యసమితి పీస్‌కీపర్‌గా రెండు పర్యటనలు చేశారు. 1997-2000 సంవత్సరాల నడుమ ఆర్మీ చీఫ్‌గా ఉన్న జనరల్ ముహమ్మద్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ కుమార్తె కమలికను వివాహం చేసుకున్నారు. బంగ్లాదేశ్ సైన్యాన్ని ఆధునీకరించారన్న పేరు జమాన్‌కు ఉంది.

లోకం తీరు







తిరుమల ఆలయం ముందు విభిన్న ప్రతిభావంతులు, చెన్నైలో ఆధ్యాత్మిక రైలుకు పచ్చజెండా ఊపుతున్న మంత్రి శేఖర్‌బాబు, టీటీడీ తమిళనాడు అడ్వయిజరీ కమిటీ మాజీ అధ్యక్షులు ఏజే శేఖర్ తదితరులు

శ్రీవారిని దర్శించుకున్న1008 మంది అనాథ, దివ్యాంగ చిన్నారులు

చెన్నై/తిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): టీటీడీ తమిళనాడు అడ్వయిజరీ కమిటీ, చెన్నై రోటరీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 1008 మంది అంధులు, మూగ, దివ్యాంగులు, అనాథ పిల్లలు సోమవారం సాయంత్రం తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వారితో పాటు 495 మంది వలంటీర్లున్నారు. విభిన్న ప్రతిభావంతులు కావడంతో గత ఏడాది తరహాలోనే టీటీడీ సోమవారం కూడా ఉచితంగా దర్శనం కల్పించింది. అధికారులు, సిబ్బంది దగ్గరుండి దర్శనం చేయించారు. వీరి ఆధ్యాత్మిక యాత్రను తమిళనాడు హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు సోమవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. టీటీడీ తమిళనాడు అడ్వయిజరీ కమిటీ మాజీ అధ్యక్షులు ఏజే శేఖర్ తదితరులు నేతృత్వం వహించడంతో పాటు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. చెన్నై సెంట్రల్ నుంచి ప్రత్యేక రైలులో వచ్చిన చిన్నారులకు రేణిగుంట రైల్వేస్టేషన్‌లో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వాగతం పలికి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో తిరుమలకు పంపించారు. రోటరీక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహావీర్ బోత్రా, ఈవెంట్ చైర్మన్ పంకజ్ కటారియా పాల్గొన్నారు.





సత్యదేవుడి ఆలయంలో వజ్ర కిరీటాన్ని ఈవో, చైర్మన్‌కు అందజేస్తున్న దాత మట్టే సత్యప్రసాద్, అమ్మవారికి అలంకరించనున్న వజ్రకిరీటం, వజ్రకర్ణాభరణాలు

అనంతలక్ష్మి అమ్మవారికి వజ్రకిరీటం

» అన్నవరం సత్యదేవునికి సమర్పించిన దాతే దేవేరికి కూడా...

అన్నవరం, ఆగస్టు 5: కాకినాడ జిల్లా అన్నవరంలో కొలువైన అనంతలక్ష్మి అమ్మవారికి వజ్రకిరీటం కానుకగా అందింది. రెండేళ్ల క్రితం సత్యదేవుడికి వజ్రకిరీటం సమర్పించిన పెద్దాపురం లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్, సూర్యకమల దంపతులు తాజాగా సోమవారం దేవేరి అనంతలక్ష్మి అమ్మవారికి వజ్రకిరీటం, స్వామి,అమ్మవార్లకు వజ్రకర్ణాభరణాలను సమర్పించారు. సుమారు 1.50 కోట్లతో వజ్రకిరీటం, రూ.50 లక్షలతో వజ్రకర్ణాభరణాలను దాత చేయించారు. మట్టే సత్యప్రసాద్, ఆయన కుమారుడు ఆదిశంకర్ గర్భాలయంలో మూలవరుల చెంత ప్రత్యేకపూజలు చేయించి దేవస్థానం ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రాజా ఐవీ రోహిత్‌లకు అందజేశారు. పర్వదినాలు మినహా నిత్యం స్వామి, అమ్మవార్లు వజ్రకిరీటంతో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పానీపూరీ వాలాకు రాష్ట్రపతి ఆహ్వానం

» స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం



ఆహ్వాన పత్రిక చూపుతున్న చిరంజీవి

తెనాలి, ఆగస్టు 5: స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అరుదైన అవకాశం పానీపూరి వాలాకు దక్కింది. రాష్ట్రపతి నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. గుంటూరు జిల్లా తెనాలి బాలాజీరావుపేటలో పానీపూరీ బండి నడుపుతున్న మెగావత్ చిరంజీవికి సోమవారం పోస్టల్ అధికారులు రాష్ట్రపతి పంపిన ఆహ్వానాన్ని అందించారు. ఈ నెల 15న ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఆహ్వానం అందుకున్న చిరంజీవి ఉబ్బితబ్బిబ్బు అయ్యాడు. జాతీయ పట్టణ జీవనోపాధి విషన్ కింద సాయం పొందిన చిరంజీవి పానీపూరీ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. 2021లో మెప్మా విభాగం నుంచి ఆర్థిక సాయం పొంది, క్రమం తప్పకుండా రుణాలను చెల్లిస్తుండటంతోపాటు డిజిటల్ రూపంలో నగదు లావాదేవీలను నిర్వహిస్తున్నందుకుగాను తనకు ఈ ఆహ్వానం అందిందని తెలిపారు.

బాత్‌రూమ్‌ల ఫొటోలకు ఫుల్‌స్టాప్

» టీచర్లకు ఆ భారం తప్పించిన ప్రభుత్వం

» యాప్‌ను తొలగించిన పాఠశాల విద్యాశాఖ

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం వివాదాస్పద రీతిలో ప్రవేశపెట్టిన బాత్‌రూమ్‌ల ఫొటోల యాప్‌కు ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టింది. బాత్‌రూమ్ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసే యాప్‌ను పాఠశాల విద్యాశాఖ తొలగించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వం పాఠశాలల్లో అనేక రకాల యాప్‌లు తీసుకొచ్చింది. ప్రతిరోజూ టీచర్లు ఆ యాప్‌లు వినియోగించి సమాచారం అప్‌లోడ్ చేసే విధానాన్ని ప్రారంభించింది. అందులో ఒకటి బాత్‌రూమ్ ఫొటోల క్యాప్చరింగ్ యాప్. ప్రతిరోజూ ఉదయం పాఠశాలకు రాగానే టీచర్లు బాత్‌రూమ్‌ల పరిశుభ్రతను తెలిపేలా వాటి ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇలా తమతో బాత్‌రూమ్‌ల ఫొటోలు తీయించడం అవమానకరంగా ఉందని, ఈ ఒక్క యాప్‌ను వెంటనే తొలగించాలని అప్పట్లో టీచర్లు గగ్గోలు పెట్టారు. కానీ ప్రభుత్వం వినిపించుకోలేదు. అయితే, ఇది టీచర్లను అవమానించినట్లుగా ఉందని భావించిన టీడీపీ ప్రభుత్వం ఆ యాప్‌ను పూర్తిగా తొలగించింది. యాప్‌ను తొలగించినందుకు ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి, నోబుల్ టీచర్స్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకట్రావు, బి.హైమారావు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

'రేషన్' ఎగుమతులకు అడ్డుకట్ట!

» కాకినాడ పోర్టులో రెండు చెక్‌పోస్టులు

» ఫోర్టిఫైడ్ బియ్యమని నిర్ధారణైతే కేసులే!

» పోర్టు వద్ద 24 గంటలూ పీడీఎస్ బియ్యం తనిఖీలు

» మంత్రి మనోహర్ ఆదేశాలతో కార్యరూపం



కాకినాడ పోర్టులో బొంబాయి గేటు వద్ద బియ్యం తనిఖీ కోసం సోమవారం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో తనిఖీలు

కాకినాడ కలెక్టరేట్, ఆగస్టు 5: రేషన్ బియ్యాన్ని రీసైకిల్ చేసి కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి చేయకుండా నిరోధించేందుకు రాష్ట్రప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. 24 గంటలూ నిఘా ఉంచేలా రెండు చెక్‌పోస్టుల ఏర్పాటుకు నిర్ణయించింది. పోర్టుకు వెళ్లే ప్రధాన గేటు వద్ద (బొంబాయి కాటా) మొదటి చెక్‌పోస్టు ఏర్పాటు చేసింది. సోమవారం నుంచి దీనివద్ద తనిఖీలు కూడా ప్రారంభించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసాద్, పోలీసులు, పోర్టు అధికారుల ఆధ్వర్యంలో బియ్యం లారీలను విస్తృతంగా తనిఖీ చేశారు. పీడీఎస్ బియ్యంలో కెర్నెల్స్ కలిగిన పోర్టిఫైడ్ బియ్యం కోసం తనిఖీలు జరిగాయి. రెండో చెక్‌పోస్టును పోర్టు బీవోసీ గేటు వద్ద ఏర్పాటు చేయనున్నారు. చెక్‌పోస్టుల వద్ద మోహరించిన టీంలో పోలీసు అధికారులు, పోర్టు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన టెక్నికల్ అసిస్టెంట్ ఉంటారు. వీరు నిరంతరం పోర్టులోకి వెళ్లే బియ్యం లోడ్ లారీలను పరిశీలిస్తారు. బియ్యం నాణ్యతను గుర్తించేందుకు శాంపిల్స్ తీసుకుంటారు. ప్రధానంగా బ్రోకెన్, రా రైస్‌ల నుంచి ఈ శాంపిల్స్ స్వీకరిస్తారు. వీటిలో కెర్నెల్స్ కలిగిన పోర్టిఫైడ్ బియ్యంగా ల్యాబ్‌లో నిర్ధారణ అయితే వాటిని పీడీఎస్ బియ్యంగా గుర్తించి కేసులు నమోదు చేస్తారు. ప్రభుత్వ చర్యతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కాకినాడలో జూన్ 28న పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో పీడీఎస్ బియ్యం కోసం నిల్వ ఉంచిన గోదాములపై దాడులు జరిగాయి. తర్వాత కూడా దాడులు కొనసాగుతూ వచ్చాయి. రూ.154 కోట్ల విలువైన 50,647 మెట్రిక్ టన్నుల బియ్యం సీజ్ చేశారు. ఆయా యాజమాన్యాలపై 6ఏ కేసులతోపాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశారు. సీజ్ చేసిన బియ్యంలో 26,488 మెట్రిక్ టన్నులు పీడీఎస్(కెర్నెల్స్) పోర్టిఫైడ్ బియ్యంగా నిర్ధారించారు. మిగిలిన 24,159 టన్నుల బియ్యాన్ని ఆయా యాజమాన్యాలకు అందజేశారు.

ఐదేళ్లలో 800 కోట్ల పీడీఎస్ బియ్యం ఎగుమతి

ఐదేళ్ల జగన్ ప్రభుత్వ హయాంలో గత ఐదేళ్లలో రూ.800 కోట్ల విలువైన రేషన్ బియ్యం కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి అయినట్లు అధికారులు అంచనా వేశారు. కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నడిచే గోదాముల ద్వారానే విదేశాలకు తరలినట్లు విమర్శలు వచ్చాయి. దీంతో టీడీపీ కూటమి ప్రభుత్వం దీనికి అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది. కాకినాడ జిల్లాలో ఉన్న బియ్యం గోదాముల్లో విస్తృతంగా తనిఖీలు చేసింది. దరిమిలా చాలావరకు అక్రమ రవాణా ఆగింది. దీనిని సంపూర్తిగా అడ్డుకునే క్రమంలో మంత్రి మనోహర్ ఆదేశాలతో కలెక్టర్ షణ్మోహన్ పోర్టులో కొత్త చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

ఎస్‌ఆర్‌సీ నివేదికను సవాల్ చేస్తూ పిటిషన్ వేస్తాం

» ప్రస్తుత వ్యాజ్యం ఉపసంహరణకు అనుమతి ఇవ్వండి

» హైకోర్టును అభ్యర్థించిన పెద్దిరెడ్డి .. అంగీకరించిన న్యాయస్థానం

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): 'నాకు ప్రాణహాని లేదంటూ సెక్యూరిటీ రివ్యూ కమిటీ(ఎస్‌ఆర్‌సీ) ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేస్తాం. మంత్రిగా నాకు న్న 5 ప్లస్ 5 సెక్యూరిటీని కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలు చేసిన ప్రస్తుత పిటిషన్‌ను ఉపసంహరించుకొనేందుకు అనుమతించండి' అని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సోమవారం హైకోర్టును అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన న్యాయస్థానం, ఎస్‌ఆర్‌సీ నివేదికను సవాల్ చేస్తూ పిటిషన్ వేసేందుకు పెద్దిరెడ్డికి వెసులుబాటు కల్పిస్తూ వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. మంత్రిగా ఉండగా తనకు ఇచ్చిన 5 ప్లస్ 5 సెక్యూరిటీని కొనసాగించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తి పిటిషనర్‌కు 2 ప్లస్ 2 సెక్యూరిటీని కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా హోం శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ... పెద్దిరెడ్డికి ఎలాంటి ప్రాణహాని లేదని ఎస్ఆర్‌సీ నివేదిక ఇచ్చిందన్నారు. ఎమ్మెల్యేగా ఆయనకు 1 ప్లస్ 1 భద్రత కల్పిస్తున్నామన్నారు.

ఎస్ఆర్‌సీ రిపోర్టును ఎంపీ మిథున్‌రెడ్డికి అందజేయండి

తనకు 4 ప్లస్ 4 భద్రతను కల్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ రాజంపేట నియోజకవర్గం వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం హైకోర్టులో విచారణకు రాగా పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ... పిటిషనర్‌కు ఎలాంటి ప్రాణహాని లేదని, అదనపు భద్రత అవసరం లేదని సెక్యూరిటీ రివ్యూ కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు. ఎంపీ హోదాలో మిథున్‌రెడ్డికి 2 ప్లస్ 2 సెక్యూరిటీ కల్పిస్తున్నామన్నారు. ఈ దశలో న్యాయస్థానం జోక్యం చేసుకుంటూ ఎస్ఆర్‌సీ నివేదికను పిటిషనర్‌కు అందజేశారా? అని ఆరా తీసింది. లేదని ప్రభుత్వ న్యాయవాది బదులివ్వడంతో నివేదికను మిథున్‌రెడ్డికి అందజేయాలని ప్రభుత్వ జీపీని ఆదేశిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

సీఐడీ అటాచ్‌మెంట్‌లోకి ఆ భూమిని తెచ్చేలా ఆదేశించండి

» జోగి రమేశ్ కుటుంబ సభ్యులు ప్లాట్లు వేస్తున్నారు

» హైకోర్టులో అగ్రిగోల్డ్ విన్నపం

అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సీఐడీ ఆటాచ్ చేసిన 2160 చదరపు గజాల అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన భూమిని మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబ సభ్యులు ప్లాట్లుగా వేసి విక్రయిస్తున్నా, వాటి రక్షణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ అగ్రిగోల్డ్ యాజమాన్యం దాఖలు చేసిన వ్యాజ్యం సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. విచారణ జరిపిన న్యాయస్థానం పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి కృష్ణా జిల్లా అంబాపురం గ్రామం పరిధిలో సీఐడీ అటాచ్ చేసిన 2160 చదరపు గజాల భూమిని జోగి రమేశ్ కుటుంబ సభ్యులు ప్లాట్లుగా వేసి విక్రయిస్తున్నారని అగ్రిగోల్డ్ యాజమానులు అవ్వా వెంకట వీణా సంతోషి మరో 8 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జోగి రమేశ్ కుమారుడు జోగి శరత్ మరికొందరు కుటుంబ సభ్యులతో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు కుమ్మక్కయ్యారన్నారు. సీఐడీ అటాచ్ చేసిన సర్వే నంబర్ 88లో ఉన్న 2160 చదరపు గజాల భూమిని సర్వే నంబర్ 87లో ఉన్నట్లుగా మార్చి ప్లాట్లుగా వేసి విక్రయించారన్నారు. సంబంధిత భూమిని సీఐడీ అటాచ్‌మెంట్ పరిధిలోకి తీసుకొచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది పీఎస్‌పీ సురేశ్‌కుమార్ వాదనలు వినిపించారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూక దాడి..

నిందితులపై 307 సబబే

» హైకోర్టు స్పష్టీకరణ

» ముందుగా మేజిస్ట్రేట్‌కు చెప్పక్కర్లేదు

» అప్పట్లో ఆ సెక్షన్ చేర్చకపోవడం నాటి దర్యాప్తు అధికారి అసమర్థతే: న్యాయమూర్తి

» నలుగురు నిందితులకు షరతులతో బెయిల్

» రూ.15 వేలతో రెండు పూచీకత్తులు

» ప్రతి నెలా 1, 15 తేదీల్లో దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని ఆదేశం

» అప్పిరెడ్డి, రఘురాం సహా వైసీపీ నేతల పిటిషన్లపై విచారణ ఎల్లుండికి వాయిదా



అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూక దాడి ఘటనలో నిందితులపై హత్యాయత్నం, తదితర సెక్షన్లు చేర్చడాన్ని హైకోర్టు సమర్థించింది. దర్యాప్తు అధికారి చర్య సహేతుకమైనదేనని అభిప్రాయపడింది. దాడి ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఎఫ్ఐఆర్‌లోనే ఉన్నాయని, దాని ఆధారంగా ఐపీసీ సెక్షన్లు 307 (హత్యాయత్నం), 326 (ప్రమాదకర ఆయుధాలతో తీవ్రంగా గాయపరచడం) వంటివి చేర్చకపోవడం అప్పటి దర్యాప్తు అధికారి అసమర్థతగా పేర్కొంది. కేసు ప్రాథమిక దశలో విస్మరించిన వివరాలను తర్వాతి దశలో సరిచేయడం తప్పేమీ కాదని తెలిపింది. దర్యాప్తులో సేకరించిన వివరాల ఆధారంగా అదనపు సెక్షన్లు చేర్చడం దర్యాప్తు అధికారి విధి అని స్పష్టం చేసింది. అదనపు సెక్షన్లు చేర్చేముందు సంబంధిత మేజిస్ట్రేట్‌కు తెలియపరచాలని చట్టనిబంధనల్లో నిర్దేశించలేదని తెలిపింది. ఎఫ్ఐఆర్‌లో మార్పులు చేయడానికి చట్టం అనుమతించనప్పటికీ.. దర్యాప్తులో గుర్తించిన అంశాలు ఆధారంగా సెక్షన్లు సవరిస్తూ మెమో దాఖలు చేయడం సాధారణమైన అంశమేనని వెల్లడించింది. ఐపీసీ 307, 326 సెక్షన్లను చేరుస్తూ దర్యాప్తు అధికారి వేసిన మెమోను తిరస్కరించాలని నలుగురు నిందితుల తరఫు న్యాయవాదులు చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. అయితే ఆ నలుగురు పిటిషనర్లు గత నెల 3 నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారని, ఆ తర్వాత కేసు దర్యాప్తులో చెప్పుకోదగినంత పురోగతి ఉందని గుర్తుచేసింది. వారికి బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తుకు అవరోధం కలగబోదని అభిప్రాయపడింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆ నలుగురికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. మంగళగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సంతృప్తి మేరకు ఒక్కొక్కరూ రూ.15 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని.. చార్జిషీట్ దాఖలు చేసేవరకు ప్రతి నెల 1వ తేదీ, 15వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట మధ్య దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఆయనకు అందుబాటులో ఉండాలని, కేసు దర్యాప్తును ప్రభావితం చేయడం గానీ, సాక్షులను బెదిరించడం గానీ చేయవద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయం పై మూకదాడి ఘటనలో గుంటూరుకు చెందిన అచ్చల వెంకటరెడ్డి, బత్తుల దేవానంద్, షేక్ ఖాజా మొహిద్దీన్, షేక్ మస్తాన్‌వలీలను పోలీసులు అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. వీరికి జూలై 3న మేజిస్ట్రేట్ జ్యుడీషియల్ కస్టడీ విధించారు. ట్రయల్ కోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో వీరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల ఇరువైపు వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి సోమవారం తన నిర్ణయాన్ని వెల్లడించారు.

వైసీపీ నేతలకు ముందస్తు బెయిల్‌పై విచారణ 8కి వాయిదా

మరోవైపు.. ఇదే దాడి కేసులో వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, వైసీపీ నేత దేవినేని అవినాశ్, మాజీ ఎంపీ నందిగం సురేశ్, ఆ పార్టీ కార్యకర్తలు జి.రమేశ్, షేక్ రబ్బానీ బాషా, చిన్నాబత్తిన వినోద్‌కుమార్, మరికొందరు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై సోమవారం కూడా హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. ఇదే కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మరికొందరు పిటిషన్లు దాఖలు చేశారని.. వాటిపై కౌంటర్లు దాఖలు చేస్తామని.. అన్ని పిటిషన్లపైనా గురువారం వాదనలు వినిపిస్తామని తెలిపారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ విచారణను గురువారాని(8వ తేదీ)కి వాయిదా వేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, న్యాయవాది వై.నాగిరెడ్డి, తిరుమలశెట్టి కిరణ్, శశాంక్ భువనగిరి వాదనలు వినిపించారు.

పిన్నెల్లి అనుచరులు నా భూమి కబ్జా చేశారు

» కౌలుకు తీసుకొని... అడుగు పెడితే చంపేస్తామంటున్నారు

» టీడీపీ కార్యాలయంలో ఓ మహిళ ఫిర్యాదు

» రాష్ట్రవ్యాప్తంగా భూ ఆక్రమణలపై వెల్లువెత్తిన కంప్లైంట్లు

» టీడీపీలో ఉన్నామని ఇళ్లపై దాడి చేసి కొట్టారు

» పోలీసులు ఏనాడూ పట్టించుకోలేదు

» ఎస్సీ మహిళ సువర్ణమ్మ ఫిర్యాదు

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మాచర్ల వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వగ్రామంలో ఆ పార్టీ నేతలు తమ భూమిని కబ్జా చేశారని ఒక మహిళ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు బాధితులు సోమవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి హాజరై తమ సమస్యలపై వినతులు ఇచ్చారు. వారి నుంచి పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, పార్టీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్, మహిళా నేత ఆచంట సునీత వినతులు స్వీకరించారు. 'పిన్నెల్లి స్వగ్రామంలో వైసీపీ నేతలు నా భూమిని కౌలుకు తీసుకొన్నారు. ఒక ఏడాది మాత్రం కౌలు ఇచ్చి నాలుగేళ్ల నుంచి ఇవ్వడం లేదు. భూమిలోకి అడుగు పెడితే చంపేస్తామని బెదిరిస్తున్నారు. వారికి భయపడి మార్కాపురంలో తలదాచుకోవాల్సి వచ్చింది. నా భూమిని నాకు ఇప్పించండి' అని పిన్నెబోయిన రమణమ్మ విజ్ఞప్తి చేశారు. గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొమ్మూరు గ్రామానికి చెందిన మహ్మద్ ఖాశిం, షేక్ జిలాని, షేక్ అర్షతున్నీసా ఇచ్చిన ఒక వినతిపత్రంలో తాము టీడీపీ వారమని గత ప్రభుత్వ హయాంలో తమ భూములు లాక్కొన్నారని, విచారణ జరిపించి తమ భూములు తమకు ఇప్పించాలని కోరారు. నెల్లూరు జిల్లా కొండాపురం మండలం పార్లపల్లి గ్రామంలో 17 ఎకరాల పశువుల పోరంబోకు భూమిని వైసీపీ నేతలు కబ్జా చేశారని, దీనితో పశువులకు ఇబ్బందిగా ఉందని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అదే మండలం భీమవరప్పాడు గ్రామంలో 36 ఎకరాల భూమిని వైసీపీకి చెందిన సర్పంచి, ఉప సర్పంచి కలిసి ఒక ప్రైవేటు కంపెనీకి అక్రమంగా అమ్మేశారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతల అండతో తన భూమిని ఆక్రమించుకొన్నారని, దళితులం కావడంతో పోలీసుస్టేషన్‌కు వెళ్లినా న్యాయం జరగలేదని ఏలూరు జిల్లా ముసునూరుకు చెందిన మేడూరి స్వర్ణ కుమారి ఫిర్యాదు చేశారు. తనకు తెలియకుండా తన భూమిని ఇతరుల పేరు మీదకు మార్చారని పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తుర్లపాడుకు చెందిన చింతల శేషగిరిరావు ఫిర్యాదు చేశారు. తాము టీడీపీలో ఉండటంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో తమ ఇళ్లపై అనేకసార్లు దాడులు చేసి కొట్టారని, స్టేషన్లో ఏనాడూ పట్టించుకోలేదని.. ఇప్పుడు చర్యలు తీసుకోవాలని నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం కొండాపురం మండలం గిట్టి గుండాలపాలెం ఎస్సీ కాలనీకి చెందిన పదర్ల సువర్ణమ్మ కోరారు.

పిన్నెల్లిపై కేసుల పూర్తి వివరాలివ్వండి

» పోలీసులను ఆదేశించిన హైకోర్టు

అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఈవీఎం, వీవీప్యాట్‌ల ధ్వంసం, అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడి, నాగశిరోమణి అనే మహిళను బూతులు తిట్టిన వ్యవహారంతో పాటు పోలింగ్ మరుసటి రోజు కారంపూడి సీఐ నారాయణ స్వామిపై దాడిచేసి గాయపరిచిన ఘటనలకు సంబంధించి నమోదైన కేసుల్లో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన రెండు పిటిషన్లు సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చాయి. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఎన్నికల సందర్భంగా మే 13న పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన ఘటన, తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలకు సంబంధించి పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని అనుచరులు 15 మందిపై హత్యాయత్నం, మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మే 14న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డి, అనుచరులు కారంపూడిలో దాడులకు పాల్పడుతుండగా అడ్డుకోబోయిన సీఐ నారాయణ స్వామిపై దాడిచేసి గాయపరిచారు. సీఐ ఫిర్యాదుతో పిన్నెల్లి సోదరులు, అతని అనుచరులపై పోలీసులు హత్యాయత్నం, మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుల్లో అరెస్టయిన పిన్నెల్లి ప్రస్తుతం నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ కేసుల్లో ఆయనకు బెయిల్ మంజూరు చేసేందుకు ఇటీవల గురజాల కోర్టు నిరాకరించింది. ఈ నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిన్నెల్లి హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

వరదలో పోలవరం

» ఈసీఆర్ఎఫ్ డ్యాం ప్రాంతంలో సీపేజీ జలాలు

» కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి మరో 3 నెలలు ఆగాల్సిందే

పోలవరం, ఆగస్టు 5: పోలవరం ప్రాజెక్టు వద్ద వరద పోటెత్తుతోంది. దీంతో ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల నడుమ సీపేజీ జలాల నీటిమట్టం పెరిగింది. ఫలితంగా కీలకమైన కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి మరో మూడు నెలల సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల అంతర్జాతీయ నిపుణుల బృందం దెబ్బతిన్న వాల్‌ను, సీపేజీ తీరును పరిశీలించి వెళ్లిన సంగతి తెలిసిందే. పాత వాల్‌కు మరమ్మతులు చేయడం కంటే కొత్తది కట్టడమే మేలని కేంద్ర జలసంఘం చైర్మన్ కుశ్వీందర్ వోహ్రా గట్టిగా అభిప్రాయపడ్డారు. రాష్ట్ర జలవనరుల శాఖ ఆ మేరకు అంచనాలను కూడా రూపొందించి కేంద్రం ఆమోదానికి పంపింది. కాగా.. వరదల వల్ల ఎగువ, దిగువ కాఫర్ డ్యాముల్లో సీపేజీ భారీగా ఎగదన్నుతోంది. ఆ డ్యాముల నడుమ సీపేజీ జలాల నీటిమట్టం 23.88 మీటర్లుగా నమోదైంది. అక్కడ 0.6 టీఎంసీల నీరుంది. గోదావరి నీటిమట్టం సాధారణ స్థాయికి చేరుకుంటే తప్ప సీపేజీ దిగువకు పోయే మార్గం లేదు. ప్రస్తుతం డీవాటరింగ్ ద్వారా నీటిని తోడేయడం సాధ్యం కాని పని కావడంతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అతి కీలకమైన నూతన డయాఫ్రం వాల్ నిర్మాణం నవంబరులో మాత్రమే సాధ్యమవుతుందని జల వనరులశాఖ అధికారులు అంటున్నారు.

పెద్దిరెడ్డిపై వేసిన ఈపీలో అభ్యర్థులందరినీ ప్రతివాదులుగా చేర్చాం

» అనుబంధ పిటిషన్ వేశాం: రామచంద్రయాదవ్

» అనుమతించిన హైకోర్టు... విచారణ 8కి వాయిదా

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, పుంగనూరు వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్(ఈపీ) సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్, న్యాయవాది పీవీజీ ఉమేష్ చంద్ర వాదనలు వినిపిస్తూ... కోర్టు ఆదేశాలకు అనుగుణంగా పెద్దిరెడ్డితో పాటు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు అందరినీ ఈపీలో ప్రతివాదులుగా చేరుస్తూ అనుబంధ పిటిషన్ వేశామన్నారు. అనుబంధ పిటిషన్‌ను అనుమతిస్తూ ప్రధాన వ్యాజ్యంపై విచారణను వాయిదా వేయాలని కోరారు. ఈ వాదనలు పరిగణనలో తీసుకున్న న్యాయస్థానం అనుబంధ పిటిషన్‌ను అనుమతించింది. పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గంలో పెద్దిరెడ్డితో పాటు ఎన్నికల్లో పోటీచేసిన ఇతర అభ్యర్థులు అందరినీ ప్రతివాదులుగా చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బంగ్లా పయనం ఎటు?

బంగ్లాదేశ్‌లో పరిణామాలు ఇంతవేగంగా మారిపోతాయని, ముగింపు ఇలా ఉంటుందని ఎవరూ ఊహించలేదు. ఆమె తండ్రి, బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రహ్మాన్ యాభైయేళ్ళక్రితం స్వదేశంలో హత్యకు గురైన విషయాన్ని గుర్తుచేసుకుంటే, హసీనా ఆమేరకు అదృష్టవంతురాలే. పదిహేను సంవత్సరాలు దేశాన్ని నిరవధికంగా, ఓ నియంతలాగా ఏలిన ఆమె ఇక తనకు పదవి కంటే ప్రాణం ముఖ్యమని తెల్చుకోవాల్సి వచ్చింది. హడావుడిగా దేశం నుంచి నిష్క్రమించాల్సివచ్చింది. రాజీనామా చేసిన గంటలోగా అప్పటికే పెట్టాబేడాతో సిద్ధంగా ఉన్న హెలికాప్టర్ ఎక్కి దేశ సరిహద్దులు దాటిపోయారామె.

గత మూడువారాలుగా బంగ్లాదేశ్ తీవ్ర హింసాకాండ చవిచూసింది. భద్రతాబలగాలు, అధికారపార్టీ కార్యకర్తలు కలసికట్టుగా యువకులమీద సాగించిన అకృత్యాలు, మూడువందలమందిని నడిరోడ్డుమీద కాల్చిచంపేసిన దారుణాలు ఆమెకు ఎంతో చెడ్డపేరు తెచ్చాయి. స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ముప్పైశాతం మేరకు రిజర్వేషన్లు కల్పించిన అంశం ఈ మొత్తం ఉపద్రవానికి తక్షణ కారణం. తన తండ్రి హయాంలో ఆరంభమైన ఆ రిజర్వేషన్లు అనంతరకాలంలో ఎన్నో మలుపులు తిరిగి, తప్పుదోవలుపట్టి, కొంతమేరకు బలహీనపడినప్పటికీ, వీటి విషయంలో యువతరంతో ఆమె ఏ స్థాయిలో యుద్ధం చేశారో తెలియంది కాదు. హైకోర్టు తీర్పుతో తిరిగిరగిలిన ఆ చిచ్చు సుప్రీంకోర్టు ఆదేశాలతో నిజానికి చల్లారాలి. కానీ, అందుకు భిన్నంగా హసీనా గద్దెదిగాలన్న లక్ష్యంతో, దిగేంతవరకూ ఆగకుండా సాగడం విశేషం. కోటా వ్యతిరేక ఉద్యమం వెనుక విపక్ష బీఎన్పీ, ఇస్లామిస్ట్ శక్తుల రాజకీయ కుట్ర ఉన్నదని ఆమె ఆరోపణ. హైకోర్టు తీర్పు వెనుక ఆమె పాత్ర ఉన్నదని అనుకున్నప్పటికీ, ఆ తీర్పును రద్దుపరచి కోటాలన్నింటినీ బాగా కుదించడం ద్వారా సుప్రీంకోర్టు అటు ఉద్యమకారులకు, ఇటు హసీనాకు కూడా న్యాయం చేసింది. కానీ, ఆ తీర్పు అమలుజరిగే వరకూ పోరాడుతూనే ఉంటామని, హసీనా క్షమాపణ చెప్పాలనీ, మృతులకు న్యాయం చేయాలనీ, చివరకు ఆమె దిగిపోవాలనీ ఇలా ఎప్పటికప్పుడు కొత్త డిమాండ్లతో ఆ ఉద్యమం కొనసాగడం విచిత్రం. సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఆమె ఏకంగా దేశంలో అతిపెద్ద మతపార్టీ జమాత్-ఎ-ఇస్లామీ మీద నిషేధం విధించడానికి సిద్ధపడటం పరిస్థితులను మరింత దిగజార్చింది.

హసీనా లేని బంగ్లాదేశ్‌తో భారత్ ఇకపై చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి రావచ్చు. ఇస్లామిస్టులను సంతృప్తిపరచడం కోసం హసీనా తనను దేశంనుంచి గెంటేశారని, ఇప్పుడు ఆ ఇస్లామిస్టులే హసీనాను దేశం నుంచి గెంటేశారని ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ ఓ వ్యాఖ్య చేశారు. అధికారంలోకి వచ్చిన సైన్యం ఎలా వ్యవహరిస్తుందో, విపక్ష బీఎన్పీ, జమాత్-ఎ-ఇస్లామీ ఏమేరకు చక్రం తిప్పుతాయో చూడాలి. మిగతా ఇస్లామిక్ పార్టీలూ కలసి ఈ రెండూ, ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా సైన్యం కృషి చేస్తుందని వార్తలు వస్తున్నాయి. ఇలా జరిగినా, జరగకపోయినా భారతదేశం ఇకపై గతంలో మాదిరిగా ప్రశాంతంగా ఉండలేదు. మతఛాందసశక్తులను నియంత్రణలో ఉంచుతూ, అటువంటివారినుంచి మనకు ముప్పులేకుండా హసీనా ఇంతకాలమూ చూసుకున్నారు. గత పదిహేనేళ్ళుగా మనం ఎంత ప్రశాంతంగా ఉన్నామన్నది 2001–2006 మధ్యకాలంలో మనం ఎదుర్కొన్న సమస్యలను బట్టి అర్థంచేసుకోవచ్చు. బీఎన్పీ-జమాతే కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగిన ఆ ఐదేళ్ళలో అనేక ఇస్లామిక్ సంస్థలు పురుడుపోసుకున్నాయి, పాకిస్థాన్ పోషించిన ఉగ్రవాద సంస్థలు మనదేశంలో విధ్వంసకాండకు పాల్పడ్డాయి. హసీనా అధికారంలోకి రాగానే ఇటువంటి శక్తులను ఏరివేశారు, ఉరితీశారు. ఇప్పుడు గతంలో మాదిరిగా బీఎన్పీ-జమాతే కూటమి అధికారంలోకి వస్తే అవే పరిణామాలు మనం చూడాల్సిరావచ్చు. బంగ్లాదేశ్‌లోని వేలాదిమంది హిందువుల భవితవ్యం ఎలా ఉండబోతున్నదో ఇప్పటికే కొన్ని సంఘటనలు తెలియచెబుతున్నాయి.

హసీనాకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో చాలా శక్తులు ఏకమైనాయి. ఈ సంక్షోభం వెనుక పాకిస్థాన్, చైనాలున్నాయన్న విశ్లేషణలను అటుంచితే, అమెరికా కూడా తనవంతుగా ఓ చేయివేసిందన్నది నిజం. బైడెన్ ప్రభుత్వం విలన్ పాత్ర కాకున్నా, ఒక బలమైన విపక్షపాత్ర పోషిస్తుంటే, హసీనాను నిలబెట్టడానికి మనం చేయవలసినంత చేయలేదన్న విమర్శలు కూడా ఈ సందర్భంలో రావడం సహజం.



నిరంతర విప్లవకారుడు

కళాసాహిత్యాలు, సంస్కృతి స్వయంభూలు కావు. అవి సాంఘిక, ఆర్థిక, రాజకీయ ఉత్పత్తులని మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతం అంటుంది. పాట, కవిత, నాటకం, నవల, కథ, ఇతర కళాప్రక్రియలన్నీ ఆయా సమాజాల నిర్దిష్ట భౌతికత లేదా అనిర్దిష్ట భౌతికత ఉత్పత్తులే. కళాసాహిత్యాల, సంస్కృతిని ఉత్పత్తి, పంపిణీ కోణం నుంచి చూడటం ఒక చారిత్రక దృక్పథం. ఉత్పత్తి, పునాది, ఉపరితలం అనే వర్గీకరణ అవసరమనీ, అలాగే అసహజమైన కేంద్రం, దాని అంచు (పెరిఫెరీ) అనే వర్గీకరణ కూడా సంస్కృతి అనే విశాల భావనలోకి వస్తాయని మార్క్సిస్టు సాహితీ సిద్ధాంత విమర్శకుడు రేమాండ్ విలియమ్స్ అంటాడు. గద్దర్ కళాసాహిత్యాలను, గద్దర్ సృష్టించిన సాంస్కృతిక సంపదను పునరాలోకన చేయడానికి రేమాండ్ విలియమ్స్ విమర్శా మార్గం దోహదం చేస్తుంది.

కళలు, పాటలు, సృజనాత్మక రచనా ప్రక్రియలన్నీ సమాజ ఉత్పత్తులనీ, అవి సమిష్టి ఉత్పత్తులని గద్దర్ అంటాడు. తన పాటల నేపథ్యాన్ని ఈ కోణం నుంచే ఆయన వివరించాడు. ప్రజలే కళల్ని నిర్మిస్తారని చెప్పాడు. వాటిని పెట్టుబడిదారీ వ్యవస్థ, అది ఉత్పత్తిచేసే దోపిడీ సంస్కృతి పరాయీకరిస్తాయని గద్దర్ అంటాడు. అయితే, భూస్వామ్య, పెట్టుబడిదారీ సమాజాలు ఉత్పత్తిచేసే కళాసాహిత్య సంస్కృతులను విప్లవీకరించాలంటాడు. క్యాపిటలిస్టు దేశాలలోని జనపదాలలో కూడా వర్గ స్పృహ వుంటుంది. మన సమాజంలోని జనపదాలలో వర్గ, కుల స్పృహ రెండూ కనిపిస్తాయి. అయితే, వాటిలో పీడిత వర్గాల పట్ల అవహేళన, వివక్ష, పాలక వర్గాల పట్ల ఆరాధన వంటివి కూడా కనిపిస్తాయి. అసమానతలు తొలిగిపోవాలన్న చైతన్యం కొరవడటం వల్ల ఈ వాసనలు వుంటాయి. పాలక వర్గాల భావాలే ప్రజల భావాలుగా చలామణి అవుతూ, దోపిడీని జనరలైజ్ చేస్తాయి. ఆ పాలక వర్గాల భావాల నుంచి ప్రజలను విముక్తి చేయటమే నా కర్తవ్యమనీ, అందుకే పాటలను విప్లవీకరించే పనిని స్వీకరించానని గద్దర్ స్పష్టం చేశాడు. ఆధిపత్య కళా సాహిత్యాలే ప్రజా జీవితంలో కేంద్ర స్థానం ఆక్రమించాయి. శ్రామిక వర్గ, పీడిత కుల కళాసాహిత్యాలు జానపదాలుగా పెరిఫెరీకి నెట్టేయబడ్డాయి. గద్దర్ విశిష్టత ఇక్కడే వుంది. జానపదాలను విప్లవపాటలుగా మార్చి, వాటిని జనజీవనంలో కేంద్రస్థానంగా మార్చేశాడు గద్దర్. నిజానికి గద్దర్‌కు అంతా సంస్కృతే. ఆర్థికం మాత్రమే కేంద్రం, మిగతావన్నీ ఉపరితలాలనే భావనపట్ల నిర్దిష్టమైన స్పష్టత ఆయనకు లేనప్పటికీ, కేంద్రం అనేది ఆధిపత్య భావననీ, అదెక్కడున్నా సరే, దాన్ని ధ్వంసం చేయాలని చూశాడు. అందుకే, ఆయన పాటలు, ఆయన జీవితంలో అనిర్వచనీయమైన విస్తృతి, వైవిధ్యం కనిపిస్తాయి. విస్మృత అంశాలను కావ్యవస్తువును చేశాడు. అలాగే, కులం, ప్రాంతం, మతం, భాష, లింగం ఇత్యాదివి ఆధిపత్య కేంద్రాలుగా మారినప్పుడు, వాటికి వ్యతిరేకంగా తన

గద్దర్ సాహిత్యమూ జీవితమూ విడదీయలేనివి. ఆయన కళాసాహిత్యాలను కేవలం సౌందర్యశాస్త్ర కోణం నుంచో లేదా అలంకార శాస్త్రాల అకడమిక్ దృక్పథం నుంచో వివేచించలేము. గద్దర్‌ది విశాలమైన కాన్వాసు. ఆయన తాత్త్వికత నిశ్చలమైనది కాదు. నిరంతర చింతనతో, తత్త్వశాస్త్ర సరిహద్దులను విస్తరించుకుంటూ పోయాడు. గద్దర్ యుగకర్త మాత్రమే కాదు, రాబోవు యుగాలకు కూడా ముందున్న విప్లవకారుడు.

పాటను, ప్రదర్శనను ఎక్కుపెట్టాడు. సమాజంలో భావ విప్లవం, సాంస్కృతిక విప్లవం రెండూ నిరంతరం కొనసాగాలని గద్దర్ సూచించాడు. కేవలం సాయుధ విప్లవం ఒంటరిగా విజయవంతం కాదని గద్దర్ అభిప్రాయం. మార్క్సు లెనిన్ మావోలతోపాటు పూలే అంబేద్కర్‌ల తాత్త్విక చింతనను కమ్యూనిస్టు పార్టీలు స్వీకరించాలని ఆయన సూచించాడు. అంతేకాదు, ప్రజాస్వామిక దశలో ప్రాంతీయ ఉద్యమాలు కూడా కీలకమైనవని, వాటికి ప్రజలే నాయకత్వం వహించాలని గద్దర్ ఆలోచించాడు. తెలంగాణ జనసభ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఉద్యమానికి ఆయన దిక్సూచి. తెలంగాణ ఉద్యమాన్ని ఆంధ్ర కేంద్ర పాలనకు వ్యతిరేకంగా నడిపినందుకే గద్దర్ మీద కాల్పులను రాజ్యం జరిపింది. ప్రజాస్వామిక తెలంగాణ ఏర్పడాలనే ఉద్యమ ఆశయం నెరవేరకుండానే భౌగోళిక తెలంగాణ ఆవిర్భవించింది. ఆ కారణంగా తెలంగాణ ప్రజల జీవితంలో ఏ మార్పూ రాలేదు. ప్రజల వాంఛ నెరవేరలేదు. దొరల వాంఛ నెరవేరలేదనేది ఆయన అభిప్రాయం. ప్రజాస్వామిక ఉద్యమాలకు పాలక వర్గాలు నాయకత్వం వహించినప్పటికీ, ప్రజలు ఆ నాయకత్వాన్ని ఆమోదించటం వల్ల ఆయా ఉద్యమాల ఆశయాలు నెరవేరవు. తెలంగాణ ఉద్యమం ఒక ప్రజాస్వామిక ఉద్యమమే అయినప్పటికీ, ప్రజల ఆశలు ఆకాంక్షలు నెరవేరలేదు. అందుకే పాట మహాశక్తిగా మారాలి. అంటే పాట సామాన్య ప్రజలను, పీడిత వర్గ ప్రజలను మహాశక్తిమంతులుగా మార్చాలని అర్థం. అప్పుడే ఆశించిన మార్పు వస్తుందనే అవగాహన గద్దర్‌కు ఉంది. తెలంగాణ అనంతరం ఒక దశాబ్దం పాటు నిశ్శబ్ద విప్లవం నివురు కప్పిననిప్పులా వుంది. అది సరైన నాయకత్వం రాగానే బహిర్గతమవుతుందని గద్దర్ ఆశించాడు. తెలంగాణ బచావో ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. అయితే, పాలకులు మారినంత మాత్రాన తెలంగాణ ప్రజాస్వామిక ఆశలు, ఆకాంక్షలు నెరవేరుతాయని అనుకోలేము. గత ఆర్నెళ్లుగా ఈ సత్యాన్ని గమనిస్తూనే వున్నాము. పాలక వర్గం స్థానంలో పీడిత వర్గం అధికారం అధిరోహించకుండా అంతరాలు తొలిగిపోవు. రాజ్యాధికారం పీడిత వర్గాలకు దక్కకుండా గద్దర్ ఆశించిన సమాజ నిర్మాణం సాధ్యం కాదు. అందుకే వర్గ కేంద్ర భావనను అయన సవరించి ఇది కుల కేంద్ర సమాజమని తన పాటలతో అర్థం చేయించాడు. ఊరు, వాడ రెండూ ప్రజాస్వామికం కావాలంటే రెండూ స్వయంపాలనా వ్యవస్థలుగా అభివృద్ధి చెందాలని దళిత పంచాయతీ ఉద్యమానికి ఆయన సంఘీభావం తెలిపాడు. తెలంగాణ ధూంధాం నిర్మాణం చేసిన గద్దరే, బహుజన ధూంధాం సభలకు ముఖ్యఅతిథిగా హాజరై 'బానిసలారా లెండిరా' అని పిలుపునిచ్చాడు. ఓటు కూడా విప్లవ రూపమని భావించిన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని గద్దర్ అనేక సభలలో నొక్కి చెప్పాడు.


గద్దర్ సాహిత్యమూ జీవితమూ విడదీయలేనివి. గద్దర్ కళాసాహిత్యాలను కేవలం సౌందర్యశాస్త్ర కోణం నుంచో లేదా అలంకార శాస్త్రాల అకడమిక్ దృక్పథం నుంచో వివేచించలేము. ఆయనది విశాలమైన కాన్వాసు. ఆయన తాత్త్వికత నిశ్చలమైనది కాదు. ఆయన నిరంతర చింతన, తత్త్వశాస్త్ర సరిహద్దులను నిరంతరం విస్తరించుకుంటూ పోయాడు. అందుకే, గద్దర్ యుగకర్త మాత్రమే కాదు, రాబోవు యుగాలకు కూడా ముందున్న విప్లవకారుడు.

● శ్రీనివాస్ దక్షిణ్
(నేడు గద్దర్ ప్రథమ వర్ధంతి)

కోటా తీర్పులో క్రీమీలేయర్ తంటా!

సామాజిక అసమానతలను రూపుమాపే ఒక ప్రగతిశీల విధానాన్ని సుప్రీంకోర్టు స్వాగతించింది; సామాజిక న్యాయసాధన రాజకీయాలకు మద్దతు నిచ్చింది. శుభస్కరమైన, చాలా కాలంగా నిరీక్షించిన ఈ చర్య ద్వారా విద్యా ఉద్యోగాలలో షెడ్యూల్డు కులాలు (ఎస్సీ), షెడ్యూల్డు తరగతుల (ఎస్టీ)కు ప్రస్తుతమున్న రిజర్వేషన్ల ఉప-వర్గీకరణకు శాసన సంబంధమైన ఆటంకాలను ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం తొలగించింది. అయితే చర్చకు యోగ్యమైన రీతిలో, ఎస్సీలు, ఎస్టీలలోని సకల సామాజిక శ్రేణులు రిజర్వేషన్ల లబ్ధి పొందేందుకు వీలుగా 'క్రీమీ లేయర్' మినహాయింపునకు కూడా పచ్చ జెండా ఊపి ఉండవల్సింది. విశేష ప్రాముఖ్యత సంతరించుకోగల అటువంటి నిర్ణయం సహజంగానే ప్రశంసలు, విమర్శలకు పాత్రమయ్యేది. ఎస్సీ రిజర్వేషన్ల విభజన తీర్పుపై దళిత నాయకులు ప్రకాశ్ అంబేడ్కర్, చంద్రశేఖర్ రావణ్ తదితరులులు ప్రశ్నలు లేవనెత్తగా షెడ్యూల్డు కులాలలో బాగా అట్టడుగున ఉన్న వాల్మీకి, మాదిగ మొదలైన దళిత సమూహాలు సుప్రీంకోర్టు తీర్పుపట్ల హర్షామోదాలు వ్యక్తం చేశాయి. ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో మారిన న్యాయ సంబంధిత పరిస్థితికి ప్రతిస్పందనగా రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా కొత్త విధానాలను రూపొందిస్తాయి, రాజకీయ పార్టీలు కొత్త రాజకీయాలను ఎలా సృష్టిస్తాయి అన్న దానిపైనే భవిష్యత్తు చాల వరకు ఆధారపడి ఉన్నది. అయితే 'ది స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దేవీందర్ సింగ్' కేసులో సుప్రీంకోర్టు తీర్పు రిజర్వేషన్లపై భారతదేశ సమున్నత న్యాయశాస్త్ర ఆలోచనా ప్రవంతి, శ్రేష్ఠమైన న్యాయ నిర్ణయాలలో ఒక ముందడుగు అని నిస్సంకోచంగా చెప్పవచ్చు. మొత్తం మీద 'అఫర్ మేటివ్ యాక్షన్' (నానా వివక్షల వల్ల రకరకాల ఇబ్బందులకు గురవుతూ తమకు దక్కాల్సిన ప్రయోజనాలను అందుకోలేకపోతున్న నిమ్న సామాజిక శ్రేణులకు జరుగుతున్న అన్యాయాల నిర్మూలనకై ప్రభుత్వం చేపట్టే సానుకూల వివక్ష లేదా ప్రగతిశీల పక్షపాత చర్య)పై ముమ్మర దాడి జరుగుతున్న ఈ రోజుల్లో సామాజిక న్యాయ రాజకీయాలలో చిన్న సర్దుబాట్లకు, విధానాలను విశాల పరిచేందుకు సుప్రీంకోర్టు తీర్పు తప్పక దోహదం చేస్తుంది.

అసంఖ్యాక దళితులు ఎంతో కాలంగా ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న న్యాయనిర్ణయమది. షెడ్యూల్డు కులాల ఉప వర్గీకరణ విషయంలో తమ అధికారాల పరిమితుల నుంచి బయటపడేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు రెండు దశాబ్దాలుగా ఉన్నత న్యాయస్థానాలలో చేస్తున్న పోరాటాలను ఈ తీర్పు ఒక కొలిక్కి తీసుకువచ్చింది. అధికరణ 341 (షెడ్యూల్డు కులాల వారికి ప్రత్యేక నిబంధనలు– ఒక రాష్ట్రం లేక కేంద్ర పాలిత ప్రాంతంలో గల ఎటువంటి కులాలు, తెగలు, జాతులు, ఆయా కులాలు, జాతులు, తెగలలో గల గ్రూపులు సంబంధిత రాష్ట్రానికి సంబంధించి షెడ్యూల్డు కులాలుగా పరిగణింపబడతాయో రాష్ట్రపతి నిర్ధారించి అధికారకంగా నోటిఫై చేస్తారు) ప్రకారం ఒక నిర్దిష్ట రాష్ట్ర ఎస్సీలు దేశవ్యాప్తంగా ఎస్సీలుగా పరిగణింబడడం సరైన విషయమేనా అన్నది ఒక వివాదాంశంగా ఉన్నది. ఎస్సీ రిజర్వేషన్లలో ఉప కోటాలను సృష్టించేందుకు ఉద్దేశించిన ఏ విధానమైనా సరే న్యాయవిరుద్ధమని 2004లో ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పునిచ్చింది. ఇ.వి. చిన్నయ్య కేసుగా ప్రాచుర్యం పొందిన ఆ వ్యాజ్యంలో సుప్రీంకోర్టు ధర్మాసనం అధికరణ 341పై ఏకగ్రీవంగా ఒక అసాధారణ సాంకేతిక దృక్పథాన్ని అనుసరించింది. రాష్ట్రాల పరిధిలోని వివిధ సామాజిక వర్గాలలోని సకల శ్రేణులు ఒక 'హోమోజీనస్ క్లాస్' (ఒకే సామాజిక సమూహం) అని, కనుక దానిలో ఉప విభజనలు న్యాయవిరుద్ధమని నాటి ఆ ధర్మాసనం స్పష్టం చేసింది.



సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను అనుమతించిందే కాని, ఆ విభజనను అమలుపరచాలని రాష్ట్రాలను ఆదేశించలేదు. షెడ్యూల్డు కులాలలోని 'క్రీమీ లేయర్' అంటే సామాజికంగా అభివృద్ధి చెందినవారికి ఈ ఉప వర్గీకరణ నుంచి మినహాయింపు ఇవ్వాలని వాదిస్తున్నట్టుగా ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తుల వ్యాఖ్యలు ఉన్నాయి. 'క్రీమీ లేయర్' నిబంధనను అమలుపరచని ఏ ఉప కోటా విధానాన్ని అయినా సవాల్ చేసేందుకు ఆ వ్యాఖ్యలను ఉపయోగించుకోవడానికి ఆస్కారం ఉంది.

ఇ.వి. చిన్నయ్య కేసు తీర్పులో ఒక లోపం ఉన్నది. సామాజిక వాస్తవికతతో పొందూ పొలిక లేని తీర్పు అది. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తరగతులు అనే వివిధ సామాజిక వర్గాలలో విభిన్న సంప్రదాయ వృత్తులు, వేర్వేరు ప్రతికూలతల ప్రాతిపదికన అనేక శ్రేణులవారు ఉన్న వాస్తవాన్ని ఆ అసంబద్ధ తీర్పు గుర్తించలేదు. చారిత్రకంగా ఆ అట్టడుగు సామాజిక శ్రేణులు ఆధునిక విద్యావకాశాలకు ఏ మాత్రం నోచుకోలేదు. తత్కారణంగా అవి అఫర్‌మేటివ్ యాక్షన్ ప్రయోజనాలను పొందలేకపోతున్నాయి. తత్కారణంగా ఉన్నత స్థాయిలో ఉన్న ఎస్సీ కులాలు రిజర్వేషన్ల ప్రయోజనాలలో సింహభాగం పొందుతున్నాయి. ఆ వ్యత్యాసాలు చిన్నవేమీ కావు బిహార్‌లో ఎస్సీ వర్గంలోని విభిన్న కులాల మధ్య విద్యా స్థాయిలో అంతరాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో 2023లో ఆ రాష్ట్రంలో నిర్వహించిన కుల గణన స్పష్టంగా వెల్లడించింది. ప్రతి 10,000 మందిలో 124 మంది రజకులు ఉన్నత విద్య డిగ్రీలు కలిగి ఉండగా దుసధ్ కులం వారిలో అటువంటి ఉన్నత విద్యావంతులు కేవలం 45 మంది మాత్రమే ఉన్నారు. ముసాహర్ కులానికి వస్తే ఒకే ఒక్క ఉన్నత విద్యావంతుడు ఉన్నాడు!

ఈ అసమానతలకు పరిష్కారమేమిటి? ఒక విస్తృత సామాజిక వర్గాన్ని రెండు, అంతకంటే ఎక్కువ ఉప వర్గాలుగా విభజించి ప్రతి ఉప వర్గానికి జనాభాలో వారి వాటా ప్రాతిపదికన ప్రత్యేక రిజర్వేషన్ కోటాను కేటాయించడమేనని లోకజ్ఞానం స్పష్టం చేస్తోంది. అనేక రాష్ట్రాలలో ఓబీసీల విషయంలో ఇలానే జరిగింది కదా. అయితే ఆ ప్రకారమే ఎస్సీ రిజర్వేషన్లను ఉప కులాల జనాభా ప్రాతిదికన విభజించేందుకు పంజాబ్, హర్యానా, ఆంధ్రప్రదేశ్ బిహార్ రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలు (2004లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం) రాజ్యాంగ విరుద్ధమని ఉన్నత న్యాయస్థానాలు ప్రకటించాయి.

అంతిమంగా సుప్రీంకోర్టు 2004లో ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం వెలువరించిన తీర్పును అదే సర్వోన్నత న్యాయస్థానం ఏడుగురు సభ్యుల ధర్మాసనం అంతిమంగా ఈ నెల 1న 6–1 మెజారిటీతో రద్దు చేసింది. మెజారిటీ తీర్పును భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ స్వయంగా రాసిన మెజారిటీ తీర్పు ఉప వర్గీకరణకు ప్రాధాన్యమిచ్చింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ సమానత్వ సూత్రానికి ఉల్లంఘన కాదని స్పష్టం చేసింది. గమనార్హమైన విషయమేమిటంటే దేశ సర్వోన్నత న్యాయస్థానం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను అనుమతించిందే కాని, ఆ విభజనను అమలుపరచాలని రాష్ట్రాలను ఆదేశించలేదు. షెడ్యూల్డు కులాలు వేర్వేరు రాష్ట్రాలలో విభిన్న రీతుల్లో ఉన్నందున ఉప వర్గీకరణ ఎలా జరగాలన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే సుప్రీంకోర్టు వదిలివేసింది. ఈ తీర్పుతో ఇ.వి. చిన్నయ్య కేసు తీర్పులోని లాంఛనప్రాయ న్యాయపరాయణత్వం (లీగల్ ఫార్మలిజం)కు సుప్రీంకోర్టు ముగింపు పలికింది. షెడ్యూల్డు కులాలలోని బాగా వెనుకబడిన సమూహాల ఇక్కట్ల పట్ల సంవేదన శీలతను ప్రదర్శించింది. వారి చారిత్రక ఇబ్బందులను పరిష్కరించేందుకు మార్గాన్ని నిర్దేశించింది. సుప్రీంకోర్టు వైఖరిని కుల ప్రాతిపదిక రిజర్వేషన్‌కు దూరంగా వెళ్లినట్టుగా భావించకూడదు. ఒక పెద్ద మార్పుకు (అది సమస్యాత్మకమే కావచ్చు) ఒక ఆరంభమే, సందేహం లేదు. ఈ విషయంలో జస్టిస్ పంకజ్ మిథల్ వ్యాఖ్యలు సమర్థించ వీలులేనివే అయినప్పటికీ, 1992లో ఇంద్ర స్వాహ్నీ కేసు తీర్పు నెలకొల్పిన నియమబద్ధ, కుల అంతరాల స్పృహతో కూడిన సానుకూల చర్యల విధానం ఆవశ్యకత విషయమై సామాజిక-న్యాయపరమైన ఏకాభిప్రాయాన్ని ప్రధాన తీర్పు దృఢతరం చేసిందని నిస్సంకోచంగా చెప్పవచ్చు. ఆ అనుకూలతకు మరింత ఆసరా నిచ్చి బాగా బలపరిచింది. తద్వారా ఒక విస్తృత, మరింత ప్రభావదాయక, యుక్తియుక్తమైన సానుకూల చర్యల విధానానికి బాధిత వర్గాలు చేస్తోన్న పోరాటాన్ని శక్తిమంతం చేసింది.

ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం వెలువరించిన తీర్పులో ఒక ఆక్షేపణీయమైన విషయమున్నది. అది, షెడ్యూల్డు కులాలలోని 'క్రీమీ లేయర్' అంటే ఎస్సీలలో సామాజికంగా అభివృద్ధి చెందినవారికి లేదా సంపన్నులకు ఈ ఉప వర్గీకరణ నుంచి మినహాయింపు ఇవ్వాలని వాదిస్తున్నట్టుగా ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తుల వ్యాఖ్యలు స్ఫురింపచేస్తున్నాయి. క్రీమీ లేయర్ నిబంధనను ఇప్పటివరకు ఎస్సీలు, ఎస్టీలకు కాకుండా కేవలం ఓబీసీలకు మాత్రమే వర్తింపచేస్తున్నారు. విచిత్రమైన విషయమేమిటంటే ఈ కేసు విచారణాంశాలలో క్రీమీ లేయర్ నిబంధన లేనే లేదు. అయినప్పటికీ న్యాయమూర్తులు ఆ విషయమై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే 'క్రీమీ లేయర్' మినహాయింపు అనేది సుప్రీంకోర్టు ఆదేశం కానేకాదు. అయితే 'క్రీమీ లేయర్' నిబంధనను అమలుపరచని ఏ ఉప కోటా విధానాన్ని అయినా సవాల్ చేసేందుకు నలుగురు న్యాయమూర్తుల వ్యాఖ్యలను ఉపయోగించుకోవడానికి ఆస్కారముందనే సహేతుక అనుమానం ఒకటి బాగా వ్యక్తమవుతోంది. ఓబీసీలకు వర్తింపచేస్తున్న 'క్రీమీ లేయర్' ప్రమాణాలను షెడ్యూల్డు కులాల విషయంలో ఎట్టి పరిస్థితులలోను పాటించకూడదని జస్టిస్ గవాయి స్పష్టం చేయడం సముచితంగా ఉన్నది. ఆ ప్రమాణాలను ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణలో దుర్వినియోగం చేసేందుకు ఎంతైనా అవకాశమున్నది. ఎందుకని? ఎలా? రిజర్వేషన్లను ఏమార్చడం ప్రభుత్వ సంస్థలు, విభాగాలకు చాలా పరిపాటిగా ఉన్నది. 'సరైన, అర్హుడైన అభ్యర్థి లభ్యం కాలేదన్న' మిషతో రిజర్వ్‌డ్ పోస్టులను భర్తీ చేయకుండా వదిలివేయడం తరచు జరగడం లేదా? 'క్రీమీ లేయర్' నిబంధనను ప్రవేశపెట్టడం వల్ల యోగ్యులైన అభ్యర్థుల లభ్యత తగ్గిపోతుంది. అంతేకాకుండా ఆ రిజర్వ్‌డ్ పోస్టులను జనరల్ కేటగిరీకి బదలాయించే అవకాశమూ ఉన్నది. కనుక ఎస్సీ/ఎస్టీల విషయంలో 'క్రీమీ లేయర్'గా పరిగణించే ఆదాయ స్థాయి అత్యధిక స్థాయిలో నిర్ణయించడం చాలా చాలా ముఖ్యం. అంతేకాకుండా 'క్రీమీ లేయర్'గా పరిగణన పొందిన వారిని అనర్హులుగా ప్రకటించకుండా విద్యా ఉద్యోగాలలో ప్రవేశాలకు పరిశీలనార్హుల వరుసలో చివరి స్థానాలలో ఉంచాలి.

మరి ఎస్సీ రిజర్వేషన్లలో ఉప వర్గీకరణలను రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా చేయనున్నాయి అనేదే ఇప్పుడు అసలైన ప్రశ్న. దళితులలో చీలికలు తెచ్చి, తమకు అనుకూలంగా ఉన్న ఎస్సీ కులాల నుంచి రాజకీయ మద్దతు పొందేందుకు ఉప కోటాలను ఉపయోగించుకోవాలనే స్వార్థపరత్వంతో రాజకీయవేత్తలు తప్పక వ్యవహరిస్తారు. చరిత్ర చాటిన, చాటబోయే సత్యమిది. అయితే ఏ ఉప వర్గీకరణలు అయినా సరే వాస్తవమైన, లెక్కించదగిన సమాచారం ఆధారంగా మాత్రమే జరిగితీరాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసిందన్న విషయాన్ని ఎవరూ విస్మరించకూడదు. ఇందుకు సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలుపవలసి ఉన్నది. అయితే సమీప గతంలో లేదా వర్తమానంలో నిర్వహించిన సమగ్ర పరిశోధనల ఆధారంగా సేకరించిన సమాచారం ప్రాతిపదికన మాత్రమే సామాజిక న్యాయ విధానాలు ఉండి తీరాలన్న న్యాయబద్ధమైన షరతును, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యుఎస్) కోటాను ధ్రువీకరిస్తూ వెలువరించిన తీర్పులో దేశ సర్వోన్నత న్యాయస్థానం దాదాపుగా పాటించనేలేదు! ఏమైనా వాస్తవిక సమాచార ఆధారిత విధానం గురించిన పునరుద్ఘాటనతో దేశ వ్యాప్తంగా కులాల ప్రాతిపదికన జనాభా గణన ఆవశ్యకతను సుప్రీంకోర్టు బలపరిచింది.

○ యోగేంద్ర యాదవ్
○ ప్రణవ్ ధావన్

ఆ దొంగ మెచ్చిన కవి ఎవరు?



పేదరికాన్ని భరించలేక, దొంగగా మారిన సాహిత్యాభిమాని అతడు. ఇటీవల ముంబైలో ఒక ఇంటిలోకి చొరబడి తీసుకుపోదామనుకున్న ఎల్ఎస్‌డి టెలివిజన్‌ను తిరిగి యథాస్థానంలో పెట్టి అక్కడ మరాఠీలో ఒక సంజాయిషీ (నోట్) పెట్టాడు– "నాకు ఇది నారాయణ్ సుర్వే ఇల్లని తెలియదు. తెలిసుంటే ఇక్కడి నుంచి దొంగతనమే చేసేవాణ్ణి కాదు. నన్ను క్షమించండి. నేను దొంగిలించిన వాటిలో టీవీతో సహా కొన్ని వస్తువులు వదిలి వెళ్తున్నాను. క్షమించాలి." ఈ పశ్చాత్తాపానికి కారణం తాను సుప్రసిద్ధ కవి నారాయణ సుర్వే ఇంట్లో దొంగతనం చేసానని ఆ ఇంట్లోనే తెలియటమే– బహుశా ఈ సంఘటన ప్రజలు మళ్లీ నారాయణ సుర్వేను చదవడానికి పురికొల్పవచ్చు. మరాఠీ సాహిత్య చరిత్రలో కార్మిక వర్గ యోధునిగా శాశ్వత్వంగా గుర్తుండిపోయే కవి నారాయణ సుర్వే

నేను లోనా బయట చిరుగులతో పరుగెత్తుతున్నాను
నా రోజు రొట్టె నా నిత్యసందేహమే
నేనొక కార్మికుణ్ణి!
పొగుపడిన సాహితీసంపదను
మెరిసే కత్తితో ఛేదిస్తాను
'టాట్..' అని వణకకండి
మిస్టర్ సారస్వత్
నా పాపాలు అనుగ్రహించదగినవి

సుప్రసిద్ధ మరాఠీ కవి నారాయణ సుర్వే బహుళ ప్రచారంలో ఉన్న కవితల్లో ఇది ఒకరకంగా తన పరిచయ కవిత. అయన కవిత్వమంతా ప్రొలిటేరియట్ పోరాటాల గురించే, సుర్వే 2010లో చనిపోయాడు. ఆయన కూతురు, అల్లుడు నవి ముంబైలో ఉన్న ఆయన మధ్యతరగతి నివాసంలో ఉంటున్నారు. కూతురు సుజాత, అల్లుడు గణేశ్‌ఘరే.. విరార్‌లో ఉన్న తమ కొడుకు దగ్గరికి వెళ్లి జూలై 14న ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి అయన ఇంట్లో దొంగతనం జరిగింది. కొన్ని వంటదినుసులు, వంట మసాలా పెట్టె, ఒక ఇత్తడి కందీలు, ఒక మేజాబల్ల, ఐదులీటర్ల వంటనూనె క్యాన్, స్నానాలగది నుంచి కొన్ని నల్లా పరికరాలతో పాటు ఒక ఎల్ఇడి టెలివిజన్ దొంగిలింపబడినవి. ఇల్లంతా చిందరవందరగా ఉన్నది. దొంగ స్నానాలగది కిటికీ అద్దం పగులగొట్టి కిటికీ ఊచలు వంచి లోపలికి ప్రవేశించాడు. సుర్వే కూతురు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో గానీ రిజిస్టర్ చేసిన ప్రాథమిక సమాచార రిపోర్టులో గానీ కొన్ని పోయిన వస్తువుల గురించే రాసింది గానీ "ప్రధానంగా ఉప్పు, బియ్యం, మసాలాలు, కొన్ని కిలోల రకరకాల పప్పులు వంటి వంటదినుసుల గురించి ప్రస్తావించలేదు." ఎందుకంటే మొదట తీసుకుపోదామనుకున్న ఎల్ఎస్‌డి టెలివిజన్ యథాస్థానంలో పెట్టి ఆ దొంగ అక్కడ మరాఠీలో ఒక సంజాయిషీ (నోట్) పెట్టాడు– "నాకు ఇది నారాయణ్ సుర్వే ఇల్లని తెలియదు. తెలిసుంటే ఇక్కడి నుంచి దొంగతనమే చేసేవాణ్ణి కాదు. నన్ను క్షమించండి. నేను దొంగిలించిన వాటిలో టీవీతో సహా కొన్ని వస్తువులు వదిలి వెళ్తున్నాను. క్షమించాలి."

సుర్వే కూతురు ఏమంటుందంటే, దొంగ తన క్షమాపణ పత్రంలో "మిగిలిన వస్తువులు కూడ తిరిగి ఇస్తానని వాగ్దానం చేసాడు" ఈ పశ్చాత్తాపానికి కారణం తాను సుప్రసిద్ధ రచయిత నారాయణ సుర్వే ఇంట్లో దొంగతనం చేసానని ఆ ఇంట్లోనే తెలియడమంటుంది. మేముండే గదిలో నారాయణ సుర్వే ఫోటోలు, ఆయనకొచ్చిన సత్కారాలు, పద్మశ్రీ ఫలకం... ఇవన్నీ చూసి ఆ దొంగ తన తప్పు గ్రహించి ఉంటాడంటుంది.

నారాయణ సుర్వే మరణానంతరం కూడ మహారాష్ట్రలో ఒక సాంస్కృతిక సంస్థగానే ప్రభావం చూపుతున్నాడు.

ఆయన శిశువుగా ఒక బట్టలమిల్లు కార్మికునికి బొంబాయిలో ఫుట్‌పాత్ మీద దొరికాడు. ఇంకా శిశువుగా ఉండగానే ఆ కార్మికుడు కూడ పోషించలేక వదిలిపెడితే తనకు తానే మహానగర వీథుల్లో ఏ పని దొరికితే ఆ పని చేసి తన పొట్ట నింపుకునేవాడు. ఆటో నడిపాడు. ఒక మునిసిపల్ స్కూల్లో చప్రాసీగా పని చేసాడు. ఆ స్కూలు వాతావరణంలో ఉద్యోగిగా చదువు నేర్చుకొని టీచర్ అయ్యాడు.

మ్యాగ్జింగోర్కీకి తన బాల్యమే తన విశ్వవిద్యాలయమైనట్లు తన శ్రమజీవన క్రమాన్ని "నా విశ్వవిద్యాలయం – మారేఖ విద్యాపీఠ్" అని 1966లో వెలువరించిన కవితాసంకలనం విస్తృతమైన ప్రచారాన్ని గుర్తింపును పొందింది. ఎందుకంటే అందులో ఉన్నవన్నీ కార్మికుల ఎదుగూ బొదుగూ లేని జీవితాలు – పోరాటాలే. కార్మికుల హక్కులు – సామాజిక న్యాయంపై అయన చేసిన రచనలకు 1973లో సోవియెట్ ల్యాండ్ నెహ్రూ అవార్డ్ వచ్చింది.

సుర్వే అల్లుడు గణేశ్‌ఘరే ఆ దొంగ రాసిన క్షమాపణపత్రం చదివి చాలా చలించిపోయాడు. "ఇటీవలి ప్రజల జ్ఞాపకాల నుంచి సుర్వే కవిత్వం కనుమరుగవుతున్నది. కాని ఒక దొంగగా మారిన పేదవానిపై ఆయన కవిత్వ ప్రభావం ఉండడమే ఆయన మా టి.వి. వదిలి వెళ్లడానికి పురికొల్పి ఉంటుంది. బహుశా ఈ సంఘటన ప్రజలు మళ్లీ నారాయణ సుర్వేను చదవడానికి పురికొల్పవచ్చు" అన్నాడు.

ప్రజలు మరొకందుకు కూడా నారాయణ సుర్వేను మళ్లీ చదవాలి – మరాఠీ సాహిత్య చరిత్ర నారాయణ సుర్వేను ప్రొలిటేరియట్ (కార్మికవర్గ) కవిగా గుర్తుపెట్టుకుంటుంది. జీవితం వల్ల, కవిత్వం, రచనల వల్ల.

మళ్లీ అటువంటి బొంబాయిలో 1981 బట్టలమిల్లుల కార్మికుల ఒక సంవత్సరం చారిత్రాత్మక సమ్మె సందర్భంగా ఆవాన్ నాట్యమంచ్ ప్రారంభమైంది. ఆ సమ్మెలో మిల్లుల ముందు భారత్ నవ్‌జవాన్ సభ నిరసన ప్రదర్శనల్లో భాగంగా విలాస్ గోగ్రే అనే దళిత విప్లవకవి ఉద్భవించాడు. ఆయన పాటలు నారాయణ సుర్వే కార్మికవర్గ చైతన్యాన్ని మరింత గుణాత్మకంగా నక్సల్బరీ, దళిత పాంథర్స్ (1972) ప్రభావంతో ముందుకు తీసుకుపోయాయి. 1997లో ఘట్కోపర్‌లో అంబేద్కర్ విగ్రహానికి తారుపూసి చెప్పులదండ వేసిన దుండగుల చర్యకు వ్యతిరేకంగా దళితాగ్రహం పెల్లుబికినప్పుడు సిఆర్‌పిఎఫ్ నిరసన ప్రదర్శనకారులపై జరిపిన కాల్పుల్లో 11 మంది దళితులు మరణించారు. ఆ దృశ్యాన్ని చూసి విలాస్‌గోగ్రే ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటికే ఆయన పాటలతో, ప్రదర్శనలతో ప్రభావితుడైన ట్రేడ్ యూనియన్ ఆర్గనైజర్ సుధీర్‌ధావ్లే ఆ సంఘటన తర్వాత విద్రోహి అనే సంస్థను స్థాపించి 'విద్రోహి' అనే పత్రికను కూడ మరాఠీ దళిత, ముస్లిం రచయితల వేదికగా ప్రారంభించాడు. ఆయన ఆరేళ్లకు పైగా (6 జూన్ 2018 నుంచి) జైల్లో ఉన్నా ఆ పత్రిక ఇప్పటికీ వెలువడుతున్నది. అయన ప్రభావంతోనే నాగపూర్ నుంచి సురేంద్ర గాడ్లింగ్ మొదట ఆవాన్ నాట్యమంచ్ గాయకుడుగా, సాంస్కృతిక కార్యకర్తగా ప్రారంభించి జీవిక కోసం న్యాయవాది అయి సుప్రసిద్ధ క్రిమినల్ లాయర్‌గా 25 సంవత్సరాలు పని చేసి 6 జూన్ 2018న ఎల్గార్ పరిషత్ భీమాకోరేగాంవ్ కేసులో అరెస్టయ్యాడు. ఆయన తల్లి చనిపోయిన ఏడాదికి ఎనిమిది రోజుల కోసం బయటికి వచ్చినప్పుడు నాగపూర్‌లో న్యాయవాదుల బృందంలో పాడిన పాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ ఇద్దరి ఇళ్లమీద కూడ 2018, ఏప్రిల్ 27న పూనె పోలీసులు దాడిచేసి వీళ్ల కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలు ఎత్తుకుపోయారు. ఆ తర్వాత జూన్ 6న ఇద్దరినీ ఎత్తుకుపోయారు. దీనిని అరెస్టు అంటారనుకోండి.

1970ల ఆరంభంలో పోలీసులు ఖమ్మంలో బి.వీరయ్య అనే విప్లవాభిమాని బుక్‌స్టాల్‌పై దాడి చేసి పుస్తకాలు ఎత్తుకుపోయారు. అప్పుడు శ్రీశ్రీ పోలీసులను 'పుస్తకాల దొంగలు' అని ఎత్తి పొడిచారు. సాంకేతిక విజ్ఞాన పరికరాలు – కంప్యూటర్లు, పెన్‌డ్రైవ్‌లు, మొబైల్‌ఫోన్ల వంటి ఎలక్ట్రికల్ డివైసెస్ వచ్చాక – పుస్తకాలతో పాటు వీటినీ ఎత్తుకుపోతున్నారు. అయితే ఇవి నిర్దోషిగా ప్రకటించినా తిరిగి ఇవ్వడం ఉండదు. మనుషులే తిరిగి వస్తే అదే మహాభాగ్యం – బతికుంటే బలుసాకు తిని బతుకొచ్చు అనుకునే కాలంలో ఉన్నాం మనం.

నిజంగానే అటువంటి కడు పేదరికం అనుభవిస్తూ రెక్కల కష్టం చేసుకొని బతికి వృద్ధులైన పూనేలోని దళిత కుటుంబాల నుంచి వచ్చారు కబీర్ కళామంచ్ కళాకారులు – జ్యోతి జగతప్, రమేశ్ గైచార్, సాగర్ గోర్కే. ముగ్గురూ ముప్పైలలో ఉన్నవాళ్లు. సుధీర్‌ధావ్లే స్థాపించిన రిపబ్లికన్ ప్యాంథర్స్ – బ్లాక్ పాంథర్స్, దళిత పాంథర్స్ – సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ప్రజాస్వామిక సంస్కృతి కోసం సైద్ధాంతిక దృక్పథాన్ని ఇస్తే మహారాష్ట్రలో ఉన్న పీష్వాలను, బ్రాహ్మణీయ సంస్కృతిని ధిక్కరిస్తూ 'నయీ పీష్వాయీ నహీ చలేగీ' అనే సందేశాన్ని పాటలు, నాటికలు వంటి కళారూపాలతో ముందుకు తీసుకుపోతున్న సాంస్కృతిక కార్యకర్తలు వీళ్లు. కబీర్ కళామంచ్ మహారాష్ట్రలో ఒక సాంస్కృతిక కళావేదికగా ఎంత ప్రసిద్ధి పొందిందంటే వీళ్లపై ఆనంద పట్వర్ధన్ ఒక డాక్యుమెంటరీ కూడా తీసాడు. వీళ్లదగ్గర ఎత్తుకుపోవడానికి ఏమీలేక సుధీర్, సురేంద్రలకు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వడానికి నిరాకరిస్తే 2000 సంవత్సరం సెప్టెంబర్‌లో వీళ్లనే ఎత్తుకుపోయి జైల్లో పెట్టింది ఎన్ఐఎ.

ఎల్గార్ పరిషత్ భీమాకోరేగావ్ 200 సంవత్సరాల సందర్భంగా బి.వి. సావంత్ (సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయవాది), కోల్సే పటేల్ (బొంబాయి హైకోర్టు విశ్రాంత న్యాయవాది చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా 280 దళిత, మైనారిటీ, బహుజన సంఘాలతో పూనే శనివార్‌వాడలో సుధీర్‌ధావ్లే మరొక ఫాసిస్టు వ్యతిరేక ప్రొలిటేరియట్ కవి బెర్టోల్ట్ బ్రెహ్ట్ మరాఠీ కవితానువాదంతో తన ప్రసంగం ప్రారంభించి రాజ్యాంగం ఆదేశిక సూత్రాలు ప్రమాణంగా 'నయీ పీష్వాయీ నహీ చలేగీ' అని ఐదువందల మంది ప్రతినిధులతో నినదించాడు. ఆయన చదివిన కవిత అయినా, కబీర్ కళామంచ్ కళాకారులు పాడిన పాటలు, ఆడిన ప్రదర్శనలు నారాయణ సుర్వే–

'పొగుపడిన సాహితీసంపదను
మెరిసే కత్తితో ఛేదిస్తాను! వణకకండి' అని సారస్వతులను హెచ్చరించిన కవిత్వంకన్నా తీవ్రమైనవి కావు. అయినా కార్మిక వర్గం కోసం ఆయన రాసిన కవిత్వంతో ప్రభావితుడైన దొంగ అయన వస్తువులను పశ్చాత్తాపంతో తిరిగి ఇచ్చాడు.

కవిత్వం రాసినందుకే ఎన్ఐఎ పోలీసులు 6, 4 సంవత్సరాల కింద ఎత్తుకుపోయి నిర్బంధించిన కవులను, కళాకారులనయినా తిరిగి వాళ్ల కుటుంబాలకు, సమాజానికి అప్పగిస్తుందా ఈ రాజ్యం?

ఏమో! కార్ల్‌మార్క్స్ అన్నా, మార్క్సిజమన్నా ఎంతో ఇష్టపడే నారాయణ సుర్వే "మనుషుల నైపుణ్యాలు పెరగడం పెట్టుబడికి దుర్వార్త. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థ కవులను ఇష్టపడదు" అంటాడు.

■ ఫెలో ట్రావెలర్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
మంగళవారం 6 ఆగస్టు 2024



అభివృద్ధే అజెండాగా.. పేదల అవసరాలే ప్రధాన లక్ష్యంగా.. మౌలిక సదుపాయాలే కీలకంగా జిల్లా అభివృద్ధికి సీఎం చంద్రబాబు రెడ్ కార్పెట్ పరిచారు. 100 రోజుల ప్రణాళికతో విజన్-2047కు దిశానిర్దేశం చేశారు. వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో ప్రధానమైన సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపిన చంద్రబాబు జిల్లా సమగ్రాభివృద్ధికి కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

విజన్‌తో..

జిల్లా సమగ్రాభివృద్ధికి చంద్రబాబు దిశానిర్దేశం



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు సృజన, బాలాజీ

విజన్-2047కు పక్కా ప్రణాళికలు

- ప్రాథమిక, వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాలకు పెద్దపీట
- పర్యాటకం, సహజ వనరుల సద్వినియోగంతో ముందుకు..
- గృహ నిర్మాణంపై పేదల్లో చిగురించిన ఆశలు
- పేదల ఇళ్ల నిర్మాణం కోసం భూసేకరణ
- మౌలిక రంగంలో రోడ్లకు అత్యంత ప్రాధాన్యం
- కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న ఇరు జిల్లాల కలెక్టర్లు

విజన్ డాక్యుమెంట్

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల సమగ్రాభివృద్ధికి విజన్-2047 డాక్యుమెంట్ల రూపకల్పన చేయాల్సిన అవసరం ఉంది. ఈ విజన్ డాక్యుమెంట్ అనేది అన్ని వర్గాలకు ప్రయోజనం కల్పించేలా ఉండటంతో పాటు జిల్లా ముఖ చిత్రాన్ని మార్చేదిగా రూపకల్పన చేయాల్సి ఉంటుంది. రాబోయే రెండు దశాబ్దాల కాలానికి ఏ విధంగా ముందుకెళ్లాలన్న అంశాలపై జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది. ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్నప్పుడు వ్యవసాయానుబంధ రంగాలే ఇక్కడ ప్రధానం. జిల్లాల పునర్విభజన తర్వాత ఎన్టీఆర్ జిల్లా పారిశ్రామిక, సేవా రంగాల్లో ముందుంది. కృష్ణాజిల్లా వ్యవసాయ ప్రధానంగా ఉంది. కృష్ణాతో పోల్చుకుంటే ఎన్టీఆర్ జిల్లాలో వ్యవసాయం కాస్త తక్కువ. ఎన్టీఆర్ జిల్లాలో ఉద్యాన పంటల సాగు ఎక్కువ. పశువుల పెంపకాన్ని ప్రాధాన్యం ఎక్కువ. తద్వారా పాల దిగుబడి ఎక్కువ. ఇది డెయిరీ రంగానికి ఊతమిచ్చేది. కృష్ణాజిల్లాలో ఆక్వా రంగం ఎక్కువగా ఉంది. కాబట్టి రెండు జిల్లాల్లో ప్రాథమికమైన వ్యవసాయ అనుబంధ రంగాలపై దీర్ఘకాలిక ప్రణాళికలను రచించాల్సి ఉంటుంది. పారిశ్రామికంగా కూడా అంతేస్థాయిలో ప్రణాళికలు రూపొందించటం ద్వారా ఔత్సాహికులను ఆకట్టుకోవటంతో పాటు వందలాది మందికి ఉపాధి కల్పించేలా ప్రణాళికలు తయారు చేయాలి. అలాగే, రెండు జిల్లాల సహజ వనరులు ఉన్నాయి. ఇసుక, గ్రావెల్, లైమ్‌స్టోన్ వంటి వాటితో పాటు ఖనిజ సంపద అధికం. రెండు జిల్లాల్లో పర్యాటకాభివృద్ధికి సంబంధించిన వనరులు ఉన్నాయి. వీటన్నింటికీ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించటం ద్వారా ముందుకు వెళ్లొచ్చు. విజయవాడ, మచిలీపట్నం కాకుండా చిన్న, మధ్యస్థాయి పట్టణాల్లో కూడా సర్వీసు సెక్టార్‌ను ముందుకు తీసుకెళ్లే కార్యక్రమాలకు విజన్ డాక్యుమెంట్‌లో శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది.

ఇళ్ల నిర్మాణానికి శుభ పరిణామం

పేదల ఆవాసానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యాన్ని ఇచ్చింది. ఈ దిశగా రెండు జిల్లాల కలెక్టర్లు ముందుకు అడుగులు వేయాల్సి ఉంటుంది. కిందటి వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలను అపహాస్యం పాలు చేసింది. సెంటు, సెంటున్నర పట్టాలు ఇచ్చి అందులో ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. వాటికి తన వంతు సాయం అందించకుండా కేంద్ర ప్రభుత్వ వాటానే ఇచ్చింది. అది కూడా సకాలంలో ఇవ్వకపోవటం వల్ల రెండు జిల్లాల్లో తలపెట్టిన పేదల ఇళ్లలో 10 శాతం కూడా పురోగతి లేదు. గత ప్రభుత్వం తలపెట్టిన ఇళ్లు కదా.. అని జగన్ టిడ్కో ఇళ్లను రద్దు చేసినట్టుగా, వదిలేసినట్టుగా చంద్రబాబు చేయలేదు. పేదల పక్షాన నిలిచి వారి ఇళ్లను త్వరగా పూర్తిచేసేలా కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. దీంతో పదిశాతం పురోగతిలో ఉన్న ఇళ్లను యుద్ధ

- మిగతా 6లో



ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానదిలో సిల్టు భారీగా పేరుకుపోతుందా? ఎగువ ప్రాంతాల నుంచి నీటి విడుదల జరిగితే మరింత సిల్టు పెరుగుతుందా? అసలు బ్యారేజీ వద్ద సిల్టు కారణంగా నీటి నిల్వలు తగ్గిపోతున్నాయా? ఈ అంశాలను పరిశీలించదానికి బ్యాథిమెట్రిక్ సర్వే చేయించాలని జలవనరుల శాఖ నిర్ణయించింది. అన్ని అనుమతులు వచ్చి నిధులు విడుదలయ్యాక పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

ఇసుక మేటరేంటి..?

ప్రకాశం బ్యారేజీ వద్ద బ్యాథిమెట్రిక్ సర్వేకు సన్నాహాలు

- రూ.40 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా
- నిధుల కోసం భూగర్భ గనుల శాఖకు లేఖ
- గతంలో ఒకసారి నిర్వహించిన సర్వే
- 1.8 లక్షల టన్నుల సిల్టు తీయించిన అధికారులు

మళ్లీ ఆ దిశగా సర్వే చేయాలని నిర్ణయం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ప్రకాశం బ్యారేజీ వద్ద బ్యాథిమెట్రిక్ సర్వే చేయించాలని జలవనరుల శాఖ అధికారులు భావిస్తున్నారు. బ్యారేజీకి ఎగువన 365 రోజుల పాటు నీరు నిల్వ ఉంటుంది. ఇక్కడ 3.07 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంది. బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం 12 అడుగులు. వరదలు వచ్చినప్పుడు ఇన్‌ఫ్లో లెక్కలను బట్టి గేట్లను పైకి ఎత్తుతారు. బ్యారేజీకి రెండు విధాలుగా వరదలు వస్తుంటాయి. నాగార్జున సాగర్ గేట్లు ఎత్తినప్పుడు ఆ నీరు పులిచింతలకు చేరుతుంది. పులిచింతల పూర్తిగా నిండాక ఎగువ నుంచి నీరు విడుదల చేస్తారు. తెలంగాణలో కురిసిన వర్షాల కారణంగా కీసర, పాలేరు, వైరా, కట్టలేరు వంటి వాగుల ద్వారా వరద నీరు వస్తోంది. బ్యారేజీలో నీటిమట్టం తక్కువగా ఉన్నప్పుడు పట్టిసీమ ద్వారా నీటిని విడుదల చేస్తారు. ఇలా ఎగువ నుంచి వస్తున్న నీటితో పాటు చెత్తాచెదారం కొట్టుకు వస్తుంది. ఇందులో కొంతభాగం గేట్లు ఎత్తినప్పుడు నీటిలో దిగువకు వెళ్లిపోతుంది. చాలావరకు చెత్తాచెదారం బ్యారేజీ గేట్ల వెనుక భాగాన ఉండిపోతుంది. ఇదంతా సిల్టుగా మారుతుంది.

ఇప్పుడు రెండోసారి

బ్యారేజీ వద్ద బ్యాథిమెట్రిక్ సర్వే నిర్వహించడం ఇదే మొదటిసారి కాదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021వ సంవత్సరంలో గుంటూరు జిల్లా వెంకటాయపాలెం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు బ్యాథిమెట్రిక్ సర్వే నిర్వహించారు. బ్యారేజీ వద్ద 1.8 లక్షల మెట్రిక్ టన్నుల సిల్టు ఉన్నట్టు గుర్తించారు. ఇలా సిల్టు తీసినప్పుడు ఇసుక బయటకు వస్తుంది. ఈ ఇసుకకు మంచి డిమాండ్ ఉంటుంది. నదిలో నుంచి తీస్తున్న ఇసుక కంటే ఈ ఇసుకలో పటిష్టత ఎక్కువగా ఉంటుందని భవన నిర్మాణ ఇంజనీర్లు చెబుతున్నారు. అందుకే సిల్టు ద్వారా వచ్చిన ఇసుకకు అధిక ధర ఉంటుంది. ఇలా తీసిన ఇసుకను ముందుగా జలవనరుల శాఖ ఉపయోగించుకుంటుంది. ఆ శాఖ ఆధ్వర్యంలో జరిగే నిర్మాణాలకు ఈ ఇసుకను ఉపయోగిస్తారు. ఇంకా మిగిలిన ఇసుకను భూగర్భ గనుల శాఖకు అప్పగిస్తారు. 2021 తర్వాత ప్రకాశం బ్యారేజీకి వరదలు పెద్దగా వచ్చిన దాఖలాలు లేవు. ఇప్పుడు బ్యారేజీ పరిసర ప్రాంతాల్లో బ్యాథిమెట్రిక్ సర్వే చేయాలని జలవనరుల శాఖ అధికారులు నిర్ణయించారు. ఈ సర్వే చేయడానికి మెరైన్ ఇంజనీరింగ్ సంస్థలను టెండర్లకు ఆహ్వానించాలి. ఆ సంస్థలు సర్వే చేసి ఇసుక, సిల్టు అంచనాలను నివేదిక రూపంలో ఇవ్వడానికి రూ.40 లక్షల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం ఉచిత ఇసుక వ్యవహారాలను భూగర్భ గనుల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నందున బ్యాథిమెట్రిక్ సర్వేకు అవసరమైన నిధులను ఇవ్వాలని భూగర్భ గనుల శాఖ అధికారులకు జలవనరుల శాఖ అధికారులు లేఖ రాశారు. ఇలా నిధులను ఇచ్చే అధికారం తమకు లేదని చెప్పిన భూగర్భ గనుల శాఖ అధికారులు ఆ ప్రతిపాదనను ఉన్నతాధికారులకు పంపారు.

బ్యాథిమెట్రిక్ సర్వే అంటే..

నదులు, సముద్ర గర్భాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, మేటలు వేసిన ఇసుకను గుర్తించడానికి ఈ బ్యాథిమెట్రిక్ సర్వేను నిర్వహిస్తారు. దీన్నే హైడ్రోగ్రాఫిక్ సర్వే అని వ్యవహరిస్తారు. నదీగర్భంలో నేల ఏ ఆకారంలో ఉంది. ఎక్కడెక్కడ ఎత్తు పల్లాలు ఉన్నాయి, ఇసుకను అక్కడ తవ్వడం వల్ల ఎలాంటి ఇబ్బందులు వస్తాయన్న అంశాలను ఈ సర్వేలో తెలుసుకుంటారు. ఈ సర్వే చేయడానికి అత్యాధునిక టెక్నాలజీతో కూడిన బోటు ఉంటుంది. దానిద్వారా మాత్రమే ఈ సర్వేను నిర్వహించడానికి అవకాశం ఉంటుంది. బోటుకు సెన్సార్, జీపీఎస్ సిస్టమ్ ఉంటాయి. ఏడీసీపీ (అకాస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్స్) ద్వారా నీటి ప్రవాహాన్ని తెలుసుకుంటారు. అలల తీవ్రతను ఈ ఏడీసీపీ తెలియజేస్తుంది.

చీటీల పేరుతో మోసం

రూ. 3.50 కోట్లకు టోకరా

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

గుణదల, ఆగస్టు 5 : చీటీల పేరిట రూ.3.50 కోట్లను నమ్మకంగా కాజేసిన ఓ వ్యక్తి చివరికి ఐపీ నోటీసులు పంపిన ఘటన రామవరప్పాడులో సోమవారం వెలుగుచూసింది. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పటేల్ నగర్‌లో ఉంటున్న కోట వెంకటనాయుడు పదేళ్లుగా ప్రైవేటుగా ఇంటి వద్ద చీటీలు వేస్తున్నాడు. కొద్దిరోజుల నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో అతని వద్ద చీటీలు వేసిన వారంతా ఆచూకీ కోసం గాలించారు. అందరినీ షాక్‌కు గురిచేస్తూ సదరు వెంకటనాయుడు బాధితులందరికీ ఐపీ నోటీసులు పంపించాడు. దీంతో వారంతా లబోదిబోమంటూ పటమట పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. బాధితుడు ఇచ్చిన ఐపీ నోటీసులు చూపించి తమకు న్యాయం చేయాలంటూ సోమవారం బాధ్యతలు చేపట్టిన కొత్త సీఐ కిషోర్‌కు మొరపెట్టుకున్నారు. ఫిర్యాదు అందుకున్న సీఐ చీటీల నిర్వాహకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడతామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలకు సరికొత్త సైన్యం

కలెక్టర్లు, ఐపీఎస్‌ల సమావేశంలో సీపీ రాజశేఖరబాబు



విజయవాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల కట్టడికి కొత్త సైన్యాన్ని తయారు చేస్తున్నామని విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు స్పష్టం చేశారు. వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఐపీఎస్‌ల నుంచి ఎవరైనా మాట్లాడతారా.. అని సీఎం అడిగారు. పక్కనే ఉన్న డీజీపీ ద్వారకా తిరుమలరావు.. రాజశేఖరబాబు పేరు చెప్పారు. చంద్రబాబు చొరవతో మాట్లాడిన రాజశేఖరబాబు.. సైబర్ నేరాల్లో అమాయకులు ఎక్కువగా డబ్బు కోల్పోతున్నారన్నారు. కమిషనరేట్ పరిధిలో రోజుకు ఐదారు ఫిర్యాదులు సైబర్ పీఎస్‌కు అందుతున్నాయన్నారు. 'అనుభవం ద్వారా అవగాహన' అనే కార్యక్రమం ద్వారా 16 రకాల సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రణాళిక రూపొందించామ న్నారు. ముందుగా పోలీసు శాఖలో టెక్నాలజీపై పూర్తి అవగాహన ఉన్న 200 మందిని సైబర్ కమాండోలుగా నియమించామన్నారు. వారికి శిక్షణ ఇచ్చి విద్యార్థులు, యువత నుంచి సైబర్ సోల్జర్స్‌ను, వారి నుంచి సైబర్ సిటిజన్స్‌ను తయారు చేస్తామని చెప్పారు. మూడు నెలల్లో 2లక్షల మంది సైబర్ సిటిజన్స్ తయారు చేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నా మన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యను టెక్నాలజీ సాయంతో పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, ట్రాఫిక్‌పై అర్కాడిస్ అనే సంస్థతో సంపూర్ణ అధ్యయనం చేయిస్తున్నామన్నారు.



వికటించిన ఇంజక్షన్

- తిరువూరు సీహెచ్‌సీలో ఐదుగురికి అస్వస్థత
- ఇద్దరి పరిస్థితి విషమం.. విజయవాడకు తరలింపు

తిరువూరు, ఆగస్టు 5 : తిరువూరు సీహెచ్‌సీలో ఇంజక్షన్ వికటించి ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. వారిలో అబ్దుల్ అలీ మొయిన్ (12), షేక్ నాగుల్‌మీరా (32) పరిస్థితి విషమించడంతో హుటాహుటిన విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సోమవారం తీవ్ర చలిజ్వరం, వాంతులతో ఐదుగురు రోగులు జనరల్ వార్డులో చేరారు. వారికి ఆసుపత్రి సిబ్బంది రాంటాక్ ఇంజక్షన్ చేశారు. ఇంజక్షన్ వికటించడంతో వారంతా అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు భయాందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఫోన్‌లో జిల్లా వైద్యాధికారిణి సుహాసినితో మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశించారు.

గన్నవరం తహసీల్దార్‌పై బదిలీ వేటు

సీసీఎల్‌ఏ ఆదేశాలతో కృష్ణా కలెక్టర్ ఉత్తర్వులు

- తూర్పుగోదావరికి రిలీవ్ చేస్తూ నిర్ణయం
- శివయ్యకు గన్నవరం తహసీల్దార్‌గా పోస్టింగ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి,విజయవాడ/మచిలీపట్నం/గన్నవరం) : వివాదాస్పద గన్నవరం తహసీల్దార్ పవన్‌కుమార్‌పై ఎట్టకేలకు బదిలీ వేటు వేశారు. ఆయన్ను తూర్పు గోదావరి జిల్లాకు బదిలీ చేస్తూ కలెక్టర్ బాలాజీ ఆదేశాలు జారీ చేశారు. ఇతర జిల్లా నుంచి వచ్చిన వ్యక్తిని ఎందుకు కొనసాగిస్తున్నారని, తహసీల్దార్‌గా అతనికి పొడిగించిన గడువు కూడా ముగిసిందని, తక్షణం సీసీఎల్‌ఏకు రిపోర్టు చేయాలని కలెక్టర్‌ను సీసీఎల్‌ఏ ఆదేశించింది. దీంతో పవన్‌కుమార్‌ను తూర్పుగోదావరి జిల్లాకు రిలీవ్ చేస్తూ కలెక్టర్ బాలాజీ ఆదేశాలిచ్చారు. తొలుత గన్నవరం డీటీ అరుణ్‌కు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించినా, ఆ వెంటనే సివిల్ సప్లయిస్‌లో పనిచేస్తున్న కె.వెంకటశివయ్యను గన్నవరం తహసీల్దార్‌గా నియమించారు. శివయ్య ఉమ్మడి కృష్ణాజిల్లాలో పనిచేశారు. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ)లో ఎస్టేట్ ఆఫీసర్ (ఈవో)గా విధులు నిర్వహించారు. మైలవరం తదితర మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేశారు.

ఆది నుంచీ వివాదాస్పదుడే..

ఎన్నికల ముందు గన్నవరం తహసీల్దార్‌గా వచ్చిన పవన్‌కుమార్ కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఇక్కడి నుంచి వెళ్లడానికి ఇష్టపడలేదు. ఇతర జిల్లాల నుంచి కృష్ణాజిల్లాకు వచ్చిన తహసీల్దార్లంతా తమ సొంత జిల్లాలకు వెళ్లిపోయినా, పవన్‌కుమార్ కదల్లేదు. పవన్‌కుమార్ సీసీఎల్‌ఏ నుంచి వచ్చారు. అక్కడి నుంచి వచ్చినవారు బయట రెండేళ్లు మాత్రమే పనిచేయాల్సి ఉంటుంది.

- మిగతా 6లో



ఎండిన వరి నారుతో రాస్తారోకో చేస్తున్న రైతులు

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

వేములమడలో రాస్తారోకో

కూచిపూడి, ఆగస్టు 5 : నారుమడులు ఎండుతున్నాయి.. నాట్లు వేసిన పొలాలు బీటలు వారాయి.. ఎన్ని పర్యాయాలు అధికారులకు మొర పెట్టుకున్నా స్పందించకపోవడంతో ఎండిన వరి నారుతో రైతులు రోడ్డెక్కారు.. గంటల తరబడి రాస్తారోకో చేసి ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన మొవ్వ మండలం వేములమడ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. ఎట్టకేలకు అధికారులు దిగివచ్చి రైతులతో చర్చించారు. జిల్లా కౌలురైతు సంఘ కార్యదర్శి సహాయ కార్యదర్శి పంచకర్ల రంగారావు, శీలం నారాయణరావులు రాస్తారోకో చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు. తహసీల్దార్ కె.మస్తానరావు, వీరంకి సెక్షన్ ఇరిగేషన్ శాఖ ఏఈ కె.సత్యనారాయణ రైతులతో చర్చించారు. భీమనదిపై గల రెగ్యులేటర్‌కు సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టి రైతులను ఆదుకుంటామని హామీ ఇవ్వటంతో సమస్య పరిష్కారమైంది. కూచిపూడి ఎస్‌ఐ శ్రీనివాస్ పరిస్థితి అదుపు తప్పకుండా చర్యలు చేపట్టారు.

దాడి ఘటనపై విచారణకు సిద్ధమా!



ఉదయభానుకు తాతయ్య సవాల్

జగ్గయ్యపేట, ఆగస్టు 5 : నవాబుపేట వైసీపీ నేత దాడి ఘటనపై సీబీసీఐడీ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమేనా అని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు సవాల్ విసిరారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తాతయ్య మాట్లాడుతూ, చిట్యేలలో సీతారెడ్డి, మల్లారెడ్డి, ముండ్లపాడులో నరసరావుల హత్యలపై సీబీసీఐడీ విచారణకు సిద్ధమేనా, నవాబుపేటలో జరిగిన గింజుపల్లి వీరయ్య, బుచ్చయ్య చౌదరిల హత్యలపై తాము సీబీఐ విచారణకు సిద్ధమని చెప్పారు. హింస, హత్యా రాజకీయాలను తాముగాని, పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు ఏనాడు ప్రోత్సహించ లేదని తెలిపారు. రాజకీయాల కోసం ఏ రోజు దిగజారలేదని స్పష్టం చేశారు.

పుస్తకం ఇవ్వకపోతే ప్రాణత్యాగం

నా భూమికి పట్టా కోసం మామ్ముళ్లు అడుగుతున్నారు

కలెక్టరేట్ వద్ద బాధితురాలి ఆవేదన



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 5 : నా భూమికి పాసుపుస్తకం ఇవ్వకపోతే ప్రాణత్యాగం చేస్తానని పెదపారుపూడి గ్రామానికి చెందిన బాధితురాలు గంటా సుశీల ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ, నా భూమి పాసు పుస్తకం ఇచ్చేందుకు పెదపారుపూడి రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారని, వైసీపీ నేతల మాటలు విని తనకు పుస్తకం ఇచ్చేందుకు వెనుకాడుతున్నారని ఆరోపించింది. కొందరు రెవెన్యూ అధికారులు మామ్ముళ్లు అడుగుతున్నారని ఆరోపిస్తూ.. కౌలుదారు బండి విజయకుమారికి పట్టా ఇచ్చేందుకు అధికారులు చూస్తున్నారని చెప్పింది. తనకున్న 48 సెంట్ల పొలాన్ని దున్నుకోకుండా వైసీపీ నాయకులు అధికారుల ద్వారా అడ్డుపడుతున్నారని, తనకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నానని పేర్కొంది.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు

అక్రమ తొలగింపులను ఆపాలి

కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ధర్నా

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 5 : స్కీం వర్కర్ల అక్రమ తొలగింపులను ఆపాలంటూ కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూసీ నాయకులు మాదల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, స్కీం వర్కర్లపై రాజకీయ కక్షసాధింపులు జరుగుతున్నాయన్నారు. ఎవరైనా తప్పుచేస్తే షోకాజ్ నోటీసులు ఇవ్వవచ్చుకాని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని అధికారులు చెబుతున్నారన్నారు. అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం కార్మికులను, స్కూలు శానిటైజర్ కార్మికులను వేధిస్తున్నారన్నారు. అంగన్వాడీ వర్కర్ల జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి ఎ.రమాదేవి మాట్లాడుతూ, స్కీము వర్కర్లను అక్రమంగా తొలగించడం తగదన్నారు. మధ్యాహ్న పథకం జిల్లా సంఘ అధ్యక్షురాలు సమ్మక్క మాట్లాడుతూ, రూ.3 వేల గౌరవ వేతనం తీసుకునే వాళ్లపై చర్యలు తీసుకుంటామని వేధిస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో సీహెచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

జి.కొండూరు, ఆగస్టు 5 : గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబరు 117ను పునసమీక్ష చేసి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డీపీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెదగమళ్ల నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జీవో 117 వల్ల ఎంపీపీ పాఠశాలల్లో 1, 2 తరగతులకు అడ్మిషన్లు గణనీయంగా తగ్గుతున్నాయని, ఉన్నత పాఠశాల్లో ఉన్న మూడు, నాలుగు తరగతులను ఉన్నత పాఠశాలల నుంచి ప్రాథమిక పాఠశాలలకు బదలాయించాలని కోరారు. నెలవారి ప్రమోషన్లు చేపట్టాలని, సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లను హెచ్.ఎంలుగా పదోన్నతి కల్పించాలన్నారు. ఈప్రక్రియ ముగిసిన అనంతరమే పని సర్దుబాటు చేయాలని ఆయన కోరారు.

గన్నవరం తహసీల్దార్‌పై బదిలీ వేటు

(5వ పేజీ తరువాయి)

తూర్పుగోదావరి జిల్లాలో తహసీల్దార్‌గా పవన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. సీతానగరం తహసీల్దార్‌గా ఏడాది పనిచేశారు. ఆ తర్వాత రాజానగరం వెళ్లారు. రాజానగరంలో చేస్తుండగానే, ఆయన రెండేళ్ల గడువు అయిపోయింది. అయితే, మరో ఏడాది పొడిగించాల్సిందిగా వైసీపీ ప్రభుత్వ హయాంలో సీసీఎల్ఏను కోరారు. అక్కడ ఓ కళాశాల వ్యవహారంలో ఆయన పాత్ర వివాదాస్పదమైంది. తర్వాత ఎన్నికల నేపథ్యంలో కృష్ణాజిల్లాకు రావటంతో గన్నవరంలో ఆయనకు పోస్టింగ్ ఇచ్చారు. అదనంగా మరో ఏడాది పెంచిన గడువు కూడా అయిపోయింది. గడువు ముగిసినందున రిపోర్టు చేయాల్సిందిగా సీసీఎల్ఏ ఆదేశించినా ఆయన కదల్లేదు. గన్నవరంలోని వీరపనేనిగూడెం భూములు, విజయవాడ ఎయిర్‌పోర్టు భూసేకరణలో పోయిన వెంచర్ల భూములకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యేతో చర్చించకుండా ఆయన సొంత నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా ఈ నిర్ణయాలు ఉన్నాయి. తనకు నమ్మకంగా ఉండే ఒక అధికారితో కలిసి ఆయన ఈ ప్రయత్నాలు చేశారు. ఈ వ్యవహారాలపై 'ఆంధ్రజ్యోతి' పలు అంశాలను వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో పవన్‌కుమార్‌పై బదిలీ వేటు వేశారు.

విజన్‌తో..

(5వ పేజీ తరువాయి)

ప్రాతిపదికన పూర్తి చేసేందుకు వంద రోజుల ప్రణాళికకు ఆదేశాలు జారీ చేశారు. టార్గెట్లు నిర్ణయించుకుని ముందుకు సాగేలా ప్రభుత్వం దిశానిర్దేశం ఇవ్వటంతో ఈ ఇళ్లపై నెలకొన్న ప్రతిష్టంబన వీడిపోయింది. అలాగే, ప్రభుత్వం కొత్త ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. పేదల ఇళ్ల కోసం భూములను చూడాల్సిందిగా నిర్దేశించటం ద్వారా రానున్న రోజుల్లో అర్హులందరికీ ఇళ్లు అందుబాటులోకి రానున్నాయి. టిడ్కో ఇళ్ల సమస్య కూడా పరిష్కారం అవుతుంది. త్వరలో అన్ని మౌలిక సదుపాయాలను, పనులు చేపట్టి లబ్ధిదారులకు అందించనున్నారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

ప్రజలు సౌకర్యవంతమైన జీవనం సాగించటానికి వీలుగా మౌలిక రంగానికి పెద్ద పీట వేసే అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రోడ్లు అభివృద్ధి చేయడంతో పాటు ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, స్టేట్ హైవేస్, నేషనల్ హైవేస్, మోర్తు వంటి శాఖలతో సమావేశాలు నిర్వహించి రోడ్ల బాగుచేతకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వం తలపెట్టి, వదిలేసిన రోడ్ల నిర్మాణాన్ని సమీక్షించి వాటిని కూడా కొనసాగించాలి.

అర్ధరాత్రి హైడ్రామా!



దళితవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉద్రిక్తత

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటులో రగడ.. ఉద్రిక్తత

నెల రోజులుగా రెండు వర్గాల మధ్య ఘర్షణ

అర్ధరాత్రి పిల్లర్ల నిర్మాణం.. పోలీసుల మోహరింపు

అధికారుల హామీతో ఆందోళన విరమణ

పెడన, ఆగస్టు 5 : పట్టణంలోని 6వ వార్డు దళితవాడలో ఆదివారం అర్ధరాత్రి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భారీగా పోలీసులు రంగప్రవేశం చేయడంతో పరిస్థితి సద్దుమణిగింది. గత నెల 21న దళితవాడలోని ప్రభుత్వ స్థలంలో ఒక వర్గం అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయగా మరో వర్గం వ్యతిరేకించడంతో స్థానికంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువర్గాలు తోపులాటకు దిగాయి. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింపజేసి పరిస్థితిని చక్కదిద్దారు. అప్పటి నుంచి పోలీసు పికెట్ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా.. ఆదివారం అర్ధరాత్రి ఒక వర్గానికి చెందిన మహిళలు అంబేడ్కర్ విగ్రహం చుట్టూ పిల్లర్ల నిర్మాణం చేపట్టారు. కానిస్టేబుల్ ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియచేయడంతో పెద్ద సంఖ్యలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పిల్లర్ల నిర్మాణం అడ్డుకోగా.. మహిళలు ఆందోళనకు దిగారు. మునిసిపాలిటీ నుంచి అనుమతి తీసుకున్నాక పిల్లర్ల నిర్మాణం చేపట్టాలని పోలీసులు సూచించినా.. పిల్లర్లు నిర్మించే తీరుతామని మహిళలు భీష్మించారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో మునిసిపల్, పోలీసు, రెవెన్యూ అధికారులు మహిళల తాలూకా పెద్దలతో సోమవారం తెల్లవారుజామున 4 గంటల వరకు చర్చలు జరిపారు. రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో పెద్దల సూచన మేరకు మహిళలు ఆందోళన విరమించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

సంక్షేమ పథకాలను విజయవంతం చేస్తాం

సచివాలయ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు కోటేశ్వరరావు

ధర్నాచౌక్, ఆగస్టు 5 : సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తామన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఉన్నతస్థాయి అధికారులతో కమిటీ వేసి వారి సమస్యలను త్వరగా పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. పరిష్కరించాలని కోరారు. సచివాలయ ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ప్రొబేషన్ డిక్లరేషన్ ఆలస్యం చేసినందుకు రావాల్సిన బకాయిలను మంజూరు చేయాలన్నారు. ప్రొబేషన్ డిక్లరేషన్ అయినప్పటి నుంచి జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ కల్పించాలని కోరారు. బహుళశాఖ విధానం లేకుండా ఉద్యోగులపై వారి మాతృశాఖ మాత్రమే ఆజమాయిషీ ఉండాలన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి రత్నం, సహాధ్యక్షుడు రమేష్‌బాబు, ఉపాధ్యక్షులు హరి, రవికుమార్ రెడ్డి, ఆశోక్‌కుమార్, మోహన్‌రావు, కోలా నాగబాబు, మారుతి ప్రసాద్, వెంకట్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పిట్టల్లంకలో ఇసుక అక్రమ రవాణా

కోడూరు : మండల పరిధిలోని పిట్టల్లంక గ్రామ సమీపంలోని కృష్ణానది నుంచి పలువురు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కృష్ణానది నుంచి పడవలపై తీసుకొచ్చి ట్రాక్టర్లలో డంపింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై స్థానిక రెవెన్యూ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండటంతోనే అక్రమ రవాణా కొనసాగుతున్నదని, దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నా రెవెన్యూ అధికారులకు చీమకుట్టినట్లైనా లేదని వాపోతున్నారు. సోషల్ మీడియాలో కథనాల మేరకు కోడూరు ఎస్‌ఐ పి.శిరీష ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ వీరాంజనేయులు తెలిపారు. అదేవిధంగా మద్యం, రేషన్ బియ్యం రవాణా కథనాలకు రెవెన్యూ, సివిల్ సప్లయిస్, ఎస్ఈబీ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



కృష్ణానది నుంచి పడవల్లో ఇసుక తరలిస్తున్న వ్యక్తులు

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపండి : డీఆర్వో

కృష్ణలంక, ఆగస్టు 5 : ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపినప్పుడే ప్రజా సమస్యల పరిష్కార వేదిక లక్ష్యం నెరవేరుతుందని, జిల్లా అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి వల్లభనేని శ్రీనివాసరావు తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా డీఆర్వో వి.శ్రీనివాసరావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన, మాట్లాడుతూ, ప్రజల నుంచి స్వీకరించిన విజ్ఞప్తులను నిశితంగా పరిశీలించి నిర్దేశించిన గడువులోగా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. జిల్లా అధికారులు వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించడం ద్వారా అర్జీదారుల అభినందన అందుకోవడంతో పాటు ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చిన వారవుతారన్నారు. క్షేత్రస్థాయి అధికారుల సమన్వయంతో అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో శ్రీనివాసరావు

పట్టణంలో దాహం కేకలు!

నాలుగు రోజులుగా నిలిచిన నీటి సరఫరా

ఇంకా పట్టాలెక్కని పైలెట్ ప్రాజెక్టు

పెరిగిపోతున్న అంచనా వ్యయం

తిరువూరు, ఆగస్టు 5 : పట్టణంలో గత నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంపింగ్ స్కీమ్ వద్ద మెయిన్ పైపులైన్ లీకు సాకుతో పట్టణంలో నీటి సరఫరా నిలుపుదల చేయడం మునిసిపాలిటికి పరిపాటిగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. భారీ వర్షాలతో వాగుల్లో నీటి ప్రవాహం ఉన్నా తాగునీటి సరఫరా నిలిచిపోవడం శోచనీయమని పలువురు పేర్కొంటున్నారు. శిథిలమైన పైపులైన్లు తరచుగా మరమ్మతులకు గురవుతున్నాయని, వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ప్రస్తావించగా, ఫెర్రీ నుంచి తాగునీటి సరఫరా పథకంలో కొత్త లైను వస్తుందని మునిసిపల్ అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారని, మరమ్మతుల పేరుతో బిల్లులు పెట్టుకోవడం పరిపాటిగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాగునీటి పైలెట్ ప్రాజెక్టుపై అనుమానాలు?

పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఆసియా మౌలిక సదుపాయాల అభివృద్ధి బ్యాంక్ (ఏఐఐబి) నిధులతో చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు పనులు ముందుకు సాగడంలేదు. ఈ ఏడాది జూలై నాటికి ప్రాజెక్టు అగ్రిమెంట్ పూర్తవడంతో, మునిసిపల్ అధికారులు కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.



స్థానిక శాంతినగర్ ఎంపీడీవో కార్యాలయ సమీపంలో పైలెట్ ప్రాజెక్టుకు సంబంధించి చేపట్టిన 10లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్ నిర్మాణం, పునాదిలోనే నిలిచిపోయింది. వార్డుల్లో రూ.21.69 కోట్లతో చేపట్టిన పైపులైన్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోగా, పలు వార్డుల్లో సిమెంట్‌రోడ్లు ధ్వంసం చేశారు.

అంచనాలకే పరిమితమైన ప్రాజెక్టు..

ఫెర్రీ నుంచి తిరువూరుకు కృష్ణాజలాలు తరలించేందుకు డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) రూ.98 కోట్లతో రూపొందించిన ప్రాజెక్టు అంచనాలు ప్రస్తుతం రూ.162.74 కోట్లకు చేరింది. ఏఐబి అగ్రిమెంట్ ఈ ఏడాది జూలైతో పూర్తవడంతో తిరిగి పునరుద్ధరించేందుకు, ప్రతిపాదనలు పంపగా, ప్రస్తుత ధరల ప్రకారం ప్రాజెక్టు అంచనాలు రూ.200 కోట్లకు పెరిగే అవకాశం ఉందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

నూతన పైపుల ఏర్పాటు

- మునిసిపల్ కమిషనర్ లోవరాజు

పట్టణంలో తాగునీటి సరఫరాకు సంబంధించి పంపింగ్‌స్కీమ్ వద్ద పైపులు పగిలిపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. యుద్ధప్రాతిపదికన కొత్తవి నిర్మిస్తున్నాం. పైపులైను ఏర్పాటుకు సంబంధించి ఇసుక లేకపోవడంతో ఇబ్బంది ఏర్పడింది. నందిగామ నుంచి ఇసుక తెప్పించి పైపులు నిర్మిస్తున్నాం. సాధ్యమైనంత త్వరగా తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తాం. తాగునీటి పైలెట్ ప్రాజెక్టుకు అగ్రిమెంట్ గడువు ముగియడంతో కొత్తగా అగ్రిమెంట్ సిద్ధం చేస్తున్నాం.

చివరి కష్టాలు



బందరు మండలం పెదపట్నం కాల్వను బాగు చేసుకుంటున్న రైతులు

పంట కాపాడుకునేందుకు రైతుల అష్టకష్టాలు

- **బోరునీటి ద్వారా పంటలు తడుపుకొనే ప్రయత్నాలు**
- **పెదపట్నం కాల్వలో తూడు, నాచు తొలగించుకున్న రైతులు**
- **సాగర్ నుంచి వచ్చే నీటిపైనే అన్నదాతల ఆశలు**

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద నీరు వస్తుండటంతో దిగువకు 80 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఐదు రోజుల పాటు నాగార్జున సాగర్ నుంచి నీరు వస్తే పులిచింతల ప్రాజెక్టు నిండుతుందని నీటిపారుదల శాఖ అధికారుల అంచనా. వారం క్రితం వరకు పులిచింతల ప్రాజెక్టులో ఒక్క టీఎంసీ నీరు మాత్రమే ఉండగా, సోమవారం నాటికి 5 నుంచి 6 టీఎంసీలకు చేరింది. ఈ నీటిని కృష్ణాడెల్టా సాగునీటి అవసరాల కోసం ప్రకాశం బ్యారేజీకి విడుదల చేస్తున్నారు. ఈ నీరు మంగళవారం నాటికి ప్రకాశం బ్యారేజీకి చేరుతుందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. బ్యారేజీకి వచ్చిన నీటిని వచ్చినట్టుగా కృష్ణాడెల్టాలోని అన్ని ప్రధాన కాల్వలకు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. సోమవారం బ్యారేజీ నుంచి 12 వేల క్యూసెక్కుల నీటిని ప్రధాన కాల్వలకు విడుదల చేశారు. అయితే, రెండు, మూడు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో సాగునీటి వినియోగం పెరిగింది. ఇలాంటి సమయంలో శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

శివారులో సాగునీటి కష్టాలు

జూ బంటుమిల్లి కెనాల్ ద్వారా బంటుమిల్లి మండలంలోని కొర్లపాడు, అర్తమూరు, మణిమేశ్వరం, పెదపట్నం గ్రామాలకు సాగునీరు అందాల్సి ఉంది. కొర్లపాడు వద్ద బంటుమిల్లి కెనాల్ నుంచి బందరు మండలంలోని పెదపట్నం బ్రాంచ్ కాల్వ ప్రారంభమవుతుంది. కొర్లపాడు వద్ద ప్రధాన కాల్వలో నాలుగు అడుగుల నీటిమట్టం ఉంటేనే శివారు ప్రాంతంలోని పెదపట్నం గ్రామానికి సాగునీరు వస్తుంది. ఈ కాల్వలో మూడు అడుగుల నీటి మట్టం మాత్రమే ఉండటంతో కొర్లపాడు, అర్తమూరు, మణిమేశ్వరం గ్రామాలకు చెందిన రైతుల ఆయిల్ ఇంజన్ల ద్వారా వచ్చిన నీటిని పొలాలకు మళ్లిస్తున్నారు. దీంతో కొర్లపాడు నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపట్నం కాల్వకు సాగునీరు అందడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలు, కాల్వ ద్వారా వచ్చిన నీటిని ఆధారంగా చేసుకుని పెదపట్నానికి చెందిన రైతులు నారుమడులు పోశారు. ప్రస్తుతం నీరు అందుబాటులోకి రాకపోడంతో నారుమడులను బతికించుకునేందుకైనా సాగునీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.. రెండు రోజులుగా పెదపట్నం గ్రామ రైతులు స్వచ్ఛందంగా కాల్వలోని తూడు, నాచు తొలగించే పనులు చేసుకుంటున్నారు. అయినా ఈ కాల్వకు నీటిని విడుదల చేయలేదని రైతులు అంటున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి పెదపట్నం కాల్వకు నీటిని విడుదల చేసి నారుమడులను బతికించాలని రైతులు కోరుతున్నారు.

ఎరువుల ముడిసరుకుపై జీఎస్టీ తగ్గించారా

పార్లమెంటులో ఎంపీ బాలశౌరి ప్రశ్న

మచిలీపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల తయారీలో వాడే ముడిసరుకులపై జీఎస్టీని ఎంతమేర తగ్గించారని సోమవారం జరిగిన పార్లమెంటు సమావేశంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ప్రశ్నించారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించినా, తుది నిర్ణయం తీసుకోలేదనే అంశంలో వాస్తమవమెంత అని అడిగారు. పార్లమెంట్‌లోని రసాయనాలు, ఎరువుల స్టాండింగ్ కమిటీ ఎరువుల ముడిసరుకులపై జీఎస్టీని 18శాతం నుంచి5శాతానికి తగ్గించాలని సిఫార్సు చేసిందని, జీఎస్టీ కమిటీ ఈ అంశాన్ని మంత్రుల కమిటీకి పంపిందని, మంత్రుల కమిటీ నిర్ణయం తెలియజేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌదరి సమాధానమిస్తూ ఎరువుల ముడిసరుకులపై జీఎస్టీని తగ్గించే అంశంపై జీఎస్టీ కౌన్సిల్ 25, 28, 31, 45, 53 సమావేశాల్లో చర్చించిందన్నారు. 25వ సమావేశంలో 12రకాలకు చెందిన బయోపెస్టిసైడ్స్‌పై జీఎస్టీని 18శాతనుంచి 12శాతానికి తగ్గించాలని సిఫార్సు చేసినట్టు తెలిపారు. అమ్మోనియా వంటి ఎరువుల ముడిసరుకులు, సల్ఫ్యూరిక్‌యాసిడ్‌పై జీఎస్టీని తగ్గించాలని మంత్రుల బృందం సిపార్సు చేసిందని చెప్పారు. ఈఅంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు.

ఐదేళ్లు రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చారు

మంత్రి కొల్లు రవీంద్ర



వన్‌టౌన్, ఆగస్టు 5 : వైసీపీ వాళ్లు శనిలా దాపురించారని, వారి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం రావణకాష్టంలా మారిందని మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వెయ్యి గొడ్లను తిన్న రాబందు నీతి వాక్యాల్లా మాజీ మంత్రి పేర్ని నాని మాటలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఐదేళ్లు దాడులు, దౌర్జన్యాలు, హత్యాచారాలతో పైశాచిక ఆనందం పొందిన వైసీపీ బ్యాచ్ ఇప్పుడు నీతులు చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. రాజ్యాంగం, ప్రజల గురించి ఇప్పుడు మాట్లాడటం శోచనీయమన్నారు. ఆ ఐదేళ్లు ప్రజలకు క్షణ క్షణం గండంలా మారిందన్నారు. న్యాయం కోరిన అమరావతి రైతులు, మహిళలపై దాడులు చేశారన్నారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపైకి గంజాయి ముఠాను పంపి దాడి చేయించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుని తిరుగుతున్నారన్నారు. తప్పు చేసిన అధికారులను చట్ట ప్రకారమే శిక్షిస్తామని నారా లోకేశ్ ప్రకటించిన నాటి నుంచి పేర్ని నాని వంటి అరాచక శక్తుల గుండెల్లో వణుకు మొదలైందన్నారు. రెడ్ బుక్ చూసి భయపడుతున్నారన్నారు. పేర్ని నాని ఇప్పటికైనా చేసిన తప్పులకు ప్రజలను క్షమాపణ కోరితే మంచిదన్నారు.

కలెక్టరేట్ ఏవోగా వీరాంజనేయ ప్రసాద్

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 5 : కలెక్టరేట్ ఏవోగా సిహెచ్. వీరాంజనేయ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎన్నికల విభాగంలో వీరాంజనేయ ప్రసాద్ పనిచేశారు. గతంలో మొవ్వ తహసీల్దార్‌గా పనిచేసిన ఈయన కలెక్టరేట్‌లో ఏవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి, ఆర్డీవో వాణిని మర్యాద పూర్వకంగా కలిశారు.



తునికిపాడులో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

50 రోజుల తర్వాత గ్రామంలోకి వైసీపీ నేత..

తునికిపాడులో ఉద్రిక్తత!

గంపలగూడెం, ఆగస్టు 5 : ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ శ్రేణులను తీవ్ర వేధింపులకు గురిచేసిన మండల వైసీపీ అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు సోమవారం సొంత గ్రామం తునికిపాడుకు రావడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి కూటమి ప్రభుత్వం వచ్చాక చావా వెంకటేశ్వరరావు తునికిపాడు గ్రామాన్ని వదిలి మధిరకు మకాం మార్చాడు. నాటి నుంచి తునికిపాడు వైపు రాలేదు. 50 రోజుల తర్వాత అకస్మాత్తుగా వెంకటేశ్వరరావు తునికిపాడులోని సొంత ఇంటికి రావడంతో వైసీపీ కార్యకర్తలు సోషల్ మీడియాలో పులి వచ్చింది.. సింహం వచ్చింది.. అంటూ స్టేటస్‌లు పెట్టడంతో టీడీపీ వర్గీయులు రగిలిపోయారు. కొందరు అతడి ఇంటిపై దాడికి యత్నించగా సీఐ నబీ, ఎస్సై శ్రీను, సిబ్బంది అడ్డుకున్నారు. టీడీపీ వర్గీయులను అక్కడి నుంచి పంపివేసి చావా వెంకటేశ్వరరావును మైలవరం స్టేషన్‌కు తరలించినట్టు సమాచారం. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో..

మరో ఐదుగురికి రిమాండ్

గన్నవరం, ఆగస్టు 5 : స్థానిక టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన వైసీపీ మూకలను మరో ఐదుగురిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించారు. సోమవారం విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మెండెం రాంబాబు, షేక్ ఇమ్రాన్, షేక్ ఇర్ఫాన్, గంగా అమరేంద్రనాథ్ రెడ్డి, సయ్యద్ సిద్ధిక్‌లను గన్నవరం పోలీసులు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించి నెల్లూరు సెంట్రల్ జైల్‌కు తరలించారు. ఈ కేసులో 71 మంది ఉండగా ఇప్పటి వరకూ 25 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన వారికోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

'మీ కోసం' అర్జీలు పరిష్కరించండి

మచిలీపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమంలో వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం 'మీకోసం' కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణితో కలిసి ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. 'మీకోసం' కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చే అర్జీలపైనా దృష్టి సారించాలన్నారు. కోర్టు కేసులను పూర్తిస్థాయిలో పరిశీలించి కౌంటర్‌లు దాఖలు చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విజయవాడ

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	96, 105, 116
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.30

టెన్త్ తప్పిన విద్యార్థులకు రేపటి నుంచి ఉచిత శిక్షణ

వన్‌టౌన్, ఆగస్టు 5: పదవ తరగతి తప్పిన విద్యార్థులకు ఈనెల 7 నుంచి తమ కళాశాలలో ఉచిత శిక్షణా తరగతులను ఏర్పాటు చేశామని కొత్తపేటలోని ఎస్‌ఆర్‌ఎస్‌వీ బీఎడ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మాజేటి సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌.కె. దుర్గ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో అనుభవం గల ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారని, ఉదయం 9.30 నుంచి 4.30 వరకు తరగతులు కొనసాగుతాయన్నారు. వివరాలకు 7995593859లో సంప్రదించవచ్చన్నారు.

త్వరితగతిన ఫిర్యాదులను పరిష్కరించండి

అదనపు కమిషనర్ మహేష్

చిట్టినగర్, ఆగస్టు 5: ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్(జనరల్) డాక్టర్ ఏ.మహేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా అదనపు కమిషనర్(జనరల్)కు అందజేశారు. మొత్తం 36 అర్జీలు వచ్చాయి. అదనపు కమిషనర్(ప్రాజెక్ట్) కే.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ మహేష్

తవ్వి వదిలేసిన రోడ్లు పునర్నిర్మాణం చేయాలని వినతి

కృష్ణలంక : స్థానిక 21వ డివిజన్‌లో తవ్వి వదిలేసిన రోడ్లు పునర్నిర్మాణం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు దోనేపూడి కాశీనాథ్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అదనపు మున్సిపల్ కమిషనర్ మహేష్‌కు స్థానికుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఇంటింటికి మ్యాన్‌హోల్స్ పథకాన్ని ప్రవేశపెట్టిన వైసీపీ ప్రభుత్వం 21వ డివిజన్‌లోని పలు రోడ్లలో అడుగు ఎత్తులో మ్యాన్‌హోల్స్‌ను ఏర్పాటు చేసిందని, దీంతో వాహనదారులు ప్రమాదాల పడుతున్నారని వివరించారు. నెలరోజుల క్రితం కృష్ణలంక హైస్కూల్‌రోడ్డు మొత్తం తవ్వి వదిలేశారని, దీని వలన ప్రమాదాలు జరుగుతున్నాయని రోడ్డు మధ్యలో తవ్వివదిలేసిన చోట సిమెంట్ కాంక్రీటు వేసి రోడ్డు మొత్తం ఒకే లెవల్‌గా వుండేలా చూడాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. అదనపు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఎం నాయకులు పుప్పాల కృష్ణ, కోరాడ రమణ, కె.శివాజీ, కోటి, ఫిరోజ్, స్థానికులు ఉన్నారు.

డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు

మంత్రి నారాయణ

భారతీనగర్, ఆగస్టు 5 : నగరంలోని నిలిచిపోయిన సైడుకాల్వ సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ అన్నారు. తూర్పు నియోజక వర్గం నాల్గో డివిజన్‌లోని వెటర్నరీ కాలనీలో సోమవారం మంత్రి నారాయణ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, స్థానిక పెద్దలతో కలసి పర్యటించారు. అనంతరం వెటర్నరీ కాలనీలోని వీఎంసీ పార్కులో ఏర్పాటు చేసిన జిమ్ సెంటర్, పరికరాలను మంత్రి నారాయణ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల ద్వారా వచ్చే ఆదాయం ఆయా మున్సిపాలిటీల అభివృద్ధికే వినియోగించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకున్నారని అన్నారు. గత ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ లో ఉన్న మున్సిపాలిటీలకు చెందిన రూ.1900 కోట్ల నిధులను ఇతర అవసరాలకు మళ్లించారన్నారు. దీంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.



జిమ్‌ను ప్రారంభించి ట్రెడ్‌మిల్ చేస్తున్న మంత్రి నారాయణ, పక్కన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ తూర్పులోని డ్రెయినేజీ వ్యవస్థ చాలా అస్తవ్యస్తంగా ఉందన్నారు. కొండ ప్రాంతాలు ఉండటం, డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికి ఈ ప్రాంతంలో చాలా కాలనీలు నీట మునుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, దేవినేని అపర్ణ, ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, పిన్నమనేని ధన ప్రకాష్, చెన్నుపాటి గాంధీ, గొల్లపూడి నాగేశ్వరరావు, నల్లూరి సుబ్బారావు, సుంకర రాజేష్ రామ్మోహన్ పాల్గొన్నారు.

గతంలో ప్రారంభించింది భవనం...జిమ్ కాదు

నాల్గో డివిజన్ వెటర్నరీ కాలనీలోని వీఎంసీ పార్కులో గతంలో స్థానిక వైసీపీ నాయకులు, కార్పొరేషన్ అధికారుల చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించింది జిమ్ భవనం మాత్రమేనని వెటర్నరీ, ఎన్టీఆర్, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ పెద్దలు ఎన్. సుబ్బారావు, సీహెచ్ సురేష్, ఎస్. రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌లోని పరికరాలను సోమవారం మంత్రి నారాయణ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చేతుల మీదుగా ప్రారంభించినట్లు వారు తెలిపారు.

దోబీఖానాలో ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, ఆగస్టు 5 : కృష్ణలంక దోబీఘాట్‌లోలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలి పారు. కృష్ణలంక 22వ డివిజన్‌లో గద్దె రామ్మోహన్ పర్యటించారు. ముందుగా ఇటీవల నీటి సమస్య పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ మేరకు సోమవారం బోర్ ఏర్పాటు పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రాథమిక వైద్య కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ ప్రాథమిక వైద్య కేంద్రంలో ప్రజలు కూర్చునేందుకు కుర్చీలు కావాలని, మంచినీటి ప్యూరిఫై మిషన్ ఇప్పించాలని వైద్య సిబ్బంది గద్దె రామ్మోహన్‌ను కోరారు. వైద్య కేంద్రానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. టీడీపీ నాయకులు చందన సురేష్, పి.అన్నారావు, తోట శ్రీను, పెద్ది అన్నారావు, గద్దె రమేష్, నడికొప్పుల శివ, బండపల్లి బుజ్జి, చలసాని రమణ పాల్గొన్నారు.

సామాజిక న్యాయమే ధ్యేయంగా కూటమి పాలన

● ఎమ్మెల్యే బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 5 : రాష్ట్రంలో సామాజిక న్యాయమే ధ్యేయంగా కూటమి పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు అన్నారు. వర్గీకరణపై సుప్రీం తీర్పును పురస్కరించుకుని అజిత్‌సింగ్ నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు సోమవారం బొండా ఉమా పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. నేతలు బొడ్డు కిషోర్, వింజమూరి సతీష్, చల్లగాలి అనిల్ పాల్గొన్నారు.



చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఉమా

పుస్తకాలు పంపిణీ

పాయకాపురం: 62వ డివిజన్ రాధా నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం పాఠ్య పుస్తకాలు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొండా ఉమా ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. నేతలు మాజీ కార్పొరేటర్ పైడి తులసి, దుర్గ, కొండ పాల్గొన్నారు.

మాచవరం, పటమట సీఐల బాధ్యతల స్వీకరణ

గుణదల, ఆగస్టు 5: కమిషనరేట్లో ప్రతిష్ఠాత్మకమైన పటమట, మాచవరం పోలీస్ స్టేషన్లకు ఏలూరు రేంజ్ నుంచి వచ్చిన ఇరు వురు సీఐలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు రేంజ్‌లో వీఆర్‌లో ఉన్న ప్రకాష్ మాచవరం సీఐగా చార్జ్ తీసుకున్నారు. మాచవరం సీఐగా పనిచేస్తున్న గుణరామ్‌ను కమిషనరేట్లో వీఆర్‌కు ఎటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మచిలీపట్నం గిలకలదిండు వద్ద ఓడరేవుకు మెరైన్ సీఐగా పనిచేస్తున్న పవన్ కిషోర్ పటమట సీఐగా బాధ్యతలు చేపట్టారు. పటమట సీఐగా పనిచేస్తున్న మోహన్ రెడ్డిని ఏలూరు రేంజ్ కార్యాలయం వీఆర్‌కు ఎటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో పటమట సీఐ మోహన్ రెడ్డికి స్టేషన్ సిబ్బంది సోమవారం సాయంత్రం వీడ్కోలు పలికారు.



పటమట సీఐ పవన్ కిషోర్ | మాచవరం సీఐ ప్రకాష్

వ్యాన్ డ్రైవర్ ఆత్మహత్య

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 5 : మనస్తాపంతో వ్యాన్ డ్రైవర్ కుండ దుర్గారావు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో జరిగింది. వివరాల ప్రకారం కుండ దుర్గారావు(33), భార్య లక్ష్మీలకు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. దుర్గారావు వ్యాన్ డ్రైవర్. అయితే గత కొంత కాలంగా మద్యానికి బానిసైన దుర్గారావు భార్యతో తరచూ గొడవ పడుతున్నాడు. ఈనెల 3న కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య తన ఇద్దరు పిల్లలను తీసుకుని తుమ్మలపాలెంలోని పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపానికి గురైన దుర్గారావు సోమవారం చీరతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థికి అభినందనలు



మాచవరం, ఆగస్టు 5 : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన శ్రీ చైతన్య కళాశాల విద్యార్థి సంతోష్‌సింగ్ రాజ్ పురోహిత్‌కు అభినందన కార్యక్రమం సోమవారం కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థిని డీన్ జి. హరిబాబు, ప్రిన్సిపాల్ ఎన్. గోకర్ణేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పాయకాపురం, ఆగస్టు 5: విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా పాయకాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ టీవీ సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాత రాజీవ్‌నగర్, ఉడాకాలనీలోని ఎల్ఐజీ, ఎంఐజీ ఈడబ్ల్యూఎస్ ప్రాంతాల్లో కరెంట్ ఉండదని తెలిపారు.

వృద్ధాశ్రమంలో చీరలు, పండ్లు పంపిణీ

పాయకాపురం, ఆగస్టు 5 : వాంబే కాలనీలోని అమ్మప్రేమ ఆదరణ వృద్ధాశ్రమంలో సోమవారం వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. రిటైర్డ్ ఇంజనీర్ పరుచూరి రాజ బాబయ్య తన మాతృమూర్తి పరుచూరి దుర్గమ్మ జ్ఞాపకార్థం అమ్మప్రేమ ఆదరణ వృద్ధాశ్రమంలో రూ. 35 వేలు విలువైన చీరలు, పండ్లు వృద్ధులకు అందజేశారు.



వృద్ధులకు చీరలు, పండ్లు అందజేసిన రాజ బాబయ్య

పీహెచ్‌సీలో సౌకర్యాలపై క్రాంతికుమార్ ఆరా

పటమట, ఆగస్టు 5 : 14వ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లోని పీహెచ్‌సీని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ సోమవారం సందర్శించి అక్కడి సౌకర్యాలపై ఆరా తీశారు. వైద్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. దర్శిపేట మెయిన్ రోడ్డు నుంచి అంబేడ్కర్‌నగర్‌లోని ఇళ్ల మధ్యగానే నడుస్తున్న డ్రెయినేజీ కాల్వను డైరెక్టుగా కృష్ణవేణి రోడ్డు పక్కగా బందర్ కాల్వలోకి కలపాలని స్థానికులు కోరారని, ఈ విషయమై ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని క్రాంతికుమార్ హామీ ఇచ్చారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు నర్రా కిషోర్, బద్రి, వీరంకి డాంగే కుమారి, చెరుకూరి సాంబయ్య, చిట్టిబొమ్మ గణేష్, షేక్ ఫాతిమా, నాజర్‌వలీ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం

విద్యాధరపురం, ఆగస్టు 5: జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారంతో ముగిసిందని, గత ఏడాదికన్నా ఈ ఏడాది పశ్చిమలో ఎక్కువ సభ్యత్వాలు నమోదు అయ్యాయని ఆ పార్టీ ప్రచార కార్యదర్శి తిరుపతి సురేష్ అన్నారు. 42వ డివిజన్‌లో ప్రియదర్శిని కాలనీ, ట్రెండ్స్ వద్ద భవన నిర్మాణ కార్మికులకు సభ్యత్వాలు నమోదు చేసి కార్డులను అందించారు. డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష, ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు. తిరుమారెడ్డి, గణేష్, వినోద్, రఫీ, సల్మాన్, శ్రీను, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాల పంపిణీలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవిచంద్రన్

భవానీపురం, ఆగస్టు 5 : క్రాంబ్వే రోడ్డులోని ఓ హోటల్‌లో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా వీ212ఏ రీజియన్-1 ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుల ఆహ్లాద కలయిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. 1860 క్లబ్‌ల ద్వారా వేద పాఠశాలలకు మౌలిక సదుపాయాలను, వాటర్ ట్యాంకులు, విద్యార్థులకు నోట్ పుస్తకాలను సమకూరుస్తున్నట్లు సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు ఆర్ రవిచంద్రన్ వివరించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో రీజియన్ గవర్నర్ కె. సతీష్‌కుమార్, సభ్యులు కందుకూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

ఆర్మీ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్



ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్(ఏఎఫ్ఎంఎస్)- బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిని మహిళలకు ఉద్దేశించారు. కోర్సు వ్యవధి నాలుగేళ్లు. నీట్ యూజీ 2024 స్కోర్, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్), సైకలాజికల్ అసెస్‌మెంట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అర్హతలు: అవివాహిత/డైవోర్స్‌డ్/లీగల్లీ సెపరేటెడ్ మహిళలు, వితంతువులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్(బైపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. నీట్ యూజీ 2024 స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులు 1999 అక్టోబరు 1 నుంచి 2007 సెప్టెంబరు 30 మధ్య జన్మించి ఉండాలి. కనీసం 152 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి. పద్దెనిమిదేళ్ల లోపు వయసు ఉన్న వారిని రెండు సెంటీమీటర్లు తక్కువగా ఉన్నప్పటికీ అనుమతిస్తారు. ఎన్‌సీసీ-సీ అర్హత ఉన్నవారు సంబంధిత సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలి.

ఎంపిక: అభ్యర్థులను నీట్ యూజీ 2024 స్కోర్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్) నిర్వహిస్తారు. ఇందులో 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే అర మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం అర్ధ గంట. ఇందులో అర్హత పొందినవారిని సైకలాజికల్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో ఇంటర్ స్థాయి కోర్ సబ్జెక్టుల నుంచి; హాబీస్; జనరల్ నాలెడ్జ్, కరెంట్ ఆఫైర్స్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. క్రీడల్లో పాల్గొన్న అనుభవం ఉన్నవారికి అదనపు వెయిటేజీ ఉంటుంది. తరవాత ఢిల్లీ బేస్ హాస్పిటల్ స్పెషల్ మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. పై స్కోర్లన్నింటినీ పరిగణనలోకి తీసుకొని మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 7
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్సిటీ)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. జేఆర్ఎఫ్ అర్హత ఉన్న అభ్యర్థులు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. మొత్తం 170 సీట్లు ఉన్నాయి.

స్పెషలైజేషన్లు-సీట్లు: ఇంగ్లీష్ 6, తెలుగు 19, ఉర్దూ 3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్ 8, హిస్టరీ 8, పొలిటికల్ సైన్స్ 10, సోషియాలజీ 20, ఆంత్రోపాలజీ 9, ఎడ్యుకేషన్ 2, రీజనల్ స్టడీస్ 5, ఇండియన్ డయాస్పొరా 2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ 4, జెండర్ స్టడీస్ 5, ఎకనామిక్స్ 28, డ్యాన్స్ 3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్ 1, కమ్యూనికేషన్ 3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్ 8, హెల్త్ సైన్స్-ఆప్టోమెట్రీ 2, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 16, నానోసైన్స్ అండ్ టెక్నాలజీ 4 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ఇతర/తత్సమాన అర్హతల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 14
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 10 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(రాత పరీక్ష) తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూలు:** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఇంటర్వ్యూలో ఎంపికైనవారి జాబితా విడుదల:** డిసెంబరు 2
- **కౌన్సెలింగ్:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 2 నుంచి
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రెయినీలు



4455 ఖాళీలు

దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్ పీవో/ఎంటీ- XIV) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ ఆగస్టు 21. వెబ్‌సైట్: https://ibps.in/

1 సీఆర్‌పీ ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజ్‌మెంట్ ట్రెయినీ - XIV

ఖాళీలు: 4,455(ఎస్సీ-675, ఎస్టీ-332, ఓబీసీ-1185, ఈడబ్ల్యూఎస్-435, యూఆర్-1846)

ఖాళీలున్న ప్రభుత్వరంగ బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

అర్హత: ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై అభ్యర్థులు అర్హులు

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.175; ఇతరులు రూ.850 చెల్లించాలి.

ఎంపిక: ప్రిలిమినరీ, మెయిన్ రాత పరీక్షలు, ఇంటర్వ్యూ, ధ్రువ పత్రాల పరిశీలన, మెడికల్ ఎగ్జామ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: అనంతపురం, ఏలూరు, గుంటూరు/విజయవాడ, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్.

మెయిన్ పరీక్ష కేంద్రాలు: గుంటూరు/విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్.

పరీక్ష విధానం

ప్రిలిమ్స్ రాత పరీక్ష(ఆబ్జెక్టివ్ టెస్ట్): ఈ పరీక్షను 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 30 ప్రశ్నలు(30 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 35 ప్రశ్నలు (35 మార్కులు), రీజనింగ్ నుంచి 35 ప్రశ్నలు(35 మార్కులు) ఇస్తారు. ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ప్రశ్న పత్రం ఉంటుంది. ఐబీపీఎస్ నిర్దేశించిన కటాఫ్ మార్కుల మేరకు అర్హత సాధించిన వారిని మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

మెయిన్ ఎగ్జామినేషన్(ఆబ్జెక్టివ్/డిస్క్రిప్టివ్): ఈ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్న పత్రంలో మొత్తం 155 ప్రశ్నలు ఉంటాయి. పరీక్షను ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ నుంచి 45 ప్రశ్నలు(60 మార్కులు), జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ నుంచి 40 ప్రశ్నలు(40 మార్కులు), ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 35 ప్రశ్నలు(60 మార్కులు) ఇస్తారు. పరీక్ష వ్యవధి 3 గంటలు.

ఇంగ్లీష్ లాంగ్వేజ్(లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే): 2 ప్రశ్నలు ఇస్తారు. 25 మార్కులు కేటాయించారు. ఈ పరీక్షకు నిర్దేశించిన సమయం 30 నిమిషాలు.

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/WP5N39qలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

అద్భుతమైన విజువల్స్‌తో 'చుట్టమల్లే'



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'ఫియర్' సినిమాపై అంచనాలను తారస్థాయిలో పెంచాయి. సోమవారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను విడుదల చేశారు. 'చుట్టమల్లే' అంటూ సాగే ఈ రొమాంటిక్ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ, అద్భుతమైన విజువల్స్ అందరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి. రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా, శిల్పా రావ్ ఆలపించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం, బాస్కో మార్టిస్ కొరియోగ్రఫీ అందించారు. కాగా, 'దేవర పార్ట్ 1' సెప్టెంబర్ 27న విడుదలవుతోంది.

పతాక సన్నివేశాల చిత్రీకరణ




అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పుష్ప 2'. డైరెక్టర్ సుకుమార్, నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ సీక్వెల్‌ను 'పుష్ప పార్ట్ 1'ను మించి ఉండేలా ప్రతీ విషయంలో జాగ్రత్త పడుతున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, రెండు పాటలు సినిమాపై అంచనాలను పెంచేశాయి. చిత్రీకరణను దాదాపు పూర్తి చేసుకుందీ చిత్రం. ప్రస్తుతం, ఈ సినిమాకు సంబంధించిన క్లైమాక్స్ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన ఓ భారీ సెట్‌లో జరుగుతోంది. ఈ సెట్‌లో అల్లు అర్జున్‌తో పాటు ఇతర కీలక తారాగణం పాల్గొంది. ఈ క్లైమాక్స్ ఎపిసోడ్ థియేటర్స్‌లో గూస్‌బంప్స్ తెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. డిసెంబరు 6న సినిమా విడుదల కానుంది.

మళ్లీ కలసి నటిస్తారా?



ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపుదిద్దుకోనున్న 'స్పిరిట్' చిత్రం స్క్రిప్ట్ వర్క్ దాదాపు పూర్తయింది. ఈ ఏడాది చివరిలో షూటింగ్ మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి. పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొనే ఈ సినిమాలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరా అనే చర్చ చాలా రోజులుగా జరుగుతోంది. తాజాగా త్రిష పేరు వినిపిస్తోంది. ఆమెతో దర్శకుడు సందీప్ మాట్లాడారనీ, ఆమె కూడా ఓకే చెప్పారనీ సమాచారం. ప్రభాస్, త్రిష కాంబినేషన్‌లో 'వర్షం', 'పౌర్ణమి', 'బుజ్జిగాడు' చిత్రాలు వచ్చాయి. 16 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ జంట 'స్పిరిట్' లో కలసి నటించనున్నారన్నమాట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి సరసన 'విశ్వంభర' చిత్రంలో త్రిష నటిస్తున్నారు.

రెండు భాగాలుగా విజయ్ సినిమా



విజయ్ దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'వీడీ 12'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని సూర్య దేవరనాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాలో విజయ్ లుక్‌ను రిలీజ్ చేశారు. కంప్లీట్ రఫ్ లుక్‌లో ఉన్న విజయ్‌ను చూసి బ్లాక్‌బస్టర్ హిట్ ఖాయం అని అభిమానులు సినిమాపై అంచనాలు పెంచేసుకున్నారు. తాజాగా, జరిగిన ఓ మీడియా సమావేశంలో చిత్ర నిర్మాత ఈ సినిమా ఓ గురించి ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. "గౌతమ్ తిన్ననూరి, విజయ్ కలియకలో తెరకెక్కే సినిమా కోసం దర్శకుడు అద్భుతమైన కథను రాసుకున్నారు. రెండు భాగాలకూ సరిపడా కంటెంట్ ఆయన రాసిన కథలో ఉంది . మొదటి భాగం ఫలితాన్ని బట్టి రెండో భాగం తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తాం" అని చెప్పారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 28న విడుదల కానుంది.

ఆప్ ప్రభుత్వానికి సుప్రీం షాక్

ఎంసీడీలో నామినేటెడ్ సభ్యుల నియామక అధికారం ఎల్జీకే

- మంత్రిమండలి సలహాను పాటించనక్కర్లేదన్న ధర్మాసనం



న్యూఢిల్లీ/చెన్నై, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో పెద్ద దెబ్బ తగిలింది. చట్టం ప్రకారం ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ)లో సభ్యులను నామినేట్ చేసే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ)కే ఉందని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ విషయంలో రాష్ట్ర మంత్రిమండలి సలహా, సూచనలను ఎల్జీ పట్టించుకోనవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసరం సోమవారం తీర్పు చెప్పింది. 10 మంది సభ్యులను ఎల్జీ నామినేట్ చేయడాన్ని సవాలు చేస్తూ ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై విచారణను 15 నెలల క్రితమే పూర్తిచేసిన సుప్రీంకోర్టు అప్పుడు రిజర్వు చేసిన తీర్పును తాజాగా వెల్లడించింది. ప్రత్యేక పరిజ్ఞానం ఉన్న వ్యక్తులను ఎంసీడీకి నామినేట్ చేసే అధికారాన్ని ఎల్జీకి కల్పిస్తూ 1993లో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం-1957కు సవరణలు చేశారని ధర్మాసనం తెలిపింది. ఎంసీడీలో 250 మంది ఎన్నికైన, 10 మంది నామినేటెడ్ సభ్యులు ఉంటారు. 2022 డిసెంబరులో జరిగిన ఎంసీడీ ఎన్నికల్లో ఆప్ విజయం సాధించింది. మెజారిటీ మార్కు 126 స్థానాలు కాగా, ఆప్ 134, బీజేపీ 104, కాంగ్రెస్ 9 స్థానాలు గెలుపొందాయి. అనంతరం 10 మంది సభ్యులను ఎల్జీ నామినేట్ చేయగా, మంత్రిమండలి సూచించిన వ్యక్తులను ఎల్జీ నామినేట్ చేసేలా ఆదేశించాలని కోరుతూ ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయించింది. కాగా, ఎంసీడీలో సభ్యులను నామినేట్ చేసే అధికారాన్ని ఎల్జీకి ఇవ్వడం వల్ల ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన స్థానిక సంస్థను ఆయన అస్థిర పరిచే అవకాశం ఉందని విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో, తాజా తీర్పు ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్బ అని ఆప్ పేర్కొంది. విచారణ సందర్భంగా సీజేఐ, జడ్జిలు చేసిన వ్యాఖ్యలకు ఈ తీర్పు పూర్తి భిన్నంగా ఉందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు.

యూట్యూబ్ ఛానళ్ల నియంత్రణకు మద్రాస్ హైకోర్టులో పిల్

యూట్యూబ్ చానళ్ల నియంత్రణకు తగిన విధివిధానాలు రూపొందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై స్పందించాలని మద్రాసు హైకోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. చెన్నైకి చెందిన పార్తీబన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిల్‌లో.. యూట్యూబ్ ఛానళ్లను నియంత్రించే విధానం లేకపోవడంతో అయా ఛానళ్లు క్రిమినల్ కేసులపై ఇష్టానుసారంగా ప్రసారం చేస్తున్నాయని, ఇది పోలీసుల విచారణపై ప్రభావం చూపుతోందని అన్నారు. ఈ ఛానళ్ల నియంత్రణకు విధివిధానాలు రూపొందించేలా ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థించారు.

అభ్యర్థిత్వం రద్దుపై ఢిల్లీ హైకోర్టుకు ఖేద్కర్

వివాదాస్పద మాజీ ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అభ్యర్థిత్వాన్ని యూపీఎస్సీ రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆమె సమర్పించిన పిటిషన్ బుధవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. పూజా ఖేద్కర్.. మోసపూరితంగా ఓబీసీ, వికలాంగుల కోటాలో ఉద్యోగం పొందినట్లు ఆరోపణల నేపథ్యంలో ఏకసభ్య కమిషన్ నివేదిక మేరకు యూపీఎస్సీ ఆమె సభ్యత్వాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే.

మృత్యు కుహరాలుగా కోచింగ్ సెంటర్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: కోచింగ్ సెంటర్లు మృత్యు కుహరాలుగా మారాయని సోమవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అవి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయని విమర్శించింది. పాత రాజేందర్‌నగర్‌లోని రావ్స్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లోని బేస్‌మెంట్‌లో వరదల కారణంగా ముగ్గురు విద్యార్థులు మరణించిన ఘటనపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చింది. కోచింగ్ సెంటర్లలో భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని ఆదేశించింది. ఈ దుర్ఘటన అందరికీ కనువిప్పు కావాలని ఆకాంక్షించింది. మరోవైపు అన్ని కోచింగ్ సెంటర్లను తనిఖీ చేయాలంటూ 2023లో ఢిల్లీ హైకోర్టు అగ్నిమాపక శాఖను ఆదేశించడాన్ని సవాలు చేస్తూ కోచింగ్ సెంటర్ల అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా ధర్మాసనం పరిశీలించింది. ఇది పసలేని పిటిషన్ అని పేర్కొంటూ రూ.లక్ష జరిమానా విధించింది.



నేలకు ఒరిగింది

గోదారి గట్టుంది.. గట్టు మీన సెట్టుంది.' అంటూ అక్కినేని,సావిత్రి జంటగా నటించిన మూగ మనసులు' (1964) చిత్రంలో జమున పాడిన పాట మీకు గుర్తుంది కదూ. ఆ పాట ఎక్కడ తీశారో తెలుసా? తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి ఏటిగట్టుపై ఉన్న చెట్టు, పరిసర ప్రాంతాల్లో. అప్పటినుంచి దశాబ్దాలుగా ఈ వృక్షరాజం నీడన ఎన్నో చిత్రాల షూటింగ్స్ జరిగాయి. హీరో కృష్ణ నటించిన 'పాడిపంటలు', చిత్రంలో 'ఇరుసులేని బండి.. ఈశ్వరుని బండి' పాటలోనూ ఈ చెట్టు ప్రముఖంగా కనిపిస్తుంది. అక్కినేని నటించిన 'సీతారామయ్య గారి మనవరాలు' చిత్రంలో 'సమయానికి తగు మాటలాడి' పాటను కూడా ఈ చెట్టు దగ్గరే చిత్రీకరించారు. కళాతపస్వి విశ్వనాథ్ రూపొందించిన 'శంకరాభరణం' నుంచి లేటెస్ట్‌గా రామ్‌చరణ్ హీరోగా నటించిన 'రంగస్థలం' చిత్రం వరకూ మొత్తం 108 చిత్రాల్లోనూ కనిపించి, తనదైన పాత్ర పోషించింది. అగ్ర దర్శకులు, దాసరి, కె.రాఘవేంద్రరావు, జంధ్యాల, ఈవీవీ.. ఈ చెట్టు చుట్టూ తిరిగిన వారే. తమ సినిమాల్లో ఒక్క సీన్ అన్నా అక్కడ తీసేవారు. ఇక దర్శకుడు వంశీ సంగతి చెప్పనక్కర్లేదు. మొత్తం 18 చిత్రాల షూటింగ్స్‌ను ఆయన ఈ చెట్టు దగ్గరే తీశారు. ఈ ప్రాంతానికి వస్తే వంశీ తన మిత్రులతో కలిసి ఈ చెట్టు కింద కూర్చుని భోజనం కూడా చేసేవారని గ్రామస్తులు చెబుతున్నారు. అలా కాలక్రమంలో ఈ చెట్టుకు 'సినిమా చెట్టు' అనే పేరు వచ్చింది. ఈ చెట్టు వద్ద సినిమాలో ఒక్క షాట్ తీసినా సినిమా హిట్ అవుతుందనే నమ్మకం సినీ పరిశ్రమలో ఉంది అందుకే అగ్ర హీరోలు, దర్శకులు ఇక్కడి వచ్చి తమ సినిమాల్లో ఏదో ఒక సన్నివేశంలో 'సినిమా చెట్టు' కనిపించాలని ప్లాన్ చేసేవారు. మధ్యాహ్నం వేళలో ఈ చెట్టు కొమ్మలకు ఊయల కట్టి ఊగుతుంటే కింద గలగల పారే గోదావరి, చుట్టూ ప్రశాంత వాతావరణం... తన్మయత్వంతో శరీరం పులకరించిపోతుంది.



ఇంత చరిత్ర కలిగిన ఈ చెట్టు ఇప్పుడు నేలకొరిగింది. గోదావరి వరదలు, అధిక వర్షాలకు చెట్టు రెండుగా చీలి నేలకూలింది. గోదావరి వరద ఉధృతి వల్ల సినిమా చెట్టుకు ప్రమాదం పొంచి ఉందని, రక్షణ వలయం ఏర్పాటు చేసి పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని స్థానికులు, ప్రకృతి ప్రేమికులు ఎన్నో సార్లు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోలేదు. చివరకు అందరూ ఊహించినట్లుగానే జరిగింది. సోమవారం తెల్లవారుజామున సినిమా చెట్టు నేలకు ఒరిగిపోయింది.

నూట యాభై సంవత్సరాల చరిత్ర

ఈ సినిమా చెట్టు చరిత్ర, సెంటిమెంటు మాటల్లో చెప్పలేనిది. 150 సంవత్సరాల కిందట గ్రామానికి చెందిన శింగులూరి తాతబ్బాయి అనే వ్యక్తి నిద్ర గన్నేరు చెట్టు (సినిమా చెట్టు) నాటినట్లు స్థానికుల కథనం. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ చెట్టును కుమారదేవం గ్రామ ప్రజలు సంరక్షించుకుంటూ వస్తున్నారు. గోదావరి వరదలు వచ్చినప్పుడల్లా ఏటిగట్టు కోతకు గురవుతుంది. ఆ కోత చెట్టుకు ముప్పుగా మారింది. గత జూలై నెల 19వ తేదీ నుంచి గోదావరి నదికి వచ్చిన వరదలు, అధిక వర్షాలకు ఏటిగట్టు నానిపోయి ఉంది. దీంతో సోమవారం తెల్లవారుజామున సినిమా చెట్టు రెండు ముక్కలుగా వీడి కూలిపోయింది. ఇది నిద్ర గన్నేరు చెట్టు అయినప్పటికీ దీని కొమ్మలు గోదావరిలోకి పెరిగి ఉంటాయి. గోదావరి వరద పోటు, అధిక వర్షాలవల్లే ఈ చెట్టు కూలిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సినిమావాళ్లకు సెంటిమెంటుగా మారి గ్రామానికి పేరు తెచ్చిన ఈ చెట్టును కాపాడుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్నో వరదల్ని, తుఫానుల్ని తట్టుకుని తరతరాలను చూసుకుంటూ కుమారదేవం గ్రామానికి ఎంతో గుర్తింపు తెచ్చిన ఈ సినిమా చెట్టు కూలిపోవడం ప్రకృతి ప్రేమికులను, గ్రామస్థులను ఆవేదనకు గురిచేస్తోంది.

కొవ్వూరు, (ఆంధ్రజ్యోతి)

సీఎంగా ఉన్నప్పటి భద్రత ఇవ్వండి

- వ్యక్తిగత రక్షణ అధికారులను ఇవ్వాలి..
- హైకోర్టులో వైఎస్ జగన్ పిటిషన్



అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హోదాలో తనకు గతంలో ఉన్న భద్రతను పునరుద్ధరించాలని.. ఈ మేరకు ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తనకు పర్సనల్ సెక్యూరిటీ అధికారులు(పీఎస్‌వోలు), కౌంటర్ అసాల్ట్ టీములు, జామర్‌ను ఏర్పాటు చేసేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి హోదాలో కేంద్ర ప్రభుత్వం తనకు కల్పించిన జడ్ ప్లస్ సెక్యూరిటీని ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తగ్గించడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరారు. కేంద్ర హోం శాఖ కార్యదర్శి, రాష్ట్ర హోం శాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, నిఘా విభాగం ఐజీ, గుంటూరు ఎస్పీ, రాష్ట్ర స్థాయి సెక్యూరిటీ రివ్యూ కమిటీని తన పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు. '2019లో విశాఖ ఎయిర్ పోర్టులో నాపై కోడికత్తితో దాడి జరిగింది. రాష్ట్ర రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ముఖ్యమంత్రి కాకముందే నాకు ఉన్నత స్థాయి భద్రత కల్పించారు. నేను సీఎం అయ్యాక జడ్ ప్లస్ కేటగిరీ కింద 139 మందితో రక్షణ కల్పించారు. 2024 ఎన్నికల ఫలితాలు ప్రకటించి నెల గడవకముందే నాకున్న భద్రతా సిబ్బంది సంఖ్యను 59కి తగ్గించారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా రక్షణ తగ్గించడం సహజ న్యాయసూత్రాలను ఉల్లంఘించడమే. ఎన్నికల ప్రచారంలో నాపై రాయితో దాడి చేశారు. ఈ వ్యవహారంలో సంబంధిత వ్యక్తిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నా ఇల్లు, కార్యాలయం వద్ద భద్రతను పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం నాకు ఇద్దరు పీఎస్‌వోలు మాత్రమే ఉన్నారు. చాలా మంది ఎమ్మెల్యేలకు నాకంటే ఎక్కువ మంది పీఎస్‌వోలను ఇచ్చారు. పోలీసులు నాకిచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం కూడా ప్రయాణానికి అనుకూలంగా లేదు. అందులో ఏసీ పనిచేయడం లేదు. ఈ కారణంగా ఇటీవల ఓ పర్యటనను అర్థాంతరంగా రద్దు చేసుకోవలసి వచ్చింది. నన్ను భౌతికంగా లేకుండా చేస్తామని అధికార కూటమి నేతలు ప్రకటనలు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను కోర్టు ముందు ఉంచుతున్నాను. సీఎం హోదాలో నాకున్న జడ్ ప్లస్ భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ జూన్ 7న కేంద్ర హోం శాఖకు వినతి సమర్పించాం. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని జూన్ 3 వరకు నాకున్న భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలివ్వండి' అని జగన్ పిటిషన్‌లో కోరారు.

మూఢాలు పోయాయి... పెళ్లి ముహూర్తాలు వచ్చేశాయి

- రేపటి నుంచి 28 వరకూ...
- 11, 18 తేదీల్లోనే అత్యధిక పెళ్లిళ్లు

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పరస్పరం నచ్చేసి.. నిశ్చితార్థం కూడా జరిగిపోయి పెళ్లి కోసం ఎదురు చూస్తున్న అమ్మాయి, అబ్బాయిల కోసం శుభ ముహూర్తాలు వచ్చేశాయ్! ఆ ఇళ్లలో ఇక పెళ్లి బాజాలు మోగనున్నాయి. ముహూర్తాల కోసం వెళితే.. 'శుభ శ్రావణ మాసం.. శుభస్య శీఘ్రం' అంటూ పంతులు గారు మంచి రోజు నిర్ణయించేస్తారు! ఈ నెల.. అంటే ఆగస్టు 7 నుంచి 28 వరకు పెళ్లి ముహూర్తాలున్నాయి. పైగా మూడు నెలల తర్వాత వచ్చిన శుభ ఘడియలు! ఇవి తప్పిపోతే.. మళ్లీ అక్టోబరు 13 దాకా ముహూర్తాలే లేవు. దీంతో 7-28 తేదీల మధ్య తెలుగు రాష్ట్రాల్లో వేల సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. ఆగస్టు 7న శుభ ముహూర్తాలు మొదలవనుండగా.. పెళ్లిళ్లు మాత్రం 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28 తేదీల్లో జరగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 26న చైత్ర మాసంతో పాటు శుక్ర, గురు మూఢాలు మొదలయ్యాయి. తర్వాత వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ (మే, జూన్, జూలై)మాసాలు కావడంతో ముహూర్తాలు లేవు. అంటే.. ఈ ఏడాది ఏప్రిల్ 26 నుంచి వివాహాలకు అనువైన ముహూర్తాలు లేకపోవడంతో తెలుగు రాష్ట్రాల్లోని ఫంక్షన్ హాళ్లు, డెకరేషన్ వ్యాపారులకు పెద్దగా వ్యాపారం లేకుండా పోయింది. ఇప్పుడైతే ఇప్పటికే పెళ్లిళ్లు కుదుర్చుకున్న వారంతా ఫంక్షన్ హాళ్లు, డెకరేషన్స్ బుక్ చేసుకున్నారని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. అయితే అక్టోబరు 13 దాకా ఆగితే అక్కడి నుంచి వచ్చే ఉగాది దాకా పెళ్లి ముహూర్తాలే ఉన్నాయి. కాగా ప్రస్తుతం ఆగస్టులో దాదాపు 10 రోజుల పాటు మంచి ముహూర్తాలున్నా.. వాటిలో 11, 18 తేదీల్లో వివాహాలు ఎక్కువగా జరగనున్నాయి. 11వ తేదీ ఆదివారం, స్వాతి నక్షత్రం, సప్తమి రావడంతో ఇది చాలా విశేషమైన రోజుగా పరిగణిస్తారు. 18వ తేదీ కూడా ఆదివారం, శ్రవణ నక్షత్రం, చతుర్దశితో పాటు పౌర్ణమి రావడంతో విశిష్టమైన రోజుగా పండితులు చెబుతుండడంతో ఈ రోజున ఉండే ముహూర్తానికి కూడా మరింత డిమాండ్ ఉంది. అయితే ఈనెల 9న, ఆగస్టు 28న కూడా పెళ్లిళ్లు అధికంగా జరగనున్నాయి.

పారిస్ ఒలింపిక్స్ (జులై 26 - ఆగస్టు 11)



జర్మనీని జయించేనా?

హాకీలో భారత్ సెమీస్ పోరు నేడు
రాత్రి 10.30 నుంచి



పారిస్: నరాలు తెగే ఉత్కంఠ మధ్య అద్భుత విజయం సాధించిన భారత హాకీ జట్టు వరుసగా రెండో ఒలింపిక్ పతకంపై గురిపెట్టింది. మంగళవారం జరిగే సెమీఫైనల్లో చిరకాల ప్రత్యర్థి వరల్డ్ చాంపియన్ జర్మనీతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. టోక్యో క్రీడల్లో కాంస్యం అందుకున్న టీమిండియా.. ఈసారి ఎలాగైనా పతకం రంగు మార్చాలనే పట్టుదలతో ఉంది. 1980 మాస్కో క్రీడల్లో భారత్ చివరిసారి స్వర్ణం నెగ్గింది. ఫైనల్ చేరి చాంపియన్‌గా నిలవడానికి హర్మన్‌ప్రీత్ సింగ్ సేనకు ఇదో సువర్ణావకాశం. బ్రిటన్‌తో జరిగిన క్వార్టర్స్ పోరులో భారత జట్టు గొప్ప పోరాట ప్రతిభను ప్రదర్శించింది. అమిత్ రోహిదాస్ రెడ్‌కార్డ్‌కు గురవడంతో.. 40 నిమిషాలపాటు 10 మందితోనే ఆడినా బ్రిటన్‌ను 1-1తో నిలువరించింది. పెనాల్టీ షూటౌట్‌లో 4-2తో గెలిచింది. వెటరన్ గోల్ కీపర్ శ్రీజేష్ గోల్ పోస్టుకు అడ్డుగోడలా నిలిచాడు. 10 పెనాల్టీ కార్నర్‌లను సమర్థంగా అడ్డుకోవడమే కాకుండా షూటౌట్‌లో రెండు గోల్స్ ఆపి భారత్‌ను ఫైనల్-4కు చేర్చాడు. మరోవైపు వరల్డ్ నెం.4 జర్మనీ సెమీస్‌లో అర్జెంటీనాపై గెలిచింది. మైదానంలో మెరుపు వేగంతో కదిలే జర్మన్ ప్లేయర్ల నుంచి భారత్‌కు ఎప్పుడూ ప్రమాదమే. గత క్రీడల్లో కాంస్య పోరులో టీమిండియా చేతిలో 4-5తో ఓడిన జర్మనీ.. ఈసారి బదులు తీర్చుకోవాలనే కసితో ఉంది. అయితే, క్వార్టర్స్‌లో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొని ముందంజ వేసిన భారత్ పూర్తి ఆత్మ విశ్వాసంతో కనిపిస్తోంది.

అమిత్ అవుట్

భారత జట్టు కీలక డిఫెండర్ అమిత్ రోహిదాస్‌పై ఒక మ్యాచ్ వేటు పడింది. దీంతో సెమీస్‌కు అతడు దూరమయ్యాడు. సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని హాకీ ఇండియా చేసిన విజ్ఞప్తిని అంతర్జాతీయ హాకీ సమాఖ్య తోసిపుచ్చింది. బ్రిటన్‌తో మ్యాచ్‌లో అమిత్ స్టిక్.. ప్రత్యర్థి ఆటగాడి ముఖంపై తగలడంతో అతడికి రెడ్ కార్డ్ చూపించి బయటకు పంపారు. ఆ తర్వాత వీడియోను పరిశీలించిన జ్యూరీ.. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా రోహిదాస్‌పై ఒక మ్యాచ్ సస్పెన్షన్ వేటు వేసింది.

ఇక.. నీరజ్ వేట

నేడే జావెలిన్ త్రో క్వాలిఫికేషన్ రౌండ్

స్వర్ణ ఆశలు ఒక్కొక్కటిగా కొడిగడుతున్న వేళ.. భారత అభిమానుల కళ్లు వెదుకుతున్నది ఒక్కడినే. అతడే టోక్యో జావెలిన్ త్రో చాంపియన్ నీరజ్ చోప్రా. మంగళవారం జరిగే క్వాలిఫికేషన్ రౌండ్‌లో చోప్రా బరిలోకి దిగనున్నాడు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించిన చోప్రాపై భారీ అంచనాలున్నాయి. అర్హత రౌండ్ దాటితే గురువారం జరిగే ఫైనల్లో నీరజ్ స్వర్ణం కోసం తలపడనున్నాడు. ఒలింపిక్స్ జావెలిన్ త్రో ఈవెంట్ చరిత్రలో ఐదుగురు మాత్రమే టైటిల్ నిలబెట్టుకొన్నారు. మరి నీరజ్ వారి సరసన చేరతాడో? లేదో చూడాలి. జాకబ్ వాడ్లెచ్ (చెక్), జూలియన్ వెబర్ (జర్మనీ), మాజీ వరల్డ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ నుంచి చోప్రాకు గట్టిపోటీ ఎదురయ్యే చాన్సుంది. మరో భారత త్రోయర్ కిశోర్ జెనా కూడా బరిలో ఉన్నాడు. ఆసియాడ్‌లో 87.54 మీటర్ల దూరం త్రో చేసి నేరుగా మెగా క్రీడలకు అర్హత సాధించిన కిశోర్.. ఆ తర్వాత 80 మీటర్ల మార్క్‌ను కూడా దాటలేకపోవడం ఆందోళన కలిగించే విషయం.



టీటీ క్వార్టర్స్‌లో శ్రీజ బృందం

వ్యక్తిగత విభాగాల్లో నిరాశపరిచిన భారత టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఇప్పుడు టీమ్ ఈవెంట్లలో రాణించేందుకు సిద్ధమయ్యారు. మనికా బత్రా, తెలుగమ్మాయి ఆకుల శ్రీజ, అర్చనా కామత్‌లతో కూడిన భారత మహిళల జట్టు టీమ్ విభాగంలో క్వార్టర్‌ఫైనల్ చేరింది. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో భారత్ 3-2తో రొమేనియాను ఓడించింది. మొదట డబుల్స్‌లో శ్రీజ-అర్చన జోడీ.. తర్వాత సింగిల్స్ మనికా నెగ్గారు. ఆ తర్వాత వరుస సింగిల్స్‌లో శ్రీజ, అర్చన ప్రత్యర్థుల చేతిలో ఓడారు. దీంతో నిర్ణాయక ఆఖరి సింగిల్స్‌లో మనికా మ్యాచ్ గెలిచి భారత్‌కు క్వార్టర్స్ బెర్త్‌ను ఖరారు చేసింది. క్వార్టర్స్‌లో అమెరికా లేదా జర్మనీతో భారత్ తలపడనుంది.

400 మీటర్లలో రెపిచేజ్‌కు కిరణ్



భారత అథ్లెట్ కిరణ్ పాహల్ మహిళల 400 మీటర్ల రేసులో నేరుగా సెమీఫైనల్ చేరడంలో విఫలమైంది. సోమవారం జరిగిన తన హీట్‌లో కిరణ్ 52.51 సెకన్లలో గమ్యం చేరి ఏడోస్థానానికి పరిమితమైంది. మొత్తం ఆరు హీట్స్ నుంచి తొలి మూడు స్థానాల్లో నిలిచిన మొత్తం 18 మంది అథ్లెట్లు సెమీస్ చేరతారు. అయితే, నేరుగా సెమీస్ చేరకపోయినా తమ హీట్స్‌లో రేసు పూర్తి చేసిన మిగతా అథ్లెట్లకు రెపిచేజ్ రూపంలో పోటీపడే రెండో చాన్స్ ఉంటుంది. దీంతో రేసు పూర్తి చేయడంతో కిరణ్ రెపిచేజ్ హీట్స్ రౌండ్‌కు అర్హత సాధించింది. మంగళవారం జరిగే రెపిచేజ్ రౌండ్‌లో విజయం సాధిస్తే కిరణ్‌కు సెమీస్ బెర్త్ ఖరారవుతుంది.

అయ్యో.. నిషా!

గాయంతో క్వార్టర్స్‌లో ఓటమి



పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ పోటీల తొలిరోజే భారత్‌కు ఊహించని పరిణామం ఎదురైంది. మహిళల 68 ఫ్రీస్టయిల్ విభాగంలో నిషా దహియా పురోగమనానికి గాయం గండి కొట్టింది. సోమవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో నార్త్‌కొరియాకు చెందిన పాక్ సోల్ గమ్‌తో నిషా తలపడింది. ఆదినుంచి ప్రత్యర్థిని ఉడుంపట్టు పట్టిన దహియా ఓ దశలో 8-1తో బౌట్‌ను గెలుచుకొనే స్థితిలో నిలిచింది. మరో 90 సెకన్లలో పోటీ ముగుస్తుందనగా నిషా కుడి చేతికి తీవ్ర గాయం అయ్యింది. నొప్పిని తట్టుకోలేక ఆమె విలవిలాడింది. 'మెడికల్ బ్రేక్' తీసుకొని మళ్లీ ఆటలోకి అడుగుపెట్టింది కానీ..గాయం కారణంగా దహియా సరైన పట్టు పట్టలేకపోయింది. ఇదే అదనుగా విజృంభించిన కొరియా అమ్మాయి వరుసగా తొమ్మిది పాయింట్లు రాబట్టింది. నిజానికి బౌట్ ముగియడానికి 10 సెకన్ల ముందు స్కోరు 8-8తో సమంగా ఉంది. ఈ దశలో నిషా పెద్దగా ప్రతిఘటించలేకపోవడంతో సోల్ గమ్ బౌట్‌లో విజయం సాధించింది. అంతకుముందు జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్లో దహియా 6-4తో సోవా రిజ్కో (ఉక్రెయిన్)ను చిత్తు చేసి శుభారంభం అందుకుంది.

'లక్ష్యం' దూరంగానే..

కాంస్య పోరులో లక్ష్య సేన్ ఓటమి
స్కీట్ మిక్స్‌డ్ టీమ్‌లో మహేశ్వరి-అనంత్ కూడా



పురుషుల బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో తొలి ఒలింపిక్ పతకం ఊరిస్తూనే ఉంది. విక్టర్ అక్సెల్సెన్‌తో సెమీస్‌లో ఓడినా.. కాంస్య పోరులో లక్ష్య సేన్ పోడియం సాధిస్తాడని, తద్వారా మరో పతకం ఖాయమని క్రీడాభిమానులంతా ఆశ పడ్డారు. దీనికి తగ్గట్టుగానే తొలి గేమ్‌లో అదుర్స్ అనిపించుకోవడంతో కమాన్.. లక్ష్య అంటూ ఫ్యాన్స్ టీవీల ముందే అతుక్కుపోయారు. కానీ ప్రత్యర్థి లీ జి జియా పట్టు వదల్లేదు. తిరుగులేని స్మాష్‌లతో విరుచుకుపడి సేన్‌ను కట్టడి చేశాడు. ఇక, చేతి గాయం కూడా ప్రభావం చూపడంతో లక్ష్యకు పరాజయం తప్పలేదు. అటు షూటింగ్‌లోనూ స్కీట్ మిక్స్‌డ్ టీమ్ కాంస్య పోరులో మహేశ్వరి-అనంత్ జోడీ తృటిలో పతకం చేజార్చుకుంది.


విక్టర్ · కున్లావుట్ · లీ జి జియా


అన్ సే యంగ్

పారిస్: ఒలింపిక్స్‌లో పదో రోజూ భారత్ పతకం లేకుండానే ముగించింది. సోమవారం భారత్ బ్యాడ్మింటన్, షూటింగ్‌లలో రెండు కాంస్యాలపై గురి పెట్టింది. అయితే మెడల్ కోసం మన అథ్లెట్లు శక్తివంచన లేకుండా పోరాడినా ఫలితం దక్కలేదు. బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో సంచలన ప్రదర్శన కనబర్చిన లక్ష్యసేన్ కాంస్య పతక ప్లేఆఫ్‌లోనూ వెనుకబడ్డాడు. మలేసియా షట్లర్ లీ జి జియా చేతిలో 21-13, 16-21, 11-21 తేడాతో ఓడాడు. దీంతో బ్యాడ్మింటన్‌లో 12 ఏళ్లుగా పతకం సాధిస్తూ వస్తున్న భారత్.. ఈసారి మాత్రం రిక్తహస్తాలతో వెనుదిరిగింది. గతంలో సైనా (2012), సింధు (2016, 2021) వరుసగా మెడల్స్ సాధించారు. మరోవైపు పురుషుల సింగిల్స్ ఫైనల్లో డిఫెండింగ్ చాంప్ విక్టర్ అక్సెల్సెన్ (డెన్మార్క్) 21-11, 21-11తో కున్లావుట్ విటిడ్‌సర్న్ (థాయ్‌లాండ్)ను ఓడించి తన స్వర్ణాన్ని నిలబెట్టుకున్నాడు. మహిళల సింగిల్స్ ఫైనల్లో అన్ సే యంగ్ (కొరియా) 21-13, 21-16తో హే బింగ్‌జావో (చైనా)పై నెగ్గి స్వర్ణం అందుకుంది.

అవకాశం దక్కినా..

పురుషుల బ్యాడ్మింటన్‌లో భారత్‌కు తొలి ఒలింపిక్ పతకం అందించే అవకాశాన్ని యువ షట్లర్ లక్ష్య సేన్ చేజార్చుకున్నాడు. ఆత్మవిశ్వాసంతో కాంస్య పతక మ్యాచ్‌ను ఆరంభించిన సేన్ తొలి గేమ్‌లో సుదీర్ఘ ర్యాలీలు, డ్రాప్ షాట్లతో ఆధిక్యం చూపాడు. చివరకు 20 నిమిషాల్లోనే ఈ గేమ్‌ను 21-13తో ముగించాడు. ఆ తర్వాత గేమ్‌లోనూ సేన్ ఎలాంటి తడబాటు లేకుండా 8-3తో దూసుకెళ్లాడు. ఇక గెలుపే తరువాయి అనుకున్న తరుణంలో.. ఈ భారీ తేడాను లీ జిన్ అద్భుతంగా అధిగమించాడు. పవర్‌ఫుల్ రిటర్న్, బాడీ స్మాష్‌లతో పాటు సేన్‌ను కోర్టుకు ఇరువైపులా ఆడించడంతో వరుసగా 9 పాయింట్లతో 12-8తో నిలిచాడు. దీంతో డీలా పడిన సేన్ తిరిగి కోలుకోలేకపోయాడు. ఇక చివరి గేమ్‌లోనూ లక్ష్య 2-8తో వెనుకబడడంతో ఒత్తిడికి లోనయ్యాడు. చూస్తుండగానే ప్రత్యర్థి ఆధిక్యం 15-7కు వెళ్లడంతో చేసేదేమీ లేకపోయింది. చివరకు బాడీ స్మాష్‌ను రిటర్న్ చేయలేక మ్యాచ్‌ను సైతం కోల్పోయాడు. మరోవైపు ఈ పోరులో సేన్ మూడుసార్లు తన కుడి చేతి గాయానికి బ్యాండేజీ వేసుకోవాల్సి వచ్చింది. రెండో గేమ్‌లో అతడి మోచేతి నుంచి రక్తం కారడంతో చికిత్స చేసుకోవాల్సి వచ్చింది. ఇదంతా అతడి లయపై ప్రభావం పడింది.

స్కీట్‌లో ఒక్క పాయింట్‌తో..





స్కీట్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత్‌కు ఒక్క పాయింట్ తేడాతో కాంస్యం చేజారింది. షూటర్లు మహేశ్వరి చౌహాన్-అనంత్ జీత్ సింగ్ జోడీ 43-44 తేడాతో నాలుగో స్థానంలో నిలిచింది. చైనా ద్వయం యిటింగ్ జియాంగ్-జియాన్లిన్ కాంస్యం గెల్చుకుంది. అలాగే ఈ గేమ్స్‌లో భారత షూటింగ్ ప్రస్థానం కూడా ముగిసింది. మెడల్ రౌండ్ తొలి స్టేషన్‌లో చైనా షూటర్లు ఇద్దరూ నాలుగుకి నాలుగు షాట్లతో 8 పాయింట్లు సాధించగా, భారత్ ఏడు మాత్రమే సాధించింది. అయితే మూడో స్టేషన్ వరకు స్కోరు 20-20గా మారడంతో పోటీ ఉత్కంఠకు చేరింది. కానీ ఆ తర్వాత మహేశ్వరి ఒక షాట్ మిస్ కావడంతో స్కోరు 27-28తో చైనాకు అనుకూలంగా మారింది. ఇక చివరి రెండు స్టేషన్లలోనూ ఇరు దేశాల షూటర్లు అన్ని షాట్లను గురి చూసి కొట్టినప్పటికీ ఆ పాయింట్ తేడా అలాగే ఉండిపోయి భారత్ ఓడింది. అంతకుముందు రెండు రోజుల పాటు సాగిన క్వాలిఫికేషన్ పోటీల్లో ఐదు రౌండ్ల అనంతరం భారత్, చైనా 146 స్కోరు చేయడంతో షూటాఫ్ అనివార్యమైంది. ఇందులో 4-3తో గెలిచిన చైనా మూడో స్థానం, భారత్‌కు నాలుగో స్థానం దక్కడంతో కాంస్యం కోసం పోటీపడ్డాయి.

స్టీపుల్ చేజ్ ఫైనల్లో అవినాశ్ సబ్లే

పారిస్: వ్యక్తిగత విభాగాలలో నిరాశాజనక ప్రదర్శనతో భారత అథ్లెట్లంతా ఉసూరుమనిపిస్తున్న వేళ..అవినాశ్ సబ్లే పతకంపై ఆశలు రేపాడు. పురుషుల మూడువేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో సబ్లే ఫైనల్‌కు దూసుకు పోయాడు. తద్వారా ఈ విభాగంలో ఫైనల్‌కు చేరిన తొలి భారత ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. సోమవారం జరిగిన హీట్స్‌లో..11 మంది తలపడిన రెండో హీట్‌లో అవినాశ్ బరిలో దిగాడు. ఎనిమిది నిమిషాల 15.43 సెకన్ల టైమింగ్‌తో గమ్యం చేరాడు. ఐదో స్థానంలో నిలవడం ద్వారా ఫైనల్‌కు అర్హత సాధించాడు. మొత్తం మూడు హీట్స్‌లో..ఒక్కో హీట్‌లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన అథ్లెట్లు ఫైనల్‌కు క్వాలిఫై అయ్యారు. ఫైనల్ ఈనెల ఎనిమిదిన జరగనుంది.


అవినాశ్

పారిస్‌లో నేటి భారతం



టేబుల్ టెన్నిస్: పురుషుల టీమ్ ప్రీక్వార్టర్‌ఫైనల్ - భారత్ x చైనా (మ. 1.30).
అథ్లెటిక్స్: పురుషుల జావెలిన్ త్రో క్వాలిఫికేషన్స్ - కిషోర్ జెనా (మ. 1.50), నీరజ్ చోప్రా (మ. 3.20), మహిళల 400మీ. రెపిచేజ్: కిరణ్ పాహల్ (మ. 2.50).
రెజ్లింగ్: మహిళల 50 కిలోల ప్రీక్వార్టర్స్-వినేశ్ ఫొగట్ x యు సుసాకి(జపాన్) (మ. 2.30).
హాకీ సెమీఫైనల్: భారత్ x జర్మనీ (రా. 10.30).

ముగింపు వేడుకల్లో పతాకధారిగా మను భాకర్



పారిస్: ఈ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు కొల్లగొట్టి చరిత్ర సృష్టించిన యువ షూటర్ మను భాకర్‌కు అరుదైన గౌరవం దక్కనుంది. వచ్చే ఆదివారం జరిగే విశ్వక్రీడల ముగింపు వేడుకల్లో భారత అథ్లెట్ల మహిళల బృందానికి పతాకధారిగా వ్యవహరించనుంది. ఫ్లాగ్ బేరర్‌గా మనును ఎంపిక చేసినట్టు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధికారి సోమవారం వెల్లడించారు. అయితే, పురుషుల బృందానికి పతాకధారి ఎవరన్నది ఐఓఏ త్వరలోనే ప్రకటించనుంది. ఆరంభ వేడుకల్లో భారత పతాకధారులుగా షట్లర్ పీవీ సింధు, టీటీ వెటరన్ స్టార్ శరత్ కమల్ వ్యవహరించిన సంగతి తెలిసిందే.

బైల్స్‌కు షాకిచ్చిన రెబెకా

నాలుగు పతకాలతో ముగించిన సిమోన్


సిమోన్ బైల్స్


రెబెకా అండ్రాడే

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌ను స్వర్ణ పతకంతో ముగించాలన్న అమెరికా సూపర్ స్టార్ జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్ ఆశ నెరవేరలేదు. పోటీలలో చివరిదైన ఫ్లోర్‌ఎక్సర్‌సైజ్ ఫైనల్లో సిమోన్ రజతానికే పరిమితమైంది. బ్రెజిల్ జిమ్నాస్ట్ రెబెకా అండ్రాడే (14.166) స్వర్ణం ఎగరేసుకుపోయింది. తద్వారా ప్రధాన అంతర్జాతీయ టోర్నమెంట్ల ఫ్లోర్‌ఎక్సర్‌సైజ్ విభాగంలో బైల్స్‌ను ఓడించిన జిమ్నాస్ట్‌గా అండ్రాడే నిలిచింది. అయితే కొద్ది తేడాతో (14.133 పాయింట్లు) బైల్స్ రజత పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ పోటీలో బైల్స్ ఒకటి రెండు తప్పులు చేయడం ఆమె స్వర్ణ పతక అవకాశాలకు గండి కొట్టింది.. బైల్స్ సహచరి జోర్డాన్ చైల్స్ (13.766) కాంస్య పతకం అందుకుంది అయితే తొలుత జరిగిన బ్యాలెన్స్‌బీమ్ ఫైనల్లో 27 ఏళ్ల సిమోన్ విన్యాసాలు చేసే క్రమంలో కిందపడిపోయింది. దాంతో పోటీని తిలకిస్తున్న వారంతా ఖిన్నులయ్యారు. ఫలితంగా 13.100 పాయింట్లతో సహచరి సునిసా లీతో సమంగా బైల్స్ నాలుగో స్థానంలో నిలిచింది. దరిమిలా ఈ విభాగంలో బైల్స్‌కు పతకం మిస్సయింది. ఇటలీకి చెందిన అలైస్ డి అమాటో (14.366) స్వర్ణం, ఝౌ యాక్విన్ (చైనా, 14.100) రజతం, మనీలా ఎస్పోసిటో (ఇటలీ, 14.000) కాంస్య పతకం దక్కించుకున్నారు. ఇక..బైల్స్ పారిస్ ఒలింపిక్స్‌ను నాలుగు పతకాలతో ఘనంగా ముగించింది. ఇందులో ఆర్టిస్టిక్ టీమ్, వ్యక్తిగత ఆల్ రౌండ్, వాల్ట్ విభాగాల్లో బైల్స్ స్వర్ణ పతకాలు సాధించింది. కాగా..ఈ క్రీడల్లో గెలుపొందిన నాలుగింటితో కలిపి ఒలింపిక్స్‌లో బైల్స్ ఓవరాల్ పతకాల సంఖ్య 11కి చేరింది.

క్లైంబింగ్‌లో మిరోస్లావా ప్రపంచ రికార్డు

మహిళల క్లైంబింగ్ స్పీడ్ ఈవెంట్‌లో అలెగ్జాండ్రా మిరోస్లావ్ (పోలెండ్) తన ప్రపంచ రికార్డును తానే అధిగమించింది. తొలి క్వాలిఫికేష్ రౌండ్‌ను మిరోస్లావ్ 6.21 సెకన్ల టైమింగ్‌తో పూర్తి చేసి నయా రికార్డును నెలకొల్పింది. గతేడాది రోమ్‌లో యూరోపియన్ క్వాలిఫయర్స్‌లో తాను నెలకొల్పిన వరల్డ్ రికార్డును 0.03 సెకన్ల తేడాతో బద్దలుకొట్టింది.


అలెగ్జాండ్రా మిరోస్లావ్

పతకాల పట్టిక



దేశం	స్వ	ర	కా	మొ
చైనా	21	17	14	52
అమెరికా	19	29	27	75
ఆస్ట్రేలియా	13	11	8	32
ఫ్రాన్స్	12	15	18	45
బ్రిటన్	11	13	17	41
కొరియా	11	8	7	26
జపాన్	10	5	11	26
ఇటలీ	9	10	6	25
జర్మనీ	6	5	4	15
నెదర్లాండ్స్	6	5	4	15
భారత్	0	0	3	3

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

బిడ్డను మోస్తూనే.. బాణాలు సంధించా


రమజనోవా

చాలా మంది అథ్లెట్లు.. పారిస్ ఒలింపిక్స్‌లో తాము చేసిన ఫీట్లు, సాధించిన విజయాలతోపాటు పలు ఆసక్తికర వార్తలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. ఈజిప్ట్ ఫెన్సర్ నాడా హఫీజ్ ఏడు నెలల గర్భంతోనే బరిలోకి దిగిన సంగతి తెలిసిందే. 'పోటీలో ఇద్దరు కాదు.. వాస్తవంగా ముగ్గురున్నారు. నేను, నా ప్రత్యర్థితోపాటు.. ఇంకా లోకం చూడని నా బిడ్డ' అని తన మ్యాచ్ ఫొటోను ఆమె షేర్ చేసింది. కాగా, నాడాతో పాటు మరో గర్భిణి కూడా పారిస్ క్రీడల బరిలోకి దిగింది. ఆమే అజర్‌బైజాన్‌కు చెందిన ఆర్చర్ రమజనోవా. ఆరున్నర నెలల గర్భంతో తాను బాణాలను సంధించానని రమజనోవా వెల్లడించింది. 'ఓ షాట్ కొట్టేటప్పుడు.. పొట్టలో బిడ్డ చిన్నగా తన్నినట్టనిపించింది. అయితే, అప్పుడు 10 పాయింట్లు సాధించా' అని ఇన్‌స్టాలో రాసుకొచ్చింది. ఆర్చరీ వ్యక్తిగత విభాగంలో పోటీపడ్డ రజనోవా ప్రీక్వార్టర్స్‌లో ఓడింది. ఫెన్సర్ నాడా హఫీజ్ రెండోరౌండ్లోనే వెనుదిరిగింది. అయితే, పతకం గెలవకపోయినా.. తమ ఆటతీరుతో, అంకిత భావంతో ఈ అథ్లెట్లు క్రీడాలోకం ప్రశంసలందుకుంటున్నారు. బిడ్డను మోస్తున్నా.. ఎంతో ధైర్యంగా హద్దులను చెరిపేస్తున్నారని ఓ నిపుణుడు అభిప్రాయపడ్డాడు. గర్భంతో ఉంటే కఠినమైన పనులు చేయకూడదనే భయాలను వీరు దూరం చేస్తున్నారని అన్నాడు.

'డబుల్'పై నోవా నజర్



సెయింట్ డెనిస్ (ఫ్రాన్స్): పారిస్ ఒలింపిక్స్ పురుషుల 100 మీ. స్ప్రింట్ టైటిల్ సొంతం చేసుకున్న అమెరికా స్టార్ నోవా లైల్స్ ఇప్పుడు 200 మీ. పరుగుపైనా కన్నేశాడు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన 100 మీ. రేసులో లైల్స్ (9.79 సె.) స్వర్ణం గెలిచిన సంగతి తెలిసిందే. జమైకా అథ్లెట్ కిషానె థాంప్సన్ (9.79 సె. ఫొటో ఫినిష్) రజతం, ఫ్రెడ్ కెర్లీ (అమెరికా, 9.81 సె.) కాంస్యం సాధించారు.

ఇంగ్లండ్ మాజీ బ్యాటర్ థోర్ప్ మృతి



లండన్: ఇంగ్లండ్, సర్రే మాజీ బ్యాటర్ గ్రాహమ్ థోర్ప్ సోమవారం మరణించాడు. 55 ఏళ్ల థోర్ప్ 2022 నుంచి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అయితే ఆ సమస్య ఏమిటనేదిమాత్రం తెలియరాలేదు. ఆ ఏడాది అతడు అఫ్ఘానిస్థాన్ జట్టు కోచ్‌గా నియమితుడయ్యాడు. కానీ హఠాత్తుగా అనారోగ్యం పాలవడంతో ఆ బాధ్యతలు చేపట్టలేదు. స్టయిలిష్ బ్యాటర్‌గా పేరు గాంచిన గ్రాహమ్ 1993 నుంచి 2005 మధ్య ఇంగ్లండ్ తరఫున 100 టెస్టులు ఆడాడు. 16 సెంచరీలతో 6744 రన్స్ చేశాడు. 82 వన్డేలలో 2380 రన్స్ చేశాడు. రిటైర్మెంట్ అనంతరం అతడు ఇంగ్లండ్ జట్టు బ్యాటింగ్ కోచ్‌గా పని చేశాడు.

గుడ్ ఫుడ్

అరటి ఆకుల్లో ఆరోగ్యం

అరిటాకులో భోంచేస్తాం. అరిటాకులో చుట్టి ఆవిరి మీద ఉడికించుకుంటాం. ఈ అలవాటులో ఎన్నో ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయి. మరీ ముఖ్యంగా దక్షిణ భారత దేశంలోని సంప్రదాయ వంటకాల్లో, పాకశాస్త్రంలో అరటి ఆకులు ప్రధాన పాత్రను పోషిస్తూ ఉంటాయి. ఇందుకు కారణం అరటిఆకుల్లో ఆరోగ్యాన్ని పెంచే పోషకాలు దాగి ఉండడమే! అయితే అరటిఆకుల్లోని సుగంధభరితమైన పాలిఫినాల్స్ మన శరీరానికి అందాలంటే అరటి ఆకుల్లో భోజనం చేస్తే సరిపోదు. ఆ ఆకుల్లో పదార్థాలను ఉంచి, ఆవిరి మీద ఉడికించాలి. అరటి ఆకులు కలిగి ఉండే మైనపు ఆకృతి, నిర్దిష్టమైన రుచి, అత్యధిక పీచు వల్ల అవి తినడానికి పనికిరాకపోవచ్చు. ఒకవేళ తిన్నా మన శరీరంలో సెల్యులోజ్ ఉండదు కాబట్టి ఆ ఆకులు జీర్ణం కావు. కాబట్టి అరటిఆకుల్లోని ఆరోగ్యకరమైన పోషకాలను పొందడం కోసం ఆ ఆకుల్లో పదార్థాలను వండుకునే విధానాన్ని అలవాటు చేసుకోవాలి. మోమోస్, మోడక్స్ చేపలు



మొదలైన పదార్థాలను ఆవిరి మీద వండి తినడానికి అరటి ఆకులు వీలుగా ఉంటాయి. గోవా, పార్సీ వంటకాలు ఎక్కువగా ఈ విధంగానే తయారవుతూ ఉంటాయి. చైనీస్ వంటకాల్లో కూడా కొన్ని మాంసపు రెసిపీలను అరటి ఆకుల్లోనే వండుతూ ఉంటారు. అయితే వంట కోసం ఉపయోగించే ఆకులు తాజాగా, లేతగా ఉండాలి. వాటిని శుభ్రం చేసి ఉపయోగించుకోవాలి.

ఆరోగ్య ప్రయోజనాలు

అరటి ఆకుల్లో వండిన వంటకాలకు మధుమేహంతో పోరాడే గుణాలు సమకూరతాయని పరిశోధనల్లో తేలింది. అలాగే అరటి ఆకుల్లో వండడం వల్ల ఆ ఆకుల నుంచి విడుదలయ్యే పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్ ఆహారంలో కలుస్తాయి. దాంతో యాంటీఆక్సిడెంట్ ప్రయోజనాలను పొందవచ్చు. వీటి వల్ల మధుమేహం, కేన్సర్, గుండె జబ్బులకు కొంత మేరకు అడ్డుకట్ట వేయవచ్చు.

ఇలా వండుకోవచ్చు

ఆరటి ఆకుల్లో చుట్టిన పదార్థాలను గ్రిల్ చేసుకోవచ్చు. స్టీమ్, డీప్ ఫ్రై కూడా చేసుకోవచ్చు. కూరలు, అన్నం, కూరగాయలు వీటన్నిటినీ అరటి ఆకుల్లో చుట్టి వండుకోవచ్చు. ఇడ్లీ పాత్రల్లో అడుగున అరటి ఆకులను ఉంచి, పిండి నింపి ఇడ్లీలను వండుకోవచ్చు. ఇలా ఇడ్లీల కోసమే కాకుండా, ఢోక్లాలను కూడా ఆవిరి మీద వండుకోవచ్చు. గుజరాతి వంటకమైన పాంకి కోసం, అరటి ఆకుల మీద పాంకి పిండి పోసి, వేడి పెనం మీద నూనె వేసి కాల్చుకుంటారు. గ్రిల్ చేసిన తర్వాత ఆకులను తీసేసి పాల్కిలను తినొచ్చు. ఇలా గ్రిల్ చేయడం వల్ల అరటిఆకుల్లోని పోషకాలు వంటకంలోని చేరతాయి. వియత్నాంలో కూరగాయలు, బియ్యం, మాంసం వంటకాల తయారీ కోసం ఆయా పదార్థాలను అరటి ఆకుల్లో ఉంచి ఉడికిస్తారు. అలాగే బార్బిక్యూలో తయారీలో మ్యాట్‌గా కూడా అరటి ఆకులను వాడుకోవచ్చు.

థ్రాంబోసిస్

కాళ్లు నొప్పులు, వాపులు కనిపిస్తే, కాళ్లకు రెస్ట్ ఇవ్వాలి అనుకుంటాం. కానీ ఇవే లక్షణాలు రక్తనాళాల్లో రక్తపు గడ్డలకు కూడా సూచనలే! ఊహాకందని విషమ పరిస్థితికి దారితీసే ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదంటున్నారు వైద్యులు.

ఆ వాపులు విషమం కావచ్చు



కాళ్లు వాస్తూ ఉంటాయి. నొప్పులు కూడా వేధిస్తూ ఉంటాయి. సాధారణంగా ఇలాంటి పరిస్థితిలో ఎక్కువ దూరం నడిచాం లేదంటే ఎక్కువ సేపు నిలబడి ఉన్నాం కాబట్టి కాళ్లు అలసిపోయి వాచి ఉంటాయనో, నొప్పి పెడుతున్నాయనో సరిపెట్టుకుంటూ ఉంటాం! వేడి నీళ్లలో కాళ్లను ముంచి ఉంచడం, కాపడం పెట్టడం లేదా నొప్పి మందులు వేసుకోవడం లాంటివి చేస్తూ ఉంటాం. కానీ ఈ సమస్యను 'థ్రాంబోసిస్'గా అనుమానించి వెంటనే వైద్యులను సంప్రతించాలి. కాళ్లలోని రక్తనాళాల్లో రక్తపు గడ్డలు ఏర్పడే పరిస్థితి ఇది. ఈ సమస్య నొప్పి, వాపుతో మొదలైనా పరిస్థితి తీవ్రమయ్యే కొద్దీ నడక కష్టమవుతుంది. కాలు నీలం రంగులోకి మారిపోతుంది. మరింత ఆలస్యం చేస్తే, రక్తనాళంలో ఏర్పడిన రక్తపు గడ్డ పగిలి, ఊపిరితిత్తులకు చేరుకుని 'పల్మోనరీ ఎంబాలిజం' అనే ప్రాణాంతక పరిస్థితి ఏర్పడుతుంది. ఆ సమయంలో ఊపిరితీసుకోలేకపోవడం, వేగంగా ఊపిరితీసుకుంటూ ఉండడం, గుండెవేగం పెరగడం, రక్తంలో ఆక్సిజన్ స్థాయులు తగ్గిపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.



అపోహలు - వాస్తవాలు

థ్రాంబోసిస్‌కు గురైనవాళ్లు పూర్తిగా బెడ్‌రెస్ట్‌కే పరిమితం కావాలని అనుకుంటూ ఉంటారు. కానీ ఇది అపోహ మాత్రమే! ఎక్కువ వాపు ఉంటే రెండు మూడు రోజుల పాటు విశ్రాంతి తీసుకుని, చికిత్స పూర్తయిన వెంటనే నడవడం మొదలుపెట్టాలి. నడవడం వల్ల రక్తపు గడ్డ ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోతుందని అనుకుంటారు. కానీ నిజానికి రక్తపు గడ్డ కాలికే పరిమితం కావాలంటే బెడ్‌రెస్ట్ తగ్గించి, నడుస్తూ ఉండాలి.

వీళ్లకే ముప్పు ఎక్కువ

రక్తపు గడ్డలు ఏర్పడే లక్షణం వంశపారంపర్యంగా సంక్రమించిన వ్యక్తులు, ఊబకాయులు, గర్భంతో ఉన్నప్పుడు బరువు పెరిగే మహిళలు, తుంటి, మోకీళ్ల మార్పిడి చేయించుకున్న వ్యక్తులు, కేన్సర్ రోగులు, తీవ్ర గాయాల బారిన పడినవాళ్లు, గుండెపోటు లాంటి ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిపాలైనవాళ్లు డీప్ వెయిన్ థ్రాంబోసిస్‌కు గురవుతూ ఉంటారు.

చికిత్స తీవ్రత ఆధారంగా...

కాళ్లు, చేతుల్లో థ్రాంబోసిస్‌లను అల్ట్రాసౌండ్, కలర్ డాప్లర్‌తో నిర్థారించుకోవచ్చు. డీడైమర్ అనే రక్తపరీక్షతో కూడా ఈ సమస్యను నిర్థారించుకోవచ్చు. మెదడులో రక్తపు గడ్డలను ఎమ్మారైతో, పొట్టలో ఏర్పడిన రక్తపు గడ్డను సిటి స్కాన్‌తో, ఒకవేళ రక్తపు గడ్డ ఊపిరితిత్తుల్లో చేరుకుందని అనుమానం వస్తే సిటి యాంజియోతో వైద్యులు నిర్థారించుకుంటారు. థ్రాంబోసిస్ ఉన్నవాళ్లకు యాంటీ కాగ్యులెంట్(రక్తాన్ని పలుచన చేసే మందులు) మందుల వాడకం వెంటనే మొదలుపెట్టవలసి ఉంటుంది. తర్వాత అందించే చికిత్స రోగి వ్యక్తి, సమస్య తీవ్రతల ఆధారంగా కొనసాగించవలసి ఉంటుంది.


- స్వల సమస్య: కాళ్లలో థ్రాంబోసిస్ సమస్య స్వల్పంగా ఉండే, యాంటీ కాగ్యులెంట్స్‌తో పాటు స్టాకింగ్స్ వాడుకోవలసి ఉంటుంది.
- తీవ్ర సమస్య: రక్తపు గడ్డను తొలగించే సర్జరీ చేయవలసి ఉంటుంది. వెయిన్‌లోకి చేరుకుని, రక్తపు గడ్డను కరిగించే మందును ఇంజెక్ట్ చేయడం, క్యాథెటర్ ద్వారా రక్తపు గడ్డను పీల్చి బయటకు రప్పించడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చు. సర్జరీ తర్వాత కూడా ఆరు నెలల పాటు యాంటీ కాగ్యులెంట్స్ వాడుకోవలసి ఉంటుంది. స్టాకింగ్స్ కూడా వాడుకోవలసి ఉంటుంది. సర్జరీ తర్వాత, పోస్ట్ థ్రాంబాటిక్ సిండ్రోమ్ సమస్య తలెత్తదు.
- సర్జరీ తర్వాత: వైద్యులు సూచించినంత కాలం యాంటీ కాగ్యులెంట్స్, స్టాకింగ్స్ వాడుకోవాలి. ఇతరత్రా వైద్య సమస్యల కోసం వైద్యులను కలిసినప్పుడు థ్రాంబోసిస్ సమస్యను వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి.

ముందుచూపుతో...

అప్పటికే థ్రాంబోసిస్ సమస్య ఉండి, ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో ఐసియులో చేరవలసి వచ్చినవాళ్లు, సర్జరీ చేయించుకోబోతున్నవాళ్లు, ఊబకాయులు, కుటుంబ చరిత్రలో థ్రాంబోసిస్ ఉన్నవాళ్లు ముందస్తుగానే వైద్యులకు ఆ విషయాన్ని తెలియపరచాలి. ఇలా చేయడం వల్ల తర్వాతి కాలంలో థ్రాంబోసిస్ తలెత్తకుండా వైద్యులు అవసరమైన నివారణ చర్యలను చేపడతారు. ఈ కోవకు చెందిన వాళ్లు థ్రాంబోసిస్ బారిన పడకుండా ఉండడం కోసం సరిపడా నీళ్లు తాగుతూ డీహైడ్రేషన్‌కు గురి కాకుండా చూసుకోవాలి. డయేరియాకు గురి కాకుండా చూసుకోవాలి.

నివారణ మన చేతుల్లోనే

- బరువును నియంత్రణలో ఉంచుకోవడం
- కుటుంబ చరిత్రలో థ్రాంబోసిస్ ఉన్నవాళ్లు ఆ సమస్యను వైద్యుల దృష్టికి తీసుకువెళ్లడం
- డీహైడ్రేషన్‌కు గురి కాకుండా చూసుకోవడం
- కాళ్ల వాపులు, నొప్పులను నిర్లక్ష్యం చేయకపోవడం



విమాన ప్రయాణాల్లో...

థ్రాంబోసిస్ సమస్య ఉన్నవాళ్లు నాలుగు గంటలకు మించి విమాన ప్రయాణాలు చేసే సమయాల్లో థ్రాంబోసిస్ తలెత్తే అవకాశాలుంటాయి. కాబట్టి 60 ఏళ్ల వయసున్న థ్రాంబోసిస్ ముప్పు ఉన్న వ్యక్తులు ట్రావెల్ స్టాకింగ్స్ వాడుకోవడం తప్పనిసరి. మద్యం తీసుకోకూడదు. నీళ్లు ఎక్కువగా తాగుతూ ఉండాలి. అలాగే విమాన ప్రయాణం చేస్తున్నంత కాలం తరచూ లేచి నడుస్తూ ఉండాలి.

పోస్ట్ థ్రాంబాటిక్ సిండ్రోమ్

థ్రాంబోసిస్ సమస్యను చికిత్సతో సరిదిద్దిన తర్వాత కాళ్లలో తలెత్తే వీలున్న సమస్య ఇది. కాళ్లలో వాపు, రంగు మారడం, కాలిగిలకలు నల్లబడడం, పుండు ఏర్పడడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సమస్య తలెత్తకుండా ఉండడం కోసం వైద్యులు సూచించినంత కాలం స్టాకింగ్స్ వాడుకోవాలి.

కాళ్లతో పాటు చేతుల్లో కూడా థ్రాంబోసిస్ తలెత్తవచ్చు. అప్పుడు కూడా వాపు, నొప్పి ఉంటాయి. ఇదే సమస్య పొట్టలో ఏర్పడితే పొట్టలో నొప్పి, వాపు కనిపిస్తాయి. ఇదే సమస్య మెదడులో కూడా ఏర్పడవచ్చు. ఇలాంటప్పుడు తీవ్రమైన తలనొప్పి ప్రధాన లక్షణంగా ఉంటుంది.



• డాక్టర్ పి.సి. గుప్తా,
- క్లినికల్ డైరెక్టర్,
హెచ్ఒడి వాస్క్యులర్ అండ్ ఎండోవాస్క్యులర్ సర్జరీ,
కేర్ హాస్పిటల్స్, హైదరాబాద్.

కాంటాక్ట్ లెన్సెస్ ఇలా...

కాంటాక్ట్ లెన్స్ వాడకం పెరుగుతోంది. అయితే తగిన జాగ్రత్తలు పాటించకపోతే కార్నియా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. కాబట్టి వాటినెలా సురక్షితంగా వాడుకోవాలో తెలుసుకుందాం!



- **చేతుల శుభ్రత** : కాంటాక్స్ లెన్స్ పెట్టుకోబోయే ముందు, తొలగించే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. కాంటాక్ట్ లెన్స్‌లను కళ్లలో ఉంచేసుకుని నిద్రపోకూడదు.
- **లెన్స్ శుభ్రత**: కాంటాక్ట్ లెన్సెస్ తొలగించిన తర్వాత, వాటిని కాంటాక్ట్ లెన్స్ సొల్యూషన్‌తో శుభ్రం చేసుకోవాలి. ఆ సొల్యూషన్‌ను ప్రతి రోజూ మారుస్తూ ఉండాలి. కాంటాక్ట్ లెన్స్‌లను ప్రతిరోజూ వాడినా, వాడకపోయినా, వాటిని శుభ్రపరిచే సొల్యూషన్‌ను ప్రతి రోజూ మారుస్తూనే ఉండాలి.
- **మేకప్‌కు ముందు**: మేకప్‌ను అప్లై చేయక ముందే కాంటాక్ట్ లెన్స్ పెట్టుకోవాలి. అలాగే మేకప్ తొలగించిన తర్వాతే లెన్స్‌ను తొలగించాలి. కనుకొలకల్లో గ్లిట్టర్, ఐలైనర్‌లను వాడుకోకూడదు.
- **పరిమితి మేరకే**: వైద్యులు సూచించినంత సమయం మేరకే కాంటాక్ట్ లెన్స్ ధరించాలి. అలాగే ఒక జత కళ్లజోడును ఎప్పుడూ వెంట ఉంచుకోవాలి.
- **కళ్ల ఇరిటేషన్**: కళ్లు మండుతున్నా, దురదలుగా ఉన్నా కాంటాక్ట్ లెన్స్ పెట్టుకోకూడదు. కాంటాక్ట్ లెన్స్ పెట్టుకున్న వెంటనే కళ్లు ఎర్రబడి, చూపు మసకబారితే ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి.



బ్లాక్ మండే

రూ.15.32 లక్షల కోట్ల సంపద ఉఫ్

చిన్న, మధ్య స్థాయి షేర్లు విలవిల

ప్రపంచ మార్కెట్లతో పాటు కుప్పకూలిన దేశీయ స్టాక్ సూచీలు

- సెన్సెక్స్ 2,222 పాయింట్లు పతనం
- 79,000 దిగువ స్థాయికి సూచీ
- 662 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
- 24,000 స్థాయికి ఇండెక్స్



- 4.21% క్షీణించిన బీఎస్ఈ స్మాల్‌క్యాప్
- బీఎస్ఈ మిడ్‌క్యాప్ 3.6 శాతం డౌన్
- 2 రోజుల్లో రూ.19 లక్షల కోట్లు ఫట్
- అమెరికా ఆర్థిక మాంద్యం భయాలు, జపాన్ వడ్డీ పోటే ప్రధాన కారణాలు
- 12.4 శాతం పడిన జపాన్ నిక్కీ ఇండెక్స్

మహోత్పాతానికి కారణాలు

- గత వారం అమెరికా ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగాల కల్పన గణాంకాలు అత్యంత నిరాశాజనకంగా ఉండటంతో పాటు ఆ దేశ తయారీ రంగ పనితీరు భారీగా క్షీణించడం వంటి అంశాలు, అమెరికా ఆర్థిక మాంద్యంలోకి జారుకుంటున్నదన్న ఆందోళనలు ఈక్విటీ ఇన్వెస్టర్లను కుదిపేశాయి. దాంతో గత శుక్రవారం నుంచే ప్రపంచ మార్కెట్లలో అమ్మకాలు పెరిగాయి.
- జపాన్ సెంట్రల్ బ్యాంక్ ప్రామాణిక వడ్డీ రేట్లను 0.25 పెంచడం అక్కడి యెన్ క్యారీ ట్రేడింగ్‌పై తీవ్ర ప్రభావం చూపింది. ఇన్వెస్టర్లు యెన్ క్యారీ ట్రేడ్‌లను పెద్దఎత్తున ఉపసంహరించుకోవడంతో జపాన్ నిక్కీ 225 ఇండెక్స్ సోమవారం ఏకంగా 12.40 శాతం క్షీణించింది. నిక్కీ ఈ స్థాయిలో పతనమవడం 1987 నాటి బ్లాక్ మండే తర్వాత మళ్లీ ఇదే తొలిసారి. క్యారీ ట్రేడ్‌లో తక్కువ వడ్డీకి లభించే దేశంలోని లేదా కరెన్సీలో రుణం తీసుకుని ఇతర మార్కెట్లలో అధిక రిటర్నులు పంచే ఆర్థిక సాధనాల్లో (ఈక్విటీలు, బాండ్లు, కమోడిటీలు) పెట్టుబడులు పెడుతుంటారు. ప్రపంచంలో క్యారీ ట్రేడ్‌కు అత్యంత ప్రాచుర్య కరెన్సీ యెన్. ఆ దేశ సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేటు పెంచడంతో పెట్టుబడులు గిట్టుబాటు కాని పరిస్థితి. దాంతో క్యారీ ట్రేడ్‌లను ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున రద్దు చేసుకుంటుండటం జపాన్‌తో పాటు ప్రపంచ మార్కెట్లపై ఒత్తిడిని మరింత పెంచింది.
- పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కూడా స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లను కలవర పెడుతున్నాయి. ఇజ్రాయెల్‌పై ఇరాన్ యుద్ధానికి సిద్ధమవుతుండటం కూడా మార్కెట్లకు ప్రతికూలంగా పరిణమించింది.
- భారత మార్కెట్లు జీవితకాల గరిష్ఠ స్థాయిలో ట్రేడవుతున్న నేపథ్యంలో మదుపరులు ముందుజాగ్రత్త చర్యగా పెద్ద ఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడ్డారు.

ముంబై: ప్రపంచ మార్కెట్లతో పాటు దేశీయ ఈక్విటీ ప్రామాణిక సూచీలు సోమవారం భారీ పతనాన్ని చవిచూశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 79,000 దిగువ స్థాయికి జారుకోగా.. ఎన్ఎస్ఈ నిఫ్టీ 24,000 వద్దకు పడిపోయింది. ఒక దశలో సెన్సెక్స్ 2,686.09 పాయింట్లు (3.31 శాతం) క్షీణించి 78,295.86 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 2,222.55 పాయింట్ల (2.74 శాతం) నష్టంతో 78,759.40 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఒక సమయంలో 824 పాయింట్లు (3.33 శాతం) పతనమై 23,893.70 వద్దకు జారుకుంది. చివర్లో కాస్త తేరుకుని 662.10 పాయింట్ల (2.68 శాతం) నష్టంతో 24,055.60 వద్ద క్లోజైంది. సూచీలకిది నెల రోజులకు పైగా కనిష్ఠ ముగింపు స్థాయి. అంతేకాదు, ఈ జూన్ 4 తర్వాత అతిపెద్ద ఒక్కరోజు నష్టమిది. గత శుక్రవారం కూడా సూచీలు ఒక శాతానికి పైగా నష్టపోయాయి. గడిచిన రెండు సెషన్లలో దాదాపు 4 శాతం క్షీణించాయి. అన్ని రంగాలు, విభాగాల షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.15.32 లక్షల కోట్లు తగ్గి రూ.441.84 లక్షల కోట్లకు పడిపోయింది. గడిచిన రెండు సెషన్లలో రూ.19 లక్షల కోట్ల మార్కెట్ సంపద హరించుకుపోయింది

మార్కెట్ దారెటు..?

అంతర్జాతీయ ప్రతికూలతల నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్లలో ఒడుదొడుకులు స్వల్పకాలం పాటు కొనసాగవచ్చని నిపుణులు భావిస్తున్నారు. దీర్ఘకాలికంగా చూస్తే మాత్రం భవిష్యత్ సానుకూలంగానే కన్పిస్తోందన్నారు. ఆర్‌బీఐ పరపతి సమీక్ష, అమెరికా ఐఎస్ఎం సర్వీసెస్ ఇండెక్స్, జపాన్ యెన్ క్యారీ ట్రేడ్ అన్‌వైండింగ్ అంశాలు మార్కెట్లను ప్రభావితం చేయవచ్చన్నారు. ప్రస్తుతం ఆకర్షణీయ ధరలకు లభించే స్టాక్స్‌లో దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులకు ప్రస్తుత కరెక్షన్ ఉపయోగపడనుందని వారు అభిప్రాయపడ్డారు.

- సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా మినహా అన్నీ నేలచూపులు చూశాయి. టాటా మోటార్స్ షేరు ఏకంగా 7.32 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. అదానీ పోర్ట్స్ 5.93 శాతం, టాటా స్టీల్ 5.31 శాతం నష్టపోగా.. ఎస్‌బీఐ, పవర్‌గ్రిడ్, మారుతి సుజుకీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు 4 శాతానికి పైగా పతనమయ్యాయి.
- బ్లూచిప్‌లతో పాటు చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దాంతో బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 3.60 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 4.21 శాతం నష్టపోయాయి. బీఎస్ఈలోని అన్ని రంగాల సూచీలూ నష్టాలు చవిచూశాయి. సర్వీసెస్ ఇండెక్స్ అత్యధికంగా 4.56 శాతం తగ్గింది. యుటిలిటీస్, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్ సైతం 4 శాతానికి పైగా నష్టపోయాయి. పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, కమోడిటీస్ 3 శాతానికి పైగా పతనమయ్యాయి.
- మార్కెట్ ఊగిసలాటల తీవ్రతకు సంకేతమైన ఇండియా వీఐఎక్స్ సూచీ 42 శాతం పెరిగి 20.37కు చేరింది. ఒక దశలో సూచీ తొమ్మిదేళ్ల గరిష్ఠ స్థాయి 52 శాతం వరకు పెరిగింది.
- బీఎస్ఈలో 4,189 షేర్లు ట్రేడవగా.. 3,446 నష్టపోయాయి. 638 లాభపడగా.. 105 యథాతథంగా ముగిశాయి. 64 కంపెనీల షేర్లు ఏడాది కనిష్ఠ స్థాయిని, 4 లోయర్ సర్క్యూట్‌ను తాకాయి.

ప్రపంచ మార్కెట్ల నష్టాలు

ఖండం	ప్రామాణిక సూచీ	నష్టం(%)
అమెరికా	డోజోన్స్	2.28
	ఎస్ అండ్ పీ 500	2.71
	నాస్‌డాక్	3.28
యూరప్	ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	2.04
	సీఏసీ (ఫ్రాన్స్)	1.42
	డాక్స్ (జర్మనీ)	1.82
ఆసియా	షాంఘై కాంపొజిట్ (చైనా)	1.54
	నిక్కీ 225 (జపాన్)	12.40
	హాంగ్‌సెంగ్ (హాంకాంగ్)	1.46
	కోస్పీ (ద.కొరియా)	8.77
	తైవాన్ వెయిటెడ్ (తైవాన్)	8.35

ఆల్‌టైం కనిష్ఠానికి రూపాయి

భారత కరెన్సీ విలువ సరికొత్త జీవిత కాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. అమెరికా డాలర్‌తో రూపీ మారకం విలువ ఒక్కరోజే 37 పైసలు క్షీణించింది. దాంతో డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు 84.09కు ఎగబాకింది. అంటే, ఒక డాలర్ విలువ మన కరెన్సీలో రూ.84.09కి పెరిగిందన్నమాట. డాలర్ విలువ రూ.84 స్థాయిని దాటడం ఇదే తొలిసారి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో భారీ నష్టాలు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణతో పాటు ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, అమెరికా ఆర్థిక మాంద్య భయాలు ఇందుకు కారణమయ్యాయి.

బోనస్ షేర్లకు టీ+2 విధానం: సెబీ

న్యూఢిల్లీ: బోనస్ షేర్ల జారీ, ట్రేడింగ్ సమయాన్ని సంస్కరించాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ భావిస్తోంది. ఇందుకోసం బోనస్ షేర్ల రికార్డు తేదీ నుంచి రెండు రోజుల్లో (టీ+2) ఆ షేర్లు మదుపరుల ఖాతాల్లో పడి ట్రేడింగ్‌కు అనువుగా ఉండాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనపై మార్కెట్ వర్గాలు ఈ నెల 26లోగా తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. ప్రస్తుతం బోనస్ షేర్లు ప్రకటించిన తర్వాత అవి వాటాదారుల ఖాతాల్లో పడేందుకు రెండు నుంచి వారం రోజుల సమయం పడుతోంది. దీన్ని రెండు రోజులకు కుదించాలని సెబీ భావిస్తోంది.

ఎంఎఫ్‌ల ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు చెక్: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)లో జరిగే ఫ్రంట్ రన్నింగ్, ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు చెక్ పెట్టేందుకూ సెబీ చర్యలు చేపట్టింది. ఇందుకోసం అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) స్పష్టమైన వ్యవస్థీకృత విధానం ఏర్పాటు చేసుకోవాలని కోరింది. దీనికి తోడు ఏఎంసీల్లో జరిగే ఇన్‌సైడర్ ట్రేడింగ్, ఫ్రంట్ రన్నింగ్‌లను బహిర్గతం చేసే విజిల్ బ్లోయర్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని కోరింది. ఇందుకు ఏఎంసీల సీఈఓలు లేదా ఎండీలు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేసింది. యాక్సిస్ ఏఎంసీ, ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఫ్రంట్ రన్నింగ్ జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో సెబీ ఈ చర్యలు తీసుకుందని భావిస్తున్నారు. ఈ రెండు విధానాలు ఈ ఏడాది నవంబరు 1 నుంచి అమల్లోకి వస్తాయని సెబీ తెలిపింది.

బిజినెస్

నవంబరు 14 నుంచి ఇండిగోలో బిజినెస్ క్లాస్

న్యూఢిల్లీ: ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానాల్లో నవంబరు 14 నుంచి బిజినెస్ క్లాస్ అందుబాటులోకి రానుంది. 12 దేశీయ రూట్లలో ఈ క్లాస్‌ను ప్రవేశపెడతారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ 18వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం ఈ ప్రకటన చేసింది. చౌక ధరల విమానయాన సంస్థ అనే పేరు నుంచి బయటపడడం, లాయల్టీ కార్యక్రమం ప్రవేశపెట్టడం, 2027 నుంచి ఏ350 వైడ్ బాడీ విమానాలు ప్రవేశపెట్టడం వైపు అడుగులు వేస్తున్నట్టు ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ చెప్పారు. మంగళవారం నుంచి బిజినెస్ క్లాస్ సీట్ల బుకింగ్‌ను ప్రారంభిస్తున్నట్టు ఆయన తెలిపారు. అలాగే బిజినెస్ క్లాస్ ప్రయాణికులకు ప్రత్యేక స్పెషల్ మీల్స్ కూడా అందచేయనున్నామన్నారు. ఏ321 నియో విమానాల్లో 12 సీట్లను బిజినెస్ క్లాస్‌కు కేటాయిస్తామని, 3 వరుసల్లో 4 సీట్ల వంతున ఆ క్లాస్‌కు ప్రత్యేకంగా ఉంచుతామని ఎల్బర్స్ తెలిపారు. బిజినెస్ క్లాస్‌లో ఒక వైపు ప్రయాణ చార్జీ రూ.18,018 నుంచి ప్రారంభమవుతుందని పీటర్ వెల్లడించారు.

ఎయిర్‌టెల్ లాభం రూ.4,160 కోట్లు

న్యూఢిల్లీ: టెలికాం ఆపరేటర్ భారతి ఎయిర్‌టెల్ కన్సాలిడేటెడ్ లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (క్యూ1)లో రెండింతలు పెరిగి రూ.4,160 కోట్లకు చేరింది. ఒక్కో వినియోగదారునిపై నగటు ఆదాయం (ఆర్పు) పెరగడంతో పాటు రూ.735 కోట్ల అసాధారణ లాభం జత కావడం ఇందుకు దోహదపడినట్టు కంపెనీ వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన లాభం రూ.1,612.5 కోట్లు. అలాగే కన్సాలిడేటెడ్ ఆదాయం 2.8 శాతం పెరిగి రూ.37,440 కోట్ల నుంచి 38,506.4 కోట్లకు చేరింది. అయితే కన్సాలిడేటెడ్ వ్యయం 23.44 శాతం క్షీణించి రూ.8,007 కోట్లకు పరిమితమైంది. కాగా భారత్‌లో పెట్టుబడి వ్యయం 27 శాతం క్షీణతతో రూ.9,327 కోట్ల నుంచి రూ.6,781 కోట్లకు తగ్గిందని పేర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,380 ▼	64,500 ▼	91,000 ▲
ముంబై	69,117 ▼	63,311 ▼	78,950 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

6వ తేదీ



హైదరాబాద్	420	విజయవాడ	430
వరంగల్	422	గోదావరి	423
చిత్తూరు	493	విశాఖపట్నం	430
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	92
వరంగల్	80	గుంటూరు	92
కరీంనగర్	80	ఒంగోలు	92
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	87
కర్నూలు	80	నెల్లూరు	87
విశాఖపట్నం	86	అనంతపురం	92
గోదావరి	92		



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్





సోమవారం నిర్వహించిన కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో పాల్గొన్న అధికారులు



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్‌పీ సిసోడియా

ఇసుక ఉచితమే

అనుసంధానమే పరిష్కారం

- ఈసారి మంచి వానలు.. శ్రీశైలం, సాగర్ నిండాయి: సీఎం
- పోతిరెడ్డిపాడు నుంచి సీమకు నీటిని తరలించాలని స్పష్టీకరణ

అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సస్యశ్యామలమయ్యేందుకు, నీటి సమస్యకు నదుల అనుసంధానమే పరిష్కారమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సోమవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో జలవనరుల శాఖపై ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిశాయని, వర్షపాతం అధికంగానే నమోదయిందని చెప్పారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు నిండాయని అన్నారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ ప్రాంతంలోని అని ప్రాజెక్టులకూ కృష్ణా జలాలను తరలించాలని, చెరువులన్నిటినీ నింపాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని, డ్రోన్లను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రాజెక్టు యాజమాన్య నిర్వహణ కూడా అత్యంత ప్రధానమైనదని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో గేట్లకు గ్రీజు కూడా పూయలేని దుస్థితి నెలకొందని, దీని ఫలితంగా కొన్ని ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోతే.. వాటిని తిరిగి బిగించేందుకు కాంట్రాక్టు సంస్థలు ముందుకు రాలేదని గుర్తు చేశారు. ఇటీవల హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువ వద్ద రహదారి నిర్మాణం కోసం ఆమోదం పొందేందుకు జాప్యం చేయడంతో గేట్ల నిర్వహణలోనూ ఆలస్యం జరిగిందని చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. గేట్ల నిర్వహణలో లోపాలు తలెత్తితే డిప్యూటీ ఇంజినీరు ఆటోమేటిగ్గా సస్పెండైపోతారని స్పష్టం చేశారు. గేట్ల నిర్వహణను డీఈఈ, ఏఈఈ నిరంతరం పర్యవేక్షించాలని తేల్చిచెప్పారు. చెరువులు, చిన్న చిన్న నీటి కుంటలు నింపడంలోనూ యాజమాన్య విధానాలను అవలంబించాలన్నారు. తమ శాఖపై జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు కలసికట్టుగా పనిచేస్తున్నారని.. తాను రోజంతా అందుబాటులో ఉంటానని.. ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు కూడా ఏమైనా సందేహాలుంటే పరిష్కరిస్తున్నారని చెప్పారు. మంత్రి నిమ్మల రామానాయుడు మంత్రిలా కాకుండా.. ప్రభుత్వ కార్యదర్శిలా నిరంతరం కష్టపడి పనిచేస్తున్నారని సాయిప్రసాద్ చెబుతుండగా.. 'కథలు చెప్పొద్దు.. ఫలితాలు చూపండి' అని సీఎం హితవు పలికారు. రాష్ట్రంలోని చివరి ఆయకట్టుకూ సాగునీరందించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని సాయిప్రసాద్ చెప్పారు. సాగునీటి కాలువల్లో పూడిక తీసేందుకు రూ.79 కోట్లు విడుదల చేశామన్నారు.

ప్రజాహితమైన పాలన చేస్తాం: మంత్రి అనగాని

రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజాహితమైన పరిపాలన అందిస్తామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. జిల్లా పరిపాలన నిర్వహణలో కలెక్టర్లు పట్టుగొమ్మలన్నారు. గత ఐదేళ్ల ప్రభుత్వ పాలనలో వ్యవస్థలు ఛిన్నాభిన్నమయ్యాయని, వాటిని గాడిలో పెట్టడానికి కలెక్టర్ల పాత్ర కీలకమని చెప్పారు. అసైన్డ్ భూములు, ఇనాం సర్వీస్ తదితర భూములపై గత ప్రభుత్వం పాటించిన విధానాలను పునఃపరిశీలించాలని కోరారు. రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖల అధికారుల మధ్య సమన్వయం ఉండాలని, భూముల సమస్యల పరిష్కారం విషయంలో గుజరాత్ తరహా కఠిన నిబంధనలతో మనం ముందుకు వెళ్లాలని కోరారు.

ఇసుక ఉచితమే

- సచివాలయాల్లో ఇసుక బుకింగ్ సదుపాయం
- వినియోగదారు రవాణా చార్జీలక్కడే చెల్లించాలి
- ఇసుక అక్రమాలపై సీబీసీఐడీ దర్యాప్తు: సీఎం

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ఇసుక కావాల్సిన వారు తమ పరిధిలోని గ్రామ సచివాలయంలో బుక్‌చేసుకునే విధానాన్ని తీసుకొస్తున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇసుక సామాన్యుడి హక్కు అని, ఆ సహజ వనరు దోపిడీని సహించవద్దని అధికారులను ఆయన ఆదేశించారు. ఇసుక కావాల్సిన వారు దాని కోసం ఒక్క పైసా కూడా చెల్లించనక్కర్లేదని, రీచ్ నుంచి తమకు కావాల్సిన చోటుకు తీసుకెళ్లడానికి అయ్యే రవాణా చార్జీలు చెల్లించాలని చెప్పారు. రీచ్ నుంచి వాహనంలో బయల్దేరిన ఇసుకను తన వద్దకు చేరిందని వినియోగదారుడు ధ్రువీకరిస్తేనే రవాణా ఖర్చులు ఆ యజమానికి విడుదల చేసే విధానం తెస్తామని సీఎం చెప్పారు. గత ఐదేళ్లు ఇసుక దోపిడీకి పాల్పడిన వారు తప్పించుకోలేరని, సీఐడీ దర్యాప్తు చేపడతామని, టెక్నాలజీ ద్వారా విచారణచేసి వాస్తవాలు, సాక్ష్యాధారాలు వెలికితీస్తామని చెప్పారు. కాగా, రాష్ట్రంలో ప్రజలకు ఇసుకను ఉచితంగా ఇస్తున్న విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు.

ప్రతి పేదవానికీ ఇల్లు

'కేంద్రప్రభుత్వం ఇప్పటివరకు పాత పథకాల కింద మంజూరు చేసినవాటిలో 9,11,594 ఇళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. 5.74,710 ఇళ్లు ఇంకా మొదలే కాలేదు. వాటి నిర్మాణానికి గడువు 11 నెలలు మాత్రమే ఉంది. ఆ లోపు ఆ ఇళ్లన్నీ పూర్తి చేయాలి. కలెక్టర్లు దీనికి మొదటి ప్రాధాన్యమివ్వాలి. ఇంతవరకు మొదలు పెట్టని ఇళ్లను లబ్ధిదారులు వెంటనే కట్టుకోకపోతే భవిష్యత్తులో వారికి ఇళ్లు నిర్మించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవచ్చు. అందువల్ల వారిని ఒప్పించి ఇళ్లు కట్టుకునేలా ప్రోత్సహించాలి. ఇక మీదట ఇళ్లు లేని నిరుపేదలకు అర్బన్ ఏరియాలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలుగా ఇస్తాం. పేదలకు ఇళ్ల నిర్మాణం పేరుతో గత ప్రభుత్వం దుర్మార్గంగా ప్రవర్తించింది. పెద్దఎత్తున భూసేకరణ చేసి.. పనికిరాని భూములు కొని భారీ స్కామ్ చేసింది. ఈ భారీ అవినీతి బాగోతాన్ని ప్రత్యేకంగా డీల్ చేస్తాం. కేంద్రం అర్బన్ ఇళ్ల నిర్మాణం కోసం ఇచ్చిన రూ. 3,180 కోట్లను, గ్రామీణ ఇళ్ల పథకం కింద ఇచ్చిన మరో రూ. 500 కోట్లను గత ప్రభుత్వం దుర్వినియోగపరిచింది. దీనిపై కేంద్రం రూ.28 కోట్లు జరిమానా విధించింది. ఇంతకంటే సిగ్గుచేటు మరొకటి ఉంటుందా?" అని చంద్రబాబు ఆగ్రహించారు.

కబ్జాకు ప్రయత్నిస్తే కొరడా: అనగాని

గత ప్రభుత్వ హయాంలో పేదవాడు అకారణంగా భూములు కోల్పోయాడని, ఆ పరిస్థితి పునరావృతం కాకుండా ఉండేందుకు ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని సవరిస్తున్నట్టు రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. 1982 ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని అనుసరించి గుజరాత్‌లో భారీ జరిమానాలు, కఠినమైన నియమ నిబంధనలు అమలు చేస్తున్నారని, అదే తరహాలో ఏపీలో ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని సవరించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. వైసీపీ పాలనలో 9 లక్షల ఎకరాల అసైన్డు భూములను ఫ్రీహోల్డుగా మార్చడమే గాకుండా దాదాపు 25,000 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగిందన్నారు. మదనపల్లె ఘటన విచారణకు వెళ్లిన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు రావడమే గత ప్రభుత్వం చేసిన కుంభకోణాలకు నిదర్శనమన్నారు. శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు, వైఎస్సార్, అన్నమయ్య, ప్రకాశం జిల్లాల్లో యాజమాన్య హక్కులు కల్పించిన(ఫ్రీహోల్డ్) భూముల రిజిస్ట్రేషన్లు(గిఫ్ట్, సేల్) ఎక్కువగా జరిగాయని వీటిపై పునపరిశీలన చేయాలని ఆర్పీ సిసోడియా సూచించారు.

● ప్రభుత్వాస్పత్రులు మెరుగుపడాలి: చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. లాభాపేక్ష లేకుండా కేవలం సేవ చేస్తున్నప్పుడు.. మనం ప్రయివేటు ఆస్పత్రులతో ఎందుకు పోటీపడలేపోతున్నామో చెప్పాలన్నారు. అధికారులు సవాల్‌గా తీసుకుని రాబోయే రోజుల్లో ప్రయివేటు ఆస్పత్రులతో ప్రభుత్వ ఆస్పత్రులు పోటీదేలా పని చేయాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా హెల్త్ ఇన్సూరెన్స్‌పై సీఎం చంద్రబాబు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను అడిగారు. హెల్త్ ఇన్సూరెన్స్‌పై కంపెనీలతో చర్చలు జరుపుతున్నామని, రూ.2 లక్షల విలువైన సర్జరీల వరకూ హెల్త్ ఇన్సూరెన్స్ కిందకు వచ్చేలా, రూ.2 లక్షలు పైబడిన సర్జరీలపై ట్రస్ట్ ద్వారానే నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

▪ ప్రజలకు న్యాయం చేయాలి

కూటమికి 93 శాతం స్ట్రైక్‌రేట్ ఇచ్చారు

- గత ప్రభుత్వం వ్యవస్థల్ని ఛిద్రం చేసింది
- సీఎం చంద్రబాబు అనుభవంతో పూర్వవైభవం
- కలెక్టర్ల సదస్సులో ఉపముఖ్యమంత్రి పవన్

అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): '164 అసెంబ్లీ.. 21 ఎంపీలు, 93 స్ట్రైక్ రేట్‌తో ఎన్డీఏ కూటమిని ప్రజలు ఆశీర్వదించారు. ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలి. వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి. వారికి న్యాయం చేయాలి" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. సోమవారం ఉదయం సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పవన్ కలెక్టర్లకు కీలక సూచనలు చేశారు. గత ప్రభుత్వ పాలనలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నామని, వ్యవస్థలను బతికించాలనే ఉద్దేశంతోనే అన్నీ తట్టుకుని నిలబడ్డామని చెప్పారు. బలోపేతమైన వ్యవస్థలను గత ప్రభుత్వం ఆటబొమ్మలుగా మార్చిందన్నారు. అత్యుత్తమ పాలనలో ఒకప్పుడు మోడల్‌గా ఉన్న రాష్ట్రం, గత ఐదేళ్ల పాలనలో ఎంత దారుణంగా దిగజారిపోయిందో చూశామని గుర్తుచేశారు. పాలన ఎలా ఉండకూడదో గత పాలకులు రాష్ట్రాన్ని మోడల్‌గా చూపారని పవన్ పేర్కొన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు మన రాష్ట్రంలో పని చేయడానికి పోటీపడేవారని, మళ్లీ అలాంటి పరిస్థితి తీసుకొద్దామని చెప్పారు. సీఎం చంద్రబాబు అనుభవం, పాలన దక్షతతో రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకొద్దామని పిలుపునిచ్చారు.

పంచాయతీల బలోపేతం

'పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి రక్షిత మంచినీటి సరఫరా, అటవీశాఖ, శాస్త్రసాంకేతిక శాఖలను తీసుకున్నాను. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి తీర్మానాలు చేస్తున్నాం. తద్వారా పంచాయతీలను బలోపేతం చేస్తాం. గ్రామాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అమలు చేస్తున్నాం. పిఠాపురం నియోజకవర్గంలో లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాం. జలజీవన్ మిషన్ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 5.4 కోట్ల గృహలకు తాగునీరివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో 4721 కిలోమీటర్ల రోడ్లను మరమ్మతు చేయాలని నిర్ణయించాం. రాష్ట్ర వ్యాప్తంగా 29.23 శాతం 37,400 చదరపు కిలోమీటర్ల నోటిపై చేసిన అడవులున్నాయి. నోటిపై చేసిన అటవీ పరిధికి అదనంగా 10,221 చదరపు కిలోమీటర్ల గ్రీన్ కారిడర్ ఉంది. చెరువు తీరాలు, ఇన్‌స్టిట్యూట్ ల్యాండ్స్ పంచాయతీ ల్యాండ్స్‌లో కూడా అటవీకరణను ప్రోత్సహించాల్సిన ఉంది. గుంటూరు, కర్నూలు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అడవులు పెంచేందుకు కృషి చేయాల్సి ఉంది' అని పవన్ అన్నారు.

వికసిత ఏపీకి అడుగులు

'రాజ్యాంగం ఎంత గొప్పగా ఉన్నా.. దాన్ని అమలు పరిచేవారు సరిగా లేకపోతే ఆ వ్యవస్థ పని చేయదు. బలహీనమైన రాజ్యాంగం ఉన్నా ప్రజల కోసం పని చేసేవారు ఉంటే ఆ వ్యవస్థ కచ్చితంగా పని చేస్తుందని డాక్టర్ అంబేద్కర్ చెప్పారు. గత ప్రభుత్వంలోని వ్యవస్థలను ఎలా ఛిద్రం చేశారో మనం చూశాం. పాలనా అనుభవం ఉన్న వ్యక్తి సీఎం చంద్రబాబు, నేర్చుకోవాలనుకునే తపన ఉన్న నాలాంటి వ్యక్తి, పాలన అనుభవం ఉన్న మంత్రివర్గ సహచరులు కలిసి వ్యవస్థలను ముందుకు తీసుకువెళతాం. సీఎం చంద్రబాబు విజన్‌ను ముందుకు తీసుకువెళ్తాం. రాష్ట్ర విభజన నాటి నుంచి ఇప్పటి వరకూ మనం నలుగుతూనే ఉన్నాం. గత ప్రభుత్వంలో బోర్డర్ దాటి రాష్ట్రంలోకి రావడానికి కూడా అనుమతించని పరిస్థితి. అన్నింటినీ దాటుకుని ముందుకు వచ్చాం. ఇప్పుడు రాష్ట్రాభివృద్ధికి మేము కట్టుబడి ఉన్నాం. 2047లో భారత్ సూపర్ పవర్ కావాలన్నా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సహకారం అవసరం. మాలో, మంత్రివర్గంలో, ఎమ్మెల్యేలతో ఏదైనా ఇబ్బంది ఉంటే మాకు చెప్పండి. సామాజిక, రాజకీయ గొడవ వల్ల దేశ సమగ్రతకు ఇబ్బంది వస్తుంది. 2047 ఇండియా సూపర్ పవర్ కావాలంటే వికసిత్ ఏపీలో ముందుకు వెళ్లాలంటే మీ సలహాలు, సూచనలు ఇవ్వాలి" అని కలెక్టర్లను కోరారు.

ఐదేళ్ల నేరాలు వెలికితీయండి!



తప్పు చేసిన వారెవరినీ వదిలిపెట్టొద్దు

- జిల్లా ఎస్పీలకు సీఎం స్పష్టీకరణ

అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): 'ఏపీ మంచి రాష్ట్రం.. కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపైనా ఉంది. వ్యవస్థలపై నమ్మకం కల్పించాలి. ఎవరు తప్పు చేసినా టెక్నాలజీ వినియోగించి జైలుకు పంపితే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్లలో జరిగిన నేరాలను వెలికితీయాలని ఎస్పీలకు పిలుపిచ్చారు. తప్పులు వెలికి తీసి బాధ్యులను శిక్షించాలని స్పష్టంచేశారు. 'వికసిత్ ఆంధ్ర 2047' లక్ష్యంగా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ జరగడానికి వీల్లేదన్నారు. 'నాకు అన్యాయం జరిగిందన్న ప్రతి ఒక్కరి వినతిని చూసి అందులో న్యాయం ఉంటే చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. నేరాలు జరిగినప్పుడు నేరస్థులను గుర్తించేందుకు కెమేరాలు, డ్రోన్లతోపాటు కృత్రిమ మేధ (ఏఐ)ని వాడుకోవాలి. ఐదేళ్ల క్రితం కొనుగోలు చేసిన 15 వేల కెమేరాలు, సాఫ్ట్‌వేర్, ఇతర హార్డ్‌వేర్ వినియోగించకుండా గత ప్రభుత్వం పక్కనపెట్టడం బాధాకరం. ఎవరు తప్పు చేసినా గుర్తించే వ్యవస్థ తీసుకొస్తే దానిని ఉపయోగించక పోవడం క్షమించరానిది' అన్నారు. నేరాల కట్టడికి ప్రపంచం మొత్తం ఎలాంటి నాణ్యమైన టూల్స్ వినియోగిస్తున్నారో ఇక్కడా వాటినే వాడదామని సూచించారు. 'మదనపల్లెలో అగ్ని ప్రమాదం అసలు గుట్టు తేల్చాలని డీజీపీ, సీఐడీ ఏడీజీని పంపా.. క్షుణ్ణంగా పరిశీలిస్తే ప్రైవేటు ప్రాంతాల్లో ఫైళ్లు పెట్టుకుని సబ్‌కలెక్టర్ కార్యాలయాన్నే ధ్వంసం చేశారు. విశాఖపట్నం, తిరుపతి మాత్రమే కాదు.. కొండలను సైతం మింగేశారు. 22ఏలో చేర్చడం, తర్వాత తీసేయడం.. భూ మాఫియా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించింది. లక్షల ఎకరాల సమస్య మన ముందుంది' అన్నారు. 'వివేకానందరెడ్డి హత్యపై జగన్ రోతపత్రికలో గుండెపోటు అని వస్తుంది. ఆయన కుమార్తె అడగ్గానే గొడ్డలి పోటు బయట పడుతుంది. ఒక క్రిమినల్ పాలిస్తే ఎలా ఉంటుందో చెప్పడానికి ఇదే నిదర్శనం' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. నేరాలకు కారణమైన మద్యంపై దేశంలోనే మంచి పాలసీ తీసుకొస్తామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఒక యాప్ తీసుకొద్దామన్నారు.

నేరాల కట్టడికి చర్యలు: డీజీపీ తిరుమలరావు

రాష్ట్రంలో నేరాల తీరుతెన్నులపై డీజీపీ ద్వారకా తిరుమలరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సైబర్ నేరాల్లో ఎంతో మంది బాధితులు రూ.లక్షలు, కోట్లు కోల్పోతున్నారని.. నేరస్థుల కట్టడికి సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకోవలసి ఉందన్నారు. మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల విచారణలో వేగం పెంచి వారికి రక్షణ కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. అత్యంత అధునాతన ఆటోమేటిక్ ఫింగర్ ప్రింట్ సర్వర్ కాలిపోయిందని, తెలంగాణ డీజీపీని బతిమాలి పని చేయించుకుంటున్నామంటూ పోలీసు వ్యవస్థ దుస్థితిని వివరించారు.

జగన్ పాలనలో గంజాయివనం..

జగన్ పాలనలో రాష్ట్రం గంజాయి వనంగా మారిందని.. గత టీడీపీ ప్రభుత్వ హయాంతో పోల్చితే వైసీపీ పాలనలో ఏకంగా 122శాతం ఎక్కువగా గంజాయి కేసులు నమోదయ్యాయని చంద్రబాబు కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో తెలిపారు. 'రాష్ట్రంలో గంజాయి 2019-23 మధ్య 122 శాతం పెరిగింది. అంతకు ముందు టీడీపీ హయాంలో ఐదేళ్లలో 2,948 కేసులు నమోదైతే వైసీపీ పాలనలో ఏకంగా 6,560కి పెరిగాయి. గంజాయి వినియోగాన్ని రాష్ట్రమంతా విస్తరింపజేసిన ముఠాలు.. దేశంలోని పలుప్రాంతాలకు స్మగ్లింగ్ చేస్తున్నాయి. గంజాయి, డ్రగ్ హాట్ స్పాట్‌లను గుర్తించి యాంటీ డ్రగ్ స్క్వాడ్‌ను వీలైనంత తొందర్లో ఏర్పాటు చేయాలి. గంజాయి సాగు, స్మగ్లింగ్‌లో కింగ్‌పిన్‌ల జాడ కనిపెట్టి కఠిన చర్యలు తీసుకోవాలి. ఎక్సైజ్, విద్య, వైద్య, పోలీసు, గిరిజన సంక్షేమ శాఖలు సమన్వయంతో మొదట డ్రగ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. మహిళలు, చిన్న పిల్లలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, ఇతర నేరాలు జరక్కుండా వారికి భద్రత కల్పించి.. 'డయల్ 112'పై విస్తృతంగా ప్రచారం చేయాలి. ఆన్‌లైన్, సోషల్ మీడియా ద్వారా మహిళలను వేధించే వారి ఆట కట్టించేందుకు ప్రత్యేక సైబర్ సెల్ ఏర్పాటు చేయాలి. అవసరం మేరకు సీసీటీవీలు ఏర్పాటు చేయాలి' అన్నారు.

పేదల సేవే పరమార్థం!

(మొదటి పేజీ తరువాయి)

విద్యుదుత్పత్తి చేసే రోజులు వచ్చాయి. పబ్లిక్ పాలసీ చాలా పవర్ ఫుల్. మనం తీసుకునే నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్తును, భావితరాల భవిష్యత్తును మారుస్తాయి. పబ్లిక్ పాలసీలకు ఆ శక్తి ఉంటుంది. 1991 ఆర్థిక సంస్కరణలు ఇందుకు ప్రధాన ఉదాహరణ. ప్రస్తుతం ప్రపంచంలో ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ స్థాయికి చేరుకున్నాం. 2029 నాటికి 3వ అది పెద్ద ఆర్థిక వ్యవస్థకు చేరుకుంటాం. నా లెక్క ప్రకారం అందరం గట్టిగా కలిసి పని చేస్తే 2047 నాటికి ప్రపంచంలో నంబర్ వన్ ఎకనామిక్‌గా భారతదేశం ఉంటుంది. లేదంటే కనీసం 3 లేదా 2వ స్థానంలో ఉంటాం. ఆ రోజు మనం అప్పట్లో రూపొందించిన పబ్లిక్ పాలసీ 25 ఏళ్ల తర్వాత ఊహించని ఫలితాలు సృష్టిస్తోంది. ఇప్పుడు కలెక్టర్లుగా మీరు చేయబోయే పని భవిష్యత్తును సృష్టిస్తుంది. అందుకే గతాన్ని గుర్తు చేస్తున్నా.

పనితీరు బాగుంటేనే...

ఐఏఎస్ తర్వాత కలెక్టర్‌గా పని చేయడం ప్రతి అధికారికీ పెద్ద డ్రీమ్. దాదాపు 35 సంవత్సరాల ఐఏఎస్ సర్వీస్‌లో ఒక మూడేళ్లు కలెక్టర్‌గా పని చేయాలని అనుకుంటారు. నేనైతే 5 ఏళ్లు కొనసాగించేవాడిని. జిల్లాల్లో పరిపాలన గాడిలో పడాలంటే కలెక్టర్లు ఎక్కువ కాలం ఉండాలి. ఇప్పుడు కూడా అదే కొనసాగిస్తాం. పని చేయకపోతే కలెక్టర్ పోస్టు గ్యారంటీ లేదు. నన్ను తప్పుగా అనుకోవద్దు. మీ పనితీరు, వచ్చే ఫలితాలను బట్టి నేను ప్రోత్సహిస్తాను. కలెక్టర్లుగా మీరు చేసే పని మీ జీవితంలో మీకు ఎప్పుడూ గుర్తుండి పోవాలి. మీ వద్దకు ఏ పని వచ్చినా మానవతా దృక్పథంతో ఆలోచించి చేయండి. 'ఇటీవల ఇలాంటి కలెక్టర్‌ను చూడలేదు' అని ప్రజలు అనుకోవాలి. సంపద సృష్టించడం, సంక్షేమాన్ని సక్రమంగా అమలు చేయడం వంటివి చేయాలి. దీని కోసం డబ్బులు కూడా లేవు. గతంలో ఇలాంటి పరిస్థితుల్లోనే.. విన్నూతంగా బీవోటీ, పీపీపీ తీసుకొచ్చాం. ఇలాంటి విన్నూత ఆలోచనలను కలెక్టర్లు శాఖల వారీగా చేయాలి. మనం ఇప్పటికే నెలకు రూ.2737 కోట్ల పింఛన్లు ఇస్తున్నాం. అంటే... ఐదేళ్లల్లో రూ.1.64 లక్షల కోట్లు ఇస్తున్నాం. గత ప్రభుత్వం బటన్ నొక్కడం తప్ప ప్రజల్ని ఎప్పుడూ నేరుగా కలిసి పరామర్శించింది లేదు.

మానవతా దృక్పథంతో...

గంటల తరబడి మీటింగ్‌లు ఉండవని ముందే చెప్పాను. రూల్స్ మాత్రమే కాకుండా... మానవతా దృక్పథంతో కూడా అధికారులు ఆలోచించాలి. కేవలం రూల్స్ చట్రంలో ఆలోచనలు చేస్తే ప్రజల సమస్యలు పరిష్కారం కావు. అధికారం ఉంది కాదా అని పెత్తనం చెలాయిస్తానంటే కుదరదు. కిందస్థాయి అధికారులతో సామరస్యంగా పని చేయించుకోండి. అలాగే.. పని చేయించడంలో రాజీపడొద్దు. కలెక్టర్లు వర్చువల్ గవర్నెన్స్ అలవాటు చేసుకోవాలి. వాట్సాప్ గ్రూప్స్ తయారు చేసుకోవాలి. ప్రభుత్వం ఒక యాప్‌ను తీసుకురావాలని చూస్తోంది. దాని ద్వారానే కలెక్టర్లకు, పోలీసులకు, ఎమ్మార్వోలకు ఆదేశాలు ఇవ్వాలని భావిస్తున్నాం. ఇప్పటికే టాటా గ్రూప్ ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. మంత్రులమంతా వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసుకున్నాం. సీఎంవోకూ గ్రూప్ ఉంది. దీనివల్ల రియల్ టైమ్ గవర్నెన్స్‌కు వెసులుబాటు ఉంటుంది.

ప్రతినెలా 10న 'పేదల సేవలో'..

ప్రతి నెలా 10వ తేదీన 'పేదల సేవ'లో కార్యక్రమం చేపట్టాలి. పేదలతో అనుసంధానం కావాలి. వారి పరిస్థితిని అర్థం చేసుకుంటేనే సరిగ్గా పని చేయగలుగుతాం. ఏం చేస్తే పేదరికం పోతుందో కలెక్టర్లు ఆలోచించాలి. పేదరికం లేని సమాజమే మా ప్రభుత్వం నిర్దిష్టమైన ఆలోచన. పీ-4 మోడల్ అనేది (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్ట్‌నర్‌షిప్) విధానం తీసుకువస్తున్నాం. సమాజంలో టాప్ 10 శాతం డబ్బులు సంపాదించిన వారు... చిట్టచివరి 20 శాతం వారిని దత్తత తీసుకుని, వారిని తీర్చిదిద్దే బాధ్యత ఇవ్వబోతున్నాం. మనమంతా చిన్న గ్రామాల్లో పుట్టిన వాళ్లమే. ఇప్పుడు సమాజంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాం. కానీ... మన తోటి వారు ఇప్పటికీ అదే ఊళ్లో రూ.100 లేదా రూ.200 సంపాదించలేని పరిస్థితుల్లో ఉన్నారు. వాళ్లపై ఫోకస్ చేద్దాం. ప్రతి కలెక్టర్ కొన్ని ప్రిన్సిపల్స్ ఫాలో అవ్వాలి. జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా చేయాలి. కేంద్రం 2047 విజన్ విడుదల చేసింది. మనం కూడా అక్టోబరు 2న మన విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తున్నాం.

ఐదేళ్లల్లో ఇబ్బందులు పడ్డా...

మేము ఈ ఐదేళ్లలో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. అందుకే ప్రజలు చారిత్రాత్మక విజయాన్ని అందించారు. మాపై చాలా ఆశలు పెట్టుకున్నారు. అధికారంలోకి వచ్చి దాదాపు 50 రోజులవుతుంది. పునర్నిర్మాణం చేయాలంటే చాలా సమస్యలున్నాయి. కొన్ని శాఖలు రాష్ట్రాభివృద్ధికి దోహదం చేస్తాయి. అభివృద్ధి జరిగితే ఆదాయం వస్తుంది. ఆదాయం వస్తే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టగలం. అభివృద్ధిలోనే ప్రజలకు సంతృప్తి ఉంటుంది. ఒక వైపు అభివృద్ధి చేయాలి.. ప్రజలు మెచ్చే పాలన ఇవ్వాలి. అది కేవలం సీఎం, డిప్యూటీ సీఎం, అధికారులే కాదు చిట్టచివరి రాజకీయ నాయకులు కూడా ప్రభుత్వ ఇమేజ్‌ను నిర్దేశిస్తారు. సరైన వ్యక్తిని సరైన స్థానంలో పెట్టి, తద్వారా మెరుగైన పాలన అందించడం సీఎంగా నాపై, డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్‌కు ఆ బాధ్యత ఉంది. నా పని తీరును ఎప్పటికప్పుడు విశ్లేషించుకుంటాను. ఇంకా నేర్చుకుంటున్నానని పవన్ కూడా అన్నారు.

ఆకస్మిక తనిఖీలు చేస్తా...

1995 నాటి సీబీఎన్‌ను చూస్తారని ఇప్పటికే చెప్పాను. ఆకస్మిక తనిఖీల్లో అధికారులకు అన్నీ స్పష్టంగా వివరించేవాడిని. ఆ తర్వాత మీడియాలో చూపించేవాళ్లం. అదంతా ఆ రోజుల్లో జరిగింది. రాష్ట్రంలో ఒక కుటుంబానికి ఏం అవసరమో అవన్నీ ప్రభుత్వం తరపున అందించాలి. అలాగే ఒక గ్రామానికి ఏం అవసరమో అవన్నీ అందిస్తాం. కలెక్టర్లందరూ యువతకు ఉపాధి కల్పించాలి. దానికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. సంప్రదాయ పద్ధతిలో కాకుండా.. వినూత్నంగా ముందుకు వెళ్లాలి.

ఐదేళ్లు నష్టపోయాం..

రాష్ట్ర విభజన కంటే 2019-24 అడ్మినిస్ట్రేషన్ వల్ల చాలా నష్టపోయాం. ఈ రోజు మనం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నాం. నేను పార్టీ కార్యాలయానికి వెళ్లి మూడు గంటలపాటు కూర్చుంటే 5 వేల ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో సగం భూ సమస్యలపైనే ఉన్నాయి. ఇది ఎవరి తప్పు? ప్రతి రికార్డునూ అనుమానంతో చూడాల్సిన పరిస్థితి! అందుకే తొలి మంత్రివర్గ సమావేశంలో ల్యాండ్ టైటిల్ చట్టాన్ని రద్దు చేశాం. సర్వే రాళ్ల కోసం ఖరీదైన గెలాక్సీ గ్రానైట్ స్టోన్‌లు కొని... వాటిపైన ఆయన ఫొటో వేసుకోవాలన్న ఆలోచన వచ్చిందంటే మనం అందరం ఆలోచించాలి.

'ఫేక్'లను వదిలేది లేదు..

కలెక్టర్లు మంచి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. చెడు వచ్చినప్పుడు కూడా వెంటనే స్పందించి.. వాస్తవాలను బయటపెట్టాలి. (ఈ సందర్భంగా భట్టిప్రోలు సంఘటన వీడియో ప్రదర్శించారు.) సమాజంలోకి ఫేక్ ఫెలోస్ వచ్చారు. 36 మందిని చంపేశారని ఢిల్లీ వెళ్లి ధర్నా చేశారు. ఎఫ్ఐఆర్‌లు అడిగితే ఇప్పటి వరకూ ఇవ్వలేదు. రాజకీయ నాయకులు పేపర్లు, టీవీలు పెట్టుకుని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసి ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. ఇది క్షమారహితం. ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదు.

ప్రతి కార్యాలయానికీ సౌర విద్యుత్ కళ

రాష్ట్రంలో విద్యుత్తు కోతలు అనేమాట వినబడేందుకు వీల్లేదు. అదే సమయంలో చౌకగా నాణ్యమైన విద్యుత్తు వినియోగదారులకు దక్కాలి. రాష్ట్రంలో హైబ్రీడ్ విద్యుత్తు వినియోగానికి వెళ్లాల్సి ఉంది. వీలైనంతవరకు సోలార్, విండ్ హైబ్రీడ్ విద్యుదుత్పత్తిని చేపడదాం. కేంద్రం అమలుచేస్తున్న సోలార్ విద్యుత్తు పథకాలను అందిపుచ్చుకుందాం. సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకుందాం. రాష్ట్రంలో వెయ్యి నుంచి రెండు వేల ఫీడర్ల పరిధిలో మినీ సోలార్ గ్రిడ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా .. విద్యుత్తు ట్రాన్స్‌మిషన్ నష్టాలను భారీగా తగ్గించవచ్చు. ప్రవాహ నష్టాలు ఒక శాతానికి తగ్గించవచ్చు. దీనివల్ల పగటి పూట తొమ్మిదిగంటలపాటు వ్యవసాయానికి ఉచితంగా నిరంతరాయంగా కరెంటును సరఫరా చేయగలుగుతాం. గత ప్రభుత్వంలో విద్యుత్ వాహనాలను ప్రోత్సహించ లేదు. ఈ వాహనాల చార్జింగ్ స్టేషన్లను కూడా తగ్గించారు. చార్జింగ్ స్టేషన్లలో నాడు విద్యుత్తు చార్జీలను భారీగా పెంచేశారు. రాష్ట్రంలో విద్యుత్తు వాహనాల వినియోగాన్ని పెంచాలి. రవాణా రంగంలోనూ విద్యుత్తు వాహనాలను ప్రోత్సహించాలి. విద్యుత్తు వాహనాల ప్రోత్సాహనికి ప్రత్యేక విధానం తీసుకురావాలి.

పోలవరం... విధ్వంసం!

2021లో పూర్తికావాల్సిన పోలవరం ప్రాజెక్టు ఇప్పుడు 2027కో.. 2028కో పూర్తయ్యేలా ఉంది. ఈ జాప్యంతో ప్రజల ఆస్తికి తీవ్రనష్టం వాటిల్లింది. పోలవరం హైడల్ ప్రాజెక్టు పూర్తి కాలేదు. దీనివల్ల రూ.4737కోట్ల మేర నష్టం వాటిల్లింది. రూ.460 కోట్లతో పూర్తయిన డయాఫ్రమ్‌వాల్ దెబ్బతినడంవల్ల రూ.990 కోట్లతో మరో డయాఫ్రమ్‌వాల్ నిర్మించాల్సి వస్తోంది. అసమర్థ నిర్ణయాలవల్ల రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయింది. రూ.పదిలక్షల కోట్ల అప్పులను వడ్డీతో సహా తీరుస్తూ సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిన బాధ్యత మనపై పడింది. సోలార్ విద్యుత్తు ఒప్పందాలను గత ప్రభుత్వం అనాలోచితంగా రద్దు చేసింది. దీనివల్ల కరెంటును వాడకుండానే, న్యాయస్థానం ఆదేశాల మేరకు ఒప్పందాలను అమలు చేయాల్సి వచ్చింది. తద్వారా రూ. వేల కోట్ల ప్రజాధనం వృథా అయింది.

సాగుకు సాంకేతికతను జోడించాలి

రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సృజనాత్మక ఆలోచనలు చేయాలి. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించి, రైతులకు ఆదాయం పెంచేందుకు ప్రకృతి సేద్యాన్ని, శాస్త్రీయ వ్యవసాయ విధానాలను అనుసరించాలి. ప్రజల ఆహార అలవాట్లలో మార్పులొచ్చాయి. పోషక పదార్థాలకు జనం అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో హైప్రొటీన్ పంట ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. వరి, రాగి, జొన్న, సజ్జ వంటి తృణధాన్యాల్లో నాణ్యమైన ఆహార ఉత్పత్తులు సాధించడానికి ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం పెంచాలి. రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో 20లక్షల హెక్టార్ల మేర ప్రకృతి సేద్యం పద్ధతిలో పండించాలి. రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి సాగును మరింత విస్తరించాలి. గతంలో పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సాహించాం. పామాయిల్, కోకో పెంచాం. ఉద్యాన పంటల్లో అధిక ఉత్పత్తులు చూస్తున్నాం. మామిడి, అరటి, డ్రాగన్ ఫ్రూట్ క్లస్టర్లు ఏర్పాటవుతున్నాయి. వ్యవసాయంతోపాటు డెయిరీ రంగాన్ని మరింత ప్రోత్సహించాలి. డెయిరీ పామ్‌లు నిర్మించుకోవటానికి 'నరేగా' నిధులివ్వాలి. గతంలో రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించి, ఉచితంగా సూక్ష్మపోషకాలు అందించాం.

డ్రోన్ టెక్నాలజీ ఉపయోగించాలి

వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించుకోవాలి. డ్రోన్లతో పురుగుమందులు పిచికారి చేస్తే.. రైతులకు అనవసరపు శ్రమ, ఖర్చు తగ్గుతాయి. డ్రోన్లతో నిరుద్యోగ యువతకు ఉపాధి కూడా లభిస్తుంది. ఏపీలో డ్రోన్ తయారీ పరిశ్రమ ఏర్పాటుపైనా కేంద్ర విమానయాన శాఖ మంత్రితో చర్చించాలి. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించి, రైతుల ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలి. సాగు ఖర్చు తగ్గిస్తే.. రైతులకు నష్టాలను నివారించగలుగుతాం. ఇందుకోసం వ్యవసాయ అనుబంధ శాఖలు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, మార్కెట్ లింకింగ్ కల్పించాలి. అడవులు పెంచాలి. అటవీశాఖలో మంచి అధికారులు ఉన్నారు. అడవులను, వన్యప్రాణులను సంరక్షించాలి. అటవీ ప్రాంతాలతో పాటు నగరాల్లోనూ పచ్చదనం పెంపుదలకు మొక్కలు విరివిగా నాటాలి.

మాది పొలిటికల్ గవర్నెన్స్...

మాది పొలిటికల్ గవర్నెన్స్ కలెక్టర్ల వద్దకు ప్రజాప్రతినిధులు వచ్చినప్పుడు అత్యంత సానుకూలంగా స్పందించండి. మేం డిక్టేటర్లం కాదు. అలాంటివాళ్లు ఎన్నికల్లో గెలవలేరు. అధికారులుగా మీకేమీ కాదు. మేం ఐదేళ్ల తర్వాత ప్రజల్లోకి వెళ్లి ఓట్లు వేయించుకోవాలి. ప్రజా ప్రతినిధులు వాస్తవాలు మీ దృష్టికి తీసుకువచ్చినప్పుడు, ఆ సమస్యను పరిష్కరించడం కలెక్టర్లుగా మీ బాధ్యత. ప్రతిదీ సొంత పనిగా భావించి చేయాలి. రాష్ట్రంలో సింపుల్ గవర్నెన్స్ ఉండాలి. ఎఫెక్టివ్ గవర్నమెంట్ ఉండాలి. నేను జిల్లాలకు వచ్చినప్పుడు పరదాలు కట్టడం, చెట్లు నరకడం, రెడ్ కార్పెట్‌లు వేయడం, స్కూళ్లకు సెలవులు ఇవ్వడం, ప్రజల్ని బలవంతంగా సభలకు తరలించడం, ట్రాఫిక్ ఆపడంవంటివి అవసరం లేదు. టెక్నాలజీ బాగా పెరిగింది. రాష్ట్రంలో విజిబుల్ పోలీసింగ్‌తోపాటు ఇన్‌విజిబుల్ పోలీసింగ్ కూడా ఉండాలి. ఈ విధానానికి శ్రీకారం చుడతాం.

సూటిగా... స్పష్టంగా!

(మొదటి పేజీ తరువాయి)

భోజన విరామ సమయంలో తదుపరి అజెండాకు సమయం సరిపోదేమో అన్న అనుమానాన్ని కొందరు అధికారులు వ్యక్తం చేశారు. "సమయం ఎలా వాడుకోవాలో మన చేతిలో ఉంటుంది. మొత్తం అజెండాను నేను పూర్తి చేస్తాను. కొంత సంక్షిప్తంగా వెళ్దాం" అని చంద్రబాబు అన్నారు. ఆ మాట ప్రకారమే తర్వాత సమీక్షలు వేగంగా నడిపించారు. అధికారుల ప్రజెంటేషన్లు అసమగ్రంగా ఉంటే అప్పటికప్పుడే చంద్రబాబు తప్పుపట్టారు. రోడ్లు భవనాలు, రవాణా శాఖల ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ప్రజెంటేషన్‌పై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. 'గతంలో ఏం తప్పులు జరిగాయో... మీ శాఖల్లో నెలకొన్న పరిస్థితి ఏమిటో చెప్పకుండా అందంగా ప్రజెంటేషన్ ఇస్తే ఏం ఉపయోగం? సమస్య ఏమిటో... ఎలా మొదలైందో కూడా చెప్పాలి కదా' అని ఆయన వ్యాఖ్యానించారు. వైద్య శాఖ కార్యదర్శి కృష్ణబాబు తన ప్రజెంటేషన్ ఇస్తున్నప్పుడు ముఖ్యమంత్రి జోక్యం చేసుకొన్నారు. అంబులెన్సులు సకాలంలో వెళ్తున్నాయో లేదో చూడటానికి ఏం వ్యవస్థ ఉందని ఆయన ప్రశ్నించారు. అటువంటిది ఏమీ లేదని కృష్ణబాబు చెప్పారు. అటువంటి వ్యవస్థ పెట్టుకోకుండా... వాటిని సక్రమంగా పర్యవేక్షించకుండా ఇక్కడ మనం ఎన్ని మాట్లాడుకొన్నా ఏం ఉపయోగం లేదని... అటువంటి వ్యవస్థను వెంటనే ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి అన్ని అంశాలపై పట్టు ఉందని... అన్నీ గమనిస్తున్నారని అర్థం కావడంతో అధికారులు కూడా తమ ప్రజెంటేషన్లలో అవసరమైన మేరకే వివరించి, మిగిలిన వాటిని తగ్గించేయడం కనిపించింది.

మీ పని మీరు చేయాలి...

సమావేశం ప్రారంభంలోనే ముఖ్యమంత్రి తన ప్రాధాన్యాలపై స్పష్టత ఇచ్చారు. 'రాజకీయ ప్రాధాన్యాలను పరిగణనలోకి తీసుకొంటూ పాలన జరగాలి. మేం ప్రజలకు కొన్ని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాం. వాటి అమలుకు మీరు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజా ప్రతినిధులకు వారి గౌరవం వారికి ఇవ్వాలి. నిబంధనలకు విరుద్ధంగా వెళ్లాల్సిన అవసరం లేదు. రాజకీయ నేతలు వారు చేసే పనులు వారు చేస్తారు. కలెక్టర్లు, ఎస్పీలు మీరు చేయాల్సిన పనులు మీరు చేయండి. రాజకీయపరమైన పనులు మీరు చేస్తే లేనిపోని సమస్యలు వస్తాయి. ఎవరి బాధ్యతలు వారు నిర్వహించండి' అని ఆయన వారికి చెప్పారు. కలెక్టర్ల పనితీరుపై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. 'నాకు మొహమాటాలు లేవు. మీ పనితీరు బాగుంటే ఐదేళ్లు కొనసాగిస్తా. లేకపోతే వెంటనే మార్చేస్తా. తర్వాత నన్ను వేరుగా అనుకోవద్దు. వచ్చేసారి సమావేశానికి వచ్చేటప్పుడు మీ పనితీరు నివేదికతో రండి. ఏ సమీక్ష అయినా అరగంటే. నేను మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పటి స్పీడ్ ఇప్పుడు కనిపించాలి. ఇంకా ఆ స్పీడ్ రాలేదు. అందరం కలిసి తెద్దాం' అని ఆయన అన్నారు.

చలోక్తులు...

కలెక్టర్ల సదస్సులో కొన్ని సరదా సన్నివేశాలు కూడా చోటు చేసుకొన్నాయి. తమ శాఖలో మంత్రి రామానాయుడు ముఖ్య కార్యదర్శిలా అన్ని పనులు చేస్తుంటే తాను మంత్రిలా ఉంటున్నానని సాగునీటి శాఖ ప్రత్యేకప్రధానకార్యదర్శి సాయిప్రసాద్ చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రి నవ్వుతూ... ఇటువంటి కథలు చెప్పవద్దని, పనులయ్యే మార్గాలు చూడాలని వ్యాఖ్యానించారు. చేనేతకు సంబంధించిన ఒక కార్యక్రమాన్ని చీరాల నుంచి విజయవాడ మార్చినట్లు ఆ శాఖ కార్యదర్శి సునీత పేర్కొనగా... ఆయా రంగాలకు పేరుపొందిన ప్రదేశాల్లోనే కార్యక్రమాలు పెట్టాలని, మార్చవద్దని సూచించారు. ఎస్పీలతో జరిపిన సమీక్షలో కూడా సీఎం తమ ప్రభుత్వానికి ఏం కావాలో నొక్కి చెప్పారు.

ఓపెన్ హౌస్‌లో సూచనలు...

సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన కలెక్టర్ల సమావేశం రాత్రి 9.15గంటలకు ముగిసింది. తర్వాత కలెక్టర్లు, ఎస్పీలతో కలిసి ముఖ్యమంత్రి విందులో పాల్గొన్నారు. అక్కడ 'ఓపెన్ హౌస్' నిర్వహించారు. ముఖ్యమంత్రికి ఎవరైనా ఏదైనా చెప్పదల్చుకొంటే నేరుగా చెప్పడానికి అవకాశం ఇచ్చారు. విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు సీఎంను కలిసి... సీసీటీవీ ఫుటేజ్ తమకు అందుబాటులో ఉండటంలేదని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దానిని తమకు అందుబాటులోకి తెస్తే నేర నియంత్రణకు ఉపయోగపడుతుందని చెప్పగా.. చంద్రబాబు అంగీకరించారు. కలెక్టర్లకు కొన్ని నిధులు కేటాయిస్తే... గ్రామాల పర్యటనలకు వెళ్లినప్పుడు చిన్నచిన్న సమస్యలను పరిష్కరించేందుకు వీలవుతుందని కృష్ణా కలెక్టర్ కోరగా, అందుకు సీఎం సమ్మతించారు. కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి ఇన్నేళ్లయినా... చాలా విభాగాలకు రెండు మూడు జిల్లాలకు కలిపి ఒకే అధికారి ఉన్నారని, దీనివల్ల సమస్యలు వస్తున్నాయని అనంతపురం కలెక్టర్ వినోద్ కుమార్ తెలపగా, దీనిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సీఎంవో అధికారులను సీఎం ఆదేశించారు.

పారిశ్రామిక రంగాన్ని దెబ్బతీశారు

- గత ప్రభుత్వంలో పూర్తిగా కుదేల్
- పరిరక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లదే
- కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి పూర్తిగా దెబ్బతిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ వేధింపులతో రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడిదారులు పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయారన్నారు. కలెక్టర్లతో సమావేశంలో పరిశ్రమల శాఖపై సీఎం సమీక్షించారు. "పరిశ్రమలకు అటవీ శాఖ నుంచి క్లియరెన్స్‌లు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయి. చివరకు ప్రజాప్రయోజనాలతో ముడిపడిన ప్రాజెక్టులకు కూడా క్లియరెన్స్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ గుర్తు పెట్టుకోవాలి. గత ఐదేళ్లు అడవులను నరికేస్తున్నా, అటవీ సంపదను తవ్వుకుపోతున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు ఒక ఊరికి రోడ్డు వేద్దామంటే అడ్డు పడుతున్నారు. ఇలాంటి యాటిట్యూడ్ సమస్యలు ఉన్నాయి. కాబట్టి పరిశ్రమలకు అనుమతులు క్లియర్ చేయాలి" అని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పరిశ్రమలకు కేటాయించిన భూముల (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్)ను గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేశారని, పాపులారిటీ కోసం ఇలాంటి చౌకబారు ఎత్తుగడలు వేసి పారిశ్రామికరంగాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏపీఐఐసీ భూములు ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని స్పష్టం చేశారు.

పీపీపీ స్థానంలో ఈపీసీ తెచ్చారు

'టీడీపీ ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో పోర్టుల నిర్మాణాన్ని చేపట్టగా.. తర్వాత వచ్చిన ప్రభుత్వం అనవసరంగా ఈపీసీ పద్ధతిని తీసుకువచ్చి ఐదేళ్ల కాలం గడిపేశారు. ఈపీసీ విధానంలో గవర్నమెంట్ డబ్బు లెక్కడ ఇస్తాం? గ్యారెంటీలు ఎలా ఇస్తాం? అలాగని ఇప్పుడు మళ్లీ వెనక్కిపోతే అటూ ఇటూ కాకుండా పోతుంది. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈపీసీ పద్ధతిలో ముందుకెళ్లి నిర్మాణంలో ఉన్న 4 పోర్టులను, 9 ఫిషింగ్ హార్బర్లను పూర్తి చేయాలి. ప్రస్తుతమున్న 5 పోర్టులతో పాటు కొత్త పోర్టులు 4 పూర్తి చేసి, మరొకటి కాకినాడలో చేపడితే రాష్ట్రంలో 10 పోర్టులు ఉంటాయి. ఎయిర్‌పోర్టులు ప్రస్తుతం 7ఉన్నాయి.మరో మూడు ఎయిర్‌పోర్టులు కొత్తగా వస్తాయి. చిన్నిచిన్న సమస్యలు పరిష్కరించాలి. అప్పుడు 10 ఎయిర్‌పోర్టులు అవుతాయి. ఏపీలో పోర్టు ఆధారిత ఉత్పత్తులకు వెళ్లాల్సిన అవసరం ఉంది. లాజిస్టిక్స్‌లో తూర్పు తీరాన అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీ ఒకటి. రాష్ట్రానికి పెద్దఎత్తున పరిశ్రమలు వస్తాయి. ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. ఇంతకుముందు ఈ రాష్ట్రంలో ఉండే వారు కూడా ఇక్కడ పెట్టుబడులు పెట్టకుండా వేరే రాష్ట్రాలకు పారిపోయారు. పెట్టుబడులు పెడితే అది చేస్తాం.. ఇది చేస్తామని మిగిలిన రాష్ట్రాలు పోటీ పడుతుంటే.. వీళ్లు (వైసీపీ ప్రభుత్వం) చాలా దుర్మార్గంగా చేశారు. ఇంకా ఒకరిద్దరు ఆఫీసర్ల మనసులో అదే ఉంటే ఆ ధోరణి పోవాలి. 'కస్టోడియన్స్ ఆఫ్ ది గవర్న్‌మెంట్‌గా ఉంటే బెస్ట్ కలెక్టర్స్. ఏమీ చేయకపోతే బెస్ట్ ఆఫీసర్స్'.. అలాంటి యాటిట్యూడ్ వచ్చేస్తుంది. ఇవన్నీ కాకుండా హౌటు క్రియేట్ వెల్త్ (సంపద సృష్టి)పై అందరూ దృష్టి సారించాలి" అని దిశానిర్దేశం చేశారు. అంతకుముందు పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.



కలెక్టర్ల సదస్సులో మంత్రి అనగాని, డిప్యూటీ సీఎం పవన్, సీఎం చంద్రబాబు, సీఎస్ నీరబ్ కుమార్

48 గంటల్లో రైతులకు సొమ్ము చెల్లించాలి

గోతాలు ఇవ్వలేని పరిస్థితి మళ్లీ రాకూడదు: చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాలశాఖలో అక్రమాలను అరికడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 48 గంటల్లోగా రైతులకు డబ్బులు చెల్లించాల్సిందేనని, రైతులకు గోతాలు (గోనె సంచులు) కూడా ఇవ్వలేని పరిస్థితిని మళ్లీ తీసుకురావద్దని స్పష్టంచేశారు. సోమవారం కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు దీనిపై ఆదేశాలు జారీ చేశారు. ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ పేరుతో గత ప్రభుత్వంలో వాహనాలకు రూ.200కోట్లకుపైగా ఖర్చుపెట్టారనీ, అదంతా అనవసరపు ఖర్చు తప్ప, వాటివల్ల కార్డుదారులకు ప్రయోజనం లేదన్నారు. ఇలా ఒక పద్ధతి లేని వ్యవస్థను తీసుకురావడమే కాకుండా.. ఒక్కో వాహనానికి 15 రోజులే పని చెప్పి.. వాటిపై పనిచేసే ఇద్దరు వ్యక్తులకు నెలంతా గత ప్రభుత్వం జీతాలు చెల్లించిందని, మిగిలిన 15 రోజుల్లో ఆ వాహనాలను బియ్యం అక్రమ వ్యాపారానికి వినియోగించారని ఆగ్రహించారు. అందుకే రేషన్ బియ్యం సులువుగా పక్కదారి పట్టేవన్నారు. కాగా, రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీల్లో కూడా చెత్త కనపడటానికి వీల్లేదని చంద్రబాబు.... అధికారులను ఆదేశించారు. స్వచ్ఛభారత్‌కు కేంద్రమిచ్చిన డబ్బులకు ఇప్పటిదాకా యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వలేదని కేంద్ర అధికారులు చెప్తున్నారన్నారు. వెంటనే యూసీలను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అన్నక్యాంటీన్లకు స్వయంసమృద్ధి

రాష్ట్రంలో అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తున్నామని చంద్రబాబు అన్నారు. వీటిని స్వయం సమృద్ధితో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భక్తులు ఇచ్చిన విరాళాలతో రూ.వెయ్యి కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి టీటీడీ నిత్యాన్నదానం కార్యక్రమం నిర్వహిస్తోందని, అలాగే అన్న క్యాంటీన్ల కోసం కూడా దాతల నుంచి విరాళాలు సేకరించాలన్నారు. అమరావతిలో ప్రత్యేకించి పీపీపీ (పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్) విభాగం ఏర్పాటు చేస్తున్నామని, జిల్లాల్లో పీపీపీ మోడల్‌లో ఏదైనా పనిచేయాలంటే ఈ విభాగాన్ని సంప్రదించాల్సి ఉంటుందని చంద్రబాబు తెలిపారు.

మైనారిటీలకు మేలు

రాష్ట్రంలోని మైనార్టీలను ఆదుకోవడంపై దృష్టి పెట్టాలని చంద్రబాబు ఆదేశించారు. "మైనార్టీల్లో ఎక్కువమంది ఆటోమొబైల్స్‌పై ఆధారపడి ఉన్నారు. వారి సంక్షేమం గురించి ఆలోచించాలి" అని సూచించారు. జిల్లాల్లోని వక్ఫ్ భూముల జాబితాలను తయారుచేసి, రిజిస్ట్రార్లకు అందజేయాలని, పీవోపీ రిజిస్టర్‌లో నమోదు చేయించాలని ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో న్యూట్రిషన్ గార్డెన్స్

బాల్య వివాహాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంచాలని చంద్రబాబు కోరారు. గతంలో సామూహిక సీమంతాలు పెట్టి ఈ అంశంపై చర్చ జరిపిన విషయం ఆయన గుర్తుచేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో న్యూట్రిషన్ గార్డెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

సభకు తొలి రజక ఎమ్మెల్యే

మొన్నటి ఎన్నికల్లో తాను నిర్వహించిన సోషల్ రీ ఇంజనీరింగ్ వల్ల, రజక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి తొలిసారి అసెంబ్లీకి వచ్చే అవకాశం కలిగించిందని చంద్రబాబు తెలిపారు. బీసీలకు వారసత్వంగా కొన్ని వృత్తులు ఉన్నాయని, వారిని ఆధునీకరణ వైపు మళ్లించాలన్నారు. గత ప్రభుత్వం నిలిపేసిన ఆదరణ పనిముట్లు సత్వరమే పంపిణీ చేయాలని ఆయన ఆదేశించారు.

ఏమ్మా చీరాల రాలేరా?

నేత పనిలో ఆధునీకరణను జోడించి చేనేత కార్మికులకు మరింత మేలు కలిగే విధానాలపై ఆలోచనలు చేయాలని కలెక్టర్లను చంద్రబాబు కోరారు. ఈ నెల 7న చీరాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించాలని చంద్రబాబు అనగా.. ఆ కార్యక్రమాన్ని విజయవాడలో నిర్వహిస్తున్నామని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత అన్నారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ.. 'ఏమ్మా చీరాలకు రాలేరా? దూరంగా ఉందా? అన్నింటికీ విజయవాడ అంటే ఎలా? నేత కార్మికులు ఎక్కడున్నారో అక్కడ చేనేత దినోత్సవం చేస్తే సబబుగా ఉంటుంది.. అధికారులందరికీ సమాచారం ఇవ్వండి' అని గట్టిగా ఆదేశించారు.

10 లక్షల కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

రాష్ట్రంలో రైతులు, మత్స్యకారులు, పాడి రైతులు, ఉపాధి పథకం, అటవీశాఖ ద్వారా మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించినట్లు వివిధ శాఖల ఉన్నతాధికారులు తెలిపారు. వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది 10లక్షల మంది కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. మత్స్యకారులు చేపల వేటకు ఉపయోగించే పడవులకు ఇస్రో సాయంతో శాటిలైట్ కమ్యూనికేషన్, ట్రాకింగ్ డివైజ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు మత్స్యశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్‌బాబు తెలిపారు. సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు పశుగణన చేపట్టనున్నట్లు పశుసంవర్ధకశాఖ ముఖ్యకార్యదర్శి ఎంఎం నాయక్ తెలిపారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద మొక్కలను పెద్దఎత్తున నాటాలని అటవీ శాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి జి.అనంత రామ్ కోరారు.

గత ఐదేళ్లలో ఏదో జరిగింది!

- భూవివాదాలు 10 % నుంచి 50 శాతానికి పెరిగాయి
- భూకబ్జాలు, దౌర్జన్యాల ఫిర్యాదులే ఎక్కువ
- వీటి పరిష్కారమే కలెక్టర్ల ప్రథమ కర్తవ్యం: సిసోడియా

అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రజల నుంచే వచ్చే అర్జీల్లో గతంలో కేవలం 10 శాతం మాత్రమే భూవివాదాలకు సంబంధించి ఉండేవని, ఇప్పుడు అనూహ్యంగా 50 శాతానికి పైగా పెరిగాయంటే గత ఐదేళ్లలో ఏదో జరిగిందని రెవెన్యూ, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా అనుమానం వ్యక్తంచేశారు. కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి అందుతున్న భూవివాదాల అర్జీల పరిష్కారానికి కలెక్టర్లందరూ మొదటి ప్రాధాన్యమివ్వాలని కోరారు. గత ఐదేళ్లలో తమ భూమిని కబ్జా చేశారని, దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారనే ఫిర్యాదులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయని.. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో భూ వివాద సంబంధిత ఫిర్యాదులు, అర్జీలు వచ్చేవి కావని.. గత ఐదేళ్లలో ఏదో తప్పు జరిగిందనే అభిప్రాయం ఇది కలిగిస్తోందని, ఇప్పుడీ ఫిర్యాదులన్నీ పరిష్కరించాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. చాలా చోట్ల అసైన్డ్ భూములు, ఇనామ్ భూముల విషయంలో అక్రమాలు జరిగాయని, చాలా చోట్ల 'డి' పట్టాలను కూడా గిఫ్ట్‌గా ఇచ్చేశారని, వాటన్నింటిపైనా విచారణ జరిపి రికార్డులను పునఃపరిశీలించాలన్నారు. రాష్ట్రంలో అసైన్డ్ చట్ట సవరణ అనంతరం ఫ్రీహోల్డ్ చేసిన 9 లక్షల ఎకరాల భూముల రికార్డులను పునఃపరిశీలిస్తామని ప్రకటించారు. ఇందుకు డిప్యూటీ కలెక్టర్ల నేతృత్వంలో కమిటీలు ఏర్పాటు చేసి వారితో రికార్డులను పరిశీలన చేయిస్తామన్నారు. అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్‌పై అనేక అనుమానాలు ఉన్నాయని, వాటి నివృతికే మళ్లీ పరిశీలన చేయబోతున్నామని తెలిపారు. కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు ప్రజలకు దూరమయ్యారని, ఈ పరిస్థితి ఎందుకొచ్చిందో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. తాను మదనపల్లె వెళ్లినప్పుడు ప్రజలు కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చేందుకు విముఖత చూపారని, ప్రతి జిల్లాలో ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య ప్రకాశం, సత్యసాయి జిల్లాల్లో భూవివాదాలు ఎక్కువగా ఉన్నాయని, ఫ్రీహోల్డ్(యాజమాన్య హక్కులు) కల్పించిన భూముల రిజిస్ట్రేషన్లు (గిఫ్ట్, సేల్) ఎక్కువగా జరిగాయని, నిషేధిత జాబితా (22ఏ) నుంచి అసైన్డ్, చుక్కలు, ఇనాం సర్వీసు, షరతుల గల పట్టాలు తొలగించిన భూముల రిజిస్ట్రేషన్లపై పునఃపరిశీలన చేయాలని ఆదేశించారు. ముందుగా ఈ జిల్లాల్లో ఒక మండలాన్ని ఎంపిక చేసుకుని అక్కడి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఫిర్యాదులను పరిష్కరించాలని, నెల రోజుల్లోపు ఇది పూర్తి కావాలని స్పష్టంచేశారు. తర్వాత జోన్లవారీగా అమలు చేయాలన్నారు. భూములు కోల్పోయిన పేదల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, ఇకపై ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారుల మధ్య సమన్వయం తప్పనిసరని.. భూవివాదాల పరిష్కారం, ఫైళ్ల పరిరక్షణ చాలా ముఖ్యమని తెలిపారు. కలెక్టర్లపై ఎంతో నమ్మకంతో ప్రజలు అర్జీలు ఇవ్వడానికి వస్తారని, వాటి పరిష్కారమే ప్రథమ కర్తవ్యంగా వారు పనిచేయాలని కోరారు. ఉదాశీనత ప్రదర్శిస్తే ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. 'మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం రెవెన్యూ కార్యాలయాల వద్ద భద్రతా వైఫల్యాలను తెలియజేసింది. అక్కడ 56 సంవత్సరాల వీఆర్ఏను రాత్రిపూట కాపలా ఉంచారు. సీసీ కెమేరాలు కూడా పనిచేయలేదు. రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలి. కలెక్టర్లు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి' అని చెప్పారు. భూముల కన్వర్షన్‌లో కలెక్టర్లు నిబంధనలు అమలు చేయాలన్నారు. శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆర్-5 జోన్ వివాదానికి తెర

- లబ్ధిదారులకు సొంత ప్రాంతాల్లో ఇళ్లు
- పేదలకు స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణాలు
- లేదా టిడ్కో గృహాల కేటాయింపు
- కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు నిర్దేశం

విజయవాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో వైసీపీ ప్రభుత్వం వేసిన ఆర్-5 జోన్ చిక్కుముడికి ముఖ్యమంత్రి చంద్రబాబు పరిష్కారం చూపారు. విజయవాడ, గుంటూరు నగరాలకు చెందిన పేదలకు వారి సొంత ప్రాంతాలలోనే ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని లేదా టిడ్కో గృహాలను కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. దీనికోసం భూసమీకరణ, భూసేకరణ విధానాలలో ముందుకు వెళ్లాల్సిందిగా ఆదేశించారు. కలెక్టర్ల సదస్సులో సీఆర్‌డీఏ సంబంధిత అంశాలపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి ఉన్నతాధికారులకు ఈ మేరకు నిర్దేశించారు. పేదలకు త్వరితగతిన ఇళ్ల కేటాయింపు చేపట్టాలని సూచించారు. చంద్రబాబు ఆదేశంతో ఆర్-5 జోన్ వివాదానికి తెరపడింది. ఆర్-5 జోన్‌లో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారుల్లో చంద్రబాబు తీసుకున్న నిర్ణయం పట్ల సానుకూలత వ్యక్తమవుతోంది. అమరావతి రాజధాని విధ్వంసం పథకంలో భాగంగా జగన్ ప్రభుత్వం ఆర్-5 జోన్‌ను తీసుకు వచ్చారన్న విమర్శలున్నాయి. రాజధానిని శాశ్వతంగా విచ్ఛిన్నం చేసేందుకు అమరావతిలో సెంటు పట్టాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారని పేదలు సైతం భావిస్తున్నారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌ను మార్చే విషయంలో చట్టబద్ధమైన ఇబ్బందులు తలెత్తటంతో జగన్ సర్కారు నిబంధనలకు విరుద్ధంగా సీఆర్‌డీఏ చట్టానికి సవరణలు తీసుకువచ్చింది. వెంటనే మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేసింది. పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు సంబంధించి పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన దాదాపు 43 వేల మందిని ఎంపిక చేసింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావిడిగా ఆర్-5 జోన్‌లో లే అవుట్లు వేసి ఇళ్ల పట్టాలను కేటాయించింది. అమరావతి రాజధానిలో తట్టెడు మట్టి వేయటానికి కూడా చేతులు రాని జగన్ ప్రభుత్వం ఆర్-5 జోన్‌లో కోట్లు ఖర్చు పెట్టి మరీ లే అవుట్లు వేసింది. లే అవుట్లతో పాటు హడావిడిగా కొన్ని మౌలిక సదుపాయాలను కల్పించింది. బస్సులు పెట్టి లబ్ధిదారులను తీసుకువెళ్లి మ్యాపింగ్ చేయించింది. ఈ అంశంపై రాజధాని ప్రాంత రైతులు కోర్టును ఆశ్రయించారు. తాజాగా చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాజధాని ప్రాంత రైతులతో పాటు లబ్ధిదారుల్లోనూ సానుకూలత వ్యక్తమవుతోంది.

సాగర్ గేట్లూ తెరుచుకున్నాయ్..!

16 గేట్లు ఎత్తి 1.53 లక్షల క్యూసెక్కులు విడుదల

అమరావతి, వీపీ సౌత్, నరసరావుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రాజెక్టులు రెండేళ్లుగా జలకళ లేక వెలవెలబోయాయి. ప్రధాన జలాశయాల్లో నీటి మట్టాలు పడిపోయాయి. కానీ.. ఈ ఏడాది ప్రకృతి కరుణించింది. రాష్ట్రంలో కురిసిన వానలు... ఎగువన కర్ణాటక, మహారాష్ట్రల్లో భారీ వర్షాలకు వరద భారీగా రావడంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కింది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. సాగర్, పులిచింతల ప్రాజెక్టులను దాటి కృష్ణా జలాలు ప్రకాశం బ్యారేజీలోకి పరుగులు పెట్టాయి. ఎగువ నుంచి 3,61,455 క్యూసెక్కులు శ్రీశైలంలోకి వస్తుండగా.. డ్యామ్ పది గేట్లను ఎత్తి 4,02,076 క్యూసెక్కులు దిగువన నాగర్జున సాగర్‌లోకి పంపుతున్నారు. దీంతో సోమవారం ఉదయం 10 గంటలకు సాగర్ గేట్లను ఎత్తివేశారు. తొలుత 11 గేట్లను మాత్రమే ఎత్తగా.. సాయంత్రానికి 16 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,53,684 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. కృష్ణమ్మ పరవళ్లను తిలకించేందుకు సాగర్‌కు పెద్దఎత్తున పర్యాటకులు వస్తున్నారు. సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 582 అడుగులకు చేరింది. సాగర్‌కు 3,23,748 క్యూసెక్కుల వరద వస్తుంటే.. క్రస్ట్ గేట్ల ద్వారా 1,53,684 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 40,516 క్యూసెక్కులు మొత్తం 1,94,200 క్యూసెక్కులు దిగువకు విడుదల



చేస్తున్నారు. ఈ వరద పులిచింతల ప్రాజెక్టుకు చేరుతోంది. దీంతో ఇక్కడ నుంచి ప్రకాశం బ్యారేజీకి 26,083 కూసెక్కులు విడుదల చేస్తున్నారు.

హంద్రీనీవా కాలువకు గండి

కర్నూలు జిల్లాలో హంద్రీనీవా సుజల స్రవంతి కాలువకు ఆదివారం రాత్రి భారీ గండి పడింది. దీంతో వంద ఎకరాలకు పైగా పంటలు నీటమునిగాయి. వెల్దుర్తి మండలంలోని 58వ కిలోమీటరు వద్ద శెట్టిపల్లి (మల్లేపల్లి పంప్‌హౌస్) వద్ద హంద్రీనీవా కాలువకు గండిపడింది. సమాచారం అందుకున్న అధికారులు మల్యాల వద్ద ఆరు పంపుల ద్వారా ఎత్తిపోస్తున్న నీటిని ఒక్కసారిగా నిలిపివేశారు. గండి ప్రాంతాన్ని పరిశీలించి పూడ్చివేత ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

గుండ్లకమ్మపై నిమ్మల, గొట్టిపాటి సమీక్ష: ప్రకాశం జిల్లా వరదాయని గుండ్లకమ్మ ప్రాజెక్టుపై జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. త్వరలోనే ప్రాజెక్టుకు గేట్లు ఏర్పాటు చేస్తామని అధికారులు మంత్రులకు వివరించారు.

సీమ ప్రాజెక్టుల పరిస్థితి ఏమిటి..?

రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న రాష్ట్రంలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కడంపై సాగునీటి రంగ నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే సీమ ప్రాజెక్టులు వెలిగొండ, బ్రహ్మంగారి మఠం, గండికోట, సోమశిల, కండలేరులకు ఏ మేరకు జలాలను వదులుతారనేది ఆసక్తిగా మారింది. పదేళ్ల తర్వాత కృష్ణా డెల్టాకు సకాలంలో సాగర్ నుంచి నీళ్ల వదిలారని రైతాంగం సంతోషం వ్యక్తం చేస్తోంది. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా రాయలసీమకు కృష్ణా జలాలను ఏ మేరకు పంపుతారన్న ఆసక్తి నెలకొంది.


రుతుపవనాలు బలహీనం

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు బలహీనంగా ఉన్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం, ఉపరితల ఆవర్తనాలు లేకపోవడంతో రాష్ట్రంలోని ఎక్కువ ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంది. అనేకచోట్ల సోమవారం పగటి ఉష్ణోగ్రతలు 3-5 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. దేశంలోనే అత్యధికంగా ఒంగోలులో 38.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

నిలకడగా గోదావరి నీటిమట్టం

పోలవరం, ఆగస్టు 5: ఏలూరు జిల్లా పోలవరం మండలంలోని పోలవరం ప్రాజెక్టు వద్ద కొన్ని రోజులుగా పెరుగుతూ తగ్గుతూ దోబూచులాడిన గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి నిలకడగా మారింది. స్పిల్‌వే నుంచి 7,30,844 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు.

ఒత్తిడిలేని విద్యా విధానం అవసరం: సీఎం



అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్చువల్ వర్కింగ్ పాలసీని తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఒత్తిడి లేని విద్యావిధానం అవసరమని, పిల్లలంతా కచ్చితంగా బడిలో ఉండాల్సిందేనని ఆయన ఆదేశించారు. కలెక్టర్ల సదస్సులో ఈ మేరకు అధికారులను ఆదేశించారు. సదస్సులో భాగంగా మానవ వనరులు, నైపుణ్యాభివృద్ధి శాఖలపై ఆయన సమీక్ష నిర్వహించారు. "ప్రస్తుతం ఇంటి నుంచి పనిచేసే విధానం పెరిగింది. భవిష్యత్తులో వర్చువల్ వర్కింగ్‌కు అవకాశాలెక్కువ. దీనికోసం తొలుత డ్రాఫ్ట్ పాలసీ రూపొందించి, దానిపై నిపుణులతో చర్చించాలి. ఆంధ్రప్రదేశ్ వర్చువల్ వర్కింగ్‌కు హబ్‌గా మారాలి" అని చంద్రబాబు ఆకాంక్షించారు.

అనాలోచితంగా సీబీఎస్ఈ: లోకేశ్

గత ప్రభుత్వం అనాలోచితంగా వెయ్యి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ప్రారంభించిందని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. కేజీబీవీ సహా వెయ్యి పాఠశాలల్లో విద్యార్థులు ఈ ఏడాది తొలిసారి సీబీఎస్ఈ పరీక్షలు రాయబోతున్నారని, వారి విషయంలో ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రమాణాలు మెరుగుపర్చాల్సి ఉందని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ అన్నారు.

టెట్‌కు 4.27 లక్షల దరఖాస్తులు

- షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు: పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు 4,27,300 మంది దరఖాస్తు చేసుకున్నారని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్జీటీ విభాగంలో పేపర్-1ఏకు 1,82,609, ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పేపర్-1బీకి 2,662 దరఖాస్తులు వచ్చాయన్నారు. స్కూల్ అసిస్టెట్ విభాగంలోని పేపర్-2ఏలో భాషా సబ్జెక్టులకు 64,036, గణితం, సైన్స్‌కు 1,04,788, సోషల్‌కు 70,767 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పేపర్-2బీకి 2,438 మంది దరఖాస్తు చేసినట్లు పేర్కొన్నారు. షెడ్యూలు ప్రకారం టెట్ పరీక్షలు జరుగుతాయన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas,
RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

పీబీ సిద్ధార్థలో వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



మొగల్రాజపురం, ఆగస్టు 5: పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఇండియన్‌ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసెర్చ్ (అణుశక్తి విభాగం) సౌజన్యంతో ఏపీలో మొట్టమొదటి సారిగా 24 నమూనాలతో 5 రోజుల పాటు జరిగే ప్రత్యక్ష వైజ్ఞానిక ప్రదర్శనను సోమవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్లాస్మా అంటే ఏమిటి, దాని వల్ల ఉపయోగాలు ఏమిటి అంశాలతో పాటు అనేక అంశాలను వివరించారు. ప్లాస్మా వల్ల భవిష్యత్‌తో రాబోయే మార్పులను చెప్పారు. మొదటి రోజు కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎన్ .లలిత్ ప్రసాద్, కృష్ణా విశ్వవిద్యాలయ రెక్టార్, సిద్ధార్థ పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ ఎం.బసవేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ జంపాల, భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తాడికొండ శ్రీనివాస కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కామర్స్ ఎక్స్ పో



విద్యార్థినికి జ్ఞాపిక అందచేస్తున్న డాక్టర్ వి. విజయదుర్గాప్రసాద్

వన్‌టౌన్, ఆగస్టు 5: గాంధీజీ మహిళా కళాశాలలో సోమవారం కామర్స్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాలేజీ విద్యార్థులు వాణిజ్య మాధ్యమాలు, వినూత్న వ్యాపార ఆలోచనలు వంటి అంశాలతో ఏర్పాటు చేసిన కామర్స్ ఎక్స్ పోను పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీ మేనేజ్‌మెంట్ స్టడీస్ డిపార్టుమెంట్ డీన్ డాక్టర్ వి. విజయదుర్గాప్రసాద్ ప్రారంభించి ఎక్స్ పోలోని వివిధ అంశాలను తిలకించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినుల కు జ్ఞాపికలు అందచేశారు. కళాశాల వైస్ చైర్మన్ కె.వి. పిచ్చయ్య, ప్రిన్సిపాల్ ఎం. రమణశ్రీ, కామర్స్ హెచ్‌వోడీ ఎం. శ్రీనివాసరావు, అధ్యాపకులు వి. వేణుగోపాల్, ఎ. శేషకుమార్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో సత్తా చాటిన నస్రీన్, నజ్రీన్



స్విమ్మింగ్‌లో సత్తా చాటిన విద్యార్థినులతో హెచ్ఎం

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 5 : పటమటలోని కేబీసీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న బాలికలు షేక్ నస్రీన్, షేక్ నజ్రీన్‌లు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటారని హెచ్ఎం కేపే ప్రేమ్‌సాగర్ తెలిపారు. కర్నూలులో ఇటీవల జరిగిన ఈ పోటీల్లోని వివిధ అంశాల్లో నాలుగు స్వర్ణాలు, నాలుగు రజతాలను వీరిద్దరూ సాధించారన్నారు. వీరిద్దరూ ఒరిస్సాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులు, పీఈటీ రమేష్‌ను హెచ్ఎం అభినందించారు.





దుర్గగుడిలో అన్నవితరణకు విరాళం అందిస్తున్న రామలింగేశ్వర ప్రసాద్, కుటుంబ సభ్యులు, వి.మురళీకృష్ణ కుటుంబ సభ్యులు

దుర్గగుడిలో అన్నవితరణకు విరాళాలు

వన్‌టౌన్, ఆగస్టు 5: దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అన్న వితరణకు భారతీనగర్‌కు చెందిన వి. మురళీకృష్ణ, కుటుంబ సభ్యులు, బృందావన కాలనీకి చెందిన పి. రామలింగేశ్వర ప్రసాద్, కుటుంబ సభ్యులు సోమవారం ఆలయానికి విచ్చేసి అధికారుల ద్వారా లక్ష రూపాయల విరాళాన్ని అందచేశారు. అమ్మవారి దర్శనానంతరం దాతలకు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం, ఆశీస్సులు అందచేశారు.

ఏడవ సెంట్రల్ పే కమిషన్ అమలు చేయాలి

- బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల డిమాండ్



మాట్లాడుతున్న ఏపీ సర్కిల్ కార్యదర్శి వెంకటేశ్వరరావు

పటమట, ఆగస్టు 5 : బీఎస్ఎన్ఎల్ పెన్షన్‌దారులకు కేంద్రప్రభుత్వం 2016లో చేసిన సెంట్రల్ పే కమిషన్ సూచనలు అమలు చేయాలని బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. అసోసియేషన్ 16వ సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక రఘురామ వేదిక వద్ద నిర్వహించారు. ఎనభై ఏళ్ల పైబడిన వారంతా ఆత్మీయంగా కలుసుకున్నారు. ఎనభై ఏళ్లు పైబడిన 75 మందిని సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ సర్కిల్ కార్యదర్శి డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నష్టాల పేరుతో సిబ్బందికి గత పదేళ్లగా పే రివిజన్ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు ఎంఆర్ఎస్ ప్రకాశరావు, కె. పూర్ణచంద్రరావు, చోరగుడి భాస్కరరావు, జి. శివనాగేశ్వరరావు, డి. దుర్గారావులు పాల్గొన్నారు.

సెంట్రల్ క్రికెట్ మ్యాచ్‌లో మూడో రోజు అర్ధసెంచరీల మోత



75 పరుగులతో అజేయంగా నిలిచిన బ్రహ్మతేజ

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 5 : మూలపాడు వేదికగా జరుగుతున్న ఏసీఏ సీనియర్ పురుషుల సెంట్రల్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా కృష్ణా బ్యాటర్స్ అర్ధసెంచరీల మోతతో ఆ జట్టు తొలి రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి 331/6 పరుగులతో నిలిచింది. పశ్చిమగోదావరితో ప్రారంభమైన మూడ్రోజుల క్రికెట్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన కృష్ణా బ్యాటింగ్ ఎంచుకుంది. ఎ. బ్రహ్మ తేజ 143 బంతుల్లో 7 ఫోరుతో 75 పరుగులతో క్రీజులో నిలిచాడు. పీవీ దుర్గారావు 62, టి. శివకు మార్ 53 పరు గులతో అర్ధసెంచరీలను నమోదు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా బౌలర్లలో పి. భువనేశ్వర్ రావుకు 2, జి. రుత్విక్‌కు 2 వికెట్లు దక్కాయి.

అనధికారిక గోడౌన్ ధ్వంసం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భవానీపురం, ఆగస్టు 5 : ఐరన్‌యార్డులో అనధికారికంగా నిర్మాణంలో ఉన్న గోడౌన్‌లో కొంత భాగాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం ధ్వంసం చేశారు. ఐరన్ యార్డులో అనధికారిక గోడౌన్ నిర్మాణం శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కమిషనర్ ధ్యాన్‌చంద్ర స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ గంధం ప్రసాద్, కిందస్థాయి సిబ్బందితో వెళ్లి షెడ్డు వేసేందుకు వేసిన గోడను ధ్వంసం చేయించారు. దీనికి ప్లాన్‌ను పెట్టిస్తున్నామని, అంత వరకు ఎటువంటి నిర్మాణం చేయకూడదని రాతపూర్వకంగా యజమాని నుంచి తీసుకున్నామని గంధం ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కార్పొరేషన్ ఆదాయానికి గండికొడితే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

'రిటర్నబుల్' రిజిస్ట్రేషన్లలో కదలిక

- అమరావతి రాజధాని రైతులకు ప్లాట్లు
- వెబ్‌ల్యాండ్ డేటాతో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం ఆదేశం
- పెండింగ్‌లో 21 వేల ప్లాట్ల రిజిస్ట్రేషన్లు
- నాలుగు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యం



విజయవాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లలో కదలిక వచ్చింది. తాజాగా ప్రభుత్వం సీఆర్‌డీఏ పరిధిలో వెబ్‌ల్యాండ్‌తో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్లు చేయాల్సిందిగా నిర్దేశించటంతో జోరందుకుంది. రెవెన్యూ పరంగా 1బీలో నమోదు కాలేదన్న కారణంతో గతంలో రిజిస్ట్రేషన్లు మందగించాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న వాటికి మళ్లీ టీడీపీ ప్రభుత్వమే మోక్షం కల్పించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రిజిస్ట్రేషన్ల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. కోర్టు తీర్పులను దృష్టిలో ఉంచుకుని రిజిస్ట్రేషన్లు చేపడుతున్నట్టు మొసలి కన్నీరు కార్చింది. అప్పట్లో స్వల్ప సంఖ్యలో చేపట్టినా ఆ తర్వాత గాలికి వదిలేసింది. రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరగకపోవటంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వం రావటంతో అమరావతి రాజధానిపై మళ్లీ ఆశలు చిగురించాయి. ఐదేళ్ల తర్వాత మళ్లీ ఈ ప్రాంతంలో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇన్నాళ్లూ ప్యాకేజీ విషయంలో ఆందోళన చెందిన రైతులకు అది ఎంతో ఆస్తిగా మారిపోయింది. టీడీపీ ప్రభుత్వం రావటంతో రిజిస్ట్రేషన్లకు సిద్ధమైన రైతులకు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాలేదన్న పేరుతో రిజిస్ట్రేషన్లు చేయటం లేదు. ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్లటంతో పరిష్కారానికి అడుగు పడింది. రాజధానిలో భూములు ఇచ్చిన రైతులకు రెసిడెన్షియల్, కమర్షియల్ కలిపి మొత్తం 64,764 ప్లాట్లు ఇచ్చారు. వీటిలో ఇప్పటి వరకు 43,700 ప్లాట్లకు రిజిస్ట్రేషన్ జరిగింది. ఇంకా 21,064 మంది రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం సీఆర్‌డీఏ అధికారులు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాలపై అవగాహన కల్పించటం వల్ల రోజుకు పది ఆ పైన రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఈ సంఖ్యను ఇంకా పెంచేందుకు సీఆర్‌డీఏ అధికారులు కాంపిటెంట్ అథారిటీ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో రిజిస్ట్రేషన్ల పని మీదే వీరంతా దృష్టి సారించారు. రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడానికి నాలుగు నెలల డెడ్‌లైన్‌ను సీఆర్‌డీఏ విధించుకుంది. ఈ నాలుగు నెలల్లో నూరు శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేయటం ద్వారా జీరో శాతం చూపించాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు.

నగరంలో సుందరీకరణకు శ్రీకారం



సీతమ్మవారి పాదాల వద్ద బ్యారేజి సమీపంలో పెయింటింగ్‌లు

వన్‌టౌన్, ఆగస్టు 5: నగరంలో సుందరీకణకు శ్రీకారం చుట్టారు. ఇటీవల నగర కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర నగరంలోని ప్రధాన రోడ్లు, దుర్గగుడి ఫ్లై ఓవర్ ప్రాంతాలను ప్రత్యేకంగా పరిశీలించి, నగరాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు పలు సూచనలు చేశారు. ఈ క్రమంలో గోడలకు, ఫ్లైఓవర్‌లకు పెయింట్స్ వేయటంతో పాటు డివైడర్లలో చక్కని మొక్కలను నాటించటంతో పాటు పుట్‌పాత్‌ల వెంట కూడా గ్రీనరీ అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశించారు. నగరంలోని బందరు, ఏలూరు, రైవస్ కాల్వగట్లను సుందరీకరించేందుకు ఆయన సూచనలు చేశారు. మరోవైపు కాల్వల్లో ఎటువంటి ప్లాస్టిక్, తదితర వ్యర్థాలను పడవేయకుండా ఆయా ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా, ఫ్లైఓవర్ దిగువన గోడలకు, సీతమ్మవారి పాదాల వద్ద గోడలకు పెయింటింగ్స్ వేస్తున్నారు. రంగు రంగుల బొమ్మలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగపరుచుకోవాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్



మాట్లాడుతున్న అడ్డూరి శ్రీరామ్

విద్యాధరపురం, ఆగస్టు 5 : భవానీపురంలోని ఎన్‌డీఏ కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు ఈ నెల 10న నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగపరచుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ కోరారు. సోమవారం ఎన్‌డీఏ కార్యాలయంలో కూటమి కార్యకర్తల సమావేశం నిర్వహించి జాబ్‌మేళా సన్నాహకాలను గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుజనా ఫౌండేషన్ ఏర్పాటు చేస్తున్న జాబ్‌మేళాలో టెక్ మహేంద్ర, అరబిందో ఫార్మా, రిలయన్స్ జియో, బిగ్ సీ, బిగ్ బాస్కెట్, ఐసీఐసీఐ బ్యాంక్, అపోలో ఫార్మశి, బ్యాంకింగ్, నవత ట్రాన్స్‌పోర్ట్ వంటి సంస్థలతో పాటు బహుళ జాతీయ కంపెనీలు కూడా పాల్గొని 3వేల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమో, ఇంజనీరింగ్ అభ్యర్థులు జాబ్ మేళాలలో పాల్గొనవచ్చన్నారు. ఆధార్ కార్డు, బయోడేటా, సంబంధిత సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. వివరాలకు 7032399488, 9000412345లలో సంప్రదించవచ్చన్నారు. గుడివాడ కృష్ణకిషోర్, చింతపల్లి అజయ్ బాబు, మోహన్ వంశీ, కార్పొరేటర్ బుల్లా విజయ్, బొమ్మకంటి వెంకట రమణ కుమార్ పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరిట జరుగుతున్న అరాచకాలను అరికట్టండి

- భవానీపురం పోలీసులకు చినసుబ్బయ్య ఫిర్యాదు

విద్యాధరపురం ఆగస్టు 5: లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరిట భవానీపురం లారీ స్టాండ్ పక్కన ఒక హాల్‌ను ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తున్న అరాచకాలను అరికట్టాలని భవానీపురం పోలీసులకు 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చిన సుబ్బయ్య సోమవారం భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భవానీపురం లారీ స్టాండ్‌లో గత 15 ఏళ్ల క్రితం లారీ ఓనర్స్ యూనియన్ ఉండేదని, అద్దెలు సరిగా చెల్లించకపోవటంతో కార్పొరేషన్ అధికారులు ఆ ఆఫీసును సీజ్ చేశారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అదే ఆఫీసులో గ్రామ సచివాలయ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ సచివాలయానికి ఆనుకుని ఉన్న మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన రేకుల షెడ్‌లో భవానీపురం లారీ అసోసియేషన్‌ను 2021లో రాజయ్య, వేణు, గూని రామిరెడ్డి, ఇంకా కొంత మంది కమిటీగా ఏర్పడి ఏర్పాటు చేశారన్నారు. అనధికారికంగా షెడ్‌ను ఆక్రమించి లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరిట బోర్డు పెట్టారన్నారు. లారీ స్టాండ్‌లోకి వచ్చే లారీల నుంచి వందల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారన్నారు. ఇదే షెడ్‌లో రాత్రిపూట తాగుతున్నారని, లారీల ఓనర్ల వద్ద ఇష్టానుసారం సెటిల్‌మెంట్లు చేసుకున్నారని తెలిపారు.

సంపత్‌రాజ్ కేసులో నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణం

మాజీ ఎంపీ హర్షకుమార్



మాట్లాడుతున్న హర్షకుమార్

ధర్నాచౌక్, ఆగస్టు 5: హిందూపూర్‌లో అతిదారుణంగా హత్యకు గురైన కాంగ్రెస్ పార్టీ నేత, న్యాయవాది రాజ్ సంపత్ కేసులో నేటి వరకు నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమని మాజీ పార్లమెంట్ సభ్యుడు జి.హర్షకుమార్ తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. మృతుని పెదనాన్నతో ఉన్న విభేదాల కారణం గా ఈ మే 29న సంపత్‌ను బలవంతంగా తీసుకువెళ్ళి హత్య చేశారన్నారు. ఈ హత్యకు కారణం ఎవరో స్థానిక ప్రజలకు,పోలీసులకు తెలుసన్నారు. ఈ అంశాన్ని హోంమంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్ళినా ఫలితం లేదని విమర్శించారు. ఈ కేసులో ఏ-1, ఏ-2, ఏ-3 లుగా పోలీస్‌శాఖలోని వారిపై పెట్టాలని ఏ-4గా మృతుడి పెదనాన్నా కె.సి.కృష్ణారెడ్డిని పెట్టాలని డిమాండ్ చేశారు. ఒక న్యాయవాదిని చంపేస్తే స్టేషన్ బెయిల్ ఏలా ఇచ్చారని న్యాయమూర్తి ప్రశ్నించారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో హంతకులను అరెస్టు చేయలేదంటే వైసీపీ ప్రభుత్వం చేసిన విధంగానే టీడీపీ కూడా చేస్తుందా అని విమర్శించారు. దళితులను చంపేస్తే ఎవరూ పట్టించుకోరా? అన్నారు. న్యాయవాది సంపత్‌కు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైకోర్టు న్యాయవాది అబ్దుల్ సలీం మాట్లాడుతూ చిన్న దొంగతనం చేసిన వాళ్లను అరెస్టు చేసే పోలీసులు జాతీయ నాయకుడు సంపత్‌ను హత్య చేసినా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈ కేసులో పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారాయని ఆరోపించారు. పోలీసులపై నమ్మకం లేదని, ఈ కేసును సీబీఐకు అప్పగించాలని హైకోర్టులో రిట్ పిటిషన్ వేస్తున్నామన్నారు.

చిరుద్యోగులపై వేధింపులు ఆపాలి

సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ధర్నాచౌక్, ఆగస్టు 5: చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు నిలుపుదల చేసి బలవంతంగా తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో చిరుద్యోగుల ధర్నాలతో ధర్నాచౌక్ దద్దరిల్లిపోతుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. జిల్లాలో చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తొలగించిన చిరుద్యోగులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. లేదంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక దశాబ్దల పాటు పని చేస్తున్న చిరు ద్యోగులను తొలగించడం సరైంది కాదన్నారు. సీఐటీయూ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌సీహెచ్.శ్రీ నివాస్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు సుప్ర జ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు నాగమణి, వీవోఏలు, మధ్యా హ్న భోజనం పథకం కార్మికులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్ వాడీ, ఆశా తదితర రంగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి

ధర్నాచౌక్, ఆగస్టు 5: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న దేశవ్యాప్తంగా జరిగే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్లమెంట్ పరిధిలోని అంశంపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడం వెనుక ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ హస్తం ఉందన్నారు. దళిత జాతులను విచ్ఛిన్నం చేసేందుకు, వారి ఐక్యతను దెబ్బతీసేందుకు, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను ఎత్తివేయడానికి కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తీర్పును రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత్ బంద్‌కు పలు జాతీయ పార్టీలు మద్దతుని స్తున్నాయన్నారు.

గంజాయి గని వీరంగం!

- నున్న రూరల్ పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో పేట్రేగిపోతున్న గంజాయి బ్యాచ్
- పాదచారులు, వాహనదారులను బెదిరించి సెల్‌ఫోన్లు లాక్కుంటున్న వైనం

పాయకాపురం, ఆగస్టు 5 : నగరంలో గంజాయి కట్టడికి పోలీసులు తీసుకునే ప్రత్యేక చర్యలపై చేస్తున్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో ఏమాత్రం కనిపించడం లేదు. గంజాయి మత్తులో యువకులు చెలరేగిపోతున్న ఘటనలు పాయకాపురం ప్రాంతంలో నిత్యం ఏదో ఓ ప్రాంతంలో వెలుగుచూస్తున్నాయి. నున్న రూరల్ పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో సోమవారం ఉదయం గంజాయి సేవించిన ముగ్గురు యువకుల వీరంగం స్థానికుల్లో భయాందోళనలు సృష్టించాయి. స్థానిక శాంతి నగర్‌లోని మలేరియా సర్కిల్- 3 విభాగంలో వర్కర్లు ఆదిశేషు, సాయిలు సోమవారం విధుల నిమిత్తం ప్రకాష్‌నగర్ ప్రాంతానికి వచ్చే సరికి గంజాయి సేవించిన గని, అతని స్నేహితులు ఇద్దరు కలసి మలేరియా వర్కర్లను డబ్బులు అడిగారు. వారు ఎందుకివ్వాలని ప్రశ్నించడంతో ఆగ్రహానికి గురైన యువకులు వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను లాక్కున్నారు. మేము సాధారణ వర్కర్లమని ఆ యువకులను బతిమలాడారు. దీంతో మరింత రెచ్చిపోయిన యువకులు నానా దుర్భాషలాడి వీరంగం వేశారు. ఒక్కొక్కరు రూ. 300 చొప్పున డబ్బులు ఇవ్వాలని లేని పక్షంలో సెల్‌ఫోన్లు తీసుకెళ్తామని యువకులు హెచ్చరించారు. దీంతో గత్యంతరం లేక వర్కర్లు వారికి డబ్బులు ఇచ్చి ఫోన్లు తీసుకున్నారు.

● నిత్యం ఇదే తంతు

పాయకాపురం, శాంతినగర్ పరిసర ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌ల వీరంగాలు నిత్యకృత్యంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలు రాత్రీ తేడా లేకుండా ఒంటరిగా రోడ్లపైకి రావాలంటే భయపడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ముఖ్యంగా మహిళలు, యువతులు రోడ్లపైకి రావాలంటేనే భయంగా ఉంటోందని, ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు గంజాయి బ్యాచ్‌ల ఆగడాలపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక బీట్లు ఏర్పాటు చేయాలని పలువురు ప్రాధేయపడుతున్నారు.



బడ్డీలు తొలగిస్తున్న వీఎంసీ సిబ్బంది

బీఆర్టీఎస్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మధురానగర్, ఆగస్టు 5: మధురానగర్ బీఆర్టీఎస్ రోడ్డులో రైవస్ కాల్వ ఒడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలను టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం తొలగించారు. జూలై 17న 'ఆంధ్రజ్యోతి'లో నీలి బడ్డీల దందా పేరుతో వచ్చిన కథనానికి స్పందించిన వీఎంసీ అధికారులు 18న కొన్ని బడ్డీలను తొలగించారు. అదే రోజు మిగిలిన బడ్డీలు కూడా తొలగించాలని, లేకపోతే తామే తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. అయినా కూడా బడ్డీల వారు ముందుకు రాకపోవడంతో సోమవారం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అరుణ నేతృత్వంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మొత్తం బడ్డీలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఖాళీగా ఉన్న వాటిని ముందుగా తొలగించారు. సరంజామా ఉన్న వాటిని యజమానులు తీసుకుంటే విగిలిన పని పూర్తి చేస్తామని, లేకపోతే సరంజామాతో స్వాధీనం చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

యూనియన్ బ్యాంక్ బైక్ ర్యాలీ

వన్‌టౌన్ ఆగస్టు 5: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిక్స్‌డ్ డిపాజిట్ల సేకరణ కోసం ఆకర్షణీయమైన కొత్తవడ్డీలను ప్రవేశపెట్టి నిర్వహించిన 333 రోజుల పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా సోమవారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ విజయవాడ జోనల్ హెడ్ సి.వి.ఎస్. భాస్కరరావు మాట్లాడుతూ తమ కష్టమర్ల నమ్మకాన్ని నిలబెట్టుకొనేందుకు, కొత్త కష్టమర్లను ఆహ్వానించేందుకు యూనియన్ సమృద్ధి పేరిట కొత్త డిపాజిట్ పథకాన్ని తీసుకువచ్చామని తెలిపారు. ఇందులో సాధారణ ప్రజలకు 7.40 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్‌లకు 8.15 శాతం వడ్డీ ఇస్తోందన్నారు. కొత్త వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్‌ను గురించి చెబుతూ దీనికింద ఎన్‌పీఏ రుణగ్రహీతలు తమ బకాయిల్లో 30 నుంచి 90 శాతం వరకు రాయితీ పొందేందుకు అవకాశం ఉందన్నారు. బకాయిలు చెల్లించిన వారంతా తాజా రుణాన్ని పొందవచ్చన్నారు. బ్యాంక్ మండల ఉపాధ్యక్షుడు ఎం. సీతారామారావు, ఎ. శారదామూర్తి, ఎన్. శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

గన్నే కృష్ణాజీ మృతదేహం మెడికల్ కళాశాలకు

ఆటోనగర్, ఆగస్టు 5: ఆటోనగర్ జమాక్ కో-ఆపరేటివ్ స్టోర్స్ వ్యవస్థాపక కార్యదర్శి గన్నే కృష్ణారావు శుక్రవారం అకస్మాత్తుగా మృతి చెందగా, మృతదేహాన్ని కుటుంబసభ్యులు విజయవాడలోని ఒక మెడికల్ కళాశాలకు సోమవారం విరాళంగా అందించారు. గన్నే కృష్ణాజీ గతంలో ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, నవభారత్ ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశారు. ఏటీపీ హాలు ప్రారంభోత్సవానికి గతంలో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శంకుస్థాపనకు వచ్చినప్పుడు ఎన్టీఆర్ ప్రయాణించిన కారుకు బ్యాటరీలు సమకూర్చారని ఆటోనగర్‌లో ఆయన గురించి తెలిసినవారు తెలిపారు. కృష్ణాజీ మృతికి ఐలా సర్వీసెస్ సొసైటీ అధ్యక్షుడు సుంకర దుర్గాప్రసాద్, సెక్రటరీ అన్నే శివనాగేశ్వరరావులు సంతాపం తెలిపి కుటుంబసభ్యులను ఓదార్చారు.

విద్యార్థులు లక్ష్య సాధన కోసం పాటుపడాలి

పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీ పాలకవర్గ అధ్యక్షుడు మల్లికార్జునరావు



ప్రసంగిస్తున్న మల్లికార్జునరావు

వన్‌టౌన్, ఆగస్టు 5: విద్యార్థులు లక్ష్యసాధన కోసం పాటుపడాలని పొట్టిశ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీ పాలకవర్గ అధ్యక్షుడు చలువాది మల్లిఖార్జునరావు అన్నారు. కళాశాలలో సోమవారం బీటెక్ మొదటి ఏడాది విద్యార్థులకు తరగతుల ప్రారంభం, పరిచయ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో కష్టపడితే ఉన్నతస్థాయికి ఎదగటానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దటంలో తమ కళాశాలకు ఉన్న ప్రత్యేకతను ఆయన వివరించారు. కార్యదర్శి చిట్టా అమర సుధీర్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రతి విద్యార్థి తమ వంతు కృషి చేయాలన్నారు. కోశాధికారి కె. రాఘవయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పతంజలి శాస్త్రి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతుడి కుటుంబానికి పరిహారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 5 : ఆరుగొలను వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏసురత్నం కుటుంబానికి స్థానిక టీడీపీ నాయకుల సమక్షంలో పరి హారం అందజేశారు. మృతుని కుటుంబానికి కారు యజమాని రూ. 30వేలు పరిహారం చెల్లించగా, టీడీపీ తరపున ఆర్థికసాయంగా మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు రూ.20వేలు, తుమ్మల బ్రహ్మాజీ రూ.25వేలు కలిపి మొత్తం రూ. 75వేల రూపాయలను మృతుని కుటుంబ సభ్యులకు సోమవారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు బేతా శేషకుమార్, లబ్బా శంకర్, రావులపాటి భానుకుమార్, మద్దాల వెంకటేశ్వరరావు, వారం రాంబాబు, సత్యనారాయణ, దండి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఏసురత్నం కుటుంబ సభ్యులకు పరిహారం అందజేస్తున్న టీడీపీ నాయకులు

లోకేశ్‌కు స్పీకర్ అయ్యన్న ప్రశంస

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థి విషయంలో మానవ వనరుల మంత్రి లోకేశ్ స్పందించిన తీరును శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రశంసించారు. 'ట్రిపుల్ ఐటీ లక్నోలో సీటు తెచ్చుకొని రూ.4 లక్షల ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్న తణుకు నియోజకవర్గం అత్తిలి గ్రామానికి చెందిన బసవయ్య విషయంలో మంత్రి లోకేశ్ స్పందించి సాయం అందించిన తీరు స్ఫూర్తిదాయకం. ఆల్ ది బెస్ట్ బసవయ్య' అని స్పీకర్ సోమవారం ట్వీట్ చేశారు.

పెట్టుబడులతో రండి

» ఎన్‌ఆర్‌ఐలకు మంత్రి గొట్టిపాటి పిలుపు

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలంటూ ప్రవాస భారతీయులను విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆహ్వానించారు. సోమవారం అమెరికాలోని ప్రవాస భారతీయులతో మంత్రి వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఇప్పుడు రాష్ట్రంలో స్థిరమైన ప్రజా ప్రభుత్వం ఉందని, పరిశ్రమలు పెట్టేవారికి చంద్రబాబు సర్కారు ఎర్ర తివాచీని వేస్తుందని గొట్టిపాటి వెల్లడించారు. ప్రవాస భారతీయులు పెట్టుబడులతో వస్తానంటే వారితో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సోలార్, పవన విద్యుత్తు రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎస్ఎస్ఈఎఫ్ఐ, ఈడబ్ల్యూపీఏ అసోసియేషన్లలాంటి వాటికి ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు.

స్కిల్ కేసులో.. బాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీం విచారణ 2 వారాలకు వాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏపీ హైకోర్టు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని గత ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ మరోసారి వాయిదా పడింది. దీనిపై సోమవారం జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. తొలుత.. ప్రభుత్వం తరఫు న్యాయవాది మారినట్లు కోర్టుకు న్యాయవాదులు తెలియజేశారు. ప్రభుత్వం నుంచి తగిన సూచనలు తీసుకోవలసిన ఉన్నందున విచారణ వాయిదా వేయాలని కోరారు. రెండు వారాలు చాలని చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా కోరగా.. అందుకు ధర్మాసనం అంగీకరించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

వలంటీర్లపై కట్టుబడి ఉన్నాం: మంత్రి డోలా

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వలంటీర్ల వ్యవస్థపై ఇచ్చిన మాటకు టీడీపీ కట్టుబడి ఉందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వలంటీర్ల వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేయనున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. సీఎం చంద్రబాబు వలంటీర్ వ్యవస్థకు హామీలిచ్చినా వైసీపీ పాలకులు మాయచేసి రాజీనామాలు చేయించారని విమర్శించారు.

రామేశ్వరం టు చెన్నై

» 400 నాటికల్ మైళ్ల దూరాన్ని ఈదుతున్న 15 మంది దివ్యాంగులు



చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సమీప మండపం సముద్ర తీరం నుంచి చెన్నై మెరీనా బీచ్ వరకు 400 నాటికల్ మైళ్ల దూరాన్ని ఈదే సాహస కార్యానికి 15 మంది దివ్యాంగులు శ్రీకారం చుట్టారు. స్థానిక షెనాయ్‌నగర్‌లో ఉన్న క్రీడాభివృద్ధి కమిషన్‌కు చెందిన ఈతకొలనులో అభినవ్ కంచి (15), గణేష్ (18), హరీస్ భరత్‌మోహన్ (16), జాషువా అబ్రహాం ఇమ్మానుయేలు (13), లక్ష్య కుమార్ (18), లక్ష్య కృష్ణకుమార్ (13), నితీష్ కృష్ణ (13), మోహన్‌రాజ్ (21), నందిక (14), రితీష్ (16), రోషన్‌రాజ్ లెనిన్ (19) సిద్ధార్థ్ (10), శ్రీరామ్ శ్రీనివాస్ (31), తేజస్ (16), విశాల్ మాధవ్ (19) శిక్షణ పొందారు. ఈ బృందం ఈదే కార్యక్రమాన్ని ఆదివారం మండపం వద్ద ప్రారంభించింది. ఈ నెల 15వ తేదీన ఈ బృందం చెన్నై మెరీనా తీరానికి చేరుకోనుంది.

నిర్లక్ష్యంతోనే రైలు ప్రమాదం!

» కోచింగ్ కాంప్లెక్స్‌కు వెళ్లాల్సిన రైలు ప్లాట్ ఫామ్‌పైనే ఎందుకు నిలిచివుంది?

» బీ 6, బీ 7 బోగీల్లో సమస్య ఉందా?

» స్మోక్ సెన్సర్లు ఏమయ్యాయి?

» సమాధానాలు లేని ప్రశ్నలు ఎన్నో

» ప్రమాదం జరిగిన కోచ్ టీటీఈ, ప్రయాణికులను విచారిస్తేనే వెలుగులోకి...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



రైలు నుంచి మంటలు, పొగలు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆదివారం జరిగిన రైలు ప్రమాదంలో సిబ్బంది నిర్లక్ష్యం ఉందన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ ఘటనలో అనేక ప్రశ్నలకు సమాధానాలు లభించడం లేదు. రాయపూర్ నుంచి శనివారం బయలుదేరిన కోర్బా ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం 6.45 గంటలకు విశాఖపట్నం 4వ నంబరు ప్లాట్‌ఫాంపైకి చేరుకుంది. ఇదే రైలు కోచింగ్ కాంప్లెక్స్‌కు వెళ్లి క్లీనింగ్ ప్రక్రియ పూర్తిచేసుకుని తిరుపతికి బయలుదేరి వెళ్లడానికి ఒంటిగంటకల్లా స్టేషన్‌కు రావాలి. 22 కోచ్‌ల రైలును శుభ్రం చేయడానికి కనీసం నాలుగు గంటలు పడుతుంది. రైలు క్లీనింగ్‌కు వెళ్లకుండా ప్లాట్‌ఫాంపైనే ఉండిపోవడానికి కారణం ఏమిటన్నదానికి అధికారుల నుంచి సమాధానం లేదు. ఆదివారం షెడ్యూల్ ఏమిటనేది వారు చెప్పడం లేదు. మరోవైపు ప్రమాదం జరిగిన బీ 7, బీ 6 ఏసీ కోచ్‌లలో ఏసీలు పనిచేయలేదని ప్రయాణికులు ఫిర్యాదు చేయడంతో విశాఖపట్నం చేరక ముందే విషయాన్ని ఆ రైలు సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు సమాచారం. ఈ సమస్యను సరిచేయడానికైనా రైలును కోచింగ్ కాంప్లెక్స్‌కు తీసుకువెళ్లాల్సి ఉంది. కానీ అలా చేయలేదు. అంటే ఆ సమస్యే ప్రమాదానికి కారణమా?... అనేది తేలాల్సి ఉంది. ఈ కోణంలో విచారించాలంటే బీ 7, బీ 6 కోచ్‌లలో ప్రయాణించిన వారి జాబితా తీసుకుని, వారిని విచారించాల్సిందే. ఏసీ కోచ్‌లలో ఉండే స్మోక్ డిటెక్టర్లు ఎందుకు మోగలేదన్న దానిపైనా విచారణ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. అలాగే స్టేషన్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని నిశితంగా పరిశీలించడం ద్వారా ప్రమాద సమయంలో కోచ్‌ల వద్ద ఏం జరిగిందనే దానిపైనా స్పష్టత వస్తుంది. అలాగే విద్యుత్ సరఫరా కోసం కోచ్‌లో ఉన్న జనరేటర్ వల్ల ప్రమాదం ఏమైనా జరిగిందా అన్న దానినీ పరిశీలించాల్సి ఉంటుంది.

విశాఖకు చేరుకున్న విచారణ బృందం

విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆదివారం కోర్బా ఎక్స్‌ప్రెస్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంపై విచారణ చేపట్టడానికి ఐదుగురు సభ్యులతో కూడిన అధికారుల బృందం విశాఖకు చేరుకుంది. తూర్పు కోస్తా రైల్వేకు చెందిన చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సూరత్ జానీ, చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజనీర్ ఎస్‌పీ బెహరా, చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ బీఎస్.నాథ్, ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, లక్నో నుంచి రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్‌డీఎస్‌వో) ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈ బృందంలో ఉన్నారు. వీరు తమ విచారణను ప్రారంభించారు.

ఆట మొదలైంది..!

ఆంధ్ర క్రికెట్ సంఘం నుంచి విజయసాయి టీమ్ అవుట్

» ఏసీఏ అధ్యక్షుడిగా కేశినేని చిన్ని ఎన్నిక లాంఛనమేనా..?

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) నుంచి వైసీపీ నాయకుడు, ఎంపీ విజయసాయి రెడ్డి టీమ్ బయటకు వెళ్లిపోయింది. విజయసాయి అల్లుడి అన్న, అరబిందో గ్రూపునకు చెందిన పి.శరత్‌చంద్రారెడ్డి రెండు దఫాలు ఏసీఏ అధ్యక్షుడిగా పనిచేశారు. ఉపాధ్యక్షుడిగా సాయిరెడ్డి అల్లుడు పి.రోహిత్‌రెడ్డి ఉన్నారు. కార్యదర్శిగా ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా రాకేశ్, కోశాధికారిగా ఏవీ చలం పనిచేశారు. వీరంతా విజయసాయి మనుషులుగా గుర్తింపు పొందారు. రాష్ట్రంలో మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఏసీఏ కార్యవర్గం మూకుమ్మడిగా రాజీనామాలు చేసింది. సెప్టెంబరు 8న గుంటూరులో ఏసీఏ నూతన కార్యవర్గం ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో ఏసీఏకి కాబోయే అధ్యక్షుడు ఎవరన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఏసీఏలో ఏపీలోని 13 ఉమ్మడి జిల్లాల క్రికెట్ సంఘాలు, రాష్ట్రవ్యాప్తంగా 18 క్రికెట్ క్లబ్బులు, ముగ్గురు అంతర్జాతీయ క్రీడాకారులతో కలుపుకొని మొత్తం 34 మంది సభ్యులుగా ఉన్నారు. వీరంతా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) నాయకత్వం వైపు మొగ్గు చూపుతున్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాగానే ఏసీఏను విజయసాయి టీమ్ నుంచి విముక్తి చేసే బాధ్యతను కేశినేని చిన్ని తీసుకున్నారు. జిల్లా అసోసియేషన్లు, క్రికెట్ క్లబ్బులతో మాట్లాడి గత పాలకవర్గాన్ని సాగనంపేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలోనే గత పాలకవర్గం వివాదానికి తెరదీయకుండా మూకుమ్మడి రాజీనామాలు సమర్పించి బయటకు వెళ్లిపోయింది. ఈ పరిణామాలతో కేశినేని చిన్నిని అధ్యక్షుడిగా ఎన్నుకునేందుకు రంగం సిద్ధమైంది. వచ్చే నెలలో జరిగే కార్యవర్గ ఎన్నికలో ఆయన ఎంపిక లాంఛనమేనని ఏసీఏ సభ్యులు చెబుతున్నారు.

గత ఐదేళ్లలో అనేక వివాదాలు..

2019లో వైసీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ఏసీఏని విజయసాయిరెడ్డి కుటుంబసభ్యులు కబ్జా చేశారు. వాస్తవానికి ఏసీఏకు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధమే లేదు. బీసీసీఐ నియంత్రణలో ఏసీఏ పనిచేస్తుంటుంది. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి నిధులు రావు. కానీ వైసీపీ ప్రభుత్వం దీనికి రాజకీయ రంగు పులిమింది. దీంతో టీడీపీ కూడా దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గత పాలకవర్గానికి చెక్ పెట్టాలని నిర్ణయించింది. ఏసీఏలో గత ఐదేళ్లలో అనేక వివాదాలు చోటుచేసుకున్నాయి. హనుమ విహారి ఉదంతం పెద్ద రచ్చనే రేపింది. తాజాగా పాలకవర్గం రాజీనామాలు చేయడానికి ముందు అస్మదీయులైన కాంట్రాక్టర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, తమ కోసమే పనిచేసిన సిబ్బందికి భారీగా జీతాల పెంపు, కొత్త ఉద్యోగుల నియామకాలు పెద్ద ఎత్తున చేశారన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి కీలకంగా వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి.

పశు, మత్స్య సంపద పెంపునకు సహకరించండి

» కేంద్రాన్ని కోరిన టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పశు, మత్స్య సంపదను పెంపొందించేందుకు సహకరించాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. సోమవారం పార్లమెంటులో ఆయన మాట్లాడుతూ ఏపీలో పశు సంరక్షణ చాలా అవసరమన్నారు. రాష్ట్రంలో 70 శాతం పైబడిన గ్రామీణ ప్రాంతం ఉండడంతో పశు సంపదకు ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. 2014 నుంచి 2019 వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధతో పశువైద్యానికి చాలా మెరుగ్గా నిధులు కేటాయించి, సహకరించారని, రానున్న ఐదేళ్లలోనూ అదేవిధంగా పశు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే దృష్టితో చంద్రబాబు ఉన్నారని తెలిపారు. అదనంగా పశు వైద్య కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. దేశంలో గుజరాత్ తర్వాత మత్స్య సంపద కలిగిన రాష్ట్రంగా ఏపీ పేరుగాంచిందన్నారు. సుమారు వెయ్యి కిలోమీటర్ల తీర ప్రాంతం ఉన్నప్పటికీ, మత్స్యకారులు మత్స్య సంపద కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారని, వలసలు వెళ్తున్నారని చెప్పారు. ఈ పరిస్థితులను తప్పించేందుకు ఏపీలో మినీ జెట్టిల ఏర్పాటు, పోర్టుల నిర్మాణం జరపాల్సి ఉందన్నారు. 45 ఏళ్ల వయసు దాటిన మత్స్యకారుల్లో దృష్టి మందగిస్తుందని, వారికి ప్రత్యేక వైద్య సహాయం అందించాలని కోరారు. మత్స్యకారులు తరచుగా సముద్రంలో మునిగి చనిపోతున్నారని, గల్లంతైన మత్స్యకారుల గురించి ఇతర రాష్ట్రాల్లో స్థానిక భాషల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తుండడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఎఫ్ఐఆర్‌ను ఇంగ్లిష్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.



ధ్వంసమైన ఫీడర్

జీఆర్పీ పంప్‌హౌస్‌లో దోపిడీకి యత్నం

» బసలదొడ్డి పంప్‌హౌస్‌కు రూ.12 లక్షల నష్టం

మంత్రాలయం, ఆగస్టు 5: కర్నూలు జిల్లా మంత్రాలయంలో తుంగభద్ర నది ఒడ్డున ఉన్న గురురాఘవేంద్ర ప్రాజెక్టు (జీఆర్‌పీ) బసలదొడ్డి రిజర్వాయరు పంప్‌హౌస్ స్టేజీ-1లో దుండగులు దోపిడీకి యత్నించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి మాధవరం సమీపంలో ని జీఆర్పీ పంప్‌హౌస్ షట్టర్‌ను పగులకొట్టి లోనికి ప్రవేశించారు. ఇంజన్‌లో ఉన్న 100 కేవీఏ ఫీడర్లు కెపాసిటర్లు, పంప్‌బేరింగ్ ప్లేట్లు, కాపర్‌పైపు, తదితర వస్తువులను పగులకొట్టి అందులోని కాపర్ ప్లేట్లను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే గస్తీ పోలీసు వాహనాన్ని చూసి, దొంగిలించిన కాపర్ ప్లేట్లను పంప్‌హౌస్‌కు 500 మీటర్ల దూరంలో ఉన్న పత్తి చేలో పడేశారు. విషయం తెలుసుకున్న ఆపరేటర్లు, జీఆర్‌పీ అధికారులు సోమవారం మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ తో విచారణ జరిపి వేలిముద్రలు సేకరించారు. చోరీ సందర్భంగా ఒక చొక్కా, టవల్‌ను దుండగులు అక్కడే వదిలేశారు. ఆ చొక్కాపై కర్ణాటకలోని శక్తినగర్ టైలర్ పేరు ఉంది. దీనిని బట్టి కర్ణాటకకు చెందిన వ్యక్తులే చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

8 జిల్లాల్లో సారా.. 10 జిల్లాల్లో ఎన్‌డీపీఎల్

» సమస్య తీవ్రంగా ఉందన్న ప్రభుత్వం

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాటుసారా ఎనిమిది జిల్లాల్లో, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌డీపీఎల్) పది జిల్లాల్లో తీవ్రంగా ఉన్నట్టు ప్రభుత్వం తెలిపింది. పార్వతీపురం మన్యం, తూర్పుగోదావరి, కాకినాడ, నంద్యాల, శ్రీకాకుళం, కర్నూలు, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో నాటుసారా ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించింది. కర్నూలు, చిత్తూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, కాకినాడ, ఎన్టీఆర్, నంద్యాల, అన్నమయ్య, కోనసీమ, కృష్ణా జిల్లాల్లో ఎన్‌డీపీఎల్ ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు తెలిపింది. ఈ మేరకు మద్యం నేరాల్లో సున్నితమైన జిల్లాలను ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా సోమవారం కలెక్టర్ల సదస్సులో ప్రకటించారు. గత ఐదేళ్లలో 1.78 కోట్ల లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటుసారా, ఎన్‌డీపీఎల్ పెరగడం వల్ల తెలంగాణతో పోలిస్తే ఏపీ రూ.40వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందన్నారు. గతంలో నాటుసారా రహిత జిల్లాలుగా ప్రకటించిన జిల్లాల్లోకీ మళ్లీ నాటుసారా వచ్చిందన్నారు. కలెక్టర్లు దీనిపై నిఘా పెట్టాలని, సంబంధిత శాఖలతో తరచూ సమీక్షించాలని కోరారు.

50లక్షలు కాజేసి.. 22 ఏళ్లుగా తప్పించుకొని..

» పనిచేస్తున్న బ్యాంకుకే టోపీ పెట్టిన కంప్యూటర్ ఆపరేటర్

» వేషం, పేర్లు, ఊర్లు, ఆధార్, మారుస్తూ పోలీసులకు బురిడీ

» హైదరాబాద్‌లో నేరం.. నాలుగైదు రాష్ట్రాల్లో మకాం, ఓ పెళ్లి కూడా

» చివరికి స్వామీజీ అవతారం.. ఆ ఆశ్రమానికే టోకరా వేసేయత్నం

» రూ.7లక్షలతో శ్రీలంక పరారీకి ప్లాన్.. తమిళనాడులో అరెస్టు

హైదరాబాద్, న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పనిచేస్తున్న బ్యాంకుకే రూ.50 లక్షల మేర టోపీ పెట్టాడా ఉద్యోగి. ఇది జరిగి ఏకంగా 22 ఏళ్లయింది. ఇప్పటిదాకా అతడిని పోలీసులు ఎందుకు పట్టుకోలేకపోయారని అంటారా? ఎప్పటికప్పుడు వేషం మార్చేయడం.. ఉన్న ఊరు నుంచి మరో ఊరు.. అక్కడ మరో పేరుతో చలామణి అవడం.. తదనుగుణంగా గుర్తింపు కార్డులనూ మార్చేస్తూ పోయాడు! తాను అరెస్టయ్యే అవకాశాలున్నాయని అనుమానమొస్తే చాలు.. ఉన్న ఊరు.. రాష్ట్రం నుంచి పరారై కొత్త అవతారం మెత్తి ఇన్నాళ్లు పోలీసులకు ముప్పుతిప్పలు పెట్టాడు. చివరికి ఓ స్వామీజీ అవతారమెత్తి.. ఓ ఆశ్రమం తెరిచి.. భక్తుల నుంచి దండిగానే దోచుకున్నాడు. ఆ రూ.7 లక్షల డబ్బుతో సముద్రమార్గం మీదుగా శ్రీలంకకు ఉడాయించే ప్రణాళికలో ఉండగా పక్కా సమాచారం మేరకు సీబీఐ అధికారులకు దొరికిపోయాడు!: 2002లో నేరం చేస్తే.. ఇప్పటికి దొరికిన ఆ నిందితుడి పేరు వి. చలపతిరావు. హైదరాబాద్‌లోని చందులాల్ బరాదరి ఎస్బీఐ బ్రాంచ్‌లో చలపతి రావు కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. 2002లో కొన్ని నకిలీ పత్రాలు సృష్టించి పనిచేస్తున్న బ్యాంకులోనే రూ. 50 లక్షలు కాజేశాడు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు సీబీఐ అధికారులు అదే ఏడాది మే 1న కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా రెండు చార్జిషీట్లు దాఖలు చేశారు. తన భర్త కనిపించకుండా పోయి ఏడేళ్లయిందని, ఫలితంగా చనిపోయినట్లు ప్రకటించాలని కోరుతూ నిందితుడి భార్య సివిల్ కోర్టును ఆశ్రయించింది. విచారణ అనంతరం కోర్టు ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. సీబీఐ అధికారులు పరారీలో ఉన్న చలపతిని 2004లో ప్రొక్లెయిమ్డ్ అఫెండర్(పీవో)గా ప్రకటించారు. సీబీఐ దర్యాప్తు ముమ్మరం కావడంతో హైదరాబాద్ నుంచి పరారైన చలపతి ఆ తర్వాత పేర్లు, చిరునామాలు, ఆధార్ కార్డులు మారుస్తూ తిరిగాడు. 2007లో వినీత్ కుమార్‌గా పేరు మార్చుకుని తమిళనాడు సేలంలో మరో వివాహం చేసుకున్నాడు. విషయం తెలుసుకుని అరెస్ట్ చేసేందుకు సీబీఐ సిద్ధం కాగా అక్కడి నుంచి పరారయ్యాడు. భోపాల్ చేరుకుని లోన్ రికవరీ ఏజెంట్‌గా ఉద్యోగంలో చేరాడు. ఆ తర్వాత ఉత్తరాఖండ్‌లోని రుద్రాపూర్ మకాం మార్చాడు. టీచర్‌గా కొంత కాలం పనిచేసి అక్కడి నుంచి పరారయ్యాడు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లోని వెరుల్ గ్రామంలో ఉన్న ఆశ్రమంలో స్వామి విధిత్మానంద తీర్థగా అవతారమెత్తాడు. స్వామీజీ ముసుగులో కొంత కాలం అక్కడే ఉండి ఏకంగా ఆశ్రమానికే రూ.7 లక్షలు శఠగోపం పెట్టి పరారయ్యాడు. ఆశ్రమం నుంచి వెళ్లే సమయంలో శిష్యురాలిని వెంటబెట్టుకుని వెళ్లాడు. స్వామీజీ అవతారంలోనే రాజస్థాన్‌లోని భరత్ పూర్ కు వెళ్లి 2024 జూలై 8వ తేదీ వరకు అక్కడే ఉన్నాడు. తర్వాత తమిళనాడు తిరునల్వేలిలోని నర్సింగునుల్ల గ్రామంలోని ఓ ఇంటికి చేరుకున్నాడు. సముద్ర మార్గం గుండా శ్రీలంక వెళ్లే ప్రయత్నాల్లో ఉండగా పక్కా సమాచారంతో సీబీఐ అధికారులు నిందితుడిని నర్సింగునుల్ల గ్రామంలోనే ఆదివారం అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరచగా ఈ నెల 16 వరకు జ్యుడిషియల్ రిమాండ్ విధించారు.



పురుగుమందు డబ్బాలతో ఆందోళన చేస్తున్న బోడపాడు గ్రామస్థులు

సర్పంచ్ భూ దందాలపై చర్యలు తీసుకోండి

» పురుగుమందు డబ్బాలతో బోడపాడు గ్రామస్థుల ఆందోళన

మార్కాపురం, ఆగస్టు 5: అధికారాన్ని అడ్డుపెట్టుకుని భూకబ్జాలకు పాల్పడిన ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం బోడపాడు సర్పంచ్ ముక్కమల్ల వెంకటరమణారెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద గ్రామస్థులు పురుగు మందు డబ్బాలతో ఆందోళన చేశారు. ప్రభుత్వ భూములతోపాటు పట్టా భూములను కూడా రికార్డులు మార్చి సొంతం చేసుకున్నాడని గ్రామస్థులు ఆరోపించారు. అతనిపై చర్యలు తీసుకోకుంటే పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని చెప్పారు. 'మీ కోసం' కార్యక్రమంలో భాగంగా కార్యాలయంలో ఉన్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా వారి వద్దకు వెళ్లి భూకబ్జాలపై విచారిస్తామని సబ్‌కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ప్రజల సమ్మతితోనే 370 రద్దు

» ఆ నిర్ణయంతో కశ్మీర్‌లో నవ శకం



న్యూఢిల్లీ, ఆగస్టు 5: భారత దేశ చరిత్రలో ఆర్టికల్ 370 రద్దు కీలక మలుపు అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. నాటి నిర్ణయం ప్రజల సమ్మతితోనే జరగాలని భావించానని ఆయన తెలిపారు. ఐదేళ్ల క్రితం తాము తీసుకున్న నిర్ణయం జమ్మూ, కశ్మీర్, లడఖ్‌లలో కొత్త శకానికి నాంది అని మోదీ వ్యాఖ్యానించారు. 'ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో తమ ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పని చేస్తుంది. ఈ మేరకు కశ్మీర్ వాసులకు హామీ ఇస్తున్నా' అని మోదీ తన ఎక్స్ సందేశంలో పేర్కొన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ స్పందించారు. ఆర్టికల్ 370 రద్దుతో భద్రత, భరోసా, మెరుగైన అవకాశాలు ఇక్కడి యువత, మహిళలు, వెనుకబడిన వర్గాలు, గిరిజనులకు చేరువయ్యాయని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలను అందుకోలేని వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం నాడు తీసుకున్న నిర్ణయం ఎంతో ఉపయుక్తంగా మారిందని తెలిపారు. 2019, ఆగస్టు ఐదున మోదీ ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్మూ, కశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన సంగతి తెలిసిందే. ఇక, ఆగస్టు ఐదును కాంగ్రెస్, పీడీపీలు బ్లాక్‌డేగా పాటించాయి. జమ్మూ, కశ్మీర్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, రాష్ట్రంలో పూర్వస్థితిని తేవాలని డిమాండ్ చేస్తూ ఈ పార్టీలు ర్యాలీలు నిర్వహించాయి. ఆగస్టు 5 భారత ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని ముఫ్తీ ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నిర్దేశించిన సమయంలోపు జమ్మూ, కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. తమను పాలించే వారిని ఎన్నుకునే అవకాశం కశ్మీర్ ప్రజలకు కల్పించాలని, తద్వారా కొన్నేళ్లుగా కొనసాగుతున్న అధికారుల పాలనకు ముగింపు పలకాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే డిమాండ్ చేశారు. ఈ ఏడాది సెప్టెంబరు 30 లోపు ఎన్నికలు నిర్వహించాలని గత ఏడాది డిసెంబరులో సుప్రీం కోర్టు ఆదేశించింది.

లవ్ జిహాద్‌పై ఇక కఠిన వైఖరి

» అస్సాం సీఎం హిమాంత



గువాహటి, ఆగస్టు 5: లవ్ జిహాద్‌కు పాల్పడితే జీవిత ఖైదు శిక్ష విధించేలా చట్టాన్ని తీసుకొస్తామని అస్సాం సీఎం హిమాంత బిశ్వశర్మ వెల్లడించారు. లవ్ జిహాద్‌ను అరికట్టడానికి చట్టాన్ని రూపొందిస్తామని ఎన్నిక ల్లో హామీ ఇచ్చామని, దాన్ని ప్రస్తుతం అమలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయమై నూతన నివాస విధానాన్ని అమలు చేస్తామన్నా రు. దీని ప్రకారం స్థానిక జాతులకే ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. హిందువులు-ముస్లింల మధ్య జరిగే భూ క్రయ విక్రయాలపైనా ఆంక్షలు విధించనున్నట్టు బిశ్వశర్మ వెల్లడించారు. వీటికి ముఖ్యమంత్రి ఆమోదం తప్పనిసరిగా ఉండేలా నిబంధన రూపొందిస్తామని, స్థానికుల హక్కులను కాపాడేందుకే ఈ నిర్ణయమని చెప్పారు.

పెద్దిరెడ్డి, జగన్ జైలుకే!

» టీడీపీ పాలనలో కక్షసాధింపులు ఉండవు: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

పుంగనూరు, ఆగస్టు 5: 'మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి కుక్కలతో సమానం. మా ప్రభుత్వం వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడదు. పోలీసు, అధికార వ్యవస్థలను అడ్డం పెట్టుకున్ని లూటీ చేసిన వైసీపీ నాయకులకు రాజ్యాంగబద్ధంగా కోర్టుల ద్వారా శిక్ష తప్పదు. ఏడాది కిందట పుంగనూరులో టీడీపీ కార్యకర్తలు, ప్రజలను అన్యాయంగా జైలుకు పంపిన పెద్దిరెడ్డి కుటుంబం.. అదే జైళ్లకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలి' అని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. చిత్తూరు జిల్లా పుంగనూరులోని జడ్పీ అతిథి గృహంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో పుంగనూరు ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి కుటుంబం వల్ల దగాపడిన ప్రజలు, రైతులు, వ్యాపారులకు తమ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. అధికార వ్యవస్థలను అడ్డం పెట్టుకొని ప్రజల మానప్రాణాలు, ఆస్తులను దోచుకున్న పెద్దిరెడ్డి కుటుంబం ప్రస్తుతం ఏమయ్యిందని ప్రశ్నించారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో కలిసి తాను నియోజకవర్గంలో పర్యటించగా.. వేలాది మంది స్వాగతం పలుకుతూ పెద్దిరెడ్డి అరాచకాలను ఏకరువు పెట్టారన్నారు. సోమల మండలంలోని సీతమ్మ చెరువును 4.5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌గా మార్చి ప్రజాధనాన్ని లూటీ చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. కాగా, ఆవులపల్లె సమీపంలోని సీతమ్మచెరువు వద్ద వందలాది మంది రైతులు 'ప్రాజెక్ట్ వద్దు.. చెరువు మాత్రమే ఉండాలని.. తమ భూములు తమకు ఇప్పించాలని' మంత్రిని కోరారు.

వైసీపీ నాయకుల భూకబ్జాలపై పోరాటం: సీపీఐ

అనంతపురం విద్య, ఆగస్టు 5: వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా వేల ఎకరాల భూములను కబ్జా చేశారని, దీనిపై సీపీఐ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. విజయవాడలో ఈ నెల 20న పెద్ద ఎత్తున సదస్సు నిర్వహించి, బాధితులకు న్యాయం చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.

సంపద ఎలా సృష్టిస్తారో చూస్తాం

» ఐదేళ్ల తర్వాత మళ్లీ అధికారం మాదే: బొత్స

చోడవరం, ఆగస్టు 5: సంపద సృష్టిస్తామని సీఎం చంద్రబాబు ప్రజలకు చెప్పారని, ఆ సంపద ఎలా సృష్టిస్తారో చూడడానికి తాము కూడా సిద్ధంగా ఉన్నామని వైసీపీకి చెందిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సంపద సృష్టించడమెలాగో ఇప్పటివరకూ పనిచేసిన నేతలకు తెలియదన్నట్టుగా టీడీపీ నేతలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ పాలనపై మూడు నెలల తర్వాత మాట్లాడతామని, అంతవరకూ ఓపికగా ఉంటామని చెప్పారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో వైసీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అలవికాని పథకాలు ప్రకటిస్తూ ప్రజలను వంచించడం చంద్రబాబుకు పరిపాటిగా మారిపోయిందన్నారు. గత ఎన్నికల్లో పాలనాపరమైన చిన్న చిన్న లోటుపాట్లు జరిగి ఉండడమో, లేదంటే టీడీపీ పథకాలపై ప్రజలు పెంచుకున్న ఆశల వల్లనో ఓటమి పాలయ్యామన్నారు. అయితే ఐదేళ్లు కళ్లు మూసుకుంటే తిరిగి తాము అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

వయనాడ్ 'సూపర్ హీరో' మిస్సింగ్!

» బాధితులను కాపాడేందుకెళ్లి కనిపించకుండాపోయిన ప్రజీశ్



వయనాడ్‌లో సహాయ బృందాలకు డ్రోన్ల ద్వారా ఆహారాన్ని చేరవేస్తున్న దృశ్యం

వయనాడ్, ఆగస్టు 5: ప్రకృతి సృష్టించిన విలయానికి కేరళలోని వయనాడ్ అతలాకుతలమైంది. ఈ పరిస్థితుల్లోనే కొందరు యువకులు తమ ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. వారిలో ప్రజీశ్ ఒకరు. ముండక్కైలో కొండచరియలు విరిగిపడ్డాయని తెలియడంతో ప్రజీశ్.. తన జీపుతో రెండు సార్లు అక్కడికెళ్లి పలువురిని కాపాడి తీసుకొచ్చాడు. ఆ తర్వాత తన కుటుంబంతో సురక్షిత ప్రాంతానికి వెళ్తున్న సమయంలో మరోసారి అతడికి ఫోన్ వచ్చింది. సాయం కోసం ముండక్కైకి తన జీప్‌లో మరోసారి వెళ్లిన అతడు తిరిగిరాలేదు. చురాల్‌మల్ ప్రాంతంలోనే ఓ చోట ధ్వంసమైన అతడి జీపు కనిపించింది. 'ఎవరికే సాయం కావాలన్నా ప్రజీశ్ ముందుండే వాడు. కొందరినైనా కాపాడాలంటూ ఆరోజు వెళ్లాడు. అతడే మా సూపర్ హీరో' అని స్థానికులు కన్నీళ్లు పెట్టుకున్నారు. కాగా, వయనాడ్ విపత్తు మృతుల సంఖ్య 222కు చేరినట్లు కేరళ ప్రభుత్వం వెల్లడించింది.

ఏపీలో ఐదేళ్లలో లక్ష చెట్ల నరికివేత

» ఎంపీ కేశినేని ప్రశ్నకు కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్ జవాబు

న్యూఢిల్లీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఏపీలో గత ఐదేళ్లలో 1,04,396 చెట్లను నరికివేశారని, 769.66 హెక్టార్ల మేర అటవీ ప్రాంతం తగ్గిందని కేంద్ర పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ తెలిపారు. సోమవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఏపీలో గత ఐదేళ్లలో తగ్గిన చెట్లు, అటవీ విస్తీర్ణాల గురించి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానమిచ్చారు. అన్నమయ్య జిల్లాలో అత్యధికంగా 27,178 చెట్లు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 25,953 చెట్లు అక్రమంగా నరికివేశారని, రాష్ట్రంలోని 13 జిల్లాల్లో అక్రమంగా చెట్లు నరికివేశారని తెలిపారు.

మోదీతో బీజేపీ రాష్ట్ర నేతల సమావేశం



ప్రధాని మోదీకి వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేస్తున్న పురందేశ్వరి, వర్మ, సీఎం రమేశ్

న్యూఢిల్లీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖల సహాయ మంత్రి శ్రీనివాస వర్మ, ఎంపీ సీఎం రమేష్ సమావేశమయ్యారు. సోమవారం ఢిల్లీలో వీరు ప్రధానిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. గత ఐదేళ్లలో జగన్ ఎలా విధ్వంసం చేశారో ప్రధానికి వివరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అందించిన మద్దతు పట్ల మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస వర్మ పుట్టినరోజు సందర్భంగా మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

పార్లమెంటు కీలక కమిటీల్లో టీడీపీ సభ్యులు

న్యూఢిల్లీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పార్లమెంటుకు చెందిన అయిదు కీలక కమిటీల్లో టీడీపీ సభ్యులకు స్థానం లభించింది. పబ్లిక్ అకౌంట్స్ కమిటీకి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీకి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎస్టిమేట్ కమిటీకి పార్థసారథి, ఓబీసీ కమిటీకి జి.లక్ష్మీనారాయణ, ఎస్సీఎస్టీ కమిటీకి కృష్ణప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హౌసింగ్ కమిటీలో కూడా మాగుంట సభ్యుడుగా ఉన్నారు. టీడీపీకి ఒక మంత్రిత్వ శాఖ స్థాయీ సంఘం ఛైర్మన్ పదవి కూడా లభించవచ్చని భావిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

విజయవాడ ● మంగళవారం 6 ఆగస్టు 2024

diksuchi@andhrajyothy.com

కాళోజీ అనుబంధ కళాశాలల్లో / అడ్మిషన్స్



ఎంబీబీఎస్, బీడీఎస్

వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(కేఎన్ఆర్‌యూహెచ్ఎస్)- అనుబంధ కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ అండ్ డెంటల్ కాలేజీల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. నీట్ యూజీ 2024 స్కోర్, వెబ్ ఆప్షన్స్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. తొమ్మిదోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు తెలంగాణ పరిధిలో చదువుకున్నవారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. సీట్ల వివరాలను వెబ్ ఆప్షన్స్ నాటికి ప్రకటిస్తారు.

అర్హత

- గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ)/బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. సైన్స్ సబ్జెక్టుల్లో జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 50 శాతం; ఓసీ దివ్యాంగులకు 45 శాతం; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు తప్పనిసరి.
- నీట్ యూజీ 2024 కటాఫ్: మొత్తం 720 మార్కులకుగాను జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 162; దివ్యాంగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 127; ఓసీ దివ్యాంగులకు 144 మార్కులను కటాఫ్ స్కోర్‌గా నిర్దేశించారు.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. లేనిపక్షంలో కౌన్సెలింగ్‌కు అనుమతించరు.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.3500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2900
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 13
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** నీట్ యూజీ 2024 ర్యాంక్ కార్డ్; పదోతరగతి, ఇంటర్/తత్సమాన కోర్సుకు సంబంధించిన సర్టిఫికెట్‌లు; ఆరు నుంచి పదోతరగతి వరకు స్టడీ సర్టిఫికెట్‌లు; టీసీ; కులం, ఆదాయం, నివాసం, ఎన్‌సీసీ ధ్రువీకరణ పత్రాలు; ఆధార్ కార్డ్; అభ్యర్థి ఫొటో; అభ్యర్థి సంతకం.
- **వెబ్‌సైట్:** knruhs.telangana.gov.in, https://tsmedadm.tsche.in

ఎండీఎస్

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(కేఎన్ఆర్‌యూహెచ్ఎస్)-ఎండీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ డెంటల్ కళాశాలలు, ఆర్మీ డెంటల్ కాలేజీల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. నీట్ ఎండీఎస్ 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. కళాశాలలు, సీట్ల వివరాలను వెబ్ ఆప్షన్స్ నాటికి ప్రకటిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: తెలంగాణ రాష్ట్రంలోని గుర్తింపు పొందిన డెంటల్ కళాశాల నుంచి బీడీఎస్/తత్సమాన డిగ్రీ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 జూన్ 30 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(డీసీఐ)/స్టేట్ డెంటల్ కౌన్సిల్ గుర్తింపు పొంది ఉండాలి. నీట్-ఎండీఎస్ 2024లో అర్హత పొంది ఉండాలి.

- నీట్ ఎండీఎస్ 2024 కటాఫ్: మొత్తం 800 మార్కులకుగాను జనరల్ అభ్యర్థులకు 263; ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 230; ఓసీ దివ్యాంగులకు 246 మార్కులను కటాఫ్ స్కోర్‌గా నిర్దేశించారు.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 8
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** నీట్-ఎండీఎస్ 2024 అడ్మిట్ కార్డ్, స్కోర్ కార్డ్; అభ్యర్థి ఫొటో; బీడీఎస్ డిగ్రీ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్లు; ఆధార్ కార్డ్; కేటగిరీ సర్టిఫికెట్; ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్; డెంటల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** knruhs.telangana.gov.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్సిటీ)- పీహెచ్‌డీ 2024 జులై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. జేఆర్‌ఎఫ్ అర్హత ఉన్న అభ్యర్థులు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. మొత్తం 170 సీట్లు ఉన్నాయి.



స్పెషలైజేషన్లు-సీట్లు: ఇంగ్లీష్ 6, తెలుగు 19, ఉర్దూ 3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్ 8, హిస్టరీ 8, పొలిటికల్ సైన్స్ 10, సోషియాలజీ 20, ఆంత్రోపాలజీ 9, ఎడ్యుకేషన్ 2, రీజనల్ స్టడీస్ 5, ఇండియన్ డయాస్పొరా 2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ 4, జెండర్ స్టడీస్ 5, ఎకనామిక్స్ 28, డ్యాన్స్ 3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్ 1, కమ్యూనికేషన్ 3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్ 8, హెల్త్ సైన్స్-ఆప్టోమెట్రీ 2, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 16, నానోసైన్స్ అండ్ టెక్నాలజీ 4 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ఇతర/తత్సమాన అర్హతల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 14
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 10 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(రాత పరీక్ష) తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** నవంబరు 8
- **ఇంటర్వ్యూలు:** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఇంటర్వ్యూలో ఎంపికైనవారి జాబితా విడుదల:** డిసెంబరు 2
- **కౌన్సెలింగ్:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 2 నుంచి
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

ఆర్మీ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్

ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్(ఏఎఫ్ఎంఎస్)- బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిని మహిళలకు ఉద్దేశించారు. కోర్సు వ్యవధి నాలుగేళ్లు. నీట్ యూజీ 2024 స్కోర్, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్), సైకలాజికల్ అసెస్‌మెంట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 220 సీట్లు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఆర్మీ ఆధ్వర్యంలో ఉన్న ఆరు కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. శిక్షణ సమయంలో ఉచిత రేషన్, ఉచిత వసతి, యూనిఫామ్ అలవెన్స్, ప్రతి నెల స్టయి పెండ్ వంటి సౌకర్యాలు కల్పిస్తారు. కోర్సు పూర్తయిన తరవాత మిలటరీ నర్సింగ్ సర్వీస్‌లో పర్మనెంట్/షార్ట్ సర్వీస్ కమిషన్ స్థాయి అధికారులుగా చేరవచ్చు.

ఆర్మీ నర్సింగ్ కళాశాలలు-సీట్లు: ఏఎఫ్ఎంసీ పుణె-40, సీహెచ్(ఈసీ) కోల్‌కతా-30, ఐఎన్‌హెచ్ఎస్ అశ్విని-40, ఏహెచ్ (ఆర్అండ్ఆర్) న్యూఢిల్లీ-30, సీహెచ్(సీసీ) లక్నో-40, సీహెచ్(ఏఫ్) బెంగళూరు-40.

అర్హత వివరాలు: అవివాహిత/డైవోర్స్‌డ్/లీగల్లీ సెపరేటెడ్ మహిళలు, వితంతువులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్(బైపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. నీట్ యూజీ 2024 స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులు 1999 అక్టోబరు 1 నుంచి 2007 సెప్టెంబరు 30 మధ్య జన్మించి ఉండాలి. కనీసం 152 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి. పద్దెనిమిదేళ్ల లోపు వయసు ఉన్న వారిని రెండు సెంటీమీటర్లు తక్కువగా ఉన్నప్పటికీ అనుమతిస్తారు. ఎన్‌సీసీ-సీ అర్హత ఉన్నవారు సంబంధిత సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలి.



ఎంపిక: అభ్యర్థులను నీట్ యూజీ 2024 స్కోర్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్) నిర్వహిస్తారు. ఇందులో 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే అర మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం అర్థ గంట. ఇందులో అర్హత పొందినవారిని సైకలాజికల్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో ఇంటర్ స్థాయి కోర్ సబ్జెక్టుల నుంచి; హాబీస్; జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. క్రీడల్లో పాల్గొన్న అనుభవం ఉన్నవారికి అదనపు వెయిటేజీ ఉంటుంది. తరవాత ఢిల్లీ బేస్ హాస్పిటల్ స్పెషల్ మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. పై స్కోర్లన్నింటినీ పరిగణనలోకి తీసుకొని మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ప్రాసెసింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మినహాయింపు వర్తిస్తుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 7
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

ప్రభుత్వ బ్యాంకుల్లో
ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్ పీవో/ఎంటీ- XIV) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 4,455 పోస్టులు భర్తీ చేయనున్నారు.

- సీఆర్‌పీ ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజ్‌మెంట్ ట్రెయినీ - XIV

ఖాళీలు: 4,455(ఎస్సీ-675, ఎస్టీ-332, ఓబీసీ-1185, ఈడబ్ల్యూఎస్-435, యూఆర్-1846)

ఖాళీలున్న ప్రభుత్వరంగ బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

బ్యాంకుల వారీగా ఖాళీలు

1. బ్యాంక్ ఆఫ్ బరోడా: **ఎన్ఆర్**
2. బ్యాంక్ ఆఫ్ ఇండియా: **885**
3. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర: **ఎన్ఆర్**
4. కెనరా బ్యాంక్: **750**
5. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా: **2000**
6. ఇండియన్ బ్యాంక్: **ఎన్ఆర్**
7. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్: **260**
8. పంజాబ్ నేషనల్ బ్యాంక్: **200**
9. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్: **360**
10. యూకో బ్యాంక్: **ఎన్ఆర్**
11. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా: **ఎన్ఆర్**

ఖాళీలు 4455

అర్హత: ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై అభ్యర్థులు అర్హులు



వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.175; ఇతరులు రూ.850 చెల్లించాలి.

ఎంపిక: ప్రిలిమినరీ, మెయిన్ రాత పరీక్షలు, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన, మెడికల్ ఎగ్జామ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: అనంతపురం, ఏలూరు, గుంటూరు/విజయవాడ, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్.

తెలుగు రాష్ట్రాల్లో మెయిన్ పరీక్ష కేంద్రాలు: గుంటూరు/విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్.

పరీక్ష విధానం

ప్రిలిమ్స్ రాత పరీక్ష(ఆబ్జెక్టివ్ టెస్ట్): ఈ పరీక్షను 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 30 ప్రశ్నలు(30 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 35 ప్రశ్నలు (35 మార్కులు), రీజనింగ్ నుంచి 35 ప్రశ్నలు(35 మార్కులు) ఇస్తారు. ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ప్రశ్న పత్రం ఉంటుంది. ఐబీపీఎస్ నిర్దేశించిన కటాఫ్ మార్కుల మేరకు అర్హత సాధించిన వారిని మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

మెయిన్ ఎగ్జామినేషన్(ఆబ్జెక్టివ్/డిస్క్రిప్టివ్): ఈ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్న పత్రంలో మొత్తం 155 ప్రశ్నలు ఉంటాయి. పరీక్షను ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ నుంచి 45 ప్రశ్నలు(60 మార్కులు), జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ నుంచి 40 ప్రశ్నలు(40 మార్కులు), ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 35 ప్రశ్నలు(60 మార్కులు) ఇస్తారు. పరీక్ష వ్యవధి 3 గంటలు.

ఇంగ్లీష్ లాంగ్వేజ్(లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే): 2 ప్రశ్నలు ఇస్తారు. 25 మార్కులు కేటాయించారు. ఈ పరీక్షకు నిర్దేశించిన సమయం 30 నిమిషాలు.

ముఖ్య సమాచారం:

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **ప్రీ-ఎగ్జామ్ ట్రెయినింగ్:** 2024 సెప్టెంబరు
- **ప్రిలిమినరీ పరీక్ష కాల్‌లెటర్ డౌన్‌లోడ్:** 2024 అక్టోబరు
- **ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు:** 2024 అక్టోబరు/నవంబరు
- **మెయిన్ ఎగ్జామ్ కాల్‌లెటర్ డౌన్‌లోడ్:** 2024 నవంబరు
- **మెయిన్ ఎగ్జామ్ ఫలితాలు:** 2024 డిసెంబరు/2025 జనవరి
- **ఇంటర్వ్యూలు:** 2025 జనవరి/ఫిబ్రవరి
- **తుది నియామకాలు:** 2024 ఏప్రిల్
- **వెబ్‌సైట్:** https://ibps.in/

ప్రిలిమ్స్ సిలబస్

రీజనింగ్: లాజికల్ రీజనింగ్, ఆల్ఫాన్యూమరిక్ సిరీస్, ర్యాంకింగ్/డైరెక్షన్/ఆల్ఫాబెట్ టెస్ట్, డేటా సఫిషియెన్సీ, ఇనిక్వాలిటీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్, పజిల్, ట్యాబులేషన్, సిల్లాగిజమ్, బ్లడ్ రిలేషన్స్, ఇన్‌పుట్-ఔట్‌పుట్, కోడింగ్- డికోడింగ్

క్వాంటిటేటివ్ ఎబిలిటీ: సింప్లిఫికేషన్, ప్రాఫిట్స్ అండ్ లాస్, మిక్చర్స్ అండ్ అలిగేషన్స్, సింపుల్ ఇంటరెస్ట్ అండ్ కాంపౌండ్ ఇంటరెస్ట్ అండ్ సర్డ్స్ అండ్ ఇండీసెస్, వర్క్ అండ్ టైమ్, టైమ్ అండ్ డిస్టెన్స్, మెన్సురేషన్- సిలిండర్, కోన్ స్పేర్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, రేషియో అండ్ ప్రొపర్షన్ పర్సంటేజ్, నంబర్ సిస్టమ్స్, సీక్వెన్స్ అండ్ సిరీస్, పర్ముటేషన్, కాంబినేషన్ అండ్ ప్రొబాబిలిటీ.

ఇంగ్లీష్ లాంగ్వేజ్: రీడింగ్ కాంప్రహెన్షన్, క్లోజ్ టెస్ట్, ప్యారా జంబుల్స్, వర్డ్ యూసేజ్, వర్డ్ స్వాప్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, ఎర్రర్ డిటెక్షన్, ఎర్రర్ స్పాటింగ్, ప్యారాగ్రాఫ్ కంప్లీషన్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్, మిసిలీనియస్.

లిటిల్స్



కాకి-పిచ్చుక

అడవిలో ఉండే ఒక కాకికి తాను మిగతా పక్షులకన్నా ఎత్తులో వేగంగా ఎగరగలననే పొగరు, అతి విశ్వాసం ఉండేవి. ఒక రోజు చిన్న పిచ్చుక ఒకటి నెమ్మదిగా ఎగురుకుంటూ కాకి గూడు దగ్గరగా వెళుతుంది. కాకి దాన్ని చూసి, నీకు కనీసం అందంగా వేగంగా ఎగరడం కూడా రానట్లు ఉన్నది కదా. ఏదో పురుగు గెంతినట్టు ఎగురుతున్నావు నన్ను చూసి, ఎలా ఎగరాలో నేర్చుకుందువులే అంటూ ఎగతాళిగా మాట్లాడింది. ఆ మాటలకు చిన్న పిచ్చుక నొచ్చుకున్నా, ఎవరి శక్తి, ఎవరి పద్ధతి వారిది, అందరూ నీలాగే ఉండాలంటే ఎలా? అని వెళ్లిపోయింది. కానీ కాకి అక్కడితో ఆగలేదు పిచ్చుకను అదేపనిగా ఎగతాళి చేస్తూనే ఉంది. ఇదంతా చూసిన తోటి పక్షులు ఇతర జంతువులు అన్నీ కాకితో ఇలా అన్నాయి. 'మీ ఇద్దరిలో ఎవరు బాగా ఎగరగలరో తేల్చుకోడానికి ఒక పోటీ పెడదాం. మీ ఇద్దరిలో ఎవరైతే ఆ దట్టమైన ఊడలున్న మర్రి చెట్టును ముందుగా చుట్టి వస్తారో వారే పోటీలో విజేత అన్నాయి జంతువులన్నీ. కాకి తన మీద తనకు గల అతి నమ్మకంతో ముందూ వెనుక చూసుకోకుండా వేగంగా ఎగిరిపోయి, దట్టంగా చిక్కగా ఉన్న ఆ మర్రి ఊడల్లో తన రెక్కలు చిక్కుకుని అలాగే కదలకుండా ఉండిపోయింది. చిన్న రెక్కలు, చిన్న శరీరం ఉన్న పిచ్చుక తేలికగా ఆ గుబురు ఊడల మధ్య నుంచి ఎగురుతూ, కాకి కంటే ముందే చెట్టును చుట్టి వచ్చి, పోటీలో గెలిచింది. ఎపుడూ ఎవరిశక్తి సామర్థ్యాలను తక్కువ చేసి అవమానించి మాట్లాడకూడదు.

సరైన నీడ ఏది?



10 తేడాలను కనుక్కోండి



దారి కనుక్కోండి



ఎన్ని కుక్కలు ఉన్నాయి?



డైలీ సుడోకు - 376

	4				1
	6	3			
6		2			
			2		3
			4	5	
5				1	

సుడోకు - 375 సమాధానం

7	8	1	4	5	3	6	2	9
4	3	9	2	6	7	8	5	1
6	2	5	8	9	1	7	3	4
5	1	6	7	4	8	3	9	2
2	9	3	6	1	5	4	8	7
8	4	7	9	3	2	1	6	5
9	5	4	1	8	6	2	7	3
3	7	8	5	2	4	9	1	6
1	6	2	3	7	9	5	4	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.